
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 39

బుధవారం 1-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 39

బుధవారం 1-5-2024



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

అదే నా కల



ఎప్పటికీ జనం గుండెల్లో బతికి ఉండాలి

దేవుడు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నా

రూ.2.70 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం

అవినీతి, వివక్ష ఎక్కడుంది? ప్రజల్లోకి వెళ్లి మైకు పెట్టి అడగండి

ఇండియాటుడే టీవీ చానల్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ ఇంటర్వ్యూలో ఏపీ సీఎం వైఎస్ జగన్ 15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వారం పాటు తీవ్ర వడగాడ్పులు

రాష్ట్రంలో వారం రోజుల పాటు వడగాడ్పుల తీవ్రత పెరగనుంది. 13 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

- వివరాలు 5లో



జేడీఎస్ నుంచి ప్రజ్వల్ సస్పెన్షన్

లైంగిక దౌర్జన్యం, వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్‌ను జేడీఎస్ తమ పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

- వివరాలు 6లో

ప్రాంతీయ శక్తులే.. ప్రజాస్వామ్య పరిరక్షకులు



బలమైన ప్రాంతీయ పార్టీలకే బీజేపీని అడ్డుకొనే శక్తి ఉంది

కేంద్రాన్ని శాసించేది బీఆర్ఎస్, వైసీపీ, డీఎంకే వంటి పార్టీలే

సీఎం పదవికి ఏమాత్రం తగని వ్యక్తి రేవంత్‌రెడ్డి

10-12 సీట్లు గెలిస్తే ఏడాదిలోపే రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసిస్తారు

మోసపోయిన ప్రజలకు సాంత్వన చేకూర్చేందుకే బస్సు యాత్ర

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 12లో



జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని అల్లాదుర్గంలో బీజేపీ నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగిస్తున్న మోదీ

పారిశ్రామిక వేత్తలు, కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన డబ్బును ఢిల్లీకి తరలిస్తున్నారు

ఆ డబుల్ ఆర్ ఎవరో మీ అందరికీ తెలుసు

ఆ వసూళ్లకు కళ్లెం వేయకపోతే తెలంగాణ ప్రజలను తిరిగి కోలుకోలేనంతగా దోచేస్తారు

ట్రిపుల్ ఆర్ సినిమా హిట్ అయితే, డబుల్ ఆర్ దేశం సిగ్గుపడేలా చేస్తోంది...

కాంగ్రెస్ పంజా.. అంటే ఐదు రకాలుగా మోసం

రాష్ట్రంలో బీజేపీని 17 సీట్లలో గెలిపిస్తే ఆ దోపిడీ ఆగుతుంది

ఫేక్ వీడియోలతో లబ్ధి పొందాలని చూస్తున్నారు.. దీని వెనుక డబుల్ ఆర్ ఉన్నట్లు తెలుస్తోంది

కాంగ్రెస్, బీఆర్ఎస్ కరప్షన్ రాకెట్ కమిటీలోనివే..

అల్లాదుర్గం బహిరంగ సభలో ప్రధాని ధ్వజం

డబుల్ ఆర్ ట్యాక్స్ ఢిల్లీకి..

పరోక్షంగా సీఎం రేవంత్‌ను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ ఫైర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆర్ ఆర్ (డబుల్ ఆర్) ట్యాక్స్ పేరుతో ప్రజలను దోచుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలుగు వాళ్లు తీసిన 'ట్రిపుల్ ఆర్' భారత్‌లోనే సూపర్ హిట్ సినిమాగా నిలిచి ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతిని సాధిస్తే... తెలంగాణలో ఈ 'డబుల్ ఆర్' యావద్దేశం సిగ్గుపడేలా చేస్తోందని మండిపడ్డారు. ఈ ట్యాక్స్‌పై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన డబ్బును నల్లధనం రూపంలో ఢిల్లీకి తరలిస్తున్నారని ఆరోపించారు. 'మీ అందరికీ ఆ డబుల్ ఆర్ ఎవరో తెలుసు. దానిని వివరించాల్సిన అవసరం లేదు. ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్లకు కళ్లెం వేయకపోతే తెలంగాణ ప్రజలు తిరిగి కోలుకోలేనంతగా దోచేస్తారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేస్తారు' అని ధ్వజమెత్తారు. దీనికి కళ్లెం పడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో 17 సీట్లలోనూ

మిగతా 10వ పేజీలో ▶

"కాంగ్రెస్ ఎన్నికల గుర్తు హస్తం... పంజా.. ఆ పార్టీ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అబద్ధపు వాగ్దానాలు, ఓటు బ్యాంకు రాజకీయం, నేరగాళ్లను పెంచి పోషించడం, కుటుంబపాలన, అవినీతి అనే ఐదు సూత్రాలను నమ్మి రాజకీయం చేస్తుంది. ఇప్పుడు మిమ్మల్ని దోచుకునేందుకు వారసత్వ సంపద పన్ను తీసుకురావాలని చూస్తోంది. ఇది అమలుచేస్తే మీరు జీవితాంతం కష్టపడి దాచుకున్న సొమ్ము మీ మరణం తర్వాత మీ వారసులకు ఇవ్వలేరు.



మేనిఫెస్టోను పట్టుకోవడానికి నిరాకరిస్తున్న బీజేపీ పరిశీలకుడు సిద్ధార్థనాథ్ సింగ్

బాబు కిచిడీ మేనిఫెస్టో

సూపర్ సిక్స్‌లో సగం వైఎస్సార్‌సీపీ నుంచి, సగం పక్క రాష్ట్రాల నుంచి కాపీ

177 ఎన్నికల హామీలతో మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్

వివరాలు 16లో





కొత్తగూడెం రోడ్‌షోకు హాజరైన ప్రజలు.. విజయ సంకేతం చూపుతున్న కేసీఆర్

ఆర్ ట్యాక్స్ నిజమైతే ఐటీ, ఈడీలను పంపించు

ఉత్త ఆరోపణలు ఎందుకని మోదీపై కేసీఆర్ ఆగ్రహం

చోటేభాయ్, బడేభాయ్ ఇద్దరూ ఒక్కటే

10లో

బీఆర్ఎస్ గెలిస్తేనే నీళ్లు, నిధులు

గోదావరి నీటిని తరలించుకుపోయే కుట్రలు

కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే గోదారిలో వేసినట్టే

రేవంత్ కొత్త జిల్లాల రద్దుకు ప్రయత్నిస్తున్నారు

కొత్తగూడెం రోడ్‌షోలో మాజీ సీఎం ఫైర్

గుజరాత్ పెత్తనమా.. తెలంగాణ పౌరుషమా?

తేల్చుకుందామన్న సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ పౌరుషం గుజరాత్‌కు తెలిసేలా మోదీని ఓడించాలి

బీజేపీ వస్తే బడుగులపై సర్జికల్ స్ట్రైక్..రిజర్వేషన్లు రద్దు

400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని సవరించేందుకు కుట్ర

కేంద్ర మంత్రి అమిత్ షాను ఆవహించిన కేసీఆర్ ఆత్మ

రెండు పార్టీలూ ఒక్కటై గూడుపుఠాణి చేస్తున్నాయి

కేసీఆర్ జీవితంలో సీఎం కాలేరని వ్యాఖ్య

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ భూపాలపల్లి/ సాక్షి, రంగారెడ్డి జిల్లా/ దిల్‌సుఖ్‌నగర్ (హైదరాబాద్): కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం వస్తే దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలపై సర్జికల్ స్ట్రైక్ చేసి రిజర్వేషన్లు రద్దు చేస్తారని ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని సవరించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఆ పార్టీకి ఓటు వేస్తే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు లభించవని, బలహీన వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొంటాయని చెప్పారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ఆత్మ బీజేపీ నేత అమిత్ షాను ఆవహించిందని, ఆ రెండు పార్టీలు ఒక్కటై రాష్ట్రంలో

మిగతా 10వ పేజీలో ▶



జమ్మికుంట జనజాతర సభలో 'బీజేపీ ఇచ్చింది ఇది.. గాడిదగుడ్డు' అంటూ చూపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఇదండీ సంగతి



ఫేక్ స్పీచ్‌లు, ఫేక్ హామీలని మన మీద కూడా ఫిర్యాదు చేయరుగా సార్!

టెన్త్‌లో మళ్లీ నిర్మల్ టాప్

99.05% ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా ఫస్ట్

65.10% ఉత్తీర్ణతతో చివరి స్థానంలో వికారాబాద్ జిల్లా

ఇంటర్‌లో మాదిరిగా టెన్త్‌లోనూ అమ్మాయిలదే హవా

మొత్తంగా 91.31 శాతం ఉత్తీర్ణత

3,927 స్కూళ్లలో 100% రిజల్ట్

ఎస్సెస్సీ ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ



ఫలితాలను విడుదల చేస్తున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు బుర్రా వెంకటేశం, దేవసేన

సాక్షి, హైదరాబాద్: ఇంటర్‌లో మాదిరిగానే టెన్త్ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. రెగ్యులర్ విభాగంలో బాలురు కన్నా 3.81 శాతం, ప్రైవేటు (కంపార్ట్‌మెంటల్) విభాగంలో 6.74 శాతం ఎక్కువ ఉత్తీర్ణతను నమోదు చేశారు. మొత్తంగా ఈ ఏడాది రెగ్యులర్ విద్యార్థులు 91.31 శాతం, ప్రైవేటు విద్యార్థులు 49.73 శాతం పాసయ్యారు. నిర్మల్ జిల్లా 99.05 శాతం ఉత్తీర్ణతతో గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. వికారాబాద్ జిల్లా 65.10 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో ఉంది. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకూ జరిగిన పదవ తరగతి పరీక్షా ఫలితాలను పాఠశాల విద్య కమిషనర్ దేవసేన, రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం మంగళవారం హైదరాబాద్‌లో వెల్లడించారు. 5,05,813 మంది పరీక్షలు రాస్తే 4,57,044 మంది ఉత్తీర్ణత సాధించినట్టు వారు తెలిపారు. రెగ్యులర్‌గా రాసిన వారిలో బాలికలు 2,28,616 (93.23%), బాలురు 2,22,656 (89.42%) మంది పాసయ్యారు. ప్రైవేటులో బాలికలు

మిగతా 11వ పేజీలో ▶

సత్తా చాటిన గురుకులాలు — రాష్ట్రవ్యాప్తంగా సగటున 96.33% ఉత్తీర్ణత

11లో

పెరుగుతున్న ఉత్తీర్ణత — 2015లో 77%.. 2024లో 91%

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ముగ్గురు మహిళలు సహా 10 మంది మావోయిస్టులు మృతి

ఘటనా స్థలం నుంచి భారీగా మందుగుండు సామగ్రి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల సామగ్రి, ఆయుధాలు ▶

రెండు వారాల వ్యవధిలోనే ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్.. ఏప్రిల్ 16న 29 మంది మావోయిస్టులు చనిపోయిన కాంకేర్ ఎన్‌కౌంటర్ ప్రాంతానికి 30 కిలోమీటర్ల దూరంలో తాజాగా ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. నారాయణపూర్, కాంకేర్ జిల్లాల పరిధిలోని మావోయిస్టులకు పెట్టనికోటగా ఉన్న అబుజ్‌మాడ్‌లో జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మహిళలు సహా పది మంది మావోయిస్టులు మృతిచెందారు. పలువురు మావోయిస్టులు గాయపడ్డారు.

6లో



టి20 ప్రపంచ కప్‌కు భారత జట్టు ప్రకటన

రోహిత్ సారథ్యంలో 15 మంది సభ్యుల టి20 భారత జట్టును సెలక్షన్ కమిటీ ప్రకటించింది. రిషభ్ పంత్ పునరాగమనం చేయగా...సంజు సామ్సన్, శివమ్ దూబే, యశస్వి జైస్వాల్‌లకు తొలి సారి వరల్డ్ కప్ టీమ్‌లో చోటు దక్కింది. జూన్ 1 నుంచి 29 వరకు అమెరికా, వెస్టిండీస్‌లలో ఈ టోర్నీ జరుగుతుంది.

18లో

ఫేక్ వీడియోల వెనుక రాహుల్ హస్తం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆగ్రహం



రాజ్యాంగాన్ని మార్చే, రిజర్వేషన్లను రద్దు చేసే ఆలోచన బీజేపీకి లేదని వెల్లడి

ఫేక్ వీడియోల వెనుక కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ హస్తం ఉంది. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, రాష్ట్రాల్లో ఆ పార్టీ అధ్యక్షులు సైతం ఫేక్ వీడియోలను సోషల్ మీడియాలో నిస్సిగ్గుగా షేర్ చేస్తున్నారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోంది. ఉన్న కొద్దిపాటి ఓటుబ్యాంక్‌ను కాపాడుకోవడానికి తంటాలు పడుతోంది.

- కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా

6లో

అమిత్‌షా 'డీప్ ఫేక్' కేసు..

- ముగ్గురిని అరెస్టు చేసిన ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు
- త్వరలో తెలంగాణలోనూ అరెస్టులు!

12లో

ALPHORES
GROUP OF SCHOOLS
TELANGANA

Gloriously Achieve more number of
10 GPAs in SSC -2024 Results



The Iconic **Dr. V. NARENDER REDDY Sir** Chairman
with the **135** ALPHORESIANS who got **10 GPA** in **SSC 2024 RESULTS**

135
10 GPAs

Congratulations!
On Your SUCCESS

747 ALPHORESIANS out of 1140 have secured ≥ 9 GPA

School Code	School Name	Total Strength	No. Of 10-GPAS	9.8	Pass %	No.of Students Failed
22209	ALPHORES HIGH SCHOOL Kothapally(H), Dist: Karimnagar	116	30	26	100	0
22258	ALPHORES HIGH SCHOOL Vavilalapally, Dist: Karimnagar	300	49	36	100	0
16285	ALPHORES HIGH SCHOOL Mdl: Sulthanabad, Dist: Peddapally	73	12	5	98.6	1
22045	ALPHORES HIGH SCHOOL Vil:Gopalraopet, Mdl: Ramadugu, Dist: Karimnagar	71	8	8	100	0
15423	ALPHORES HIGH SCHOOL Shivaveedhi, Dist: Jagtial	55	4	3	98.2	1
15408	SRI NSV HIGH SCHOOL Vil: Ramannapeta, Mdl:Mallial X-Road, Dist: Jagtial	87	5	11	100	0
20520	ALPHORES HIGH SCHOOL Mdl: Wardhannapeta, Dist: Warangal	76	1	6	100	0
13058	ALPHORES HIGH SCHOOL Bhainsa, Dist: Nirmal	54	9	12	100	0
13265	ALPHORES HIGH SCHOOL Dist: NIRMAL	28	3	5	100	0
14086	NARENDRA HIGH SCHOOL ARMOOR, NIZAMBAD	70	1	5	94.3	4
22528	ALPHORES HIGH SCHOOL Vedira, Karimnagar	35	1	4	100	0
22085	ALPHORES HIGH SCHOOL Kothapally, Karimnagar	175	12	18	99.4	1
	TOTAL:	1140	135	139	99.4	7


Swimming Pool with all Infra


NCC Wing Salutes the NATION


Difference with KARATE - THE GAME OF DEFENCE


Cradle of Culture & Conventions

The only Educational Institutions with the most Qualitative & Success Resultant Teaching as per NEP

THANKS !
PARENTS & STAFF FOR YOUR CONTINUOUS SUPPORT

SCHOLARSHIP SCHEMES FOR IIT / NEET / EAMCET COACHING

Sl. No.	Branches	GPA	Scholarship Scheme
1	Jagtial Mancherial Nirmal Nizamabad Armoor	10 GPA	2 YEARS FREE COACHING**
		9.8GPA	FREE EDUCATION ONLY for 1 Year**
2	Hyderabad Karimnagar Warangal Hanamkonda	10 GPA	30% Concession in 1st Year TOTAL FEE**

**CONDITIONS APPLY
Note: Avail the HIGH SCHOLARSHIPS by taking the SCHOLARSHIP TEST.
Concessions prescribed above are valid only upto the 5th May.
The students who are interested to avail the ABOVE SCHOLARSHIP need to report in the concerned campus on or before the 5th May'24 & ENROLL for ADMISSION with some

Colleges & Schools

KARIMNAGAR ✆ 91335 37444
JAGTIAL ✆ 92469 34445
SULTHANABAD ✆ 92469 34448
GOPALRAOPET ✆ 91333 12833
MANCHERIAL ✆ 91339 36444
HUSNABAD ✆ 91339 29444
MALLIAL ✆ 91549 01238
WARDHANNAPET ✆ 91331 89444
NIRMAL ✆ 92469 34451
BHAINSA ✆ 91333 12829
ARMOOR ✆ 91339 38444

HYDERABAD :
Suchitra Alwal - 91608 61444
Ghatkesar - 91601 28444
Karmanghat - 92468 34441
New Nallakunta - 91608 67444
Hastinapuram - 91339 73444

KARIMNAGAR :
Main Campus : Vavilalapally - 91335 88857
Tiny Tots : Vavilalapally - 91339 72444
MMT Campus : Mankammathota - 79012 41044
KTPL Boys : Kothapally - 91335 39444
KTPL Girls : Kothapally - 93902 21988
GIRLS Campus : Bhagathnagar - 91602 74443

HANAMKONDA :
Pochamma Maidan - 91604 27444
Nayeem Nagar - 91333 12830
KLN Reddy Colony - 91601 39444
Gopalpur - 91601 53444
Bheemaram - 91604 26444

MANCHERIAL :
Boys & Girls (Day) - 91602 64443
JAGTIAL :
Girls Campus - 92470 66444
Boys & Girls (Day) - 90597 23144
NIRMAL :
Girls Campus - 91602 94446

IIT | NEET Aspirants ! Classes are already started so Hurry Up ! avail SUCCESS

Now Also @

ARMOOR — ALPHORES IIT/NEET ACADEMY, DAY SCHOLAR CO-ED @ Yogeshwara Colony, Rajaram Nagar ✆ 96524 44414
NIZAMABAD — ALPHORES IIT/NEET ACADEMY, EXCLUSIVE GIRLS DAY & RESIDENTIAL, EXCLUSIVE BOYS DAY & RESIDENTIAL, EXCLUSIVE CO-ED DAY SCHOLARS ✆ 96524 44414
MANCHERIAL — ALPHORES IIT & NEET AC CAMPUS@Hi-Tech City, SMART SCHOOL@Godavari Road ✆ 91602 64443
NIRMAL — ALPHORES IIT/NEET ACADEMY, EXCLUSIVE GIRLS DAY & RES., EXCLUSIVE BOYS DAY SCHOLARS @Doctors Lane ✆ 96524 44414
HANAMKONDA — ALPHORES IIT/NEET ACADEMY, EXCLUSIVE GIRLS DAY@Pochamma Maidan, EXCLUSIVE BOYS RESIDENTIAL @Bheemaram ✆ 91604 27444, 91604 26444
HUZURABAD — ALPHORES GENIUS SCHOOL ✆ 91604 12444
MANCHERIAL — ALPHORES SMART SCHOOL ✆ 91339 36444
KARIMNAGAR — VAVILALAPALLY - ALPHORES GIRLS SCHOOL ✆ 91335 05444



SMART BAZAAR
JioMart
Reliance
Growth is Life
ఫుల్ పైసా వసూల్ సేల్
1st - 5th May
JioMart
FULL PAISA VASOOL
ఫుల్ పైసా వసూల్ లాంటి గొప్ప ఆఫర్లు కావాలా?
స్మార్ట్ బజార్ కు విచ్చేయండి
₹100 క్యాష్‌బ్యాక్
ఇంట్లో కూర్చొనే ఫుల్ పైసా వసూల్ లాంటి గొప్ప ఆఫర్లు కావాలా?
జియోమార్ట్ యాప్ డౌన్లోడ్ చేసుకోండి!
SMART BAZAAR
SMART SUPERSTORE
కూకట్‌పల్లి: CMR కాంప్లెక్స్, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ వక్కన. పంజాగుట్ట: గలేరియా మాల్, పంజాగుట్ట మెట్రో స్టేషన్ వక్కన, హైదరాబాద్: అరిహంత్ టవర్ సంతోష్‌నగర్, క్రాస్ రోడ్ దగ్గర. జూబ్లీహిల్స్: ఇన్నర్ రింగ్ రోడ్ ఆరాధన 70mm థియేటర్ ఎదురుగా. కొంపల్లి: రన్‌వే 9 దగ్గర, కుత్బుల్లాపూర్, కొంపల్లి రోడ్. మాదాపూర్: ఇనార్బిట్ మాల్, ఎల్1. అబిడ్స్: MPM మాల్, GPO ఎదురుగా, అబిడ్స్ X రోడ్. కాచిగూడ: మహేశ్వరి పరమేశ్వరి టవర్స్, కాచిగూడ ఎక్స్ రోడ్. అమీర్‌పేట్: GS 24 క్యారెట్ బిల్డింగ్, మెయిన్ రోడ్. గుడిమల్కాపూర్: కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ వక్కన, గుడిమల్కాపూర్ రోడ్. తిరుమలగిరి: మిలటరీ డెయిరీ ఫామ్ రోడ్ సుభాష్‌నగర్ బస్టాప్. మియాపూర్: మెయిన్ రోడ్ మియాపూర్ బస్టాప్, మియాపూర్ ఎక్స్ రోడ్స్. టోలిచౌకి: సలార్‌పురియా సత్వ మాగ్నస్, బ్లాక్ A, టోలిచౌకి రోడ్ షేక్‌పేట ఫ్లైఓవర్ కింద. గచ్చిబౌలి: గచ్చిబౌలి ఫ్లైఓవర్ వక్కన. పాత అల్వాల్: IG విగ్రహం దగ్గర, CYSR గార్డెన్స్. కూకట్‌పల్లి: యశోద గార్డెన్స్, శాంతినగర్. నాంపల్లి: బార్కాస్ రోడ్ భారత్ పెట్రోల్ పంప్ దగ్గర. కుషాయిగూడ: బస్టాండ్ కాలనీ, RB నగర్. బండ్లగూడ: HP పెట్రోల్ బంక్ దగ్గర, చేవెళ్ల రోడ్డు. అత్తాపూర్: శ్రీ ఎల్లమ్మ దేవాలయం వక్కన, బికె గూడ, నిజాంపేట్: గోకుల్స్ ప్లాజా, నిజాంపేట్ రోడ్. బాచుపల్లి: కేపీఆర్ ప్యారడైజ్ కాలనీ దగ్గర, మల్లంపేట రోడ్డు. కొత్తపేట: మోహన్ నగర్, ఎస్బీఐ కాలనీ, గడ్డిఅన్నారం: ఏషియన్ శివ గంగా రోడ్డు. బోడుప్పల్: విల్కానగర్ మెయిన్ రోడ్ SSS గార్డెన్ ఎదురుగా. నాచారం: ESI హాస్పిటల్ ఎదురుగా. పీర్జాదిగూడ: సాయిపురం కాలనీ, ZP ఉన్నత పాఠశాల ఎదురుగా. ఫిల్మ్ నగర్: రోడ్ నం. 3, ఫిల్మ్ నగర్
ప్రత్యేకంగా జియోమార్ట్‌లో
2 మే నాడు మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే
ఉల్లిపాయ ₹1/kg
స్ప్రైట్ / కోకోకోలా / థమ్స్అప్ / మాజా 600 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) ఫ్లాట్ 25% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹40 మొదలుకుని మా ధర ₹30 మొదలుకుని
బిస్కెట్స్ రేంజ్ 300 g మొదలుకుని / లోట్టే చోకో పై 336 g (సెలెక్ట్ వేరియంట్స్) ఫ్లాట్ 33% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹120 మా ధర ₹80 మొదలుకుని
మ్యాగీ వెజ్ అట్టా / స్నాక్టాక్ / టాప్ రామన్ / నిసిన్ జెకి / సన్‌ఫీస్ట్ యిప్పీ! నూడుల్స్ 290 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) కనీసం 33% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹82 మొదలుకుని
ట్రాపికానా / రియల్ / బి నేచురల్ జ్యూసెస్ 1 L (సెలెక్ట్ వేరియంట్స్) కనీసం 33% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹115 మొదలుకుని
బూస్ట్ / హార్లిక్స్ క్లాసికల్ మాల్ట్ హెల్త్ డ్రింక్ 1 kg ఆదా చేసుకోండి ₹170 ఎమ్ఆర్‌పి ₹595 మొదలుకుని మా ధర ₹425 మొదలుకుని
తాజ్‌మహల్ లీఫ్ టీ 500 g ఆదా చేసుకోండి ₹75 ఎమ్ఆర్‌పి ₹470 మొదలుకుని మా ధర ₹395 మొదలుకుని
బ్యాటర్, బ్రెడ్, కేక్, చీజ్, ఫ్రోజెన్ స్నాక్స్, ఫ్రోజెన్ వెజ్, ఐస్ క్రీమ్, లస్సీ, పాల పానీయాలు, పనీర్, రస్క్ 23 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) కనీసం 25% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹10 మొదలుకుని
₹60/kg భారత్ చనా దాల్ 1 kg BHARAT DAL ఇప్పుడు లభిస్తుంది nafed
గుడ్ లైఫ్ డైలీ రైస్ 26 kg మా ధర ₹1225 (₹47.11/kg) ఎమ్ఆర్‌పి ₹1800 ఆదా చేసుకోండి ₹575
ఫార్చ్యూన్ రైస్ బ్రాన్ హెల్త్ ఆయిల్ 3 L + కోహినూర్ చార్మినార్ సెలెక్ట్ బాస్మతి రైస్ 5 kg మా ధర ₹725 కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹1124 ఆదా చేసుకోండి ₹399
ప్యారీస్ వైట్ లేబుల్ సల్ఫర్ ఫ్రీ చక్కెర 5 kg మా ధర ₹214 (₹42.80/kg) ఎమ్ఆర్‌పి ₹300 ఆదా చేసుకోండి ₹86
ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ హోల్ వీట్ ఆటా 5 kg మా ధర ₹263 ఎమ్ఆర్‌పి ₹335 ఆదా చేసుకోండి ₹72
స్పైసెస్ రేంజ్ (సెలెక్ట్ వేరియంట్స్) ఫ్లాట్ 33% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹30 మొదలుకుని మా ధర ₹20 మొదలుకుని
గుడ్ లైఫ్ వెల్యూ / నట్రాక్ / పండర్‌పూర్ ఆల్మండ్ / విఠల్ బాలాజీ / పిల్ క్యాష్యూ 500 g (సెలెక్ట్ వేరియంట్స్) మా ధర ₹295 ఎమ్ఆర్‌పి ₹449 మొదలుకుని ఆదా చేసుకోండి ₹154 మొదలుకుని
సూపర్ సర్వోత్తమ్ రైస్ బ్రాన్ / ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 1 L మా ధర ₹97/ ₹110 ఎమ్ఆర్‌పి ₹199 / ₹139 ఆదా చేసుకోండి ₹102 / ₹29
విజయా ఘీ 1 L మా ధర ₹575 ఎమ్ఆర్‌పి ₹690 ఆదా చేసుకోండి ₹115
కోల్గేట్ / డాబర్ రెడ్ / మిస్వాక్ / సెన్సోడైన్ టూత్‌పేస్ట్ 80 g (సెలెక్ట్ వేరియంట్స్) ఫ్లాట్ 33% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹195 మొదలుకుని మా ధర ₹131 మొదలుకుని
పియర్స్ / డవ్ / లక్స్ / ఫియామా / గోద్రెజ్ నం.1/ సంతూర్ సోప్ 125 g మొదలుకుని (మల్టీ ప్యాక్) (సెలెక్ట్ వేరియంట్స్) ఫ్లాట్ 33% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹175 మొదలుకుని మా ధర ₹117 మొదలుకుని
హెడ్ అండ్ షోల్డర్ షాంపూ 650 ml (సెలెక్ట్ వేరియంట్స్) ఫ్లాట్ ₹500 ఎమ్ఆర్‌పి ₹859 మొదలుకుని మా ధర ₹359 మొదలుకుని
టాల్కమ్ పౌడర్ 120 g మొదలుకుని / స్కిన్ క్రీమ్ 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) ఫ్లాట్ 50% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹120 మొదలుకుని మా ధర ₹60 మొదలుకుని
సర్ఫ్ / టైడ్ / రిన్ డిటర్జెంట్ పౌడర్ 5 kg / సర్ఫ్ / ఏరియల్ మ్యాటిక్ లిక్విడ్ 3 L మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) ఫ్లాట్ 33% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹565 మొదలుకుని మా ధర ₹379 మొదలుకుని
విస్పర్ అల్ట్రా క్లీన్ XL+ 44s / నైట్ XL + 40s / స్టేఫ్రీ డ్రై మ్యాక్స్ 42s / హగ్గీస్ డైపర్స్ (సెలెక్ట్ వేరియంట్స్) ఫ్లాట్ 50% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹575 మొదలుకుని మా ధర ₹288 మొదలుకుని
cello LA OPALA LARAH ఓవల్ వేర్ డిన్నర్ సెట్ కనీసం 50% తగ్గింపు ఎమ్ఆర్‌పి ₹1225 మొదలుకుని
SMART సమ్మర్ ఫ్యాషన్ ₹149 నుండి ప్రారంభం
LIVE SMART
డ్రెసెస్ ₹499
షర్ట్స్ ₹299
షర్ట్స్ ₹249
షార్ట్స్ ₹149
షార్ట్స్ ₹399
cello ఇన్సులేటెడ్ స్టీల్ బాటిల్ మా ధర ₹199 ఎమ్ఆర్‌పి ₹398
HAPPY LIVING TRIDENT కాటన్ డబుల్ బెడ్ షీట్ సెట్ (సెలెక్ట్ వేరియంట్స్) BUY 1 GET 2 FREE ఎమ్ఆర్‌పి ₹2399
3 పీసెస్ హార్డ్ ట్రాలీ సెట్ మా ధర ₹5999 ఎమ్ఆర్‌పి ₹12000
GANGAUR స్ప్లిట్ ఏసీ 1 TON మా ధర ₹19999 ఎమ్ఆర్‌పి ₹39000
వద్ద కూడా లభ్యం
SMART SUPERSTORE
fresh Signature
10% INSTANT DISCOUNT
SBI card
*Min. Trxn.: ₹3,000; Max. Discount: ₹500 per Trxn. Valid only on one Trxn. per credit card. Validity: 01 May - 05 May 2024. T&C Apply.
Pay with MobiKwik
GET UPTO ₹300 CASHBACK
*T&C Apply: Minimum Assured Cashback ₹50
Min Transaction of ₹1000 | Valid Once Per User
Valid From 1st May to 05th May 2024 |
at SMART Bazaar, SMART Superstore & Fresh Signature
మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి



మనం చేసే పనుల్లో సాధ్యమైనంత తక్కువ దుఃఖం లేదా అసలు దుఃఖమే కలగని విధంగా జీవించాలి.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 1 మే 2024

సిగ్గూ ఎగ్గూ లేని తెంపరితనం

దేశమంతా నివ్వెరపోయిన వివాదం ఇది. ఘన కుటుంబ వారసత్వం... దేశంలోని అత్యున్నత ప్రజా ప్రాతినిధ్య వేదికైన పార్లమెంట్‌లో సభ్యత్వం... ఇవేవీ మనిషిలోని మకిలినీ, మృగాన్నీ మార్చలేక పోయిన విషాదం ఇది. మాజీ ప్రధాని దేవెగౌడ మనుమడూ, ఆయన తదనంతరం కర్ణాటకలో హసన్ నుంచి పార్లమెంట్‌కు ఎన్నికైన యువకుడూ అయిన ప్రజ్వల్ రేవణ్ణ నిస్సహాయులైన పలువురు స్త్రీలతో సాగించిన బలవంతపు లైంగిక చర్యల వ్యవహారం సభ్యసమాజాన్ని తలదించుకొనేలా చేస్తోంది. ఏప్రిల్ 26 నాటి లోక్‌సభ పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు ఆ వికృత వీడియోలు వందల కొద్దీ బయటకు రావడం సొంత కుటుంబపార్టీ జేడీ(ఎస్)ను సైతం ఆత్మరక్షణలో పడేసింది. అన్నిటికీ మించి సామాన్యులకు రక్షకులమంటూ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనవారే చివరకు భక్షకులుగా తయారవుతున్న రాజకీయ విలువల పతనానికి ఈ వ్యవహారం మరో నగ్నసాక్ష్యంగా నిలిచింది.

2019 నుంచి 2022 మధ్య పలుమార్లు తనను ప్రజ్వల్ రేవణ్ణ లైంగికంగా బలవంతం చేశారంటూ బాధితురాలు ఒకరు ఆరోపించారు. పనివారి నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగినుల దాకా పలువురితో ఈ మాజీ ప్రధాని మనుమడు ఇంట్లో, ఆఫీసులో ఇలానే వ్యవహరించారట. వాటిని స్వయంగా రికార్డ్ చేసి, బ్లాక్‌మెయిల్ చేస్తూ వచ్చారట. దాదాపు 3 వేల వీడియోలతో కూడిన ఆ వికృత చర్యల పెన్‌డ్రైవ్ ఇప్పుడు బయటపడింది. నిజానికి, ప్రజ్వల్ అకృత్య వీడియోల కథ కొత్తదేమీ కాదు. ఆయన వీడియోలు అనేకం కొన్నేళ్ళ క్రితమే బయటకొచ్చాయి. వాటి ప్రచురణ, ప్రసారాల్ని అడ్డుకొనేందుకు ఈ 33 ఏళ్ళ యువనేత అప్పట్లోనే కోర్టుకెళ్ళారు. మీడియా చేతులు కట్టేస్తూ హైకోర్టు నుంచి నిషేధపుటుత్తర్వులు తెచ్చుకున్నారు. తీరా ఇప్పుడు ఓ బాధితురాలు ముందుకొచ్చి ఫిర్యాదు చేయడంతో మరోసారి తేనె తుట్టె కదిలింది. ప్రత్యర్థి పార్టీ ప్రభుత్వం దాన్ని అందిపుచ్చుకొంది. ఈ మురికి చేష్టల కేసుపై ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేసింది. ప్రజ్వల్ వివాదంలో రాజకీయాలున్నాయనే మాట వినిపిస్తున్నది అందుకే!

వీడియోలు అయిదేళ్ళ పాతవనీ, బాధిత మహిళలకు న్యాయం చేసే ఉద్దేశమే నిజంగా ఉంటే, ఈ పార్లమెంట్ సభ్యుడి లైంగిక దుష్ప్రవర్తనపై సాక్ష్యాలు చాలాకాలంగా ఉన్నా కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కార్ ఎందుకు చర్యలు తీసుకోలేదు? ప్రస్తుత ఎన్నికల సమయంలోనే ఈ అస్త్రం ఎందుకు బయటకు తీసింది? ఇవీ బీజేపీ ప్రశ్నలు. బాధితురాలు కేసు పెట్టడం, వీడియోల వివాదాన్ని మీడియా బట్టబయలు చేయడంతో చట్టం తన పని తాను చేసుకుపోతోందన్నది అధికార కాంగ్రెస్ జవాబు. ఆరోపణల పర్వమెలా ఉన్నా, నిందితుడు ప్రజ్వల్ ప్రాతినిధ్యం వహిస్తున్న జేడీ(ఎస్), అలాగే దానితో పొత్తుపెట్టుకున్న బీజేపీలు నష్టనివారణ చర్యలు చేపట్టక తప్పలేదు. బీజేపీ అగ్రనేత – సాక్షాత్తూ కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా సైతం ఈ వివాదాస్పద వీడియోలను ఖండిస్తూ, నారీశక్తినే తాము బలపరుస్తున్నామని మంగళవారం వివరణనివ్వాల్సి వచ్చింది. ప్రజ్వల్, అతని తండ్రి రేవణ్ణ విడిగా ఉంటారనీ, తమ కుటుంబంతో సంబంధం లేదనీ నిందితుడి బాబాయ్, మాజీ సీఎం కుమారస్వామి అనాల్సి వచ్చింది. ఈ సెక్స్ వీడియోల వివాదం ప్రభావం ఎన్నికల్లో తమ పార్టీపై పడకుండా చూడాలనే తాపత్రయం తెలుస్తూనే ఉంది. చివరకు, 'సిట్' దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రజ్వల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు కుమారస్వామి ప్రకటించడం అనివార్యమైంది.

ప్రజ్వల్ రేవణ్ణ కేసు ఏదో నూటికో, కోటికో జరిగిన ఘటన అనుకుంటే పొరపాటే. రాజకీయ బలిమిని చూసుకొని కన్నూమిన్నూ కానని కొందరు... బలవంతపు లైంగిక చర్యలు, దాడులకు పాల్పడుతున్న కేసులు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. ఈ బడాబాబులు అధికారాన్నీ, హోదానూ అడ్డుపెట్టుకొని ఈ కేసుల నుంచి ఒంటి మీద దుస్తులు నలగకుండా బయటకు వచ్చేస్తున్నారు. మహిళా రెజ్లర్లతో లైంగికంగా అనుచిత రీతిలో వ్యవహరిస్తూ వచ్చిన బీజేపీ నేత బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ కేసు అంతర్జాతీయంగానూ వార్తల్లో నిలిచినా, ఇప్పటి దాకా అతీగతీ లేదు. బాధితులకు ఇప్పటికీ న్యాయం దక్కలేదు. సందీప్ సింగ్, ఖజన్ సింగ్ లాంటి పలువురు నేతల కేసుల కథ కూడా అంతే. గమ్మత్తేమిటంటే, గతంలోనే ఆరోపణలు ఎదుర్కొన్న ప్రజ్వల్ హైకోర్ట్ 'గ్యాగ్' ఉత్తర్వులను అడ్డం పెట్టుకొని, దర్జాగా గడిపేశాడు. సిగ్గుమాలిన నేరచర్యలు యథేచ్ఛగా కొనసాగించాడు. కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ ఫిర్యాదు మేరకు ఇప్పుడు ప్రభుత్వం తాజాగా దర్యాప్తు చేపట్టడంతో కష్టాలు తప్పలేదు. పోలింగైన వెంటనే గుట్టుచప్పుడు కాకుండా విదేశాలకు ఉడాయించాడు.

ప్రజ్వల్ వ్యవహారశైలి, అతని వీడియోల పెన్‌డ్రైవ్‌పై స్థానిక బీజేపీ నేత ఒకరు గత డిసెంబర్‌లోనే తన పార్టీని అప్రమత్తం చేశారు. జేడీ(ఎస్)తో పొత్తునూ, హసన్‌లో ప్రజ్వల్ అభ్యర్థిత్వాన్నీ వ్యతిరేకించారు. అన్నీ తెలిసినా బీజేపీ ముందుకెళ్ళి పొత్తు కొనసాగించడం, ప్రజ్వల్‌కు మద్దతుగా ఆ పార్టీ అధినాయకత్వం స్వయంగా ఎన్నికల ప్రచారం చేయడం విడ్డూరం. నారీశక్తికి వందనమంటూ కబుర్లు చెప్పి, మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు తంటాలు పడే పార్టీలు, ప్రతినిధులు ఆడవారికి ఇస్తున్న అసలైన గౌరవం అంతంత మాత్రమే. పితృస్వామ్య భావజాలంతో స్త్రీని భోగ వస్తువుగా చూసే సంస్కృతి నుంచి ఇవాళ్టికీ మన సమాజం, నేతలు బయటపడనే లేదన్న చేదు నిజం పదే పదే రుజువవుతోంది. చివరకు తాజా లోక్‌సభలో మహిళా ప్రాతినిధ్యం సైతం 15 శాతం లోపలే అన్నది మన మహిళా సాధికారత మాటల్లోని డొల్లతనానికి నిదర్శనం. ఇప్పటికైనా కళ్ళు తెరవాలి. అధికారం మాటేమో కానీ, ముందుగా వారిని సుఖభోగ యంత్రాలుగా భావించడం మాని, మనుషులుగా గుర్తించాలి. ప్రజ్వల్ సహా కళంకిత నేతల్ని కఠినంగా శిక్షించడం ఆ క్రమంలో తొలి అడుగు.

'ఆల్ ఫ్రీ బాబు' పునరాగమనం

విశ్లేషణ



టంకశాల అశోక్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 2004 ఎన్నికలలో ఓడిన చంద్రబాబు 2009లోనైనా గెలవాలని లెక్కకు మిక్కిలి హామీలనిచ్చారు. అయినా ఓడారు. 2014లో బీజేపీ, పవన్ కల్యాణ్‌ల పొత్తుతోపాటు, ఎడాపెడా హామీలనిచ్చి గెలిచారు కానీ వాటిని అమలు చేయటంలో విఫలమయ్యారు, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి, 2019లో ఓడారు. అందుకే ఉమ్మడి రాష్ట్ర చరిత్ర, కొత్త రాష్ట్ర చరిత్ర కలిసి ఆయనకు అలవికాని హామీల చంద్రబాబుగా పేరు తెచ్చాయి. అధికారం కోసం ప్రజలకు మోసపూరిత హామీలనిచ్చే నాయకునిగా అన్నమాట! ఈసారి మళ్లీ ఎలాగైనా గెలవాలని బడ్జెట్‌తో నిమిత్తం లేకుండా హామీలను గుప్పిస్తున్నారు. అలా కాదంటే, దేనికెంత సొమ్ము అవసరమో, మొత్తానికి కలిపి ఎంతవుతుందో పోలింగుకు తగినంత ముందే ప్రజల పరిశీలన కోసం ప్రకటించాలి.

చరిత్ర మొదటిసారి విషాదంగా, రెండవసారి ప్రహసనంగా పునరావృతమవుతుందంటాడు కార్ల్ మార్క్స్. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఎన్నికలలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నికల హామీలను చూస్తే ఆ మాట గుర్తుకు వస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 2004 ఎన్నికలలో ఓడిన ఆయన 2009లోనైనా గెలవాలని లెక్కకు అందనన్ని హామీలనిచ్చారు. అయినా ఓడారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో 2019లో ఓడిన ఆయన 2024లోనైనా గెలిచి తీరాలనుకుంటూ తిరిగి ఉచితాల హామీలను కుప్పలుతెప్పలుగా ఇస్తున్నారు. ఆయనలోని ఈ లక్షణాన్ని గమనించినందుకే 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆయనకు 'ఆల్ ఫ్రీ బాబు' అని పేరు పెట్టారు.



2009 ఎన్నికల ప్రచారం నాటి ఒక జ్ఞాపకం ప్రస్తుత సందర్భంలో మళ్ళీమళ్ళీ గుర్తుకు వస్తున్నది. అప్పుడు చంద్రబాబు ప్రతి సభలో తన ఉచిత హామీలను ఒక దానిని మించి మరొకటి ప్రకటిస్తుండేవారు. దానిపై రాజశేఖరరెడ్డి కూడా ప్రతి సభలో, ''చంద్రబాబు ఆల్ ఫ్రీ బాబు అయిపోయారు. అన్నీ ఫ్రీగా ఇస్తారట. నమ్ముతారా?'' అని ప్రజలను నేరుగా అడిగేవారు. అందుకు జవాబుగా ప్రజల నుంచి ''నమ్మం, నమ్మం'' అనే కేకలు పెద్ద ఎత్తున వినిపించేవి. చివరకు చంద్రబాబు అన్నన్ని హామీలిచ్చి కూడా రెండవసారి ఓడిపోయారు. ఇందులో చెప్పుకోవలసిన విశేషం మరొకటి ఉంది. తనవైపు నుంచి తాను కూడా 2004లో కొన్ని హామీలిచ్చిన రాజశేఖరరెడ్డి, 2009లో కొత్తగా దాదాపు ఏమీ ఇవ్వలేదు. అప్పటి ఆర్థిక మంత్రి రోశయ్య, మరికొన్ని హామీలను బడ్జెట్ భరించలేదని చెప్పటం అందుకు కారణమని అప్పుడు విన్నాము. దానితో రాజశేఖర రెడ్డికి చంద్రబాబు హామీలు అలవికానివనీ, కేవలం ఎన్నికలలో గెలిచేందుకు ఉచితాల వర్షం కురిపిస్తున్నారనీ అర్థమైంది. అప్పుడు, తన ప్రచారానికి కొత్త హామీలను కాకుండా 2004–2009 మధ్య కాలపు తన సమర్థవంతమైన పాలనను, దానిపట్ల ప్రజలకు కలిగిన విశ్వాసాన్ని ఆధారం చేసుకోదలిచారు. ఈ ఆలోచన, అందుకు అనుగుణమైన ప్రచారం పనిచేశాయి. ఫలితం తెలిసిందే.

రాష్ట్రం విడిపోయిన తర్వాత జరిగిందేమిటో చూడండి. 2014లో బీజేపీ, పవన్ కల్యాణ్‌ల పొత్తుతో గెలిచిన చంద్రబాబు, అటువంటి పొత్తు ఉండి కూడా, ఏ పొత్తూ లేని జగన్‌మోహన్ రెడ్డిని ఓడించేందుకు ఎడాపెడా హామీలు ఇవ్వవలసి వచ్చింది. కానీ వాటిని అమలు చేయటంలో విఫలమై, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి, 2019లో ఓడిపోయారు. తన పాలన ప్రజలను మెప్పించి ఉంటే, ఈ రెండవసారి పొత్తులు ఉన్నా లేకున్నా గెలవాల్సింది. కానీ అది జరగకపోగా, ఉమ్మడి రాష్ట్ర చరిత్ర, కొత్త రాష్ట్ర చరిత్ర కలిసి ఆయనకు అలవికాని హామీల చంద్రబాబుగా పేరు తెచ్చాయి. మరొక విధంగా చెప్పాలంటే, అధికారం కోసం ప్రజలకు మోసపూరిత హామీలనిచ్చే నాయకునిగా అన్నమాట! తెలుగునాట ఎన్నికల చరిత్రలో ఇటువంటి అప్రతిష్ఠ సంపాదించిన నాయకుడు మరెవ్వరూ లేరు. తన 2004 నాటి ఎన్నికల ఓటమిని గమనిస్తే ఈ మాట మరింత బాగా అర్థమవుతుంది. ఎన్నికలకు కొద్దిముందు తిరుపతి వద్ద ఆయనపైన నక్సలైట్ దాడి జరిగింది. ఆ స్థాయి గల ఒక నాయకునిపై అంత తీవ్రమైన దాడి జరగటం అదే మొదలు, అదే ఆఖరు. అటువంటపుడు తన పట్ల చాలా సానుభూతి రావలసింది! అయినప్పటికీ అందువల్లగానీ, తన పాలనా ప్రతిష్ఠవల్ల గానీ గెలవగలననే నమ్మకం ఏర్పడని చంద్రబాబు, ముఖ్యంగా రైతుల కోసం, గ్రామీణుల కోసం డజన్ల కొద్దీ వరాలు ప్రకటించారు. అయినా గెలవలేదు.

ఎన్టీఆర్ ఉదంతాన్ని అట్లుంచినా, చంద్రబాబుకు సామాన్య ప్రజల సంక్షేమం కోరే నాయకునిగా ఎన్నడూ పేరు లేదు. అధికారానికి వచ్చిన కొత్తనుంచే అప్పటి ఆర్థిక సంస్కరణలను ఎంతో ఉత్సాహంగా భుజాన వేసుకున్న ఆయన తనను తాను సీఈఓగా చెప్పుకొన్నారు. సంస్కరణలకు దేశంలో అందరికీ మించిన పతాకధారి అయ్యారు. ఆ విషయంలో మన్మోహన్ సింగ్‌ను సైతం మించిపోయి దేశ విదేశాలలోనూ పేరు సంపాదించి ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌లకు ప్రీతి పాత్రుడయ్యారు. కానీ ఆ క్రమంలో వ్యాపార వర్గాలకు ఎంత దగ్గరయ్యారో సామాన్య ప్రజలకు అంత దూరమయ్యారు. లోగడ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాలు, తర్వాత ఎన్టీఆర్ అమలుపరచిన సంక్షేమ పథకాలను తగ్గించి వేశారు లేదా రద్దుపరచారు. అందుకే ప్రజల విశ్వాసం కోల్పోయి 2004లో పరాజయం పాలవగా, ఆ పరిణామం ప్రజలను సంతోషపెట్టింది. కనీసం ఆర్థిక సంస్కరణలకీ, ఇండియా వంటి వెనుకబడిన సమాజంలో ప్రజా సంక్షేమానికీ మధ్య సమతులనాన్ని పాటించాలనే విజ్ఞత అయినా తనకు లేకపోయింది. అందువల్లనే ఈ 21వ శతాబ్దంలో జరిగిన నాలుగు ఎన్నికలలో (2004, 2009, 2014, 2019) మూడింట ఓటమి పాలయ్యారు. ఇప్పుడు అయిదవ ఎన్నికను ఎదుర్కొంటున్నారు. తన ఆర్థిక సంస్కరణలు, పరిపాలన గొప్పగా ఉండి ఉంటే ప్రతిసారీ గెలవవలసింది! అది కూడా పొత్తుల కోసం చూడకుండా.

ప్రతిసారీ తన ప్రత్యర్థులను మించి ఎడాపెడా హామీలు ఇస్తున్నారంటేనే చంద్రబాబు బలహీనత అర్థమవుతున్నది. మరొకవైపు 2014లో వలె గెలిచినపుడు అయినా సదరు హామీలను ఎంత మాత్రం అమలుపరచక విఫలం కావటాన్ని బట్టి అవి బడ్జెట్‌తో, ఆర్థిక పరిస్థితితో నిమిత్తం లేనివని తెలిసిపోతున్నది. అవి అలవిమాలినవని ముందుగా గ్రహించలేనివాడు కాదాయన. అయినప్పటికీ ఆ పని చేశారంటే, 2014లో, 2019లో చేసి, ఇపుడు 2024 కోసం తిరిగి చేస్తున్నారంటే, ఆయన ఉద్దేశమే ప్రజలను మోసగించటమనుకోవాలి. ఏమి చేసైనా సరే అధికారం సంపాదించాలన్నమాట!

అదే పని చేసి తలమీదకు తెచ్చుకున్న రెండు ప్రభుత్వాల ఉదాహరణలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పొరుగునే ఉన్నాయి. ఒకటి కర్ణాటక, రెండు తెలంగాణ. రెండు చోట్ల కూడా కాంగ్రెస్ పార్టీ మితిమీరిన హామీలనిచ్చింది. అవి బడ్జెట్ శక్తికి మించిపోగలవని ఆర్థికవేత్తలు ముందుగానే హెచ్చరించారు. అయినా పెడచెవిని పెట్టిన కాంగ్రెస్ ప్రజలను మభ్యపుచ్చి అధికారాన్నయితే సంపాదించింది గానీ, హామీలను అమలుపరచలేక ఏడాది తిరగకముందే తలకిందులవుతున్నది. ప్రజలలో నిరసనలు రెండు రాష్ట్రాలలోనూ మొదలయ్యాయి.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ఈసారి ఇచ్చిన హామీలకు ఏటా సుమారు లక్షన్నర కోట్లు అవసరం కాగలవన్నది ఒక అంచనా. అది నిజం కాదని తెలుగుదేశం అధ్యక్షుడు చెప్పదలచుకుంటే, తన హామీలలో దేనికెంత సొమ్ము అవసరమో, మొత్తానికి కలిపి ఎంత అవుతుందో, రాష్ట్ర బడ్జెట్‌తో పోల్చినపుడు పరిస్థితి ఏమిటో పోలింగుకు తగినంత ముందే ప్రజల పరిశీలన కోసం ప్రకటించాలి. అది నిజాయితీగల పద్ధతి అవుతుంది. ప్రజలు విజ్ఞులని స్వయంగా చంద్రబాబు తరచూ గంభీరంగా ప్రకటిస్తుంటారు. ఒక నాయకుని గత పాలనలో ప్రజలకు కలిగే అనుభవం కూడా విజ్ఞతలోకి వస్తుంది. అందువల్ల, చంద్రబాబు గురించి ప్రజల గత కాలపు నిరాశలను, అపనమ్మకాలను మరచిపోయేటట్లు చేయాలంటే, ఆయన ఈ వివరాలు వెంటనే ప్రకటించాలి. లేనట్లయితే, ఆయనకు 2009లో రాజశేఖర రెడ్డి పెట్టిన 'ఆల్ ఫ్రీ బాబు' పేరును ప్రజలు తిరిగి గుర్తు చేసుకోగలరు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గూడు లేని జనాలు



జీవన వ్యయ సంక్షోభం వల్ల యూరప్ వ్యాప్తంగా జనాలు నాశనానికి దగ్గరగా ఉన్నారు. సోషల్ మార్కెట్ ఎకానమీ విఫలమైంది. నెలనెలకీ ఐర్లాండ్‌లో స్థిరమైన ఆశ్రయంలేని వాళ్ల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ఇంటి అద్దెలు పిచ్చెక్కిస్తున్నాయి.

– మిక్ వాలెస్, ఐర్లాండ్ నుంచి యూరోపియన్ పార్లమెంట్ ఎంపీ

శతాబ్దపు ఘోరాలు



ఈ శతాబ్దపు అత్యంత తీవ్రవాద నేరంగా అక్టోబర్ 7(ఇజ్రాయెల్ మీద హమాస్ దాడి) నిలిచిపోతుంది. దాన్ని అనుసరించి సాగుతున్నది(గాజా మీద ఇజ్రాయెల్ దాడి) ఈ శతాబ్దపు అత్యంత రాజ్య ప్రాయోజిత హింసగా నిలిచిపోతుంది. యూఎస్/యూకే మద్దతుతో ఒక ప్రజాస్వామిక దేశంగా భావించేది దీన్ని చేపట్టడం దిగ్భ్రాంతికరం. – చార్లీ హెర్బర్ట్, విశ్లేషకుడు

తేడా లేదా?



భారత నాయకులు స్వదేశంలో చేసినట్టే, దేశీయ రాజకీయాల కోసమే (కెనడా ప్రధాని) జస్టిన్ ట్రూడో ఖలిస్తానీ అతివాదానికి మద్దతిస్తున్నాడని కొందరు భారత మేధావులు సూచిస్తున్నారు. నిజంగానా? అల్–ఖైదా స్లోగన్లు మార్మోగిన, 9/11 తీవ్రవాద దాడిని ఉత్సవం చేసుకొన్న ఏ సమావేశానికైనా భారత ప్రధాని హాజరయ్యారా?

– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

మీకు నోరు లేదా?



పదేళ్ల క్రితం జర్మనీలోని ఒక వాటర్ పార్క్ వీడియోతో మొదలుపెట్టిన ఓ 29 ఏళ్ల యూట్యూబర్ (ధ్రువ్ రాఠీ) ఇవ్వాళ అత్యంత ప్రభావశీలమైన బీజేపీ విమర్శకుడు కావడం అనేది ప్రతిపక్షాల దుస్థితినే ఎక్కువగా చాటుతోంది. – సదానంద్ ధూమే, కాలమిస్ట్

యూత్, అంకుల్స్ మధ్య...




టీ20 ప్రపంచ కప్ జట్టు కోసం, అంకుల్స్ అంకుల్స్‌లా ఆడే, అంకుల్స్ యూత్‌లా ఆడే, యూత్ అంకుల్స్‌లా ఆడే, యూత్ యూత్‌లానే ఆడే ఆటగాళ్లందరినీ పరిగణనలోకి తీసుకుని, బీసీసీఐ చక్కని సమన్వయం చేసుకుంటుందని ఆశిస్తాను.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

కార్మికుల హక్కులను కాలరాస్తారా?

సందర్భం



బొల్లిముంత సాంబశివరావు

ప్రపంచ వ్యాప్తంగా పాలకుల, పెట్టుబడిదారుల కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తామని కార్మికులు శపథం చేసే రోజు మే డే. 19వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రారంభమైన పారిశ్రామిక విధానం వలన కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయి. ఈ పరిస్థితుల నుంచి బయట పడాలని 1884 అక్టోబర్ 7న అమెరికాలోని చికాగో నగరంలో ఓ కార్మిక సదస్సు నిర్వహించారు. పీడనకు వ్యతిరేకంగా, ఎనిమిది గంటల పనికోసం ఉద్యమించాలనే అవగాహనకు సదస్సు వచ్చింది. ఇందుకు కార్మిక సంఘాలు సమ్మె ప్రారంభించాయి.

1886 మే 1న ఉదయం 10 గంటలకు అమెరికా అంతటా సమ్మె సైరన్ మోగింది. 13 వేల పారిశ్రామిక సంస్థలు మూత పడ్డాయి. 3 లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ప్రారంభమైన 24 గంటల తర్వాత కార్మికుల సంఖ్య 4 లక్షలకు చేరింది. చికాగో నగరంలో 40 వేల మంది కార్మికులు తమ కుటుంబాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. అనేక దేశాల్లో ఎర్ర జండాలు రెపరెపలాడాయి. ప్రభుత్వాలు బెంబేలు పడ్డాయి. పారిశ్రామిక వేత్తల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. పెట్టుబడిదారుల కనుసైగలతో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు కార్మికులు నేలకొరిగారు. కాల్పులను వ్యతిరేకిస్తూ 1886 మే 4న 'హే' మార్కెట్ కార్మికులతో నిండిపోయింది. 'ఖబడ్దార్ మమ్ములను కాల్చి చంపుతారా' అంటూ కార్మికుల ఆగ్రహావేశాల మధ్య సభ ప్రారంభమైంది. సభపై పోలీసులు దాడి చేయటంతో కార్మికులు తిరగబడ్డారు. చాలా మంది తలలు పగిలాయి, చేతులు, కాళ్లు తెగి పడ్డాయి. మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిచిపోయింది. ఏడుగురు పోలీసులు, ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కార్మిక నాయకులపై కేసులు బనాయించి 7 గురికి మరణశిక్ష, 8 మందికి పదిహేనేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. చికాగో కార్మికులపై పోలీసుల హింసాకాండను ఖండిస్తూ అనేక దేశాల్లో పెద్దఎత్తున ప్రదర్శనలు జరిగాయి. కార్మికుల అమరత్వం 8 గంటల పని దినం చట్టానికి నాంది పలికింది.

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వలస పాలనలో భారత కార్మికులు కూడా దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. చికాగో కార్మికుల పోరాటానికి ముందే భారతీయ రైల్వే కార్మికులు 1862లో 8 గంటల పని డిమాండ్ చేస్తూ మొట్టమొదటి సమ్మె చేశారు. సమ్మెపై వలస పాలకులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత పాలకులు, వలస పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలనే అమలు జరిపారు.

మోదీ ప్రభుత్వం కార్మికులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, వేతనాల కోడ్, సామాజిక భద్రత కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, భద్రత– ఆరోగ్యం – పని పరిస్థితుల సంబంధిత కోడ్ అని నాలుగు కోడ్‌లుగా మార్చి... కార్మిక హక్కులను హరించింది. పారిశ్రామిక సంబంధాల కోడ్ కార్మిక హక్కులను కాల రాస్తోంది. ఈ కోడ్ రావటానికి ముందు కార్మికుల డిమాండ్లపై సమ్మె నోటీసు ఇవ్వటానికి 14 రోజుల వ్యవధి సరిపోయేది. ఇప్పుడు దాన్ని 60 రోజులకు పెంచారు. సమ్మెకు వ్యతిరేకంగా ట్రిబ్యునల్‌కు వెళ్లే అవకాశం యజమానులకు కల్పించారు. నాలుగు కోడ్‌లు రాక ముందు పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలకు యజమానులే బాధ్యత వహించాలి. ఇప్పుడు కార్మికులే ప్రమాదాలకు బాధ్యత వహించాలి. ఎనిమిది గంటల పనికి స్వస్తి చెప్పి, యజమానులు కోరితే 10 నుంచి 12 గంటలు పని చేయాలి. అందుకు ప్రత్యేక వేతనం ఉండదు.

గత కార్మిక వర్గ ఉద్యమాలను అవగాహన చేసుకుని, మోదీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలి. అందుకు ఈ మే 1 నాంది కావాలి.

రైతు కూలీ సంఘం (ఏపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు । 98859 83526

మే డే స్ఫూర్తిని కాపాడుకోవాలి!

వందల సంవత్సరాలుగా ప్రపంచ శ్రామిక ప్రజలు చిందించిన నెత్తుటి త్యాగాల గుర్తుగా అరుణ పతాకం రెపరెపలతో ప్రపంచ వ్యాప్తంగా సభలు ప్రదర్శనలతో... మే డే వచ్చింది. సకల దేశాల జాతుల మతాల, కులాల కార్మికులంతా ఒకటేనని ఈ ప్రపంచమే మనదని చాటి చెప్పిన కార్మిక వర్గ అంతర్జాతీయ దినమే మే డే. 19వ శతాబ్దం రెండవ అర్ధ భాగంలో ఇంగ్లండ్ కేంద్రంగా యూరప్ అమెరికా లలో సంభవించిన పారిశ్రామిక విప్లవ ఫలితంగా కార్మిక వర్గం పుట్టుకతోనే సంఘటిత సమరశీల పోరాటాలకు నాంది పలికింది.

ఆవిరి యంత్రం, జౌళి యంత్రాలు, రైళ్లు, టెలిగ్రాఫ్, మరమగ్గం తదితర అనేక యంత్ర సాధనాలను కనిపెట్టడంతో పారిశ్రామిక విప్లవం జరిగింది. దీని వలన అంతకు ముందు ఉన్న భూస్వామ్య ఉత్పత్తి వ్యవస్థ నిర్మూలించబడి పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ అమలులోకి వచ్చింది. కార్మిక వర్గంపై పెట్టుబడిదారీ వర్గ దోపిడీ తీవ్రంగా కొనసాగుతున్న కాలంలో కార్మిక వర్గం తమ సమస్యల కోసం సంఘటితంగా పోరాడవలసిన పరిస్థితులు ఏర్పడినాయి. ఈ పరిస్థితుల మధ్య 18 – 16 గంటల పని నుండి 8 గంటల పని దినం కోసం కార్మిక వర్గం రక్తతర్పణ చేసిన దినమే మే డేగా ప్రసిద్ధి చెందింది.



1923 మే 1వ తేదీన లేబర్ కిసాన్ పార్టీ నాయకుడు (ఆ తరువాత కమ్యూనిస్టు పార్టీ సెక్రటరీ) సింగార వేలు ఎర్రజెండాను ఎగరవేయడంతో ఆనాటి నుండి భారతదేశంలో కార్మిక వర్గం మే డేను జరపడం కొనసాగుతూ వస్తున్నది. రష్యాలో మేడే ఉత్సవాల్లో అక్కడి కమ్యూనిస్ట్ నాయకులు 8 పని గంటల డిమాండ్‌తో పాటు చిన్న చిన్న ఆర్థిక డిమాండ్‌లను చేర్చడాన్ని లెనిన్ నిరసించినాడు. మే డే రాజకీయ స్వభావాన్ని తక్కువ చేసే ఆర్థిక డిమాండ్‌లు చేర్చడాన్ని లెనిన్ వ్యతిరేకించారు. మే డే సందర్భంగా కార్మిక వర్గం రాజకీయ లక్ష్య సాధన కోసం ప్రతిన పూనాలని ఆయన చెప్పారు.

ఆ తర్వాత కాలంలో మే డే అంతర్జాతీయ కార్మిక వర్గానికి కేంద్ర బిందువు అయింది. ఎన్నో రాజకీయ డిమాండ్లు వివిధ సందర్భాల్లో చేర్చబడ్డాయి. అంతర్జాతీయ కార్మిక వర్గ సంఘీభావం, అందరికీ ఓటు హక్కు, సామ్రాజ్యవాద యుద్ధ వ్యతిరేకత, వలసవాద అణచివేత వ్యతిరేకత, రాజకీయార్థిక సంఘాలు ఏర్పరచుకునే హక్కు, రాజకీయ ఖైదీల విడుదల వంటివి అందులో కొన్ని.

మే డే రాజకీయ చరిత్ర ప్రాముఖ్యాన్ని రూపుమాపేందుకు అమెరికా బూర్జువా సంస్కరణ వాద, అవకాశవాద సంఘ నాయకులు మే డే నాడు ప్రదర్శనలు కాకుండా సెలవు రోజు అయిన ఆదివారం జరపాలని 1890 లోనే నిర్ణయించారు. ఇటువంటి కుట్రతోనే అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ అవకాశవాద నాయకులు మే డేకు ప్రతిగా సెప్టెంబర్ ఒకటిని లేబర్ డేగా నిర్ణయించారు. అమెరికన్ ప్రభుత్వ కుట్ర పూరితంగా మే మొదటి తేదీని బాలల ఆరోగ్య దినంగా ప్రకటించింది.

భారతదేశంలో మతోన్మాద అనుబంధ కార్మిక సంఘం అయిన భారతీయ మజ్దూర్ సంఘ్ మే డేని గుర్తించకుండా 'విశ్వ కర్మ దినం' జరుపుతున్నారు. మే డేకు ఉన్న వర్గ స్వభావాన్ని మొద్దుబార్చడానికి మే డే రాజకీయ స్వభావాన్ని దెబ్బతీయడానికి ప్రభుత్వాలు, వివిధ సంస్కరణ వాద అవకాశవాద ట్రేడ్ యూనియన్‌లు మే డేను రికార్డింగ్ డ్యాన్సులతో పండుగలుగా జరుపుతున్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మే నెల మొదటి రోజున ప్రపంచ కార్మిక వర్గం కమ్యూనిస్టు పార్టీలు అంతర్జాతీయ కార్మిక పోరాట దినోత్సవాన్ని జరుపుతూనే ఉన్నారు.

శ్రామిక ప్రజల దోపిడీకి, అణచివేతకు, మానవ సమాజం ఎదుర్కొంటున్న సకల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యలకు మూల కారణంగా ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించి సోషలిస్ట్ సమాజ నిర్మాణానికి కార్మిక వర్గం సంసిద్ధం కావాలనే మే డే చారిత్రక పిలుపును శ్రామిక వర్గం ఎత్తి పట్టాలి.


కార్మిక వర్గ అంతర్జాతీయత వర్ధిల్లాలి!
ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి!!

– జంపన్న । మార్క్సిస్ట్–లెనినిస్ట్ నాయకుడు
(నేడు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం – మే డే)

సాధ్యమయ్యేనా?

'జనలోకోన్నతమైన తత్పురము తూ–చా తప్పకుండంగ వ/ర్ణన సేయన్ తరమే!' అంటూ వర్ణన చేశాడు ధూర్జటి మహాకవి కాళహస్తి పురాన్ని.

'తు–చ తప్పకుండా' అంటే, ఏ చిన్న విషయమూ వదిలి పెట్టకుండా, సంపూర్ణంగా అని అర్థం. ఈ జాతీయం తెలుగు వారి వాడుకలో తరచుగా వినిపిస్తుంది కానీ 'తు'– 'చ' లు సంస్కృత పదాలు. 'తు'– 'చ'– 'హి'–'వై'–'హ' ఇలాంటి ఏకాక్షర అవ్యయ పదాలు సంస్కృతంలో కొన్ని ఉన్నాయి. వీటికి, 'అయితే', 'మరియు', 'కదా', 'సుమా!', 'సుమీ!' అని వరసగా స్థూలంగా అర్థం చెప్పుకోవచ్చు.



జ్యోతిర్మయం

చాలా చోట్ల (అన్ని చోట్లా కాదు) ఈ పదాలు ఉన్నా లేకపోయినా, ఒక వాక్యం ద్వారా చెప్పదలచుకొన్న అర్థం మారదు. 'సుముఖశ్చ, ఏకదంతశ్చ... లంబోదరశ్చ...' అని చెప్పే గణపతి షోడశ నామాలలో ఈ 'చ' లకు ప్రత్యేకం అర్థమేమీ లేదు. 'దృష్ట్వా తు పాండవానీకం...' అన్న భగవద్గీత శ్లోకంలో 'తు' ఊత పదం. 'కిం కరిష్యతి వై యమః' అన్న చోట 'వై' కి చెప్పుకోదగ్గంత అర్థం లేదు. 'నిరర్థకం తు–హి ఇత్యాది...' అన్నాడు జయదేవుడు. 'పూరణా ఏక ప్రయోజనమ్'. శ్లోక పాదం పూరించటం మాత్రమే ప్రయోజనం, అని.

ఈ తు–చలు కావ్యాలలో కంటే పురాణాలలో ఎక్కువగా కనిపిస్తాయి. కారణం పురాణాలలో కథను లక్షల కొద్దీ శ్లోకాలలో చెప్పాలి. అన్ని లక్షల శ్లోకాలు ఛందస్సు చట్రంలో బిగించి అల్లేటప్పుడు, అక్కడక్కడా మక్కు పెట్టవలసి వస్తుంది. ముఖ్యంగా జాబితాలు కట్టి చెప్పాల్సి వచ్చినప్పుడు. ధృతరాష్ట్రుడి నూరుగురి కొడుకుల పేర్లు ఇవీ, ఫలానా వంశంలో రాజులు వీళ్లూ అని వరసగా చెప్పాలంటే, ఆ పేర్లన్నీ తు–చలు లేకుండా వరసగా ఛందస్సులో ఇమడవు.

ఫలానా వారి మాటో, ఆదేశమో, సలహానో, ఉపదేశమో తు–చ తప్పకుండా పాటించటమంటే, నూటికి నూరు శాతం వాళ్ళు చెప్పింది చెప్పినట్టు చేయటం. 'ఇది ముఖ్యం, అది అముఖ్యం' అని సొంత బుద్ధి వాడకుండా, పూర్తి భక్తి గౌరవాలతో చెప్పిందంతా చేసేయటం.

'కాళహస్తిపురంలో ఎన్నెన్నో విశేషాలు ఉన్నాయి. వాటిలో ఏ చిన్న విశేషమూ వదలకుండా సమగ్రంగా, మొత్తం ఉన్న దున్నట్టు వర్ణించడమనేది ఎవరికయినా సాధ్యం అవుతుందా?' అంటున్నాడు ధూర్జటి.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.అష్టమి రా.12.58 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** శ్రవణం రా.12.31 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** తె.4.18 నుండి 5.46 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ఉ.11.32 నుండి 12.20 వరకు, **అమృత ఘడియలు:** ప.2.03 నుండి 4.12 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.39, **సూర్యాస్తమయం:** 6.14.



టంగుటూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



మైదుకూరులో సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



చిత్తూరు జిల్లా కలికిరిలో జరిగిన సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

నాయకుడంటే ఓ నమ్మకం..

టంగుటూరు, మైదుకూరు, కలికిరి ఎన్నికల సభల్లో ఏపీ సీఎం వైఎస్ జగన్

మీ మేనిఫెస్టోలో ప్రధాని మోదీ ఫొటో ఎక్కడ చంద్రబాబూ?

సాక్షి ప్రతినిధి, ఒంగోలు, సాక్షి ప్రతినిధి, కడప, సాక్షి రాయచోటి: అసత్యాల హరిశ్చంద్రులంతా 2014 తరహాలో మరోసారి కూటమి కట్టి మళ్లీ మోసగించేందుకు తయారయ్యారని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తాను వరుసబెట్టి 58 నెలలుగా మనందరి ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీమ్‌ల లిస్టు చదువుతుంటే చంద్రబాబుకు పిచ్చి కోపం వస్తోందని వ్యాఖ్యానించారు. చంద్రబాబూ..! నువ్వు పేదలకు చేసిన మంచి ఏమిటని అడిగితే సమాధానం చెప్పకుండా జగన్‌ను తిడితే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. నాయకుడంటే ప్రజలకు నమ్మకం కలిగేలా ఉండాలన్నారు. 'చంద్రబాబుది బోగస్ రిపోర్టు అయితే మీ జగన్‌ది ప్రోగ్రెస్ రిపోర్ట్. ఇద్దరి పాలనలే ఇందుకు నిదర్శనం' అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉదయం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం టంగుటూరులో, మధ్యాహ్నం వైఎస్సార్ జిల్లా మైదుకూరులో, సాయంత్రం అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం కలికిరిలో నిర్వహించిన బహిరంగ సభల్లో సీఎం జగన్ మాట్లాడారు.

నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం..

ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేవి కాదు. ఇది జగన్‌కు, చంద్రబాబుకు మధ్య జరుగుతున్న ఎన్నికల యుద్ధం కాదు. పేదలకు – చంద్రబాబు మోసాలకు మధ్య జరుగుతున్న యుద్ధం ఇది. మీ జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కూడా సజావుగా కొనసాగింపు. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నీ ముగింపు, మళ్లీ మోసపోవటమే. మళ్లీ చంద్రముఖి నిద్ర లేస్తుంది. లకలకా అంటూ మళ్లీ ఐదేళ్లు మీ అందరి రక్తం తాగేందుకు తలుపు తడుతుంది. నాయకుడంటే ప్రజల్లో నమ్మకం ఉండాలి. తాను ఒక మాట చెబితే చేస్తాడనే నమ్మకం ఆ నాయకుడిపై ప్రజలకు కలగాలి. మేనిఫెస్టోలో చెప్పిన 99 శాతం వాగ్దానాలను అమలు చేసి నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం.

ఎవరు మనసున్న మనిషి?

చంద్రబాబు హయాంలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు ఇచ్చిన పెన్షన్ ఎంత? కేవలం రూ.1,000 మాత్రమే. ఈరోజు మీ బిడ్డ ఇస్తున్న పెన్షన్ రూ.3,000. మరి ఎవరికి మనసుంది? చంద్రబాబు ఏనాడైనా ఆ అవ్వాతాతలకు తోడుగా ఉన్నాడా? ఇంటికే పెన్షన్ పంపించాడా? 14 ఏళ్ల పాలనలో ఎన్నడైనా బటన్లు నొక్కి అక్కచెల్లెమ్మలకు మంచి చేశాడా? మరి మీ బిడ్డ 130 సార్లు బటన్లు నొక్కి నేరుగా రూ.2.70 లక్షల కోట్లు ఎక్కడా లంచాలు లేకుండా పారదర్శకంగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లో జమ చేశాడు. వలంటీర్లు మళ్లీ మీ ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్తు మారాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు, వివక్ష లేని పాలన జరగాలన్నా, మన పిల్లలు, మన బడులు, మన చదువులు బాగుపడాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తు మీద రెండు బటన్లు నొక్కాలి.

బాబుది బోగస్ రిపోర్ట్.. జగన్‌ది ప్రోగ్రెస్ రిపోర్ట్

బాబు వస్తే జాబొస్తుందని 2014లో చంద్రబాబు, ఎల్లో మీడియా ఊదరగొట్టాయి. చంద్రబాబు ఐదేళ్లలో ముష్టి వేసినట్లు 32 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తే మీ జగన్ 2.31 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశాడు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో గవర్నమెంట్ ఉద్యోగాలు నాలుగు లక్షలు మాత్రమే ఉంటే ఈ 58 నెలల కాలంలో మీ బిడ్డ ఏకంగా మరో 2.31 లక్షల గవర్నమెంట్ ఉద్యోగాలు భర్తీ చేశాడు. మరి బాబు రిపోర్ట్ బోగస్ కాదా? ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో మీ జగన్ రిపోర్టు కళ్లెదుటే కనిపిస్తున్న వాస్తవం కాదా?

బంగారం వేలం వేయించిన బాబు

చంద్రబాబూ.. రైతుల రుణ మాఫీపై తొలి సంతకం చేస్తానన్నావు. బ్యాంకుల్లో పెట్టిన బంగారం విడిపిస్తానన్నావు. మరి రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేశావా? బ్యాంకుల్లో పెట్టిన బంగారాన్ని విడిపించకపోగా ఏకంగా వేలం వేయించాడు. చంద్రబాబు రైతులకు ఉచితంగా పంటల బీమా ఏరోజైనా ఇచ్చాడా? పెట్టుబడి సాయంగా చంద్రబాబు ఏ ఒక్క రైతుకైనా రైతు భరోసా అందించారా? ఎన్నికలు రావడంతో జగన్ కంటే ఎక్కువ డబ్బులిస్తానంటూ నమ్మబలుకుతున్నాడు. వ్యవసాయం దండగ అని నువ్వు మాట్లాడిన మాట నిజం కాదా చంద్రబాబూ? రైతులపై బషీర్‌బాగ్‌లో కాల్పులు జరిపించింది నువ్వు కాదా? రైతన్నలకు ఉచిత కరెంటు ఇస్తే తీగల మీద బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందన్న మాటలు నీవి కావా? రైతులను అన్ని రకాలుగా మోసం చేసి నిట్ట నిలువునా ముంచిన నీది బోగస్ రిపోర్టు కాదా?

మేనిఫెస్టోలో మోదీ ఫొటో వద్దన్న బీజేపీ!

"ఈ పెద్దమనిషి చంద్రబాబు.. ఇవాళ మేనిఫెస్టో అంటూ ప్రకటించాడు. చంద్రబాబు విశ్వసనీయత, సాధ్యం కాని హామీలు ఏ స్థాయిలో ఉన్నాయంటే... పైనుంచి బీజేపీ వాళ్లు ఫోన్ చేసి నీ ఫొటో మాత్రమే పెట్టుకో! ప్రధాని మోదీ ఫొటోను నీ మేనిఫెస్టోలో పెట్టొద్దు అని తేల్చి చెప్పారు. అంటే ఈయన సాధ్యం కాని హామీలిచ్చినట్లే కదా! అదంతా మోసమే అని రుజువు అవుతోంది కదా? కూటమిలో ఉంటూ ముగ్గురి ఫొటోలు కూడా పెట్టుకునే పరిస్థితిలో చంద్రబాబు లేడంటే ఒక్కసారి గమనించండి. ప్రజల్ని మోసం చేయడం కోసం ఆయన ఏ స్థాయిలో బరి తెగించాడో చూడండి"

\- కలికిరి సభలో సీఎం జగన్

చేతగానివాడికే కోపం ఎక్కువ..

చంద్రబాబు వయసు 75 ఏళ్లు దాటింది. ఇంత జీవితం.. వెన్నుపోట్లు, మోసాలు, అబద్ధాలు, కుట్రలతోనే గడిచిపోయింది. 75 ఏళ్లు వచ్చాయి కదా..! ఆ మనిషిలో ఇప్పుడైనా పశ్చాత్తాపం కనిపిస్తుందా? అని చూస్తే ఏ కోశానా లేదు. వీళ్లంతా.. ఎంత దారుణంగా మాట్లాడుతున్నారో తెలుసా? జగన్‌ను మనిషి అనాలో రాక్షసుడు అనాలో చంద్రబాబుకు అర్థం కావట్లేదట! జగన్‌ను ఎందుకు చంపకూడదు? అని అడుగుతాడు ఈ పెద్దమనిషి. పనిలో పనిగా జగన్‌ను పాతేస్తానని కూడా అంటాడు. మొన్న నందికొట్కూరు, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు, కొవ్వూరులో అన్న మాటలివి. అయ్యా.. మీ సంస్కారానికి ఓ నమస్కారం! చేతగానివాడికే కోపం ఎక్కువ.

\- మైదుకూరు సభలో సీఎం జగన్

రైతన్నలకు జగనేం చేశాడంటే..

- గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్నదాతలకు రైతు భరోసా ఇచ్చింది మీ జగన్.
- సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తోంది మీ జగన్.
- గ్రామాల్లో ఆర్బీకేలు తేవడంతోపాటు 9 గంటలు పగటిపూటే నాణ్యమైన ఉచిత విద్యుత్, ఇ– క్రాప్, ఉచిత పంటల బీమా, గిట్టుబాటు ధరలు, ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, రైతన్నలకు సలహాలు, దళారీలు లేకుండా పంటల కొనుగోళ్లు.. ఇవన్నీ జరిగింది ఎప్పుడంటే మీ బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాకే.
- మీ జగన్ చెప్పిన దాని కంటే మిన్నగా రైతన్నలకు సాయం చేశాడు. రైతు భరోసా ద్వారా ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో రూ.50 వేలు ఇస్తానని చెప్పినా అంతకంటే మిన్నగా ఐదేళ్లలో రూ.67,500 పెట్టుబడి సాయంగా అందించాడు.
- ఈ దఫా అధికారంలోకి వచ్చాక ఏటా రూ.16 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.80 వేలు రైతన్నల చేతిలో పెడతామని చెబుతున్నా. మరి మాట తప్పకుండా కచ్చితంగా ఇచ్చే మీ జగన్‌ను నమ్మాలా? లేక ఇస్తానని మోసం చేసే బాబును నమ్మాలా?

మీ సంస్కారానికి ఓ నమస్కారం..

నేను వరుసబెట్టి 58 నెలలుగా మనందరి ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీమ్‌ల లిస్టు చదువుతుంటే చంద్రబాబుకు పిచ్చి కోపం వస్తోంది. మా చంద్రబాబును ఇలాంటి ప్రశ్నలు అడుగుతావా? అని ఈనాడుకు, ఆంధ్రజ్యోతికి, టీవీ 5, దత్తపుత్రుడికి కోపం వస్తోంది. వదినమ్మకూ కోపం వస్తోంది. వీరందరికీ పిచ్చిపిచ్చిగా కోపం వస్తోంది. వీరితో పాటు చంద్రన్న కాంగ్రెస్‌కు కూడా కోపం వస్తోంది. మనకు కౌంటర్‌గా వారు లిస్టులు చదువుతున్నారు. కాకపోతే అవి స్కీమ్‌ల లిస్టులు కాదు. అవన్నీ నాపై తిట్లు, శాపనార్థాలు, బెదిరింపులు, బూతులు, అబద్ధాల లిస్టులు. అవి ప్రతి రోజూ గడగడ చదివేస్తున్నారు. అయ్యా.. మీ సంస్కారానికి ఓ నమస్కారం అని వారందరికీ చెబుతున్నా.

జవాబు చెప్పకుండా జగన్‌ను తిడతావా?

చంద్రబాబూ నువ్వు పేదలకు చేసిన మంచి ఏమిటని అడిగితే నీ దగ్గర నుంచి సమాధానం లేదు. పాత మేనిఫెస్టోను అమలు చేస్తావా? అంటే సమాధానం రాదు. మీ కొత్త మేనిఫెస్టోకు విశ్వసనీయత ఏమిటి? ప్రజలకు జవాబు చెప్పకుండా జగన్‌ను తిడితే ఏం ప్రయోజనం?

9 నుంచి హజ్ యాత్రలు షురూ

- 2024 హజ్ యాత్ర షెడ్యూల్ విడుదల
- మే 25 వరకు 35 విమానాల్లో 13,600 మంది యాత్ర

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర హజ్ –2024 యాత్ర షెడ్యూల్‌ను కేంద్ర హజ్ కమిటీ మంగళవారం విడుదల చేసింది. మే నెల 9 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్ర హజ్ యాత్రికుల టూర్ షెడ్యూల్ ఉంటుంది. ఈ ఏడాది రాష్ట్ర హజ్ కమిటీ నుంచి దాదాపు 13,600 మంది యాత్రికులు హజ్ ఆరాధనలకు సౌదీఆరేబియాలోని జిద్దా నగరానికి వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 13,600 మంది యాత్రికుల్లో 11,200 మంది తెలంగాణ రాష్ట్రం నుంచి, ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు 1800 మంది, కర్నాటక, మహరాష్ట్ర నుంచి దాదాపు 600మంది యాత్రికులు హైదరాబాద్ నుంచే వెళ్లనున్నట్టు తెలిపారు. మే 9 నుంచి 25వరకు 16 రోజుల్లో 35 విమానాల్లో సౌదీ ఆరేబియాలోని జిద్దానగరానికి చేరుకుంటారు. యాత్రికులు తమ షెడ్యూల్ కంటే 48 గంటల ముందే నాంపల్లి హజ్ హౌస్‌లో రిపోర్ట్ చేయాలని అధికారులు సూచించారు. 20 కేజీల్లోపు బరువుండే రెండు లగేజ్ బ్యాగ్‌లు, 7 కేజీల హ్యాండ్ క్యారీ మాత్రమే తీసుకు రావాలని స్పష్టం చేశారు. యాత్రకు సంబంధించిన ప్రక్రియలు పూర్తి చేసేందుకు హజ్ హౌస్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. లగేజ్, కరెన్సీ, ఇమిగ్రేషన్, కస్టమ్స్‌తో పాటు బోర్డింగ్ పాస్‌లు కూడా హజ్‌హౌస్‌లోనే యాత్రికులకు అందజేస్తారు.

పదిరోజులు 'భాగ్యనగర్' బంద్



రామగుండం: సికింద్రాబాద్– సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 10వ తేదీ వరకు రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత కూడా ఇదేనెల 16 నుంచి 22వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మూడో రైల్వేలైన్‌లో సాంకేతిక పనుల నేపథ్యంలో ఈ రైలును రద్దు చేస్తున్నట్లు తెలిసింది. కోల్‌బెల్ట్ జిల్లాల నుంచి సికింద్రాబాద్‌కు ప్రతిరోజూ తక్కువ ధరలతో సాధారణ, మధ్య తరగతి ప్రజలు ప్రయాణం చేసేందుకు భాగ్యనగర్ రైలు సౌకర్యంగా ఉంటుంది. దీనిని తరచూ రోజులు, నెలల తరబడి రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు లేని అడ్డంకులు సాధారణ, మధ్య తరగ తి ప్రజలు ప్రయాణించే రైళ్లకు ఎందుకనే ప్రశ్న లు తలెత్తుతున్నాయి. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు స్పందించాలనే డిమాండ్ వస్తోంది.

వారంపాటు తీవ్ర వడగాడ్పులు!

- దక్షిణ, నైరుతి దిశల నుంచి వీస్తున్న బలమైన గాడ్పులు
- పొడి వాతావరణంతో పెరిగిన వడగాల్పుల తీవ్రత
- 13 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న వారం రోజులపాటు వడగాడ్పుల తీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలకుతోడు పొడి వాతావరణం, దక్షిణ, నైరుతి దిశల నుంచి గాలుల ప్రభావం వల్ల వడగాడ్పుల తీవ్రత పెరుగుతుందని తెలిపింది. ముఖ్యంగా 13 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోని పలుచోట్ల ఈ నెల 6వ తేదీ వరకు తీవ్ర వడగాల్పులకు అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా బుధ, గురువారాల్లో వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. అయితే ఈ నెల 6 వరకు తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నప్పటికీ అక్కడక్కడా తేలికపాటి వానలు కూడా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

రామగుండం.. అగ్నిగుండం..

మంగళవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే రామగుండంలో 44.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఖమ్మంలో సాధారణం కంటే 3.6 డిగ్రీలు, భద్రాచలం, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో 3 డిగ్రీల చొప్పున అధికంగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇక రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని చాలాచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా జైనలో అత్యధికంగా 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా నల్లగొండ జిల్లా మాడుగులపల్లిలో 46.2, జగిత్యాల జిల్లా అల్లీపూర్‌లో 46.1, కొల్వాయ్ 46 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్‌లోకెల్లా ఇవే అత్యధిక ఉష్ణోగ్రతలని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

మంగళవారం ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
రామగుండం	44.4
నిజామాబాద్	44.1
ఖమ్మం	43.5
మహబూబ్‌నగర్	43.3
మెదక్	43.2
నల్లగొండ	43.0
భద్రాచలం	43.0
ఆదిలాబాద్	42.8
హనుమకొండ	42.0
హైదరాబాద్	41.9
విజయవాడ	41.0
విశాఖపట్నం	38.0

రైతులకు వేసిన డబ్బు మళ్లీ సర్కార్ ఖాతాలోకి..

- రైతు బంధుపై రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది రైతుల గగ్గోలు
- బ్యాంకు వివరాలు సరిగా లేకపోవడమే కారణం
- సమాచారం తెలిసినా పట్టించుకోని యంత్రాంగం



సాక్షి, హైదరాబాద్: అధికార యంత్రాంగ నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. రైతుబంధు సొమ్ము సక్రమంగా రైతుల ఖాతాల్లో వేయకపోవడంతో అవి తిరిగి ప్రభుత్వ ఖాతాల్లోకే వచ్చిపడుతున్నాయి. ఇటీవల యాసంగి సీజన్‌కు సంబంధించి వేసిన రైతుబంధు సొమ్ము వేలాదిమంది రైతులకు వెళ్లకుండానే వెనక్కి రావడంపై వారు భగ్గుమంటున్నారు. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారమే 19 వేల మంది రైతుల ఖాతాల్లోకి వెళ్లాల్సిన రైతుబంధు సొమ్ము బ్యాంకుల వరకు వెళ్లి తిరిగి వెనక్కి వచ్చింది. అనేకమంది రైతులకు ఇంకా పూర్తిస్థాయిలో రైతుబంధు సొమ్ము అందలేదన్న ఆరోపణలు ఉన్నాయి. రైతుబంధు సొమ్ము వెనక్కి వచ్చినట్టు లెక్కలు తీసిన వ్యవసాయశాఖ అధికారులు, వాటిని ఇంకా పూర్తిస్థాయిలో సరిదిద్దలేదు. తిరిగి రైతుబంధు చెల్లింపులు చేయకపోవడంపైనా విమర్శలు ఉన్నాయి.

అధికారుల తప్పుల వల్లే ఈ పరిస్థితి...

- వ్యవసాయశాఖ అధికారుల తప్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న ఆరోపణలు ఉన్నాయి.
- ఇంటిపేర్లు, రైతుల పేర్లు తప్పుగా రాయడం, బ్యాంకు ఖాతాల నంబర్లు సరిచూసుకోకుండా నంబర్లలో తప్పులు దొర్లడం వంటి కారణాల వల్ల రైతుల ఖాతాలకు వేసిన డబ్బులు వెనక్కి వస్తున్నాయి.
- ఒక్క అక్షరం తప్పుగా వచ్చినా కూడా బ్యాంకులు తిరిగి వెనక్కి వేస్తున్నాయి.
- కొందరు రైతుల బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ కావడం, ఖాతాదారులు డిఫాల్టర్‌గా మారడం, కొందరి ఖాతాలు క్లోజ్ అవ్వడం, రుణాలు రెన్యువల్ చేసుకోవడంతో పాత ఖాతాలు పోయి కొత్త ఖాతాలు రావడం, పాత ఖాతాల వివరాలే వ్యవసాయశాఖ వద్ద ఉండటం తదితర కారణాలు కూడా రైతుబంధు సొమ్ము తిరిగి వెనక్కి రావడానికి కారణంగా ఉంటుందని ఒక వ్యవసాయ ఉన్నతాధికారి తెలిపారు.
- వ్యవసాయశాఖకు రైతులు ఫిర్యాదు చేస్తున్నా, పూర్తిస్థాయిలో స్పందించడం లేదన్న విమర్శలొస్తున్నాయి.
- సాంకేతిక సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.
- బ్యాంకులతో వ్యవసాయ శాఖ సమన్వయం చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

యాసంగిలో ఐదెకరాలకే రైతుబంధు పరిమితం...

రైతుభరోసా పథకం వచ్చే వానాకాలం నుంచి ప్రారంభిస్తామని, అప్పటివరకు గత రైతుబంధు మార్గదర్శకాలనే అమలు చేస్తామని కాంగ్రెస్ సర్కారు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. రైతుబంధు మార్గదర్శకాల ప్రకారం భూమి విస్తీర్ణంతో సంబంధం లేకుండా రైతులందరికీ రైతుబంధు సొమ్ము వేయాలి. కానీ ఇప్పటివరకు ఐదు ఎకరాలున్న రైతులకు మాత్రమే రైతుబంధు సొమ్ము అందజేసినట్టు వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. కాగా, కొందరు రైతులు మాత్రం ఐదెకరాల వరకే ఉన్నా తమకు అందలేదంటున్నారు. దీనిపై కొంత గందరగోళం నెలకొంది. గత వానాకాలం సీజన్ లెక్కల ప్రకారం రైతుబంధు సొమ్ము తీసుకున్న రైతులు 68.99 లక్షలు ఉన్నారు. ఈ యాసంగి సీజన్‌లోనూ అంతే మంది రైతులకు సొమ్ము విడుదల చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంది. ఆ ప్రకారం 1.52 కోట్ల ఎకరాలకు రూ. 7,625 కోట్లు విడుదల చేయాలి. ఇప్పటివరకు ఐదెకరాల వరకున్న రైతులకు మాత్రమే రూ. 5,202 కోట్ల రైతుబంధు సాయం అందిందని వ్యవసాయ వర్గాలు తెలిపాయి.

ఓయూ హాస్టళ్లు కొనసాగుతాయి: రిజిస్ట్రార్

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూ క్యాంపస్‌లోని హాస్టల్స్ కొనసాగుతాయని రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. పలు ఉద్యోగాలకు, యూజీసీ నెట్, టీఎస్ టెట్ తదితర పోటీ పరీక్షలు ఉన్నందున విద్యార్థుల విజ్ఞప్తి మేరకు హాస్టల్స్‌ను కొనసాగించనున్నట్లు వెల్లడించారు. మెస్ బిల్లులు చెల్లిస్తాం భోజనశాలలను కూడా తెరిచి ఉంచాలని విద్యార్థులు కోరారు. దీంతో వీసీ రవీందర్‌తో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు రిజిస్ట్రార్ చెప్పారు.

కాంగ్రెస్ ప్రేమ దుకాణాల్లో ఫేక్ వీడియోలు

నా వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు.. నకిలీ వీడియోలు సృష్టిస్తున్నారు

ప్రతిపక్షంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం ● మహారాష్ట్రలో మోదీ ఎన్నికల ప్రచారం

షోలాపూర్: విపక్ష కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, సమస్యలు.. కవల పిల్లలు అని విమర్శించారు. దశాబ్దాలపాటు పరిపాలించిన కాంగ్రెస్ మన దేశానికి ఇచ్చింది పేదరికాన్ని తప్ప ఇంకేమీ లేదని ధ్వజమెత్తారు. మంగళవారం మహారాష్ట్రలోని లాతూర్, ధారాశివ్, షోలాపూర్ జిల్లాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమి బీజేపీకి వ్యతిరేకంగా కృత్రిమ మేధ సాయంతో ఫేక్ వీడియోలు సృష్టించి, సోషల్ మీడియాలో వ్యాప్తిలోకి తీసుకొస్తోందని ఆరోపించారు. తన రూపాన్ని, గొంతును అనుకరిస్తూ.. తాను అనని మాటలు అన్నట్లుగా, తన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ నకిలీ వీడియోలు తయారు చేస్తున్నారని, సాంకేతికతను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ఫేక్ వీడియోలను కాంగ్రెస్ ప్రేమ దుకాణంలో అమ్మకానికి పెట్టారని అన్నారు. ఎన్నికల పోరాటంలో బీజేపీని ఎదుర్కొనే దమ్మూ ధైర్యం లేక విపక్షాలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం సాగిస్తున్నాయని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అబద్ధాలను ప్రజలెవరూ నమ్మడం లేదని, అందుకే తప్పుడు దారులు ఎంచుకుందని విమర్శించారు. కాంగ్రెస్ అబద్ధాల దుకాణం మూతపడక తప్పదని తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే..



పాకిస్తాన్‌కు విజ్ఞాపన పత్రాలు బంద్

''కాంగ్రెస్ పాలనలో మన దేశంలో ఉగ్రవాద దాడులు జరిగిన వెంటనే పాకిస్తాన్‌కు విజ్ఞాపనలు పంపించే పరిస్థితి ఉండేది. ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలంటూ పాకిస్తాన్‌కు విజ్ఞప్తులు చేసేవారు. అది చూసి మీడియాలో కొందరు మిత్రులు కాంగ్రెస్‌ను పొగుడుతూ చప్పట్లు కొడుతూ ఉండేవారు. అప్పట్లో ఇలాంటి వినతిపత్రాలపై పత్రికల్లో నిత్యం పతాక శీర్షికలతో వార్తలు వస్తుండేవి. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి ముష్కరుల దాడులు ఆగిపోయాయి. విజ్ఞాపన పత్రాలను మనం నమ్ముకోవడం లేదు. శత్రువుల భూభాగంలోకి అడుగుపెట్టి మరీ గట్టిగా బుద్ధిచెబుతున్నాం. దేశ భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడడం లేదు. ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహించాం. నవభారత్ ప్రగతికి ఇదొక సూచిక. ఏ క్షణమైనా కూలిపోయే స్థితిలో ఉండే బలహీన ప్రభుత్వం బలమైన దేశాన్ని నిర్మించలేదు. ఈ ఎన్నికల్లో మన దేశ ఆత్మగౌరవానికి సంబంధించిన ఎన్నికలు. ప్రపంచ అభివృద్ధికి నేడు భారత్ వేగాన్ని అందిస్తోంది. గత పదేళ్లలో మనం ఎన్నో ఘనతలు సాధించాం. బలమైన ప్రభుత్వంతోనే అనుకున్నది సాధించగలం.

ఓటు వృథా చేసుకోవద్దు

దేశ ఆర్థిక వ్యవస్థను కాంగ్రెస్ నాశనం చేసింది. నేను ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ గురించి మాట్లాడితే కాంగ్రెస్ యువరాజుకు జ్వరం వచ్చేస్తోంది. దేశాన్ని దోచుకున్న నేతలు ఇప్పుడు జైల్లో ఉన్నారు. జనం సొమ్ము మింగేసినవారు తిరిగి కక్కాల్సిందే. అవినీతిపరుల నుంచి డబ్బు తిరిగి వసూలు చేస్తాం. ఇది మోదీ గ్యారంటీ. కాంగ్రెస్‌కు ఒక్క కుటుంబమే ముఖ్యం. మాకు దేశంలోని ప్రతి కుటుంబం ముఖ్యమే. 2014, 2019లో ప్రజలు మాకు ఇచ్చిన అవకాశాన్ని వారికి మేలు చేయడానికే ఉపయోగించాం. సామాజిక న్యాయానికి పెద్దపీట వేశాం. రిజర్వేషన్ల విషయంలో బీజేపీపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తోంది. ఇప్పుడు సాక్షాత్తూ బాబా సాహెబ్ అంబేడ్కర్ వచ్చినా రిజర్వేషన్లను రద్దు చేయలేరు. విద్య, ఉద్యోగాల్లో అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. వాటిని రద్దు చేయడం ఎవరివల్లా కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లలో కోత వేసి, ఓటు బ్యాంక్‌కు కట్టబెట్టాలన్నదే కాంగ్రెస్ కుట్ర. ఎస్సీ, ఎస్టీ నాయకత్వాన్ని కాంగ్రెస్ ఎదగనివ్వలేదు. గత పదేళ్లలో పార్లమెంట్‌లో, అసెంబ్లీల్లో అడుగుపెట్టిన ఎస్సీ, ఎస్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల్లో అత్యధిక శాతం బీజేపీ, ఎన్డీయేకు చెందినవారే. ఈ ఎన్నికల్లో కనీసం 275 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టలేని దుస్థితిలో కాంగ్రెస్ ఉంది. అలాంటి పార్టీకి ఎన్నికల్లో మద్దతు పలికి ఎవరూ ఓటు వృథా చేసుకోవద్దు. మహారాష్ట్రలో సంచరించే ఆత్మ(శరద్ పవార్) ఒకటి ఉంది. ఆయన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైతులకు చేసింది సున్నా. ఎన్నికల సమరంలో ప్రజలు ఆయనను ఓటుతో శిక్షించే సమయం వచ్చింది.

ప్రధాని పదవిని ముక్కలు చేస్తారట!

దేశ ప్రజలను, రైతులను కాంగ్రెస్ దగా చేసింది. వారి కలలను విచ్ఛిన్నం చేసింది. కాంగ్రెస్ హయాంలో రైతన్నలకు దక్కాల్సిన నిధులను, ఎరువులను కూడా లూటీ చేశారు. సాగునీటి వసతి కల్పించలేదు. ప్రాజెక్టులు పూర్తిచేయలేదు. ప్రతిభావంతులైన మన దేశ యువతకు కాంగ్రెస్ వల్ల అన్యాయం జరిగింది. మన దేశం ముక్కలు కావడాన్ని కళ్లారా చూసినవారు ఇప్పుడు ప్రధానమంత్రి పదవిని ముక్కలు చేయాలని అనుకుంటున్నారు. విపక్ష కూటమి అధికారంలోకి వస్తే ప్రధాని పదవిని ఇన్‌స్టాల్‌మెంట్లలో పంచుకుంటారట! ఐదేళ్లలో ఐదుగురు ప్రధానమంత్రులు అనేది దేశాన్ని దోచుకొనే పథకమే. కాంగ్రెస్ పార్టీ ప్రమాదకరమైన ఆట ఆడుతోంది'' అని ప్రధాని మోదీ ఆరోపించారు.

కాంగ్రెస్ ఎజెండాపై ఓటర్లను అప్రమత్తం చేయండి

ఎన్డీయే అభ్యర్థులకు ప్రధాని మోదీ లేఖ

విపక్ష కాంగ్రెస్ దురుద్దేశాలు, ఎజెండాపై ఓటర్లను అప్రమత్తం చేయాలని ప్రధానమంత్రి మోదీ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అభ్యర్థులకు వ్యక్తిగతంగా లేఖలు రాశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్ కుట్ర చేస్తోందని, ఓటు బ్యాంక్‌కు మతపరంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఆ పార్టీ ఎత్తుగడ అని పేర్కొన్నారు. వారసత్వ పన్ను విధించి, ప్రజల ఆస్తులను లాక్కొని ఓటు బ్యాంక్‌కు అప్పగించాలన్నదే కాంగ్రెస్ ఎజెండా అని విమర్శించారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు విభజన, విద్వేషపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆక్షేపించారు. ప్రమాదకరమైన కాంగ్రెస్ ఎజెండాను ఓటర్లకు వివరించి, అప్రమత్తం చేయాలని ఎన్డీయే అభ్యర్థులను మోదీ కోరారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా బీజేపీకి ఒక విలువైన కార్యకర్త అని ఆయన రాసిన లేఖలో ప్రధాని ప్రశంసించారు. గతంలో గుజరాత్ మంత్రిగా, ఇప్పుడు కేంద్రమంత్రిగా అమిత్ షా చక్కటి పనితీరు ప్రదర్శిస్తున్నారని కొనియాడారు.



ఎన్నికల విచిత్రం

మహారాష్ట్రలోని మాఢా పట్టణంలో మంగళవారం ఎన్నికల ప్రచారసభలో గొంగళి కప్పుకుని సంప్రదాయ వస్త్రధారణలో కనిపించిన ప్రధాని నరేంద్ర మోదీ

ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

ముగ్గురు మహిళలు సహా 10 మంది మావోయిస్టులు మృతి

దుమ్ముగూడెం/చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో రెండు వారాల వ్యవధిలోనే మరో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. నారాయణపూర్, కాంకేర్ జిల్లాల పరిధిలోని మావోయిస్టులకు పెట్టనికోటగా ఉన్న అబుజ్‌మడ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళలు సహా 10 మంది మావోయిస్టులు మృతిచెందారు. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు సమావేశమయ్యారనే సమాచారంతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్, డీఆర్‌జీ దళాలు సోమవారం రాత్రి నుంచి గాలింపు కొనసాగిస్తున్నాయి. మంగళవారం ఉదయం టేక్‌మెట, కాకూర్ గ్రామాల మధ్యనున్న అటవీ ప్రాంతంలోని సమావేశ ప్రాంతానికి చేరుకున్న బలగాలపైకి మావోయిస్టులు కాల్పులకు దిగారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య హోరాహోరీ ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో ముగ్గురు మహిళలు సహా పది మంది మావోయిస్టుల మృతదేహాలు కనిపించాయి. ఘటనాస్థలి నుంచి ఏకే 47, ఇన్సాస్ రైఫిళ్లతో పాటు భారీ ఎత్తున మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. పలువురు మావోయిస్టులు గాయపడ్డారని వారి కోసం గాలింపు ముమ్మరం చేశామన్నారు.

16 మంది నక్సల్స్ లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లో రెండు వారాల్లో జరిగిన రెండు భీకర ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో బీజాపూర్ జిల్లాలో మంగళవారం 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

మరోసారి ఉల్లంఘిస్తే జైలు తప్పదు..

ట్రంప్‌కు న్యూయార్క్ కోర్టు హెచ్చరిక ● 9 వేల డాలర్ల జరిమానా

న్యూయార్క్: హష్ మనీ కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కు కోర్టు గట్టి వార్నింగిచ్చింది. తాము ఇచ్చిన గ్యాగ్ ఉత్తర్వులను 9 పర్యాయాలు ఉల్లంఘించినందుకు 9 వేల డాలర్ల జరిమానా విధించింది. సాక్షులు, జడ్జీలతోపాటు ఈ కేసుకు సంబంధించి మరికొందరిపై మరోసారి ఇలా వ్యాఖ్యలు చేస్తే జైలుకు పంపక తప్పదని హెచ్చరించింది. న్యూయార్క్ జడ్జి జువాన్ ఎం మెర్చన్ ఈ మేరకు తీర్పు చదువుతున్న సమయంలో ట్రంప్ తలదించుకుని నేల చూపులు చూస్తూ ఉండిపోవడం గమనార్హం. శుక్రవారం కల్లా జరిమానా చెల్లించాలని, ట్రంప్ సొంత 'ట్రూత్ సోషల్'వేదికపై చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలను తొలగించాలని ఆదేశించారు. గ్యాగ్ ఉత్తర్వుపై ట్రంప్ మరో ఉల్లంఘన ఆరోపణలపై గురువారం విచారణ జరగనుంది. ఓ పోర్న్ నటితో బంధం బయటికి పొక్కనివ్వరాదంటూ ఆమెకు మాజీ లాయర్ ద్వారా డబ్బులు ముట్టజెప్పిన ఆరోపణలపై కోర్టు విచారణ జరుపుతోంది.

అనంత్‌నాగ్ పోలింగ్ వాయిదా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్–రాజౌరీ లోక్‌సభ స్థానానికి మే 7వ తేదీన జరగాల్సిన పోలింగ్‌ను ఈసీ మే 25వ తేదీకి వాయిదా వేసింది. అననుకూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పోలింగ్‌ను వాయిదా వేయాలంటూ జమ్మూకశ్మీర్ బీజేపీ చీఫ్ రవీందర్ తదితరులు ఇటీవల ఈసీని కోరారు. దీనిపై కశ్మీర్ యంత్రాంగం అందజేసిన నివేదిక ఆధారంగా పోలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఈసీ తెలిపింది.


బీజేపీలోకి మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే

భోపాల్: మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే రాంనివాస్ రావత్ మంగళవారం బీజేపీలో చేరారు. షియోపూర్ జిల్లాలో జరిగిన బీజేపీ ర్యాలీలో సీఎం మోహన్ యాదవ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు.

వీడియోల వెనుక రాహుల్ హస్తం!

- మంత్రి అమిత్ షా ఆగ్రహం
- రిజర్వేషన్లను రద్దు చేసే ఆలోచన లేదని వెల్లడి

గువాహటి: కాంగ్రెస్‌లో నిరాశ, అసంతృప్తి తీవ్రస్థాయికి చేరాయని, అందుకే ఆ పార్టీ ఫేక్ వీడియోలు సృష్టిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వీడియోల వెనుక కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హస్తం ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, రాష్ట్రాల్లో ఆ పార్టీ అధ్యక్షులు సైతం ఫేక్ వీడియోలను సోషల్ మీడియాలో నిస్సిగ్గుగా షేర్ చేస్తున్నారని దుయ్యబట్టారు. సిద్ధాంతాలు, విలువలు, మేనిఫెస్టో ఆధారంగా ఎన్నికల్లో పోటీ పడాలి తప్ప ఫేక్ వీడియోలను నమ్ముకోవడం ఏమిటని కాంగ్రెస్‌ను నిలదీశారు. మంగళవారం అస్సాం రాజధాని గౌహతిలో అమిత్ షా మీడియాతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ, రాయ్‌బరేలీ నుంచి పోటీ చేసే ధైర్యం రాహుల్ గాంధీకి, ప్రియాంక గాంధీకి లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని, ఉన్న కొద్ది పాటి ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవడానికి తంటాలు పడుతోందని చెప్పారు. ఈసారి కూడా ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదని అన్నారు. దేశమంతటా ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు. అన్ని మతాల పౌరులకు ఒకే పౌర చట్టం ఉండాలన్నారు. లౌకిక దేశంలో మతానికో చట్టం ఉండడం సరైంది కాదని, రాజ్యాంగ స్ఫూర్తికి అది విరుద్ధమేనని అన్నారు. అధికారంలోకి వస్తే సివిల్ కాంట్రాక్టులు మైనారిటీలకు ఇస్తామని కాంగ్రెస్ చెబుతోందని ఆక్షేపించారు. తక్కువ బిడ్ దాఖలు చేసిన వారికి కాంట్రాక్టులు అప్పగిస్తారు తప్ప ఇలా మతం ఆధారంగా కాంట్రాక్టులు ఇస్తామనడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి కూడా మతపరమైన రిజర్వేషన్ ఉందా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు.



రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు

కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని అమిత్ షా మండిపడ్డారు. కాంగ్రెస్ అబద్ధాలకు అంతు లేకుండా పోతోందని ధ్వజమెత్తారు. ఓటర్లను మైనార్టీగా, మెజార్టీగా చూసే అలవాటు తమకు లేదని కాంగ్రెస్‌కు చురక అంటించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని స్పష్టంచేశారు. బడుగు బలహీన వర్గాల హక్కుల రక్షణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చే ఉద్దేశం, రిజర్వేషన్లను రద్దు చేసే ఆలోచన బీజేపీకి ఎంతమాత్రం లేదని పునరుద్ఘాటించారు.

మోదీ 'ఆత్మ' వ్యాఖ్యలకు పవార్ కౌంటర్

పుణె: మహారాష్ట్రలో ఓ ఆత్మ తిరుగుతోందని, గెలవలేక అది ఇతరులను మంచి పని చేయనీయకుండా చెడగొడుతోందని శరద్‌పవార్‌నుద్దేశిస్తూ ప్రధాని మోదీ చేసిన పరోక్ష వ్యాఖ్యలపై ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్‌పవార్ దీటుగా బదులిచ్చారు. జున్నార్ తహసీల్ పరిధిలో మంగళవారం జరిగిన ఎన్సీపీ ఎన్నికల మీటింగ్‌లో పవార్ మాట్లాడారు. ''కొన్నేళ్ల క్రితం అంటే 2016లో పుణెలో ప్రధాని మోదీ ఒక ప్రసంగం చేశారు. పవార్ సాహెబ్ వేలు పట్టుకునే రాజకీయాల్లోకి వచ్చానని మోదీ ఆనాడు సభాముఖంగా సెలవిచ్చారు. ఇప్పుడేమో గత 45 ఏళ్లుగా ఒక ఆత్మ అవిశ్రాంతంగా మహారాష్ట్రను విశ్రాంతి తీసుకోనివ్వట్లేదని నన్ను దూషిస్తున్నారు. నా ఆత్మ అస్వస్థతకు గురైన మాట నిజమే. కానీ సొంత పనుల్లో అలసిపోయి కాదు. రైతుల కడగళ్లు, ధరవరల నుంచి సామాన్య ప్రజానీకాన్ని గట్టెక్కించేందుకు కష్టపడి నా ఆత్మ అలా అలసిపోయింది. ప్రజల కష్టాలు తీర్చేందుకు 100 రెట్లు ఎక్కువగా కష్టించేందుకైనా నా సదా సిద్ధం' అని పవార్ వ్యాఖ్యానించారు.

ఎలక్షన్ బీట్

తొలిదశ 66.14% ; రెండోదశ 66.71%

ఎట్టకేలకు పోలింగ్ శాతాలను ప్రకటించిన ఈసీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోలింగ్ ముగిసిన 11 రోజులకు కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ శాతాన్ని అధికారికంగా మంగళవారం ప్రకటించింది. ఏప్రిల్ 19న తొలి దశకు జరిగిన ఎన్నికల్లో 66.14 శాతం పోలింగ్ నమోదుకాగా, ఏప్రిల్ 26న రెండో దశకు జరిగిన ఎన్నికల్లో 66.71 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో తొలి దశలో 69.43 శాతం, రెండో దశలో 69.64 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి తొలి దశలో 101 స్థానాలకు, రెండో దశలో 88 స్థానాలకు పోలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

తొలిసారిగా బరిలో మాజీ మంత్రి ఆనంద్ శర్మ

న్యూఢిల్లీ: కేంద్రమంత్రులుగా పనిచేసిన రాజ్యసభ సభ్యులను బీజేపీ ఈసారి లోక్‌సభ బరిలో దింపినట్లే కాంగ్రెస్ సైతం సీనియర్ నేత ఆనంద్ శర్మను లోక్‌సభలో పోటీకి నిలుపుతోంది. కేంద్ర మాజీ మంత్రి అయిన ఆనంద్ శర్మను హిమాచల్‌లోని కంగ్రా నుంచి కాంగ్రెస్ బరిలో నిలిపింది. లోక్‌సభకు శర్మ పోటీచేయడం ఇదే తొలిసారి. 1984 ఏప్రిల్‌లో తొలిసారిగా ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత నాలుగుసార్లు ఆయన ఎగువసభకే ఎన్నికయ్యారు.

యూపీలో రాహుల్, ప్రియాంక పోటీ లేనట్లే!

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో సోనియా గాంధీ కుటుంబానికి కంచుకోటలుగా భావించే అమేథీ, రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాల నుంచి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పోటీ చేయడంలేదని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ నుంచి వరుసగా రెండోసారి పోటీకి దిగిన సంగతి తెలిసిందే. అక్కడ పోలింగ్ సైతం ముగిసింది. ఆయన అమేథీలోనూ పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అమేథీ నుంచి రాహుల్‌ను, రాయ్‌బరేలీ నుంచి ప్రియాంకను బరిలోకి దించాలని కాంగ్రెస్ నేతలు పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. పార్టీ ఆదేశాల ప్రకారం నడుచుకుంటానని రాహుల్ చెప్పారు. కానీ, అమేథీ నుంచి పోటీకి దూరంగా ఉండాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం. ప్రియాంక సైతం పోటీకి విముఖత చూపుతున్నారు.

బీజేపీ గెలుపు కోసం హోమాలు

వాషింగ్టన్: ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ విజయాన్ని కాంక్షిస్తూ అమెరికాలోని పలు నగరాల్లో బీజేపీ మద్దతుదారులు యాగాలు చేపట్టారు. న్యూజెర్సీ, న్యూయార్క్, వర్జీనియా, మేరీలాండ్, షికాగోల్లో ఆదివారం యాగాలు నిర్వహించినట్లు ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ–యూఎస్ఏ ఒక ప్రకటనలో తెలిపింది. షికాగో శివారులోని ఆలయంలో జరిపిన పవిత్ర చండీ యాగం, వర్జీనియాలోని శ్రీ వెంకటేశ్వర లోటస్ ఆలయంలో జరిగిన గణపతి హోమంలో భారత సంతతికి చెందిన నిపుణులు, వాణిజ్యవేత్తలు, నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఎక్కువ సంతానం' నిందలెందుకు: ఖర్గే

చంపా(ఛత్తీస్‌గఢ్): ఆర్థిక పరిస్థితుల కారణంగా పేదలకే ఎక్కువ మంది సంతానాన్ని కలిగి ఉంటున్నారు, అలాంటప్పుడు ముస్లింలే లక్ష్యంగా ఎందుకు విమర్శలు చేసుకుంటున్నారంటూ ప్రధాని మోదీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. ముస్లింలు కూడా ఈ దేశ ప్రజలేనని చెప్పారు. ప్రతిపక్ష ఇండియా కూటమి మెజారిటీ సీట్లు సాధించనుందని గ్రహించిన మోదీ..మంగళసూత్రాలు, ముస్లింల గురించి మాట్లాడు తున్నారంటూ దుయ్యబట్టారు. బీజేపీకి 400పైగా సీట్లు రావడం పేదల సంక్షేమానికి మంచిది కాదని, వారి నుంచి హక్కులను లాగేసుకుంటుందని ఖర్గే ఆరోపించారు.

కాంగ్రెస్ 'ఓట్ జీహాద్' వ్యాఖ్యలు

ఫరూకాబాద్: జీహాదీకే ఓటేయాలంటూ కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్, బంధువు మరియా ఆలం ఓటర్లను కోరడం వివాదాస్పదంగా మారింది. సోమవారం యూపీలోని ఫరూక్‌బాద్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో వీరిద్దరూ పాల్గొని ఇండియా కూటమి తరపున ప్రచారం చేశారు. జీహాదీకే ఓటేయాలని, బీజేపీని ఓడించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో మైనారిటీలకు ఓట్ జీహాద్ అవసరమని ఆలం పేర్కొన్నారు. నిఘా బృందాల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మరియా ఆలంతోపాటు వేదికపై ఉన్న సల్మాన్ ఖుర్షీద్‌పై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

పార్టీ నుంచి ప్రజ్వల్ సస్పెండ్

బెంగళూరు: లైంగిక దౌర్జన్యం, వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కారణంగా సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్‌ను జేడీఎస్ తమ పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. మంగళవారం హుబ్బళిలో జేడీఎస్ కోర్ కమిటీ భేటీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు హెచ్‌డీ దేవెగౌడకు ప్రజ్వల్ సస్పెన్షన్‌పై సిఫార్సుచేసిన కొద్ది సేపటికే పార్టీ ప్రజ్వల్‌ను సస్పెండ్‌చేసింది. ''మహిళలను ప్రజ్వల్ లైంగికంగా వేధిస్తున్నట్లు సంబంధిత వీడియోలు సామాజిక మాధ్యమాల్లో, మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. ఆ వీడియోలు పార్టీకి, పార్టీ నాయకత్వానికి చెడ్డపేరు తెస్తున్నాయి. పార్టీ నియమావళి, క్రమశిక్షణా నిబంధనావళిని ఉల్లంఘించిన కారణంగా తక్షణం ఆయన్ను సస్పెండ్‌చేస్తున్నాం' అని సస్పెన్షన్ ఉత్తర్వులో పార్టీ పేర్కొంది. కోర్ కమిటీ భేటీలో కర్ణాటక రాష్ట్ర జేడీఎస్ చీఫ్ హెచ్‌డీ కుమారస్వామి కూడా పాల్గొన్నారు. ''కేసు దర్యాప్తు కోసం ప్రభుత్వం నియమించిన సిట్ నివేదిక, ప్రభుత్వ చర్యలను బట్టి సస్పెన్షన్‌ను పొడిగిస్తామని కుమారస్వామి చెప్పారు.



ఎందుకు ఇప్పుడే అరెస్ట్ చేశారు?

కేజ్రీవాల్ కేసులో ఈడీని ప్రశ్నించిన సుప్రీం

న్యూఢిల్లీ: సరిగ్గా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలోనే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్ట్ చేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అరెస్ట్‌ను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఎదుట మంగళవారం వాదనలు కొనసాగాయి. ఈ సందర్భంగా ధర్మాసనం ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజును పలు ప్రశ్నలు అడిగింది. మనీలాండరింగ్ కేసులను 365 రోజుల్లో పూర్తి చేయాలన్న నిబంధనలుండగా..ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై న్యాయ ప్రక్రియ ప్రారంభానికి, కేజ్రీవాల్ అరెస్టుకు మధ్య చాలా సమయం ఎందుకు ఉందని అడిగింది. ఈ కేసుకు సంబంధించిన అటాచ్‌మెంట్లు ఏవైనా ఉంటే, వాటికి పిటిషనర్‌తో ఏమైనా సంబంధం ఉందా అని కూడా ఆరా తీసింది. 'వ్యక్తి స్వేచ్ఛ అత్యున్నతం. దానిని ఎవరూ కాదనలేరు'అని పేర్కొంది. 'ఇదే కేసులో కస్టడీలో ఉన్న మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై ఇచ్చిన తీర్పులో మొదటి భాగం ఆయనకు అనుకూలంగా, రెండో భాగం వ్యతిరేకంగాను ఉంది. కేజ్రీవాల్‌కు ఇందులోని ఏ భాగంతో సంబంధం ఉందో చెప్పండి. పదేపదే కోర్టును ఆశ్రయిస్తున్నారనే కారణంతో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసే అధికారం ఈడీకి ఉంటుందా? శుక్రవారం విచారణలో వీటికి సమాధానమివ్వండి'అని అదనపు సొలిసిటర్ జనరల్‌ను ధర్మాసనం ఆదేశించింది.

ఆరేళ్లుగా నిద్రలోనే ఉన్నారెందుకు?

ఉత్తరాఖండ్ అధికారులపై సుప్రీం కన్నెర్ర ● 'పతంజలి'క్షమాపణ ప్రకటనలపై సంతృప్తి

న్యూఢిల్లీ: పతంజలి ఆయుర్వేద సంస్థ తప్పుదోవ పట్టించే ప్రకటనలపై ఆరేళ్లపాటు కిమ్మనని ఉత్తరాఖండ్ రాష్ట్ర లైసెన్సింగ్ అథారిటీ(ఎస్ఎల్ఏ)పై సుప్రీంకోర్టు కన్నెర్ర చేసింది. 'ఏప్రిల్ 10వ తేదీన మేం ఆదేశాలిచ్చిన తర్వాత మాత్రమే ఎస్ఎల్ఏ మేల్కొంది. దేశంలో చట్టాలున్న విషయం, తన అధికారాలు, బాధ్యతలను గురించి తెలుసుకుంది. మేం అన్నీ చేశామంటూ ఇప్పుడు తనే సొంతంగా సర్టిఫికెట్ ఇచ్చుకుంటోంది'అంటూ ఎస్ఎల్ఏ ఇచ్చిన వివరణపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'కావాలనుకుంటే క్షణాల్లో పనులు చేస్తారు. లేదంటే ఏళ్లకు ఏళ్లు దొర్లిస్తుంటారు.. అని అర్థమవుతోంది'అని వ్యాఖ్యానించింది. సానుభూతి కావాలంటే కనీసం తమ వద్ద జరిగిన విషయాలను వెల్లడించి నిజాయతీతో ఉండాలని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆరేళ్లపాటు ఎలాంటి చర్యలూ తీసుకోలేకపోవడానికి కారణం ఏం చెబుతారు? అంటూ సూటిగా ప్రశ్నించింది. దివ్యా ఫార్మసీ, పతంజలి ఆయుర్వేద సంస్థకు చెందిన 15 ఉత్పత్తుల లైసెన్సులను రద్దు చేస్తూ ఏప్రిల్ 15వ తేదీన ఆదేశాలిచ్చామంటూ ఎస్ఎల్ఏ వేసిన అఫిడవిట్‌పై ధర్మాసనం ద్వివిధంగా స్పందించింది. అయితే, ఎస్ఎల్ఏ తీసుకున్న చర్యలు చట్ట ప్రకారంగానే ఉన్నాయా అంటూ అనుమానం వ్యక్తం చేసింది. తాజాగా మరో అఫిడవిట్ దాఖలు చేసేందుకు ఎస్ఎల్ఏకి పది రోజుల గడువిచ్చింది.

క్షమాపణ ప్రకటనపై సంతృప్తి

బేషరతుగా క్షమాపణలు చెబుతూ యోగా గురువు రాందేవ్, బాలకృష్ణ, పతంజలి ఆయుర్వేద సంస్థ వార్తా పత్రికల్లో ఇచ్చిన ప్రకటనల్లో మెరుగైన పురోగతి కనిపించిందటూ ధర్మాసనం ప్రశంసించింది. ప్రత్యక్ష హాజరు నుంచి రాందేవ్, బాలకృష్ణలకు మినహాయింపు ఇవ్వాలన్న వినతిపై ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. మే 7వ తేదీన జరిగే విచారణకు మాత్రం వారిద్దరూ రావాల్సిన అవసరం లేదని తెలిపింది.

ఐఎంఏ అధ్యక్షుడిపై ఆగ్రహం

పతంజలి తరఫున హాజరైన సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గీ వాదనల సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌వీ అశోకన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. 'మేం మంచి పనులు చేశాము. మా వైద్యులు కూడా చనిపోయారు. అయినప్పటికీ సుప్రీంకోర్టు మా వైపు వేలెత్తి చూపడం దురదృష్టకరం'అని సోమవారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అశోకన్ వ్యాఖ్యానించడం తనకు ఆందోళన కలిగించిందన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ..అదే నిజమైతే, ఈ కేసులో ఇప్పటివరకు జరిగిన వాటికంటే కూడా చాలా తీవ్రమైన అంశమిది. మరింత తీవ్ర పరిణామాలకు సిద్ధమై ఉండండి' అంటూ ఐఎంఏ ప్రెసిడెంట్ అశోకన్‌ను హెచ్చరించింది.

ఆగని పాలస్తీనా అనుకూల ఆందోళనలు

న్యూయార్క్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడికి నిరసనగా అమెరికా విశ్వవిద్యాలయాల్లో మొదలైన ఆందోళనలు మరింత విస్తరిస్తున్నాయి. మంగళవారం తెల్లవారుజామున న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలోని హామిల్టన్ హాల్ భవంతిని విద్యార్థి నిరసనకారులు తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. భవంతిలోకి ఎవరూ రాకుండా బ్యారికేడ్లు అడ్డుపెట్టి కిటికీల్లో పాలస్తీనా జెండాలను ఎగరేశారు. టెక్సాస్, ఉతా, వర్జీనియా, న్యూజెర్సీల్లోని వర్సిటీల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి. చర్చలు, సంప్రతింపులు విఫలమై చివరకు పోలీసులు కలగజేసుకుని చాలా మంది విద్యార్థులను అరెస్ట్‌చేస్తున్న దృశ్యాలే అంతటా కనిపిస్తున్నాయి. నిరసనకు దిగిన విద్యార్థుల సస్పెన్షన్ ప్రక్రియ మొదలైందని కొలంబియా వర్సిటీ తెలిపింది. సోమవారం ఆస్టిన్‌లోని టెక్సాస్ వర్సిటీలో మరో 40 మందిని అరెస్ట్‌చేశారు.

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 1 । మే । 2024

సిటీలో సన్‌రైజర్స్





శరత్ సిటీ మాల్‌లో..

బేగంపేట్‌లో ప్యాట్ కమిన్స్



సాక్షి, సిటీబ్యూరో: 'హలో ఎలా ఉన్నారు.. తెలుగు ప్రజలు' అంటూ ప్రముఖ క్రికెటర్ హెన్రిచ్ క్లాసెన్ తెలుగు మాటలతో సందడి చేయగా.. మరో సన్‌రైజర్ హైదరాబాద్ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి తెలుగులో ఎలా మాట్లాడాలో క్లాసెన్‌కు క్లాసెస్ చెప్పారు. మంగళవారం కొండాపూర్‌లోని శరత్ సిటీ మాల్‌లో ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ 'రాన్'లో సన్‌రైజర్స్ క్రికెటర్లు హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డితో పాటు అబ్దుల్ సమద్, జయదేవ్ ఉనద్కత్, నటరాజన్‌లు సందడి చేశారు. ఈ సందర్భంగా తమ అనుభవాలను పంచుకున్నారు. బౌలింగ్ వేసే సమయంలో ముందస్తు చిట్కాల కన్నా అప్పటికప్పుడు సమయానుగుణంగా మార్చుకునే ప్లాన్స్ మంచి ఫలితాలిస్తాయని, తన బౌలింగ్‌లో ఈ నియమాన్నే పాటిస్తానని బౌలర్ జయదేవ్ ఉనద్కత్ తెలిపారు. స్టార్ క్రికెటర్ల రాకతో మాల్ అంతా అభిమానులతో నిండిపోయింది. కాగా.. బేగంపేట్‌లోని లైఫ్‌స్టైల్ బ్రాండ్ కళ్లద్దాల స్టోర్‌లో సన్‌రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సందడి చేశారు. 'కారెరా ఐవేర్'ను ఆవిష్కరించారు.

హాట్ క్యాంపెయిన్

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఎండదెబ్బ



- ఉదయం 10 గంటలకే ముగిస్తున్న నేతలు
- వేసవి తీవ్రతకు కార్యకర్తలు బెంబేలు
- ఇంటింటికీ వెళ్లలేకపోతున్నట్లు పార్టీల్లో ఆందోళన
- గడువు సమీపిస్తుండడంతో పెరుగుతున్న ఉత్కంఠ

సాక్షి, సిటీబ్యూరో: ఉదయం 10 గంటలు దాటితే చాలు. హోరెత్తించే మైకులు, పరుగులు పెట్టించే పాటలు, అదరగొట్టే ప్రసంగాలు అన్నీ బంద్. ఎవరో తరుముతున్నట్లుగా ఎక్కడి వాళ్ల అక్కడ అదృశ్యమైపోతున్నారు. మండుతున్న ఎండలకు సామాన్యులే కాదు. లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన అతిరథమహారథులు సైతం విలవిలాడిపోతున్నారు. మరికొద్ది రోజుల్లో జరుగుతున్న ఎన్నికల్లో గెలిచేదెవరో, ఓడేదెవరో కానీ దంచి కొడుతున్న ఎండలు మాత్రం పార్టీల ప్రచారానికి మోకాలడ్డుతున్నాయి. రోడ్ షోలకు, కార్నర్ మీటింగ్‌లకు బ్రేకులు వేస్తున్నాయి. సాధారణంగా అయితే ఎన్నికల రాకతో వాతావరణం మారిపోతుంది. అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంతో హోరెత్తిస్తారు. రోడ్లు, కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌లు అంతటా జైకొట్టే నినాదాలు మార్మోగుతాయి. ఓట్ల కోసం వచ్చే పార్టీలకే కాదు. ప్రజల్లో సైతంఎన్నికల జోష్ కనిపిస్తుంది. కానీ ఈ వేసవి ఎన్నికల వాతావరణాన్ని పూర్తిగా మార్చివేసింది. ఓటు అడిగేందుకు వెంట వచ్చే కార్యకర్తలు, నాయకులు లేక ప్రచారం వెలవెలబోతోంది. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నగరంలో బంద్ వాతావరణం నెలకొంటోంది. దీంతో ప్రచారంలో అన్ని రాజకీయ పార్టీల్లో ఆందోళన కనిపిస్తోంది. ప్రచారంలో తాము వెనుకబడిపోతున్నామని వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు, అనుచరగణాల్లో ఆందోళన నెలకొంది.

సమీపిస్తున్న గడువు..

- గ్రేటర్ పరిధిలోని లోక్‌సభ స్థానాలకు మే 13న జరిగే ఎన్నికలకు గడువు తరుముకొస్తోంది. ప్రచారానికి మరో 11 రోజులే మిగిలి ఉంది. కానీ ఎండల తీవ్రత కారణంగా వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు వారి అనుచరగణాలు అన్ని ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నారు. 'గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం చేయగలిగాం. కానీ ఈసారి ఇబ్బందిగానే ఉంది. సాయంత్రం 4 గంటల తర్వాత ప్రచారం చేపట్టినా ఎక్కువ మందిని కలవలేకపోతున్నాం' అని వివిధ పార్టీలకు చెందిన నాయకులు కొందరు విస్మయం వ్యక్తం చేశారు. ఉదయం తక్కువ సమయం ఉండడం వల్ల కార్నర్ మీటింగ్‌లను కూడా ఏర్పాటు చేయలేకపోతున్నారు. సాయంత్రం 7 గంటలు దాటితే తప్ప కార్నర్ మీటింగ్‌ల వద్ద సందడి కనిపించడం లేదు. దీంతో ఒక రోజులో ఒకటి, రెండు మీటింగ్‌ల కంటే ఎక్కువ ఏర్పాటు చేయలేకపోతున్నాం' అని చెప్పారు.
- సాధారణంగా బైక్ ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించేందుకు ఎక్కువ మందిని తరలించాల్సి ఉంటుంది. ఎండల కారణంగా ఇలాంటి ప్రదర్శనలకు కూడా ఆటంకం కలుగుతోంది. ప్రచారానికి వచ్చే కార్యకర్తలకు, అనుచరులకు అన్ని సదుపాయాలు కల్పించినా ఉదయం 10 గంటలు దాటితే చాలు అందరూ జారుకుంటున్నారు అని కాంగ్రెస్ నాయకుడు ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు పెద్ద ఎత్తున జనం కనిపించేవిధంగా ప్రదర్శన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలనుకున్నా గతంలో లాగా అడ్డా కూలీలు కూడా ప్రచారానికి రావడం లేదు. మరో వైపు ప్రచార వాహనాలు, సాంస్కృతిక బృందాలు సైతం సాయంత్రం పూట మాత్రమే అక్కడక్కడా కనిపిస్తున్నాయి. 'ఓటేయాలని అభ్యర్థిస్తూ పాటలు పాడినా, ప్రదర్శనలు ఇచ్చినా చూసేందుకు జనం మాత్రం ఉండడం లేదు'అని ఓ పార్టీ నాయకుడు చెప్పారు.

కొలిక్కిరాని బేరసారాలు..

ఒకవైపు ఎండల తీవ్రత కారణంగా ఎన్నికల ప్రచారం ఇలా పేలవంగా ఉండగా, మరోవైపు గంపగుత్తగా ఓట్ల కొనుగోలు కోసం వివిధ పార్టీల్లో బేరసారాలు కూడా మొదలయ్యాయి. కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, కులసంఘాలను లక్ష్యంగా చేసుకొని బేరసారాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వివిధ పార్టీల్లో డివిజన్ స్థాయి నాయకులకు, అభ్యర్థులకు మధ్య ఈ అంశం ఇంకా చర్చల దశలోనే ఉన్నట్లు ప్రధాన పార్టీల నాయకులు చెబుతున్నారు. కొన్ని చోట్ల డివిజన్‌స్థాయి నాయకులు గొంతెమ్మ కోర్కెలు కోరుతున్నట్లు ఒక పార్టీకి చెందిన అభ్యర్థి విస్మయం వ్యక్తం చేశారు. ఏదేమైనప్పటికీ అన్ని పార్టీలకు ఈ వారం రోజులే కీలకం కావడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

'ఎర్లీబర్డ్' ఆదాయం రూ. 820 కోట్లు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీకి ఈ సంవత్సరం 'ఎర్లీబర్డ్' స్కీమ్ ద్వారా రూ. 820 కోట్ల ఆదాయం లభించింది. మంగళవారం రాత్రి 9 గంటల వరకు ఈ మొత్తం వసూలైంది. ఆన్‌లైన్ ద్వారాను చెల్లింపులకు అవకాశం ఉండటంతో అర్ధరాత్రి వరకు మరికొంత పెరుగుతుందని జీహెచ్‌ఎంసీ వర్గాలు పేర్కొన్నాయి. ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 30 లోగా ఆస్తిపన్ను చెల్లిస్తే ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇవ్వడమే ఎర్లీబర్డ్ స్కీమ్. ఈ సంవత్సరం ఈ స్కీమ్‌ను వినియోగించుకొని 7.27 లక్షల ఇళ్ల యజమానులు రూ. 820 కోట్లు చెల్లించినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. గత సంవత్సరం కంటే ఈసారి రూ.34.16 కోట్లు అధికంగా వసూలైందన్నారు. గత సంవత్సరం రూ.785.84 కోట్లు వసూలైందని వివరించారు. రాయితీ చివరి రోజైన మంగళవారం ఒక్కరోజే రూ.96.61 కోట్లు వసూలైంది. ఇందుకు కారకులైన ప్రజలకు, జీహెచ్‌ఎంసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. జీహెచ్‌ఎంసీకి వచ్చే ఆదాయాన్ని ప్రజల సదుపాయాలకు వినియోగిస్తామని పేర్కొన్నారు.

- ఎప్పటి మాదిరిగానే వెనకబడిన బాలురు
- గ్రేటర్‌లో మొత్తం 89.12 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్ జిల్లాకు 30వ స్థానం
- 10కి 10 జీపీఏలో సర్కారు బడుల తడబాటు

గ్రేటర్ పరిధిలో పదో తరగతి ఫలితాలు ఇలా..

2024

జిల్లా	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణులైన విద్యార్థులు	శాతం
హైదరాబాద్	73,202	63,511	86.76
రంగారెడ్డి	50,811	46,245	91.01
మేడ్చల్-మల్కాజిగిరి	46,736	41,879	89.61
2023			
హైదరాబాద్	68,468	54,971	80.92
రంగారెడ్డి	47,551	41,488	87.35
మేడ్చల్-మల్కాజిగిరి	43,319	39,299	90.72

బాలికలు భళా!

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ

సాక్షి, సిటీబ్యూరో: పదో తరగతి పరీక్షల్లోనూ బాలికల హవానే కొనసాగింది. ఎప్పటి మాదిరిగానే బాలురు వెనకబడిపోయారు. గ్రేటర్ మొత్తమ్మీద పదో తరగతి పరీక్షలకు 1,70,749 మంది విద్యార్థులు హాజరు కాగా.. 1,51,635 మంది ఉత్తీర్ణత సాధించారు. 89.12 శాతం ఉత్తీర్ణత లభించింది. గతేడాది కంటే ఫలితాలు కొంత మెరుగుపడినప్పటికీ.. ఈసారి కూడా మహా నగరం వెనకబడింది. రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్ 30వ స్థానం, మేడ్చల్-మల్కాజిగిరి 27వ స్థానం, రంగారెడ్డి జిల్లా 24వ స్థానానికి పడిపోయాయి. సర్కారు బడుల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిపోగా.. 10/10 జీపీఏ సాధనలో సైతం బాగా వెనకబడిపోయాయి.

గత ఏడాదితో పోల్చితే..

మహానగర పరిధిలో బాలిక ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఈసారి 91.75 శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించారు. గతేడాదితో పోల్చితే 3.21 శాతం పెరిగింది. హైదరాబాద్ జిల్లాలో బాలికలు 89.90 శాతం, బాలురు 83.41, రంగారెడ్డి జిల్లాలో బాలికలు 93.32, బాలురు 88.89, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బాలికలు 92.03, బాలురు 87.35 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సర్కారు బడుల్లో..

- సర్కారు బడుల్లో ఉత్తీర్ణత శాతం బాగా తగ్గిపోయింది. పదికి పది జీపీఏ సాధనలో పూర్తిగా దిగజారింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో నలుగురు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ముగ్గురు, రంగారెడ్డి జిల్లాలో 10 మంది విద్యార్థులు మాత్రమే పదికి పది జీపీఏ సాధించగలరు.
- హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 78.89 శాతం ఉత్తీర్ణత లభించింది. మొత్తం మీద 7,445 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 5,873 మంది ఉత్తీర్ణత సాధించారు. సుల్తాన్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని వి. ప్రతీక్ష, అమీర్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని అక్షిత, మాసాబ్‌ట్యాంక్ రెడ్ క్రాస్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని జెట్టి జ్యోత్స్న ప్రియ పదికి పది జీపీఏ సాధించారు.
- రంగారెడ్డి జిల్లా పరిధిలోని 82.35 శాతం ఉత్తీర్ణత లభించింది. మొత్తం 17,369 విద్యార్థులకు 14,303 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో ఒకరు, జెడ్పీహెచ్‌ఎస్‌లో 9 మంది విద్యా ర్థులు పదికి పది జీపీఏను సాధించారు. మోడల్ స్కూళ్లలో ఆరుగురు, బీసీ సంక్షేమ గురుకులాల్లో 8 మంది, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 23 ంది, ట్రైబల్ గురుకులాల్లో ఇద్దరు, మైనారిటీ గురుకులాకు చెందిన ఒకరు పది జీపీఏ సాధించారు.
- మేడ్చల్ జిల్లాలో 81 శాతం ఉత్తీర్ణత లభించింది. మొత్తం 75,00 విద్యార్థులకు 6,200 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ముగ్గురు విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించారు. బాచుపల్లి ప్రగతినగర్ విద్యార్థిని అక్షర, కీసర జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి రాంచరణ్ రెడ్డి, నూతనకల్ పాఠశాల విద్యార్థిని లక్ష్మీ ప్రసన్నలకు పదికి పది జీపీఏలు లభించాయి.



బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12 ఎన్‌బీటీనగర్ గవర్నమెంట్ హైస్కూల్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న టీచర్లు

మసాజ్ పేరుతో అసహజ ప్రవర్తన

వ్యక్తి నగ్న వీడియోలు తీసిన ఇద్దరు మహిళలు

- సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరింపులు
- బాధితుడి నుంచి రూ.20 వేలు వసూలు
- మరో 30 లక్షలు కావాలంటూ ఫోన్లు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



సనత్‌నగర్: థెరపిస్టుల ముసుగులో ఇద్దరు మహిళలు ఓ వ్యక్తిపై 'అసహజ' దాడికి యత్నించడంతో పాటు అతడిని నగ్నంగా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో బాధితుడు భయ పడి రూ.20 వేలు ఇచ్చాడు. కానీ.. మరో రూ.30 లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి.. సనత్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి తనకు తానుగా థెరపిస్టుగా చెప్పుకున్న ఓ మహిళ పరిచయమైంది. ఆమె ద్వారా భరత్‌నగర్‌కు చెందిన మరో మహిళ ఫోన్ నంబర్‌ను తీసుకుని మాట్లాడాడు. తాము థెరపిస్టులమని, మసాజ్ చేస్తామంటూ సదరు వ్యక్తితో నమ్మబలికారు. దీంతో అతడు ఆ ఇద్దరు మహిళలు చెప్పిన్నట్లుగా భరత్‌నగర్‌లోని వారి ఇంటికి వెళ్లాడు. అయితే.. పరిస్థితులపై అనుమానం వచ్చిన బాధితుడు వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని భావించాడు. అతడు బయటికి వచ్చేందుకు ప్రయత్నిస్తుండగానే ఇద్దరు మహిళలు బలవంతంగా నిర్బంధించారు. అతడి ఒంటిపై దుస్తులు తీసి లైంగిక దాడికి యత్నించారు. ఈ క్రమంలోనే నగ్న వీడియోలు తీశారు. అంతటితో ఆగకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామంటూ బెదిరించారు. అలా చేయకుండా ఉండాలంటే తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఆందోళనకు గురైన ఆ వ్యక్తి రూ.20 వేలు ఆన్‌లైన్ ద్వారా వారికి ఇచ్చాడు. వారి బారి నుంచి బయటపడ్డానని భావిస్తున్న క్రమంలోనే మళ్లీ ఓ మహిళ ఫోన్ చేసి రూ.30 లక్షలు ఇవ్వాలని, లేకపోతే వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో పాటు కుటుంబ సభ్యులకు పంపిస్తామని బెదిరించింది. దీంతో బాధితుడు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల బరిలో 30 మంది ఉన్నారని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం వారికి గుర్తులను కేటాయించినట్లు చెప్పారు. 85 సంవత్సరాలు పైబడిన ఓటర్ల కోసం హోమ్ ఓటింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాతబస్తీలో అమిత్ షా రోడ్డు షో

చార్మినార్: పాతబస్తీలో బుధవారం కేంద్ర మంత్రి అమిత్ షా రోడ్డు షో నిర్వహిస్తున్నారని.. నగరంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆయనకు ఘనంగా స్వాగతం పలకాలని బీజేపీ గోల్కొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు నిత్యా ఫరేఖ్ కోరారు. లాల్ దర్వాజ నుంచి ప్రారంభమయ్యే రోడ్డు షోతో మజ్లిస్ పార్టీ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి తగిన గుణపాఠం అవుతుందన్నారు. గత 40 ఏళ్లుగా పాతబస్తీకి ఎలాంటి మేలు చేయని ఆయన.. ఈసారి కూడా తననే గెలిపించాలని కోరుతూ ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని.. కానీ.. హైదరాబాద్ ఓటర్లు ఆయన మాటలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

దేశ సమగ్రతే మోదీ లక్ష్యం: ఈటల



మాజీ సైనికుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల

నాగోలు: దేశ సమగ్రత, రక్షణే ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన లక్ష్యమని మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నాగోల్ శుభం కన్వెన్షన్‌లో నిర్వహించిన మాజీ సైనికుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. గడచిన పదేళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ దేశ రక్షణ విభాగాలలో ఎంతో పురోగతి సాధించినట్లు చెప్పారు. దేశం సుభిక్షంగా, సురక్షితంగా ఉండాలంటే మళ్లీ నరేంద్ర మోదీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌడ్ సంఘం నాయకులతో ఈటల రాజేందర్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

డిటోనేటర్ పేలి కార్మికుడి సజీవ దహనం

కీసర: డిటోనేటర్ తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు అది పేలి ఓ కార్మికుడు సజీవ దహనమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రమాదం జరిగిన విషయాన్ని కంపెనీ యాజమాన్యం గోప్యంగా ఉంచింది. మేడ్చల్– మల్కాజిగిరి, యాదాద్రి– భువనగిరి జిల్లాల సరిహద్దులో ఉన్న ఈ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై ఆలస్యంగా సమాచారం అందుకున్న కీసర పోలీసులు మంగళవారం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కీసర మండలం అంకిరెడ్డిపల్లిలోని సాల్వో ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో బిహార్ రాష్ట్రం అన్సాన్‌పురకు చెందిన సోనూ కుమార్ (23) ఏడాది నుంచి ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం కంపెనీలోని డీ37బ్లాక్ యాసిడ్ ప్లాంటులో డిటోనేటర్ తయారు చేస్తుండగా ఒక్కసారిగా పెద్దఎత్తున పేలుడు సంభవించడంతో ప్లాంటు లోపలే ఉన్న సోనూ కుమార్‌కు మంటలు అంటుకొని సజీవ దహనమయ్యాడు. ఆనవాళ్లు కూడా లేకుండా పూర్తిగా కాలిపోయాడు. భారీ పేలుడు కారణంగా ప్లాంటు నేలమట్టమైంది. పేలుడు జరిగిన సమయంలో ప్లాంటులో సోనూ కుమార్ ఒక్కడే ఉన్నాడని, మిషన్ ఆపరేట్ చేస్తున్నాడని సీఐ తెలిపారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని మృతుడి పెద్దమ్మ కల్పనాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపడతామని సీఐ తెలిపారు.

సికింద్రాబాద్‌కు 3 ఈవీఎంలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు పోటీలో ఉన్న సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి మూడు ఈవీఎంలు (బ్యాలెట్ యూనిట్లు) వినియోగించాల్సిన అవసరం ఏర్పడింది. ఈవీఎంలలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు ఉంటాయి. వాటిలో బ్యాలెట్ యూనిట్లలో ఒక్కో యూనిట్‌లో నోటాతో సహా 16 గుర్తులకు అవకాశముంటుంది. సికింద్రాబాద్ లోక్‌సభకు ఏకంగా 45 మంది అభ్యర్థులు బరిలో మిగలడంతో ఇక్కడ 3 బ్యాలెట్ యూనిట్లు వాడాల్సి ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు. హైదరాబాద్ లోక్‌సభకు 30 మంది అభ్యర్థులు ఉండటంతో రెండు బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సి ఉంటుందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని 1810 పోలింగ్ కేంద్రాల్లో మూడేసి బ్యాలెట్ యూనిట్లు, హైదరాబాద్ పరిధిలోని 1944 పోలింగ్ కేంద్రాల్లో రెండేసి బ్యాలెట్ యూనిట్లు వాడాల్సి ఉంటుంది.

పురస్కారాలు స్ఫూర్తినిస్తాయి

గన్‌ఫౌండ్రీ: పురస్కారాలు బాధ్యతలను పెంచడంతో పాటు మరికొందరికి స్ఫూర్తిని కలిగిస్తాయని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్ర భారతిలో తిరుమల బ్యాంక్, వంశీ ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాలలో సేవలందిస్తున్న పలువురు ప్రముఖులకు వంశీ తిరుమల కామధేను ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. సింగపూర్, న్యూజిలాండ్, ఉగాండా దేశాలకు చెందిన ప్రముఖులకు సైతం ఈ పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో భగవాన్ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్, సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ, సినీ నటులు మురళీమోహన్, కోట శ్రీనివాసరావు, సుమన్, తిరుమల బ్యాంక్ చైర్మన్ ఎన్.చంద్రశేఖర్, వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజులతో పాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.



నటుడు కోట శ్రీనివాసరావుకు పురస్కారాన్ని అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

45.91 లక్షలు

హైదరాబాద్ జిల్లాలోని అర్హులైన ఓటర్ల సంఖ్య ఇది



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మే 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లేసేందుకు 45,91,201 అర్హత కలిగి ఉన్నారు. తాజాగా వెలువడిన అనుబంధ జాబితాతో కూడిన ఓటరు జాబితాలో వీరున్నారు. గత ఫిబ్రవరిలో వెలువడిన తుది జాబితాలో 45,70,138 మంది ఓటర్లుండగా, ఆ తర్వాత కొత్తగా నమోదు చేసుకున్న వారు, తొలగించినవారు పోను వీరు అర్హత కలిగిన ఓటర్లుగా మిగిలారు. ఇప్పుడు సైతం ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, వారికి మాత్రం పోలింగ్‌లో పాల్గొనే అవకాశం లేదని అధికారులు తెలిపారు.

జూబ్లీహిల్స్ టాప్..

అనుబంధ జాబితా సహా అంతిమ జాబితా మేరకు సైతం హైదరాబాద్ జిల్లాలోని జూబ్లీహిల్స్‌లోనే అత్యధికంగా 3,87,056 మంది ఓటర్లున్నారు. ఫిబ్రవరిలోని తుది జాబితాలోనూ జూబ్లీహిల్స్‌లోనే అత్యధిక ఓటర్లుండగా, ఇప్పుడు ఇంతకంటే ఎక్కువ మంది ఓటర్లున్నారు. అప్పుడు ఈ సెగ్మెంట్‌లో 3,87,206 మంది ఓటర్లున్నారు.

యాకుత్‌పురాలో అత్యధికంగా పెరిగారు. గత ఫిబ్రవరిలో వెలువడిన ఓటరు తుది జాబితా అనంతరం దాదాపు రెండున్నర నెలల కాలంలో యాకుత్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 4,733 మంది ఓటర్లు పెరిగారు. ఫిబ్రవరి 8వ తేదీన వెలువరించిన తుదిజాబితాలో ఈ సెగ్మెంట్‌లో 3,55,979 మంది ఓటర్లుండగా, ఆ తర్వాత కొత్తగా చేరికలు, తొలగింపుల అనంతరం 4,733 మంది పెరిగి అంతిమంగా 3,60,712 ఓటర్లు మిగిలారు. వీరందరికీ మే 13న ఓటు వేసే అర్హత ఉంది. ఫిబ్రవరిలోని తుది జాబితా అనంతరం ఈ సెగ్మెంట్ జాబితాలో కొత్తగా 9,179 మంది చేరగా, వివిధ కారణాలతో 4,446 మందిని తొలగించారు.

అనుబంధ జాబితాతో సహా అంతిమంగా మే 13 పోలింగ్‌కు అర్హులైన ఓటర్లు నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	ఓటర్లు
ముషీరాబాద్	3,07,995
అంబర్‌పేట	2,79,924
ఖైరతాబాద్	2,99,651
జూబ్లీహిల్స్	3,87,056
సనత్‌నగర్	2,53,381
నాంపల్లి	3,26,057
సికింద్రాబాద్	2,66,337
మలక్‌పేట	3,17,636
కార్వాన్	3,62,411
గోషామహల్	2,74,522
చార్మినార్	2,30,298
చాంద్రాయణగుట్ట	3,49,611
యాకుత్‌పురా	3,60,712
బహదూర్‌పురా	3,21,904
కంటోన్మెంట్	2,53,706
మొత్తం	45,91,201

4 సెగ్మెంట్లలో తగ్గిన ఓటర్లు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో గత ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితా వెలువడింది. అనంతరం జాబితాలో ఓటరుగా చేరేందుకు భారీ సంఖ్యలోనే ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. అధిక సంఖ్యలోనే ఓటర్లుగా నమోదయ్యారు. కానీ.. తాజాగా వెలువడిన (అనుబంధ జాబితాతో కూడిన) తుది జాబితాలో మాత్రం పెద్దగా తేడా కనపడటం లేదు. కొత్తగా జాబితాలో పేర్లు చేరిన వారితో పాటు, తొలగించిన ఓట్లు కూడా ఎక్కువగా ఉండటమే అందుకు కారణం. అప్పుడు మొత్తం ఓటర్లు 45,70,138 మంది ఉండగా, ఇప్పుడు వారిసంఖ్య 45,91,201కి చేరింది. అంటే 21,063 మంది మాత్రం పెరిగారు. ఈ పెరుగుదల సైతం దాదాపు సగం నియోజకవర్గాల్లో మాత్రం చేర్పులు, తొలగింపుల అనంతరం అప్పటి కంటే తగ్గింది. అలాంటి నియోజకవర్గాలు నాలుగుండగా, రెండు పాతబస్తీ పరిధిలో, రెండు న్యూసిటీలో ఉన్నాయి. పాతబస్తీ పరిధిలోని కార్వాన్‌లో అప్పటి కంటే 606 మంది ఓటర్లు తగ్గగా, గోషామహల్‌లో 146 మంది తగ్గారు. కార్వాన్‌లో ఫిబ్రవరిలో వెలువడిన తుది జాబితాలో మొత్తం ఓటర్లు 3,63,017 మంది ఉండగా, ఆ తర్వాత 8613 మంది ఓటర్లు కొత్తగా చేరారు. వివిధ కారణాలతో 9,219 మందిని తొలగించారు. దాంతో అప్పటి కంటే మొత్తం ఓటర్ల సంఖ్య 606 తగ్గి అంతిమ జాబితాలో 3,62,411 మందిగా ఉన్నారు. అలాగే గోషామహల్ సెగ్మెంట్‌లో ఫిబ్రవరి తుది జాబితాలో 2,74,668 మంది ఉండగా, కొత్తగా 4,327 మంది చేరారు. తొలగింపులు మాత్రం అంతకంటే ఎక్కువగా 4,473 ఉన్నాయి. దీంతో అప్పటి కంటే 146 మంది తగ్గారు. అంతిమ జాబితాలో ఓటేసేందుకు అర్హత ఉన్నవారుగా 2,74,522 మంది మిగిలారు.

న్యూసిటీలో..

న్యూసిటీలోని జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌లో ఫిబ్రవరి తుది జాబితాలో 3,87,206 మంది ఓటర్లుండగా, ఆ తర్వాత కొత్తగా భారీ సంఖ్యలో 10,147 మంది చేరినప్పటికీ, తొలగించినవారు అంతకంటేఎక్కువగా 10,297 మంది ఉన్నారు. అంటే 150 మంది తగ్గారు. అంతిమంగా 3,87,056 మంది ఓటేసే అర్హత కలిగి ఉన్నారు. ఇదే మాదిరిగా సికింద్రాబాద్ సెగ్మెంట్‌లో ఫిబ్రవరి జాబితాలో 2,67,282 మంది ఓటర్లుండగా, కొత్తగా 7,829 మంది పేర్లు చేరాయి. జాబితాలోని 8,774 మంది పేర్లు తీసేశారు. దీంతో ఫిబ్రవరి కంటే 945 మంది ఓటర్లు తగ్గారు. అంతిమంగా 2,66,337 మంది ఈ సెగ్మెంట్‌లో ఓటేసేందుకు అర్హులుగా ఉన్నారు.

మంగళవారం ఉష్ణోగ్రతలు ఇలా..	రాజీవ్ నగర్	హఫీజ్‌పేట	యాకుత్‌పురా	కేపీహెచ్‌బీ	బన్సీలాల్‌పేట	ఎల్‌బీనగర్	శివరాంపల్లి	చిలకలగూడ	కిషన్‌బాగ్	బండ్లగూడ	నాంపల్లి	కూకట్‌పల్లి
	43.5	43.3	43.2	43.1	43.0	43.0	42.9	42.9	42.8	42.7	42.5	42.4

కాంగ్రెస్‌కు మాదిగ సంఘాల మహా కూటమి మద్దతు


మాట్లాడుతున్న పోకల కిరణ్ మాదిగ

పంజగుట్ట: మాదిగ జాతికి మంద కృష్ణ మాదిగ, మోత్కుపల్లి నర్సింహులు తీరని అన్యాయం చేస్తున్నారని తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి చైర్మన్ పోకల కిరణ్ కుమార్ మాదిగ అన్నారు. జాతిని అడ్డం పెట్టుకుని మంద కృష్ణ ప్యాకేజీలు పొందాడని, మోత్కుపల్లి పదవులు అనుభవించాడని ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి దశపాక నర్సింహ మాదిగ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌లతో కలిసి మాట్లాడుతూ... గత 30 ఏళ్లుగా మాదిగ రిజర్వేషన్ల పేరుతో మంద కృష్ణ మాదిగలను వంచిస్తున్నాడని ఆరోపించారు. వీరిద్దరూ మాదిగ జాతికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వారి లబ్ధి కోసం మాదిగజాతిని గంపగుత్తలా పార్టీలకు అమ్మేస్తున్నారన్నారు. మహా కూటమి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రతి దళిత వాడలో పర్యటించి మాదిగలను చైతన్యం చేస్తామని, మాదిగ బిడ్డ అయిన రాజయ్యను అకారణంగా పదవినుంచి తొలగించిన బీఆర్ఎస్‌కు, అధికారంలోకి రాగానే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తానని మాట తప్పిన బీజేపీకి ఓటువెయ్యరాదన్నారు. వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాస్టార్‌జీ, మల్లు శివరాం, పుంజర్ల సుధాకర్ మాదిగ, తలారి చైతన్య, యాదగిరి, ప్రేమ్ రాజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మలక్‌పేట: ఎన్నికల విధినిర్వహణలో అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం హైద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం ముంతాజ్ కాలేజ్‌లో ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసిడింగ్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ఎన్నికల నియమావళి పాటించాలని, ఈవీఎంల ఆపరేటింగ్, వాటిని భద్రపరిచే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అవకతవకలకు తావులేకుండా పోలింగ్ సజావుగా నిర్వహించాలని సూచించారు. 360 పీఓ, ఏపీఓలకు గాను 319 మంది శిక్షణకు హాజరు కాగా 41 గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓ రాజేష్‌కుమార్, ఏఆర్‌ఓ, సైదాబాద్ తహశీల్దార్ జయశ్రీ, ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్, డీపీఓ యుగంధర్‌రెడ్డి, సెక్టోరల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

వంట సరిగా చేయలేదని..


రవీనా దుర్వే మృతదేహం


నిందితుడు నవీన్ దుర్వే

భార్యను చంపిన భర్త

నిజాంపేట్: వంట రుచిగా చేయలేదని ఓ వ్యక్తి భార్యతో గొడవపడి ఆమెను హతమార్చిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నవీన్ దుర్వే, రవీనా దుర్వే(28) నగరానికి వలస వచ్చి బాచుపల్లిలోని వెనుక ఉన్న ప్రగతి కన్‌స్ట్రక్షన్స్‌లో కార్మికులుగా పనిచేస్తూ గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. సోమవారం రాత్రి వంట విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. వంట సరిగా చేయడం లేదని ఆగ్రహానికి లోనైన నవీన్ ఇటుకతో భార్య రవీనా తలపై మోదడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. నిందితుడు నవీన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ విద్యార్థుల సత్తా



సాక్షి,సిటీబ్యూరో: పదవ తరగతి పరీక్షల్లో బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 1690 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా , 123 మంది విద్యార్థులు పదికి పది జీపీఏ, 586 మంది ఏ గ్రేడ్, 512 మంది ఏ-2 గ్రేడ్, మిగిలిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ కళిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

ఇరాన్‌కు డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారంటూ..

- ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసుల పేరుతో స్కైప్ కాల్
- రూ. 47 లక్షలు వసూలు

హిమాయత్‌నగర్: ముంబై నుంచి ఇరాన్ దేశానికి డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారని బెదిరించి సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తికి టోకరా వేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన వ్యక్తికి ముంబై ఫెడెక్స్ కొరియర్ పేరుతో ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు అతడి ఆధార్ కార్డ్‌తో ముంబై నుంచి ఇరాన్‌కు 450 గ్రాముల ఎండీఎంఏ, 5 కిలోల దుస్తులు, 3 ఎక్స్‌పైరీ అయిన పాస్‌పోర్టులు, ల్యాప్‌టాప్‌తో కూడిన పార్సిల్‌ను ముంబై కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం అతడికి క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో స్కైప్ వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు బాధితుడికి చెందిన ఆరు నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్‌లు, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్, ఉద్యోగ వివరాలు అడిగారు. ఈ విషయాలను తమ కుటుంబ సభ్యులతో కూడా చెప్పవద్దని బెదిరించారు. డ్రగ్స్ కొరియర్‌తో పాటు మనీలాండరింగ్ కేసులు ఉన్నాయని అతడిని బెదిరించారు. గత ఆరు నెలల బ్యాంక్ లావాదేవీలతో పాటు నిబంధనల ప్రకారం బ్యాంక్‌లలో ఉన్న నగదును పంపించాలని, వెరిఫై చేసి తిరిగి పంపిస్తామని నమ్మించారు. స్కైప్ కాల్‌లో ఉండగానే ఇతర విషయాల కోసం సమీపంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచ్‌కు వెళ్లి బయట వేచి ఉండాలని సూచించారు. వారి నమ్మిన బాధితుడు కేటుగాళ్లు చెప్పిన విధంగా రూ.46,78,000 బదిలీ చేశాడు. అనంతరం డబ్బు తిరిగి రాకపోవడం, వారు స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి నగర సైబర్ క్రైమ్ పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

'కేర్'లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం ప్రారంభం..

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని కేర్ ఆసుపత్రిలో 'కేర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైజెస్టివ్ డిసీజెస్, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్'ను ఏర్పాటు చేశారు. క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.కె.హరిప్రసాద్ మంగళవారం ఈ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ వైద్యులు మాట్లాడుతూ కొత్త విభాగం ద్వారా అత్యాధునిక వైద్యసేవలు అందించడంతో పాటు ముందస్తుగా వ్యాధి గుర్తింపు మరింత సమర్థవంతంగా కాలేయ మార్పిడి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో గ్రూప్ సీఈఓ జస్‌దీప్ సింగ్, క్లినికల్ డైరెక్టర్, నూతన విభాగ అధిపతి డా.మహ్మద్ అబ్దున్ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సహకార సంస్థ ద్వారా రూ.1100 కోట్ల ఎగుమతులు

ఏజీవర్సిటీ: జాతీయ సహకార సంస్థ ద్వారా 2023-2024 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1100 కోట్ల ఎగుమతులు చేయనున్నట్లు సంస్థ తెలుగు రాష్ట్రాల సమన్వయ కర్త డాక్టర్ ఎస్ఎల్ఎస్‌టీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయ సహకార సంస్థ ద్వారా 2023-24 సంవత్సరానికి రూ. 1100 కోట్ల విలువైన ఎగుమతులు జరిగాయన్నారు. ఏప్రిల్ నెలలో రూ.400 కోట్ల విలువైన చక్కెర, గోధుమలు, బియ్యం, ఉల్లిపాయలు ఎగుమతి చేసినట్లు ఆయన వివరించారు.

ఫ్లై ఓవర్ పై నుంచి పడి కార్మికుడి మృతి


ప్రబీర్ సర్దార్(ఫైల్)

అంబర్‌పేట: చే నంబర్ ఫ్లైఓవర్‌పై సెంట్రింగ్ పని చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే...పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రబీర్ సర్దార్ (22) చే నంబర్ ఫ్లైఓవర్‌పై సోమవారం రాత్రి సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అంబర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సేవకుడు జ్ఞానకుమార్‌కు డాక్టరేట్



నాగోలు: సామాజిక, సంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు సేవలు అందిస్తున్న కొత్తపేట, న్యూనాగోలు కాలనీ చెందిన కొమర్రాజు ఫౌండేషన్ సంస్థాపక అధ్యక్షులు కొమర్రాజు వెంకట జ్ఞానకుమార్‌కు ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ (యుఎస్‌ఏ) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. స్ఫూర్తి సర్వీస్ సొసైటి ఇండియా ఎన్‌జీవో నిర్వహించిన కార్యక్రమంలో జ్ఞానకుమార్‌కు డాక్టరేట్, అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జ్ఞానకుమార్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్నతోద్యోగిగా పదవీ విరమణ చేసిన అనంతరం 2014 లో కొమర్రాజు ఫౌండేషన్‌ను స్థాపించి దాని ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం నిర్వహించిన స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా సంస్థ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 82వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి మంగళవారం తీర్పు చెప్పారు. ఏపీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... మీర్‌పేట్ ఠాణా పరిధిలో నివసిస్తున్న పాస్తం రాములు 2022 డిసెంబర్ 28న తన కుమార్తెకు పాలల్లో మత్తు మందు కలిపి ఇచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. మర్నాడు ఉదయం బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో అనుమానం వచ్చిన తల్లి ఆరా తీయగా కన్న తండ్రే తాగిన మైకంలో కూతురిపై లైంగిక దాడికి పాల్పడినట్లు గుర్తించింది. బాధితురాలి అక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మీర్‌పేట్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం మంగళవారం నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.82వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. బాధితురాలికి రూ. 15లక్షలు నష్టపరిహారం మంజూరు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది. నిందితుడికి శిక్షపడేందుకు కృషి చేసిన ఏపీపీ సునీత, ఏసీపీ పురుషోత్తం రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి తదితరులను రాచకొండ సీపీ తరుణ్ జోషి అభినందించారు.

ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది



పంజగుట్ట: ప్రజాస్వామ్యం ఎంతో ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని, ఎమర్జెన్సీ నాటికంటే రెండితల ఎక్కువ దుర్మార్గాలు జరుగుతున్నాయని ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ప్రతినిధి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. అవినీతి, అధికార దుర్వినియోగం ఎక్కువైందని, మహారాష్ట్రలో అజిత్‌పవార్ రూ. 75వేల కోట్ల కుంభకోణం, ఆయన భార్య రూ. 25వేల కోట్ల కుంభకోణాలు చేశారని, వారు బీజేపీలోకి వెళ్లగానే అన్నీ మాఫ్ అయిపోయాయని ఇంతకన్నా దారుణం ఏముంటుందని ప్రశ్నించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ది జేఏసీ ఆఫ్ సెక్యులర్ డెమోక్రటిక్ ఫ్రంట్, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో సేవ్ డెమోక్రసీ, సేవ్ కాన్సిస్ట్యూషన్, సేవ్ ఇండియా పేరుతో నిర్వహించిన సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ .. మణిపూర్‌లో ఎన్నో నిక్షేపాలు ఉన్నాయని అక్కడ ఒక గిరిజన తెగవారు మాత్రమే స్థలాలు కొనే అవకాశం ఉండడంతో వాటిని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు రెండు తెగలమధ్య గొడవలు సృష్టించి ఎన్నో దారుణాలకు పాల్పడ్డారన్నారు. ఒక ఫేక్ వీడియో ప్రచారం చేస్తే 12 గంటల్లో ఢిల్లీనుంచి పోలీసులు వచ్చి నోటీసులు ఇస్తారని, అదే రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు సరఫరా చేసే వారిని మాత్రం పట్టుకోరని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు లింగా నాయక్, అబ్దుల్ మాజీద్, సోగరాబేగం, కస్తూరి శ్రీనివాస్, భద్ర, ఇంద్రసేన, స్నేహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామశాల ప్రమాణాలపై బీఐఎస్ మానక్ మంథన్



సాక్షి, సిటీబ్యూరో: ప్రజలకు భద్రత కల్పిస్తూ వ్యాయమశాలలో అనుసరించాల్సిన ప్రమాణాలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారులు మంగళవారం మానక్ మంథన్ నిర్వహించారు. వ్యాయమశాల నిర్వహణ కోసం బీఐఎస్ రూపొందించిన ఐఎస్-18655-2024 ప్రమాణంపై నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో నగరానికి చెందిన ప్రముఖ వ్యాయమశాలల ప్రతినిధులు, శిక్షకులు, ఔత్సాహికులు పాల్గొన్నారు. కార్యక్రమానికి బీఐఎస్ సౌత్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ యూఎస్పీ యాదవ్, జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్త కె. వెంకటేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా రూపొందించిన ఈ ప్రమాణంలోని విశేషాలు, ప్రయోజనాలను అధికారులు వెల్లడించారు. వ్యాయమశాలకు వచ్చే ప్రతి వ్యక్తిని పర్యవేక్షించే విధానం, రుసుము చెల్లింపులు, తదితర అంశాలతో రూపొందించిన ఈ ప్రమాణాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని బీఐఎస్ డీడీజీఎస్ యూఎస్‌పీ యాదవ్ తెలిపారు. బీఐఎస్ కొత్తగా రూపొందించే ప్రమాణాలు, ఇదివరకే ఉన్న ప్రమాణాల్లో మార్పులను చేసేందుకు మానక్ మంథన్ అనే వేదికను ఏర్పాటు చేసినట్లు బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ పేర్కొన్నారు.

రూ.1.68 కోట్లు పట్టివేత

మలక్‌పేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మలక్‌పేట పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలలో పెద్ద మొత్తంలో నగదు పట్టుబడినట్లు ఇన్‌స్పెక్టర్ గుంజె శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సాయంత్రం దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుడంగా ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా.. నిబంధనలకు విరుద్ధంగా రూ.కోటీ 68 లక్షల 87 వేల 800 నగదు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ నగదుకు సంబంధించి సరైన పత్రాలు చూపించని కారణంగా నగదు స్వాధీనం చేసుకుని ఎన్నికల కమిషన్ వారికి అందజేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రాడిసన్ స్టార్ హోటల్‌లో వజ్రాభరణాలు చోరీ

బంజారాహిల్స్: శుభకార్యానికి తమిళనాడు నుంచి హైదరాబాద్ వచ్చి స్టార్ హోటల్‌లో బస చేసిన మహిళకు చెందిన బంగారు వజ్రాభరణాలు చోరీకి గురైన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... తమిళనాడు మధురైకి చెందిన మెహ్రూన్ ఇస్మాయిల్ అనే మహిళ శుభకార్యం నిమిత్తం హైదరాబాద్ వచ్చి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-6లోని రాడిసన్ బ్లూప్లాజా హోటల్‌లో రూమ్ నెంబర్ 427లో బస చేసింది. ఈ నెల 27న ఉదయం తన గది నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేయడానికి వచ్చింది. ఆ సమయంలో హోటల్ సిబ్బంది ఆమెకు తెలియకుండా రూమ్ క్లీనింగ్ చేసి వెళ్లిపోయారు. గదికి వచ్చి చూడగా లాకర్‌లో ఉండాల్సిన గోల్డ్ డైమండ్ ఆభరణాలు కనిపించలేదు. నాలుగో అంతస్తు ఫ్లోర్ ఇన్‌చార్జి, సూపర్‌వైజర్, రూమ్ సర్వీస్ స్టాఫ్‌లపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వాష్‌రూంలో యువతి ఫొటోలు తీసేందుకు యత్నం

వెంగళరావునగర్: ఓ గుర్తుతెలియని వ్యక్తి వాష్‌రూంలోకి వెళ్లిన యువతి ఫొటోలు, వీడియోలు తీయడానికి యత్నించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధురానగర్‌కాలనీ ప్రధాన రహదారిలో హరేలియా హాస్టల్‌లో కొందరు యువతులు, మహిళలు ఉంటున్నారు. ఏప్రిల్ 28న తెల్లవారుజామున ఓ యువతి వాష్‌రూంలోకి వెళ్లగా ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వెంటిలేటర్ గుండా ఫొటోలు, వీడియోలు తీయడానికి ప్రయత్నించాడు. దీనిని గుర్తించిన ఆమె కేకలు వేయడంతో సదరు వ్యక్తి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్ల్యూసీఓఏ అధ్యక్షుడిగా రాజానర్సింగ్‌రావు

బంజారాహిల్స్: ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లో సీనియర్ అనస్తీషియాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రాజా నర్సింగ్‌రావు వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఆప్తాల్మిక్ అనస్తీషియా (డబ్ల్యూసీఓఏ) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బ్రెజిల్‌లోని సావోపాలోలో జరిగిన డబ్ల్యూసీఓఏ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 2028లో హైదరాబాద్‌లో వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఆప్తాల్మిక్ అనస్తీషియా సమావేశాన్ని నిర్వహించాలని కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు రాజానర్సింగరావు ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు.

సందడిగా 'రియల్ స్టార్ అవార్డ్స్'...



సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్ వేదికగా ఏర్పాటు చేసిన 'రియల్ స్టార్ అవార్డ్స్' కార్యక్రమంలో ప్రముఖ సినీతార, బిగ్‌బాస్ ఫేం అశ్వినీ శ్రీ పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డా.గంప నాగేశ్వర్ రావు, రియల్ ఎస్టేట్ కోచ్-ట్రైనర్ సింగిరెడ్డి నిరంజన్ పాల్గొని రియల్ ఎస్టేట్ ఔత్సాహికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు యనమల డెవలపర్స్ సీఎండీ యనమల రాజు మాట్లాడుతూ యనమల డెవలపర్స్ రీ-సేల్‌కు ల్యాండ్ మార్క్‌గా మారిందన్నారు. ఎలాగోలా ప్లాట్లు కొనిపించి చేతులు దులుపుకోకుండా, అవసరమైన సమయంలో వారి ప్లాట్లను అమ్మిపెట్టే బాధ్యత కూడా తామే తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు రజనీ సాయిచంద్, పులిమామిడి నారాయణ, డా.చంద్రకాంత్ రావు, డా.పద్మజలతో పాటు సంస్థ డైరెక్టర్ యనమల సిరి, ఎండీలు సునీల్ ఆర్య, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

రూ.62,620 నగదు స్వాధీనం


పోలీసుల అదుపులో పేకాట రాయుళ్లు

గచ్చిబౌలి: ఓ అపార్ట్‌మెంట్‌లో గుట్టు చప్పుడు కాకుండా ఆడుతున్న పేకాట రాయుళ్లను రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజాగూడలోని అట్లాంటిక్స్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నెంబర్ 304లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్ఓటీ, రాయదుర్గం పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. నిందితుల నుంచి రూ.62,520 నగదు, 11 మొబైల్ ఫోన్లు, ఐదు సెట్ల ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. కమ్మంపాటి మధవి అనే మహిళ కొంత కాలంగా పేకాట కేంద్రాన్ని నిర్వహిస్తూ ఆటకు రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిర్వాహకురాలితో పాటు జి.శ్రీనివాస్, కె.రాజేందర్ రెడ్డి, బి.లక్ష్మీనారాయణ, కె.రాములు, కె.బాలరాజ్, ఎం.చలపతి రావు, జి.చంద్ర శేఖర్ రెడ్డి, పి.నాగరాజులకు నోటీసులు జారీ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ గదిలో యువకుడి అనుమానాస్పద మృతి


హేమంత్ (ఫైల్)

అమీర్‌పేట: హోటల్ గదిలో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జడ్చర్ల గ్రామానికి చెందిన హేమంత్ (28) బ్రిక్స్ వ్యాపారం చేస్తున్నాడు. అతను కొన్నాళ్లుగా అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. సోమవారం శుభకార్య నిమిత్తం నగరానికి వచ్చిన వారు రాత్రి ఎస్ఆర్‌నగర్‌లోని ఓ హోటల్‌లో బస చేశారు. గదిలో మద్యం సేవించిన హేమంత్ రాత్రి 2 గంటల సమయంలో బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. ఎంతకూ బయటికి రాకపోవడంతో అతడి ప్రియురాలు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్న హేమంత్‌ను గుర్తించి అతడి స్నేహితులకు ఫోన్ చేసి సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు అతడిని బయటికి తీసుకువచ్చి 108 కాల్ చేశారు. పరీక్షించిన సిబ్బంది అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి హేమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరుత చిక్కేనా?

శంషాబాద్: మూడ్రోజుల క్రితం ఎయిర్‌పోర్టు రన్‌వే సమీపంలో తిరిగింది చిరుతేనని నిర్ధారణ కావడంతో దానిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. బోన్‌ల సంఖ్యను 2 నుంచి 5కు, ట్రాప్ కెమెరాలను 9 నుంచి 20కి పెంచారు. నిర్మానుష్య, అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బోన్‌లలో మేక మాంసాన్ని పెట్టారు. చిరుత చిక్కేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మోదీ నాయకత్వంలోనే దేశ ప్రగతి


ప్రచారం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ కిలారి, శివకుమార్

శ్రీనగర్‌కాలనీ: నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమైన ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్నిరంగాల్లో ప్రగతిని సాధించి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలించిందని మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. మూడోసారి ప్రధానిగా మోదీ కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో అత్యధిక ఎంపీ సీట్లు బీజేపీ సాధిస్తుందన్నారు. నేతలు గోవర్ధన్‌రెడ్డి, కమ్మరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో బధిర విద్యార్థుల హవా

శ్రీనగర్‌కాలనీ: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీనగర్‌కాలనీ ఆశ్రయ్–ఆకృతి బధిర పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పవన్‌రెడ్డి, రితిక్, షరీఫ్‌లు 8.8 జీపీఏ సాధించారు. స్కూల్ డైరెక్టర్ డీపీకే బాబు, అకడమిక్ డైరెక్టర్ శశికళ అభినందించారు.

ఎల్లారెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో...

ఎల్లారెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో 30 విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందులో 28 మంది విద్యార్థులు పాసై 93.5 ఉత్తీర్ణత సాధించారు. హెచ్‌ఎం మెర్సీ, ఇంచార్జ్ సుగుణాసాగర్ విద్యార్థులను అభినందించారు.

వైద్య శిబిరానికి మంచి స్పందన

శ్రీనగర్‌కాలనీ: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని గ్రేటర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్, మైనార్టీ నేత మోసిన్ ఖురేషి అన్నారు. మంగళవారం హేమావతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో స్థానికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. వైద్యులు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు అందించి మందులను అందజేశారు. నేతలు ఎర్ర కృష్ణకుమార్, సుధామ్, రమేష్‌నాయక్, ఎల్లమేశ్వర్, డాక్టర్ లహర్‌గాంధీ, శాస్త్రి, యాకమ్మ, వెంకటేష్, అంజయ్యగౌడ్, దేవ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లో చేరిన మహిళలు

ఫిలింనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ఫిలింనగర్‌కు చెందిన వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. సీనియర్ నేత మామిడి నర్సింగరావు ఆధ్వర్యంలో మహిళా సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్‌లో చేరి దానం నాగేందర్ గెలుపుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మామిడి నర్సింగరావు వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దీప, చంద్రకళ, హనుమమ్మ, కోటేశ్వరమ్మ, దానమ్మ, మల్లేశ్వరి, రాములమ్మ, జయమ్మ, నాగమణి తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆకుల రాజు, కాటూరి రమేష్, ఘని, దాస్, గోపాల్‌నాయక్, మల్లేష్‌యాదవ్, సునీల్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


అలేఖ్య

ఫిలింనగర్: అనుమానాస్పద స్థితిలో వివాహిత అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్‌లో నివసించే నవీన్‌కు 2021లో అలేఖ్యతో వివాహం జరిగింది. నవీన్ జూబ్లీహిల్స్ క్లబ్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం తాను డ్యూటీలో ఉండగా తన వదిన ఫోన్ చేసి అలేఖ్య కనిపించడం లేదని చెప్పడంతో వెంటనే తాను వెళ్లి అన్ని ప్రాంతాలను గాలించానని, స్వగ్రామంలోనూ వెతికానని బాధితుడు నవీన్ తెలిపారు. బంగారంతో పాటు వెండి వస్తువులు తీసుకుని తన భార్య వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిలింనగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి అలేఖ్య కోసం గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 61161లో సంప్రదించాలని కోరారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్తాచాటిన సర్కారు బడుల విద్యార్థులు


రాజ్‌భవన్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల సందడి

పది ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు
- ఖైరతాబాద్‌లో 84.23 శాతం ఉత్తీర్ణత
- 9 జీపీఏ సాధించిన విద్యార్థులు అధికం
- ఆరు పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

బంజారాహిల్స్:సర్కార్ బడుల్లో పదో తరగతి విద్యార్థులు సత్తా చాటారు. గత విద్యా సంవత్సరానికి భిన్నంగా ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణతా శాతం అధికంగా నమోదు కావడం పట్ల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యా శాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, బోరబండ, శ్రీనగర్‌కాలనీ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియంలలో మొత్తం 1332 మంది పరీక్షలు రాయగా ఇందులో 1122 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 84.23 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది.

అత్యల్ప ఉత్తీర్ణత

ఈ విద్యా సంవత్సరంలో పది పరీక్షల్లో కొన్ని పాఠశాలల్లో అత్యల్ప ఉత్తీర్ణత శాతం నమోదైంది. సోమాజిగూడ మక్తా హైస్కూల్‌లో ఉర్దూ మీడియంలో 60 శాతం, ఖైరతాబాద్ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో ఉర్దూ మీడియంలో 33.33 శాతం నమోదైంది. పంజగుట్ట పడవ హైస్కూల్‌లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. అలాగే యూసుఫ్‌గూడ హైస్కూల్‌లో ఉర్దూ మీడియంలో 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. బంజారాహిల్స్ గతి ప్రభుత్వ పాఠశాలలో ఉర్దూ మీడియంలో 100 శాతం ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ పాఠశాల పేరు	మీడియం	హాజరు	ఉత్తీర్ణులు	శాతం
రాజ్‌భవన్ హైస్కూల్	ఇంగ్లిష్	129	123	95.35
ఎర్రమంజిల్ హైస్కూల్	ఇంగ్లిష్	49	36	73.47
సోమాజిగూడ మకా	ఉర్దూ	15	9	60
సోమాజిగూడ మక్తా	ఇంగ్లిష్	18	12	66.67
ఖైరతాబాద్ ప్రాక్టీసింగ్	తెలుగు	2	2	100
ప్రాక్టీసింగ్ హైస్కూల్	ఇంగ్లిష్	15	14	93.33
ప్రాక్టీసింగ్ హైస్కూల్	ఉర్దూ	6	2	33.33
చింతల్‌బస్తీ	తెలుగు	17	16	94.12
పంజగుట్ట పడవ	తెలుగు	8	8	100
పంజగుట్ట పడవ	ఇంగ్లిష్	4	4	100
జవహర్‌నగర్	తెలుగు	16	14	87.50
జవహర్‌నగర్	ఇంగ్లిష్	56	53	94.64
స్వరాజ్‌నగర్	ఉర్దూ	29	24	82.76
ఎల్లారెడ్డిగూడ-2	ఉర్దూ	22	12	54.55
సోమాజిగూడ శ్రీరామ్‌నగర్	తెలుగు	26	18	69.23
సోమాజిగూడ శ్రీరామ్‌నగర్	ఇంగ్లిష్	55	48	87.27
యూసుఫ్‌గూడ	తెలుగు	14	12	85.71
యూసుఫ్‌గూడ	ఇంగ్లిష్	139	114	82.01
యూసుఫ్‌గూడ	ఉర్దూ	9	9	100
బోరబండ	తెలుగు	37	29	78.38
బోరబండ	ఇంగ్లిష్	234	190	81.20
ఎస్‌బీటీనగర్	తెలుగు	21	18	85.71
ఎస్‌బీటీనగర్	ఇంగ్లిష్	76	70	92.11
ఫిలింనగర్	తెలుగు	29	18	62.07
ఫిలింనగర్	ఇంగ్లిష్	139	116	83.45
చౌరాజాన్షియా	ఉర్దూ	22	21	95.45
చౌరాజాన్షియా	ఇంగ్లిష్	15	14	93.33
గతి హైస్కూల్	తెలుగు	18	15	83.33
గతి హైస్కూల్	ఇంగ్లిష్	48	45	93.75
గతి హైస్కూల్	ఉర్దూ	3	3	100
షేక్‌పేట	తెలుగు	21	17	80.95
షేక్‌పేట	ఇంగ్లిష్	40	36	90

ఉపాధ్యాయుల ప్రోత్సాహం



రోజూ తమ చదువులపై టీచర్లు ప్రత్యేక దృష్టిపెట్టారు. ప్రత్యేక తరగతులు తీసుకుని మమ్మల్ని బాగా చదివేలా ప్రోత్సహించారు. నేను 9.5 జీపీఏ సాధించగలిగాను. టీచర్ల ప్రోత్సాహం లేకపోతే ఈ మార్కులు రావడం చాలా కష్టం. – స్వాతి, రాజ్‌భవన్ హైస్కూల్

ప్రత్యేక తరగతులు దోహదం



పరీక్షలకు ముందు వంద రోజులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ఉపాధ్యాయులు శ్రద్ధ పెట్టారు. దీని ఫలితంగా 9.7 జీపీఏ సాధించగలిగాను. ఈ మార్కులు బాగా సంతృప్తినిచ్చాయి. – కె.దీప్తి, రాజ్‌భవన్ హైస్కూల్

మెరిసిన పేదింటి పిల్లలు

బంజారాహిల్స్: పదో తరగతి పరీక్షాలు మంగళవారం వెలువడగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఆయా పాఠశాలలకు పేరు తీసుకువచ్చారు.

- ◆ ఎర్రమంజిల్ హైస్కూల్‌లో ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని కెంజర్ల వర్ష 9.5 జీపీఏ, ఎస్.హారిక 9.5 జీపీఏ సాధించారు.
- ◆ ఖైరతాబాద్ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని ఎస్.నేహామాధురి 9.7 జీపీఏ, పి.పూజ 9.3 జీపీఏ సాధించారు.
- ◆ జవహర్‌నగర్ హైస్కూల్‌లో తెలుగు మీడియం విద్యార్థిని 9.5 జీపీఏ, యెల్చూరి వైష్ణవి 9.3 జీపీఏ సాధించారు.
- ◆ రాజ్‌భవన్ హైస్కూల్‌లో ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని ఎస్.శ్రీకంత 9.8, దీప్తి 9.7, స్వాతి 9.5, సాయితేజ 9.3 జీపీఏ సాధించారు.
- ◆ షేక్‌పేట హైస్కూల్‌లో ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని నాగసంధ్య 9.7 జీపీఏ, శ్రీవల్లి 9.7 జీపీఏ సాధించారు.
- ◆ బోరబండ హైస్కూల్‌లో ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ పోలీస్ పాటిల్ 9.7, అబ్దుల్‌నజీం, అమ్రీన్‌బేగం, స్నేహ రాథోడ్, అబ్దుల్ అజీం 9.5 జీపీఏ సాధించారు.

కష్టపడి చదివా



సోమాజిగూడ రాజ్‌భవన్ హైస్కూల్‌లో శ్రీకంత అనే విద్యార్థినికి 9.8 జీపీఏ రాగా కష్టపడి చదివి ఈ మార్కులు తెచ్చుకున్నానని వెల్లడించింది. ఉపాధ్యాయులు తనకిచ్చిన ప్రోత్సాహం, ప్రత్యేక శ్రద్ధ తనకు ఈ మార్కులు తీసుకువచ్చినట్లు తెలిపింది. – ఎస్.శ్రీకంత, రాజ్‌భవన్ హైస్కూల్

ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా

సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్


దానం సమక్షంలో పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు

ఫిలింనగర్: బీఆర్‌ఎస్ పార్టీలో తాను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని, అన్ని విషయాలు కార్యకర్తలకు తాను చెప్పుకోలేనని సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు దానం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దానం వారికి పార్టీ కండువాలు వేసి అనంతరం భావోద్వేగంతో మాట్లాడారు. తాను బీఆర్‌ఎస్‌గా ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ఒక్క ముఖ్య నేతను కూడా సీఎం కేసీఆర్‌ను కల్పించలేకపోయానని ఆ అయిదేళ్ల కాలంలో తనకు కేవలం అయిదారుసార్లు మాత్రమే కేసీఆర్‌ను కలిసే అవకాశం వచ్చిందని అన్నారు. సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద గంటల కొద్ది వేచి చూసిన రోజులు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. మంత్రి కేటీఆర్ సైతం సమయం ఇచ్చేవారు కాదని అన్నారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉంటుందని గడిచిన నెలలో సాధారణ కార్యకర్తలను సైతం సీఎంను కల్పించానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసే దిశలో ఇందిరమ్మ కమిటీలతో పాటు ఎన్నో నామినేటెడ్ పోస్టులు ఉంటాయని కష్టపడే కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు. సీనియర్ నేతలు మామిడి నర్సింగ్‌రావు, దీపాదేవి, మల్లేష్ యాదవ్, కాటూరి రమేష్, సింహం, నాగేష్‌సాగర్, ఆకుల రాజు పాల్గొన్నారు.

పీఓ, ఏపీఓల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఖైరతాబాద్ నియోజకవర్గ ఏఆర్‌ఓ హేమంత్ బోర్కాడే

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని 245 పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించనున్న ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారుల (ఏపీఓ) సమావేశం మంగళవారం చింతల్‌బస్తీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ సహాయ రిటర్నింగ్ అధికారి హేమంత్ బోర్కాడే, ఈఆర్‌ఓలు ప్రశాంతి, అనితారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ మే 13న జరగనున్న పోలింగ్ సందర్భంగా పీఓ, ఏపీఓల పాత్ర ఎంతో కీలకమైనదని, ప్రణాళిక బద్ధంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు పోలింగ్ బూత్‌లకు చేర్చాలన్నారు. తమకు ఇచ్చిన ఫారాలన్నీ నిబంధనల మేరకు సక్రమంగా పూర్తి చేయడంతో పాటు ఎప్పటికప్పుడు పోలింగ్ శాతాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు. యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో డీఆర్‌సీ సెంటర్ ఏర్పాటుచేశామని, ఈవీఎంలు, వీవీ ప్యాట్లు మే 12న పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ బూత్‌లకు చేర్చాలన్నారు. పోలింగ్ బూత్‌లలో అన్ని ఏర్పాట్లు ఉండాలని వెల్లడించారు.

'కేటీఆర్ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలి'

హిమాయత్‌నగర్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కేంద్రంలో అధికారంలోకి వస్తే హైదరాబాద్ నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతం చేస్తాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు చేయడాన్ని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ తీవ్రంగా ఖండించింది. మంగళవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో పార్టీ జాతీయ అధ్యక్షుడు గౌంటి కుమార్ చౌదరి యాదవ్ మాట్లాడుతూ... కేటీఆర్ తన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు విక్రమ్ కుమార్ యాదవ్, బ్రహ్మయ్య, చిట్టిబాబు, లక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగానికి వెళ్లొచ్చేలోగా ఇంట్లోని నగలు చోరీ

వెంగళరావునగర్: విధులకు వెళ్లి వచ్చేలోపు ఇంట్లోని నగదు, నగలు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే శివానీ, ఆమె భర్త రాజేష్, అత్త జయలక్ష్మిలు ఏప్రిల్ 29న ఉదయం ఉద్యోగ నిమిత్తం బయటకు వెళ్లారు. మధ్యాహ్నం శివానీ, ఆమె అత్త కలిసి ఇంటికి వచ్చి చూడగా అల్మారా తెరిచి ఉంది. అందులో ఉండాల్సిన 3 జతల చెవి రింగులు, 1.5 తులాల చైను, రూ. 2 వేల నగదు కనిపించలేదు. దీంతో మంగళవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో సంఘటనలో రహమత్‌నగర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళకు చెందిన రూ. 6 వేలు, ఆఫీసు పేపర్లు దొంగలు పట్టుకెళ్లినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉద్యోగ విరమణ వీడ్కోలు

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్న పలువురు ఉద్యోగులు మంగళవారం పదవీ విరమణ పొందారు. ఆస్పత్రిలోని లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప వారిని ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. పదవీ విరమణ పొందిన వారిలో నాలుగో తరగతి ఉద్యోగిని గడ్డం విమల, సీనియర్ పర్సనల్ సెక్రటరీ డేవిడ్ రాజు, సీనియర్ సెక్రటరీయల్ అసిస్టెంట్ టి.వి.ఎస్.ఆర్.కె.శర్మ, సీనియర్ సెక్రటరీయల్ అసిస్టెంట్ (వీఆర్‌ఎస్) టి.విజయలక్ష్మి, హెడ్ నర్సు అరుణ పవలూరి, పార్వతి చిలువూరి, షేక్ బషీర్ అహ్మద్ లు ఉన్నారు. ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ డాక్టర్ శాంతివీర్, డాక్టర్ తేజా, డాక్టర్ నాగేశ్వర్రావ్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో 'సునామీ' సృష్టిస్తాం

పంజగుట్ట: రోడ్లపై పోలీసులు క్యాంపులు పెట్టి డబ్బులు పట్టుకుంటున్నారు కానీ ఎన్నికల కమిషన్ మాత్రం డబ్బులు ఇచ్చి ఓట్లు కొనుగోలను నియంత్రించడంలో విఫలం అవుతోందని ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ పీపుల్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షుడు సి.హెచ్.భూపాల్‌గౌడ్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో తాను సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి తమ పార్టీ తరఫున బరిలో ఉన్నానని, తనకు ఉంగరం గుర్తు కేటాయించారని తెలిపారు. 52 శాతం ఉన్న బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీలను కలుపుకొని సికింద్రాబాద్ నియోజకవర్గంలో సునామీ సృష్టిస్తానని ధీమా వ్యక్తం చేశారు.



భళా.. బడ్జెట్ స్కూళ్ల విద్యార్థులు

- 10 జీపీఏ సాధించిన విద్యార్థులు
- పలు పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు
- పాఠశాలల్లో ఆనందోత్సాహాలు


10 జీపీఏ సాధించిన బీఎస్‌ఆర్ బ్రిలియంట్ స్కూల్ విద్యార్థినికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

బంజారాహిల్స్: పదో తరగతి ఫలితాల్లో బడ్జెట్ స్కూల్ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. బస్తీల్లో ఉన్న బడ్జెట్ స్కూళ్లు సైతం కార్పొరేట్ స్కూళ్లకు తక్కువేమీ కాదన్నట్లుగా పదికి పది జీపీఏ సాధించి విద్యార్థులు వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపారు.

మేస్త్రీ కూతురు...

ఫిలింనగర్ బీఎస్‌ఆర్ బ్రిలియంట్ స్కూల్‌లో చదువుతున్న బి.అర్చన 10 జీపీఏ సాధించి సత్తా చాటింది. ఎమ్మార్సీ కాలనీలో నివాసం ఉండే అర్చన తండ్రి తాపీ మేస్త్రీగా విధులు నిర్వహిస్తున్నాడు. బీఎస్‌ఆర్ బ్రిలియంట్ స్కూల్‌లో 35 మంది విద్యార్థులకు 33 మంది విద్యార్థులు పాస్ అయ్యారని. 99 శాతం ఉత్తీర్ణత నమోదు చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ వీరారెడ్డి, ప్రిన్సిపాల్ మాధవి రెడ్డి తెలిపారు.

సత్తా చాటిన సెక్యూరిటీ గార్డ్‌ల పిల్లలు...

బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని శ్రీ సరస్వతి హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. ఎ.హారిక, ప్రతీక్ష 10 జీపీఏకు 10 జీపీఏ సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ప్రతీక్ష తండ్రి ఒడిశాకు చెందిన వారు కాగా ఆమె తండ్రి భరత్ బిషన్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. హారిక తమ పాఠశాలలో 81 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 81 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలు నమోదు చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ రామసుబ్బయ్య నాయుడు తెలిపారు.

వివేకానంద స్కూల్‌లో...

ఫిలింనగర్ జ్ఞానిజైల్‌సింగ్‌నగర్ బస్తీలోని వివేకానంద స్కూల్‌లో ఇద్దరు విద్యార్థినులు 10కి 10 జీపీఏ సాధించి సత్తా చాటారు. పాఠశాలకు చెందిన గౌరీ, బి.హేమలతలు 10 జీపీఏ సాధించారు. మొత్తంగా 97 శాతం ఫలితాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రామచంద్రయ్య తెలిపారు. విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ అనంతరాములు ఘనంగా సత్కరించారు.

సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో 100 శాతం

బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో శాతం 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ మాచుపల్లి శేఖర్ తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. విద్యార్థి జి.కృష్ణ మనోహర్ 9.5 జీపీఏ సాధించినట్లు వారు వివరించారు.


10 జీపీఏ సాధించిన సరస్వతి స్కూల్ విద్యార్థులకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు


విద్యార్థులను సత్కరిస్తున్న సెయింట్ జోసెఫ్ స్కూల్ ఉపాధ్యాయులు


10 జీపీఏ సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న ఫిలింనగర్ వివేకానంద స్కూల్ ఉపాధ్యాయులు

ప్రేమించాడు.. ఏడాదికే వదిలేశాడు..

పెళ్లి చెడగొట్టేందుకు కుట్రలు చేస్తున్న యువకుడిపై కేసు

వెంగళరావునగర్: ప్రేమించానన్నాడు, ఏడాది పాటు తిరిగి వదిలేశాడు, మళ్లీ ఇప్పుడు యువతి పెళ్లి చెడగొట్టడానికి ప్రయత్నిస్తున్నాడో యువకుడు. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... జవహర్‌నగర్‌లో నివసించే యువతిని యూసుఫ్‌గూడలో డైలీ లేబర్‌గా ఉంటున్న హేమంత్ 2021లో ప్రేమించానన్నాడు. యువతి ఒప్పుకోవడంతో ఏడాదిపాటు స్నేహం చేశాడు. 2022లో ఆమెను వదిలేశాడు. 2023లో ఆమెకు తల్లిదండ్రులు త్రినాథ్ అనే వ్యక్తితో పెళ్లి చేయడానికి సిద్ధపడ్డారు. ఈ క్రమంలో ఏప్రిల్ 28న త్రినాథ్‌కు హేమంత్ ఫోన్ చేసి తమ పర్సనల్ ఫొటోలు చూపిస్తూ ఆమెను పెళ్లి చేసుకుంటే మర్యాదగా ఉండదని, ఫొటోలు వైరల్ చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దాంతో ఆమె మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనుల ప్రారంభం

రహమత్‌నగర్: బోరబండ సైట్–3 శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు ఎట్టకేలకు పునః ప్రారంభమయ్యాయి. శ్మశాన అభివృద్ధి కోసం పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లోకాయుక్తను ఆశ్రయించి రూ. 1.75 లక్షలను మంజూరు చేయించారు. అయితే అప్పట్లో కొన్ని కారణాల వల్ల ఆ పనులు నిలిచి పోయాయి. తాజాగా ఆ సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య పనులు ఆగిపోయిన విషయాన్ని లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి అభివృద్ధి పనులను ప్రారంభించారు. దీంతో 54 బస్తీల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇండియా కూటమికి సంపూర్ణ మద్దతు: ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న ఇండియా కూటమి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులకు లోక్‌సభ ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర తెలిపారు. యువతను మోసం చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలని, ఆ పార్టీల అభ్యర్థులకు ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో 'ఇండియా కూటమి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపిద్దాం' పేరిట రూపొందించిన కరపత్రాలను సమితి ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. పలు డిమాండ్లతో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మే 1 నుంచి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్య ప్రసాద్, శ్రీమాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బీజేపీది ఆరెస్సెస్ ఎజెండా

సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యుడు గురుదీప్ సింగ్ సప్పల్



సాక్షి, హైదరాబాద్: దేశ పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిన భారత రాజ్యాంగానికి ఆర్ఎస్ఎస్ వ్యతిరేకమని, అందుకే రాజ్యాంగాన్ని రద్దు చేసి మను ధర్మ విధానాన్ని అమలు చేయాలని ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శాశ్వత సభ్యుడు గురుదీప్‌సింగ్ సప్పల్ అన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాని అమలు చేయాలని చూస్తున్న బీజేపీ ఆ లక్ష్యాన్ని సాధించేందుకే 400 సీట్లు కోరుకుంటోందని అన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం ఆయన ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ, ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాత పాల్, మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ తన శ్వేతపత్రంలో రాజ్యాంగం హిందూ వ్యతిరేకంగా ఉందని, మార్పు చేయాలని రాసుకుందని అన్నారు. పదేళ్ల పాలనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ ఖాళీలను కూడా భర్తీ చేయలేదని తెలిపారు. బీజేపీ కులగణనకు వ్యతిరేకమని, కాంగ్రెస్ కులగణన చేసి రిజర్వేషన్లు పెంచాలని ప్రయత్నిస్తోందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్లు పెంచాలంటే కులాల లెక్కలు ఉండాలని, అందుకే కుట్ర పూరితంగానే ప్రధాని పదేళ్ల కాలంలో కులగణన చేయలేదని ఆరోపించారు.

బీసీలకు బీజేపీ చేసిందేంటో చెప్పాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్



సాక్షి, హైదరాబాద్: పదేళ్లపాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీలకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చిందో స్పష్టం చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీవర్గానికి చెందిన వ్యక్తి ప్రధానిగా ఉంటే సరిపోదని, బీసీల సంక్షేమం, అభివృద్ధికి కనీసం ఒక్క కార్యక్రమం కూడా చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బీసీవర్గాల్లో బీజేపీ ప్రభుత్వంపై పలు అనుమానాలున్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందని చెప్పారు. కులాలవారీగా జనాభా లెక్కలు ప్రకటించాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా, బీజేపీ ఒప్పుకోకపోవడంలో అంతర్యం ఏమిటన్నారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని, చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు పెట్టలేదని, బీసీ బిల్లు పార్లమెంట్‌లో పెడితే బీజేపీ వ్యతిరేకించిందని మండిపడ్డారు.

ఓయూలో తాగునీరు, కరెంట్‌పై చర్చకు సిద్ధం


మాజీ సీఎం కేసీఆర్ వస్తే నేను చూపిస్తా లేదంటే కేసీఆర్ రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలి: ఎమ్మెల్సీ బల్మూరి



సాక్షి, హైదరాబాద్: ప్రతి విద్యార్థి సమస్య కాంగ్రెస్ ప్రభుత్వం తన సమస్యగా చూస్తుందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేయదని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో తాగునీరు, కరెంట్ సమస్య లేదని, దీనిపై చర్చకు సిద్ధమని, మాజీ సీఎం కేసీఆర్ వస్తే చూపిస్తానని సవాల్ విసిరారు. సమస్య ఉంటే ముక్కు నేలకు రాస్తానని, లేదంటే మీరు సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఏనాడు ఉస్మానియా వర్సిటీకి వెళ్లలేదని, విద్యార్థుల సమస్యలపై ఏరోజూ మాట్లాడలేదని ఆరోపించారు. వర్సిటీలో లేని సమస్యను ఉన్నట్టుగా చిత్రీకరించిన చీఫ్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. ప్రతీ ఏడాది ఇచ్చినట్లుగానే వేసవి సెలవుల్లో భాగంగా 15 రోజుల కోసం చీఫ్ వార్డెన్ సర్క్యులర్ జారీ చేశారని అన్నారు.

రేవంత్‌ను జైల్లో పెట్టేందుకు బీజేపీ యత్నం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న ఢిల్లీ, జార్ఖండ్ సీఎంలను ఇప్పటికే జైలులో పెట్టారని, కొత్తగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని జైలులో పెట్టేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. రేవంత్‌ను అరెస్ట్ చేస్తే ఇక పీఎం మోదీ పతనం మొదలవుతుందన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డికి నోటీసులు ఇవ్వడానికి బదులుగా రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎన్నికల కమిషన్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా కర్ణాటక, మహారాష్ట్రలకు వెళ్తున్న రేవంత్ సంగతేందో తేల్చాలని అమిత్ షా అధికారులకు ఆదేశించారని నారాయణ ఆరోపించారు. ముస్లిం రిజర్వేషన్లను తీసేస్తామని అమిత్ షా ప్రకటించడం దారుణమని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో ఒక్క సీటూ రాదన్నారు.



కొత్తగూడెం రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో నామా నాగేశ్వరరావు, మాలోతు కవిత, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఆర్ ట్యాక్స్ నిజమైతే ఐటీ, ఈడీలను పంపించు

కొత్తగూడెం రోడ్‌షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

- ఉత్త ఆరోపణలు చేయడం ఎందుకని ఆగ్రహం... చోటేభాయ్, బడేభాయ్ ఇద్దరూ ఒక్కటే
- బీఆర్ఎస్ గెలిస్తేనే నీళ్లు, నిధులు
- గోదావరి నీటిని తరలించుకుపోయేందుకు కుట్రలు
- కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే గోదావరిలో వేసినట్టే
- కొత్త జిల్లాల రద్దుకు ప్రయత్నిస్తున్నారు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నేడు తెలంగాణలో ఆర్ ట్యాక్స్ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి వసూళ్లు మొదలెట్టాడని ప్రధాని మోదీ అన్నారని.. అవినీతి జరిగిందని తెలిస్తే ఐటీ, ఈడీలను రంగంలోకి దించాలి కానీ ఉత్త ఆరోపణలు చేయడం ఎందుకని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి కొత్తగూడెంలో జరిగిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. చోటేభాయ్, బడేభాయ్ ఇద్దరూ ఒక్కటేనని, బయటకు మాత్రం వేర్వేరు అన్నట్టుగా నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. వీరికి ఓటేస్తే గోదావరి నీళ్లు మనకు దక్కవని, మోటర్లకు మీటర్లు వస్తాయని హెచ్చరించారు. ఈ రెండు పార్టీలకు ఓటేస్తే గోదావరిలో పడేసినట్టేనని వ్యాఖ్యానించారు. తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న గోదావరి నీటిని తమిళనాడుకు తరలించుకుపోయేందుకు ప్రధాని నరేంద్రమోదీ కుట్రలు చేస్తున్నారని కేసీఆర్ ఆరోపించారు. ఇచ్చంపల్లి దగ్గర బ్యారేజీ కట్టి ఈ నీటిని ఎత్తుకుపోయేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. మన బతుకుదెరువు, మన జీవన్మరణ సమస్య అయిన గోదావరి నీటిని తీసుకుపోతాం అంటుంటే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.

కొత్తగూడెం జిల్లా ఉండాలా? వద్దా?

ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా.. పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలను రద్దు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని కేసీఆర్ అన్నారు. అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఆ తర్వాత రాష్ట్రాన్ని అంధకారం చేస్తోందని విమర్శించారు. కొత్తగూడెం జిల్లాను రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ఈ జిల్లా ఉండాలా? వద్దా? అంటూ కేసీఆర్ ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు రూ.10వేలు అందిస్తే కాంగ్రెస్ పార్టీ రూ.15,000 ఇస్తామని చెప్పిందని, కల్యాణలక్ష్మి ద్వారా తాము ఆర్థికసాయం అందిస్తే, దానికి అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారని, ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. తమ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తే కాంగ్రెస్ ఎన్నికల హామీలో రూ. రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించారని, మరి ఈ రోజు ఎంతమందికి రైతుబంధు అందింది, ఎంతమందికి తులం బంగారం ఇచ్చారు, రుణమాఫీ ఎంత అమలు చేశారు.. అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులకు ఇబ్బంది రావొద్దనే ఉద్దేశంతోనే ఖర్చుకు వెనుకాడకుండా అన్ని ప్రాంతాల్లో త్రీఫేస్ కరెంట్ ఇచ్చామని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో విద్యుత్ సమస్యల కారణంగా మోటార్లు కాలిపోతున్నాయన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఎక్కడ కాటకలిసిందని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గురుకులాలు పెట్టి అద్భుతమైన ఫలితాలు సాధించామన్నారు. కానీ కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో కలుషిత ఆహారం తిని భువనగిరిలో ఓ విద్యార్థి చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సింగరేణిపై కుట్రలు చేస్తారు

కేంద్రంలో అధికారంలో ఉన్న బడేభాయ్ ఆదేశాల మేరకు ఇక్కడి చోటే భాయ్ సింగరేణి మీద కుట్రలు చేసే ప్రమాదం ఉందని కేసీఆర్ హెచ్చరించారు. గతంలో ఆస్ట్రేలియా నుంచి అదాని దిగుమతి చేసుకున్న బొగ్గు కొనాలంటూ ప్రధాని మోదీ ఎంత ఒత్తిడి చేసినా 'మాకు సింగరేణి బొగ్గు ఉంది. అదాని బొగ్గు అవసరం లేదు. ఒక్క టన్ను కూడా కొనను'అంటూ తెగేసి చెప్పానని కేసీఆర్ తెలిపారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని ఆదేశిస్తే.. నా తలకాయ తెగిపడ్డా మోటార్లకు మీటర్లు పెట్టనంటూ రైతుల ప్రయోజనాలు కాపాడిన చరిత్ర తనకు ఉందన్నారు.

మత విద్వేషాలు రేపుతున్నారు..

తెలంగాణలో మత సామరస్యానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని కేసీఆర్ చెప్పారు. తమ హయాంలో ఏ ఒక్కరోజూ మత కలహాలు జరగలేదని గుర్తు చేశారు. కానీ ఈ రోజు హిందూ, ముస్లిం అంటూ విద్వేషాలు రేపుతున్నారని ఆయన మండిపడ్డారు. దేశంలో నరేంద్రమోదీ అంత దరిద్రమైన పాలన చేసిన మరో నేత లేదని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మతాల మధ్య పంచాయితీలు పెట్టి ఓట్లు దండుకోవడం తప్ప మరేం లేదన్నారు.

బీఆర్ఎస్ గెలిస్తేనే నిధులు..

గోదావరి నీళ్లు తెలంగాణకు దక్కాలన్నా, కేంద్రం నుంచి తెలంగాణకు నిధులు రావాలన్నా, రైతుల మోటార్లకు మీటర్లు పెట్టొద్దన్నా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీనే గెలిపించాలని కేసీఆర్ కోరారు. ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత గెలిస్తేనే ఈ ప్రాంత ప్రయోజనాలు కాపాడుకుంటామని చెప్పారు. ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించానన్నారు. 'జబ్‌తక్ తెలంగాణా మే కేసీఆర్ హై, తబ్‌తక్ సెక్యులర్ రియాసత్ రహేగా'అంటూ మైనారిటీలకు హామీ ఇచ్చారు.



అల్లాదుర్గంలో జరిగిన బీజేపీ బహిరంగ సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కిషన్‌రెడ్డి, రఘునందన్‌రావు, బీబీ పాటిల్ తదితరులు

డబుల్ ఆర్ ట్యాక్స్ ఢిల్లీకి..

▶ మొదటి పేజీ తరువాయి

బీజేపీని గెలిపించాలని కోరారు. మంగళవారం జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని చిల్వర్ గ్రామం (అల్లాదుర్గం)లో బీజేపీ నిర్వహించిన బహిరంగసభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ... 'నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు' అంటూ తెలుగులో ఉపన్యాసం ప్రారంభించారు. బసవేశ్వర్, సంగమేశ్వర్, సేవాలాల్ మహరాజ్‌లకు నమస్కారాలు తెలియజేశారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే గూటి పక్షులు..

'బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు అతిపెద్ద స్కాం కాగా... విపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ దీనిపై విచారణ జరుపుతామని చెప్పింది. కానీ అధికారంలోకి వచ్చాక ఈ కేసుకు సంబంధించిన ఫైళ్లను తొక్కి పెట్టింది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఓటుకు కోట్లు కేసులో విచారణను ముందుకు సాగకుండా చర్యలు తీసుకుంది. ఈ రెండు పార్టీలు ఒకరినొకరిని కాపాడుకోవాలని చూస్తున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్క గూటి పక్షులే.. అవి కరప్షన్ రాకెట్ కమిటీకి చెందిన సభ్యులు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ద్వారా ఇది అర్థమవుతోంది. బీఆర్ఎస్.. ఆప్‌తో కలిసి లిక్కర్ స్కామ్ చేసింది. ఢిల్లీలో లిక్కర్ స్కామ్ చేసిన పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది' అని మోదీ ధ్వజమెత్తారు. 'కాంగ్రెస్.. రైతులకు వెన్నుపోటు పొడవడానికి కూడా వెనుకాడటం లేదు. వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు చేయలేదు. క్వింటాల్ వరికి రూ.500 బోనస్ ఇస్తామన్నారు. ఇప్పుడు ఇవ్వకుండా, కనీసం దానిపై మాట్లాడకుండా నోటికి తాళం వేసుకున్నారు' అని మోదీ తెలిపారు.

కాంగ్రెస్ జన్మతః రాజ్యాంగ వ్యతిరేకి..

'నేను జీవించి ఉన్నంత కాలం రాజ్యాంగానికి ఏమీ జరగకుండా కాపాడుకుంటాను. రాజ్యాంగాన్ని కదిలించే వ్యక్తి, శక్తి ఎవరూ ఉండరు. కాంగ్రెస్‌కు, వాళ్ల తొత్తులు, చెంచాలకు సవాల్ చేస్తున్నా. దీన్ని కాపాడే బాధ్యత నేను తీసుకుంటున్నాను. దళితులు, బంజారా, ఆదివాసీలు, ఓబీసీల రిజర్వేషన్లను మతప్రాతిపదికన ముస్లింలకు ఇచ్చే ప్రయత్నాన్ని ఎట్టిపరిస్థితుల్లో జరగనివ్వను. కాంగ్రెస్ పార్టీ జన్మతః రాజ్యాంగ వ్యతిరేకి. మతపర రిజర్వేషన్లు వద్దని రాజ్యాంగంలో ఉంటే.. రాహుల్ గాంధీ ఓటుబ్యాంకు రాజకీయాల కోసం ఆ రిజర్వేషన్లను ప్రోత్సహిస్తున్నారు. మోదీకి రాజ్యాంగమంటే పవిత్రగ్రంథం, రాజ్యాంగం రచించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గుజరాత్ సీఎంగా ఏనుగుపై రాజ్యాంగాన్ని ఊరేగించాను. నేను కింద నడిచాను. 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టడానికి ముందే ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ప్రతీక అయిన పార్లమెంట్ భవనం ఎదుట సాష్టాంగ ప్రణామం చేశాను. రాజవంశీయులు (నెహ్రూ, ఇందిరాగాంధీ కుటుంబం) అధికార దాహంతో రాజ్యాంగాన్ని అవమానించారు. వాళ్లు ఈవీఎంలు, ఎన్నికల కమిషన్‌ను కూడా నమ్మడం లేదు' అని మోదీ ధ్వజమెత్తారు.

ఫేక్ వీడియో సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారు...

'ఈ ఎన్నికల్లో ఓడిపోతామని భావించి కాంగ్రెస్ నాయకులు రిజర్వేషన్లపై ఫేక్ వీడియో సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో వివిధ సామాజికవర్గాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీని వెనుక డబుల్ ఆర్ ఉన్నట్లు తెలుస్తోంది. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఒక ముఖ్యమంత్రి ఇలా చేయొచ్చా? ఇండియా కూటమి నిరాశా నిస్పృహల్లో మునిగిపోయింది. దేశవ్యాప్తంగా ఈ కూటమికి ఈసారి ప్రతిపక్ష హోదా కూడా దక్కే పరిస్థితి లేదు. కాంగ్రెస్‌కు ఓటేస్తే అది పూర్తిగా నిష్ఫలమే. బీజేపీ ఒక్కటే వికల్పం, సంకల్పం. మీరు రఘునందన్ రావు, బీబీ పాటిల్‌కు ఓటు వేస్తే నేరుగా మోదీకి వేసినట్లే. తెలంగాణ అభివృద్ధికి మా ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చుచేసింది. 4 వందేభారత్ రైళ్లు, 40 రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, మెదక్-ఎల్లారెడ్డి-బోధన్ జాతీయ రహదారిపై నిర్ణయం, సంగారెడ్డి-అకోల-నాందేడ్ నేషనల్ హైవే పూర్తి, అందోల్-నారాయణఖేడ్-జుక్కల్ రోడ్డులో కనెక్టివిటీ పెంపు...ఇలా ఎన్నో చర్యలు చేపట్టాం' అని మోదీ చెప్పారు.

కాంగ్రెస్‌ను ఒక్క సీట్లో గెలుపైనా అవసరమా?

'కేంద్రం ఎన్నో ప్రయాసలకు ఓర్చి తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తుంటే... ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం సంకుచిత రాజకీయాలు చేస్తోంది. సమ్మక్క, సారక్క గిరిజన వర్సిటీ స్థాపనకు కేంద్రం చర్యలు తీసుకుంటే నేటికీ దానికి అవసరమైన భూమి ఇవ్వలేదు. మనోహరాబాద్-సిద్దిపేట-కొటపల్లి రైల్వేలైన్‌కు భూమి కేటాయించలేదు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్‌ను ఒక్క ఎంపీ సీట్లో అయినా ప్రజలు గెలిపించాల్సిన అవసరముందా? కనీసం హైదరాబాద్‌లో పండుగ నిర్వహించుకోవాలంటే కూడా చివరకు శ్రీరామ నవమికి కూడా ఆంక్షలు పెట్టింది. ఒక వర్గం ఓట్ల కోసం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2009 వరకు కాంగ్రెస్‌కు రికార్డు స్థాయిలో ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపించారు.. కానీ కాంగ్రెస్ ఏం చేసింది. గెలిచాక ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కులను కాలరాసింది. ఏపీని ఒక ప్రయోగశాలగా మార్చి ఓబీసీల రిజర్వేషన్లను ముస్లింలకు కట్టబెట్టింది. రాజ్యాంగం, రిజర్వేషన్లపై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోంది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు నేను కట్టుబడి ఉన్నాను. మీ కోసం నేను పోరాడతాను' అని చెప్పారు.

నెహ్రూ కాలం నుంచి మోసం

'కాంగ్రెస్ మొదటి నుంచి రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను గౌరవించలేదు. దేశ మొదటి ప్రధాని నెహ్రూ రాజ్యాంగాన్ని అవహేళన చేసి పెద్ద తప్పు చేశారు. ఆయన తర్వాత ఇందిరాగాంధీ తన రాజకీయ అవసరాల కోసం రాజ్యాంగానికి తూట్లు పొడిచారు. ఎమర్జెన్సీ విధించారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు మీడియా, పత్రిక స్వేచ్ఛను హరించారు. మన్మోహన్ సింగ్ కేబినెట్ చట్టరూపకంగా బిల్లును తెస్తే.. దాన్ని రాహుల్ చింపివేశారు. రాజ్యాంగానికి వారిచ్చే గౌరవమిది. రాజ్యాంగాన్నే కాదు కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని కూడా అవమానించి అప్పటి అధ్యక్షుడు సీతారాం కేసరిని బాత్‌రూంలో బంధించి సోనియాగాంధీని అధ్యక్షురాలిని చేశారు. వీరికి అధికారమే సర్వస్వం' అని మోదీ మండిపడ్డారు.

బీజేపీ బలపడుతుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ముచ్చెమటలు

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ బలపడుతుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ముచ్చెమటలు పోసి, ఆ పార్టీల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి అత్యధిక స్థానాల్లో బీజేపీ గెలవబోతుండడంతో..కేంద్రంలో మోదీ అధికారంలోకి వస్తే హైదరాబాద్‌ను యూటీ చేస్తారని ఒకడంటే.. ఇంకొకడు ఢిల్లీలో హంగు వస్తుందని..మరొకడు రిజర్వేషన్లు తీసేస్తారని రకరకాలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో చిల్వర్ గ్రామంలో జరిగిన బహిరంగసభలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ చరిత్రలో బీజేపీ 17 ఎంపీ స్థానాలు గెలవడానికి ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో ఏ వాడ, గల్లి, ఏప్రాంతానికి వెళ్లిన ఈ ఎన్నికల్లో మాత్రం బీజేపీకే ఓటేస్తామని ప్రజలు చెబుతున్నారన్నారు. తమకు రాజకీయాలతో సంబంధం లేదని, దేశం ముఖ్యం..మా పిల్లల భవిష్యత్ ముఖ్యమని వారంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కారణంగా తెలంగాణలో బీసీలకు అన్యాయం జరుగుతుందని, ముస్లిం రిజర్వేషన్ కారణంగా బీసీలకు నష్టం జరిగిందనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గ్రహించాలన్నారు. జీహెచ్‌ఎంసీలో 150 స్థానాలు ఉంటే 33% 50 స్థానాలు బీసీలకు రిజర్వ్ చేస్తే వాటిలో 31కి పైగా స్థానాల్లో నాన్ బీసీ ముస్లింలు గెలిచారన్నారు. ఈ పరిస్థితిని గమనిస్తే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తోడుదొంగలని అర్థమవుతోందని ధ్వజమెత్తారు. బీజేపీని ఎదుర్కొనేందుకు వీరు ఎప్పుడైనా ఒకవుతారన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ కాంగ్రెస్ మధ్య జరుగుతున్నది కేవలం డూప్ ఫైట్ మాత్రమేనని చెప్పారు.

మోదీవి దిగజారుడు వ్యాఖ్యలు: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రధాని స్థాయిని దిగజార్చేలా.. హిందువులను రెచ్చగొట్టేలా మోదీ దిగజారి మాట్లాడుతున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. ఆయన గాంధీభవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. మోదీ అబద్ధాల ప్రసంగానికి శిక్షణ ఎవరిచ్చారో తెలుసుకోవాలని ఉందని ఎద్దేవా చేశారు. మతాల మధ్య చిచ్చు పెట్టేలా మాట్లాడుతున్న ప్రధానికి ఎన్నికల కమిషన్ ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈసీ డమ్మీగా మారిందని, ఈసీని బీజేపీ ఇంటిసంస్థగా మార్చుకుందని ఆరోపించారు. అన్ని కులాలు బీజేపీకి దూరమౌతున్నా యని అమిత్ షా ఢిల్లీ పోలీసులను గాంధీ భవన్‌కు పంపారన్నారు. హరీశ్ మీడియాలో కనిపించాలని.. రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేయాలంటున్నారని పేర్కొన్నారు.

గుజరాత్ పెత్తనమా.. తెలంగాణ పౌరుషమా?

▶ మొదటి పేజీ తరువాయి

గూడుపుఠాణి చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు బీఆర్ఎస్ పార్టీ అనామకులకు ఎంపీ టికెట్ ఇచ్చిందని అన్నారు. డిసెంబర్‌లో జరిగిన సెమీఫైనల్ ఎన్నికల్లో కేసీఆర్‌ను బొంద పెట్టామని, ఇప్పుడు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ పౌరుషం గుజరాత్‌కు తెలిసేలా మోదీని ఓడించాలని ప్రజలను కోరారు. ఫైనల్స్‌లో మోదీ, అమిత్‌షాలను ఓడించి, రాహుల్‌గాంధీని ప్రధానిని చేసినప్పుడే మనం గెలిచినట్లు అని పేర్కొన్నారు. 'గుజరాత్ పెత్తనమా.. తెలంగాణ పౌరుషమా? తేల్చుకుందాం..' అని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో, జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో నిర్వహించిన జనజాతర సభల్లో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ శివారు బాలాపూర్, బడంగ్‌పేట్, సరూర్‌నగర్‌లో, మహేశ్వరం నియోజకవర్గంలోని ఎన్‌టీఆర్ నగర్‌లో రోడ్ షో అనంతరం కార్నర్ మీటింగుల్లో ప్రసంగించారు.

తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారు

'కులగణన చేపట్టి దామాషా ప్రకారం బలహీన వర్గాలకు రిజర్వేషన్లు తీసుకురావాలని మేము ప్రయత్నిస్తుంటే, బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తోందో మోదీ సమాధానం చెప్పాలి. బీజేపి కుట్రలను ప్రజలు గమనిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు వారిని గద్దె దించుతారు. ప్రధానిగా మోదీ పదేళ్లలో తెలంగాణకు ఇచ్చింది ఏమీ లేదు. బండి సంజయ్ కరీంనగర్‌కు తెచ్చిందేమీ లేదు.. గాడిద గుడ్డు తప్ప. గుండు అర్వింద్, అరగుండు సంజయ్‌లు రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలి. పదేళ్లలో మోదీ కర్ణాటకకు చెంబు, ఏపీకి పాచిపోయిన లడ్డూలు, మట్టి, నీళ్లు, తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారు..' అని రేవంత్ ఎద్దేవా చేశారు.

మోదీ, షాలకు కర్రుకాల్చి వాత పెట్టాలి

'మోదీ అన్ని రకాలుగా మోసం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ హయాంలో మంజూరు చేసిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వేకోచ్‌లను రద్దు చేశారు. ఏటా ఐదు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి ఒక్కరికీ ఇవ్వలేదు. రైతుల ఆదాయం పెంచుతామని చెప్పి రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చారు. అధికారంలోకి వచ్చాక కేసీఆర్ మోసం చేసినందుకు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారు. అదే విధంగా నరేంద్ర మోదీకి, అమిత్‌షాకు కర్రు కాల్చి వాత పెట్టాలి..' అని సీఎం అన్నారు.

సైనికుల్ని పంపించినా భయపడేది లేదు

'తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రంలో డ్రగ్స్ నిషేధిస్తుంటే వాటి మూలాలు గుజరాత్‌లో వెలుగు చూస్తున్నాయి. కేసీఆర్ ఉపన్యాసాన్ని మోదీ నకలు కొట్టారు. నన్ను తిడితే ఏం వస్తుంది? సలహాలు ఇవ్వాల్సింది పోయి అడ్డగోలుగా తిట్టిపోయిండు. కేసీఆర్, కిషన్‌రెడ్డి కూడా ఇదే పని చేస్తున్నారు. తిట్టడానికి ఇంత దూరం రావలసిన అవసరం లేదు. హైదరాబాద్ మెట్రో రైలుకు నిధులు కేటాయించలేదు. బుల్లెట్ రైలు ఇవ్వలేదు. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్‌రోడ్డు రాకుండా ప్రధాని అడ్డుకున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన నన్ను కేసీఆర్ తరహాలోనే అరెస్టు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. కేసీఆర్ బెదిరిస్తేనే భయపడలేదు. తాజాగా మోదీ ఢిల్లీ పోలీసులను పంపాడు. వాళ్లకు భయపడతామా? సైనికుల్ని పంపించినా భయపడేది లేదు. రేవంత్‌రెడ్డికి జైలు కొత్త కాదు..' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

రాజకీయం కోసం రాముడి అక్షింతలు పంచారు

'అయోధ్యలో రాముడి కల్యాణానికి 15 రోజుల ముందే రాజకీయం కోసం శ్రీరాముడి అక్షింతలు ఇంటింటా పంచి బీజేపీ అవమానించింది. రాజకీయాల కోసం రాముడిని వాడుకుంటున్న విషయాన్ని హిందువులందరూ ఆలోచించాలి. మన మందరం హిందువులం కాదా? రామభక్తులం కాదా? అయినా ఓట్ల కోసం హిందుత్వాన్ని ఎప్పుడూ వాడుకోలేదు..' అని రేవంత్ అన్నారు.

ఇండియా కూటమిలోకి కేసీఆర్‌ను తీసుకోం

'బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందంలో భాగంగా కాంగ్రెస్‌ను ఓడించేందుకు, బీజేపీని గెలిపించేందుకు పలు స్థానాల్లో డమ్మీ అభ్యర్థులను కేసీఆర్ పోటీలో నిలిపారు. బీఆర్ఎస్‌ను ఇండియా కూటమిలోకి తీసుకోం. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ నన్ను వేధించి కేసులు పెట్టి జైలుకు పంపాడు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అక్రమ కేసులు పెట్టింది. కేసీఆర్ మళ్లీ పగటి కలలు కంటున్నాడు. వంద రోజుల్లోనే కాంగ్రెస్‌ను దిగిపోవాలంటున్నాడు. నేను ప్రజల మద్దతుతో సీఎం అయ్యా. ఏడాది కాదు..కేసీఆర్? నీ జీవితం మొత్తం ఎదురు చూసినా మళ్లీ నీకు సీఎం పదవి రాదు. తిక్కలోడు తిరనాళ్లకు పోయినట్లు కేసీఆర్ బస్సుయాత్ర ఉంది..' అని సీఎం విమర్శించారు.

కొండా రాజ్యసభ సీటు కొనుక్కోవచ్చు

'మాజీ మంత్రి సబితమ్మ పొద్దున కారు గుర్తు అంటుంది. రాత్రిపూట కమలం గుర్తుకు ప్రచారం చేస్తుంది. సొంత పార్టీని బీజేపీకి తాకట్టు పెట్టింది. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రాజకీయాన్ని కూడా ఓ వ్యాపారంగా చూస్తున్నాడు. పదేళ్లు తెలంగాణను మోసం చేసిన మోదీ పక్కన చేరి మళ్లీ ఇక్కడి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడు. వందల కోట్లు ఉన్న కొండాకు నిజంగానే ప్రజా సేవ చేసే ఆలోచన ఉంటే.. రూ.కోట్లు పెట్టి ఏ రాజ్యసభ సీటో కొనుక్కోవొచ్చు..' అని రేవంత్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి సీతక్క, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, కరీంనగర్, వరంగల్, చేవెళ్ల పార్టీ అభ్యర్థులు వెలిచాల రాజేందర్ రావు, కడియం కావ్య, గడ్డం రంజిత్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో జరిగిన కాంగ్రెస్ జనజాతర సభకు హాజరైన జనం

వడదెబ్బతో వృద్ధురాలు మృతి

జమ్మికుంట (హుజూరాబాద్): జమ్మికుంటలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో అపశ్రుతి చోటు చేసుకుంది. వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాల ఐలమ్మ (68) వడదెబ్బకు గురై సభలోనే కుప్పకూలింది. వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఐలమ్మ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి సహాయం అందేలా చూస్తానని పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హామీ ఇచ్చారు.

కమ్యూనలిస్టులను తరుముదాం

సీఎం రేవంత్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: కమ్యూనిస్టుల సహకారంతో మతోన్మాదులను తరిమికొడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. మంగళవారం రాత్రి హుజూరాబాద్‌లో జనజాతర సభ అనంతరం ఆయన సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావులతో ఉన్న ఫొటోలను 'లోక్‌సభ ఎలక్షన్స్-2024'హ్యాష్ ట్యాగ్‌తో పోస్టు చేశారు. 'తెలంగాణ అంటే బహుజనవాదం, తెలంగాణ అంటే సకల జనహితం. ఈ వాదాన్ని ఓడిపోనివ్వం - ఈ జన హితాన్ని కరిగిపోనివ్వం. కమ్యూనిస్టుల అండతో కమ్యూనలిస్టులను తరుముదాం'.. అని ట్వీట్ చేశారు.

కేసీఆర్ మరో గోబెల్

- ప్రజల్లోకి తప్పుడు సమాచారం
- 'ఎక్స్'లో సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్‌ను చూస్తే గోబెల్ మళ్లీ పుట్టాడనిపిస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీలో నీటి కొరతతో హాస్టళ్లు, మెస్‌లను మూసివేస్తున్నారని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన 'ఎక్స్'వేదికగా ఘాటుగా స్పందించారు. 'మొన్న సూర్యాపేటలో, నిన్న మహబూబ్‌నగర్‌లో, ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించి తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు'.. అని పేర్కొన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్న 2023 మే లో కూడా వర్సిటీ చీఫ్ వార్డెన్ వేసవి సెలవులకు సంబంధించి, నెల రోజుల పాటు మే 12 నుంచి జూన్ 6 వరకు హాస్టళ్లు, మెస్‌ల మూసివేతపై ఇలాంటి నోటీసునే జారీ చేశారంటూ ఆ నోటీసును 'ఎక్స్'లో పోస్టు చేశారు. నాటి నోటీసులో కూడా విద్యుత్, నీటి కొరతల గురించి ప్రస్తావించారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతే యూనివర్సిటీ మూసేస్తున్నట్టు దిక్కుమాలిన, దివాళాకోరు ప్రచారం చేయడం కేసీఆర్ దిగజారుడుతనానికి పరాకాష్ట అని రేవంత్ ధ్వజమెత్తారు.

క్లుప్తంగా...

పది ఫలితాల్లో భాష్యం జయభేరి

సాక్షి, హైదరాబాద్: ఎస్సెస్సీ–2024 ఫలితాల్లో భాష్యం విద్యార్థినీ, విద్యార్థులు జయభేరి మోగించారు. 264 మంది భాష్యం విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి సత్తాచాటారని హైదరాబాద్ భాష్యం జోనల్ హెడ్ అంకమ్మరావు ఒక ప్రకటనలో తెలిపారు. జీపీఏ 9.8కి పైగా 502 మంది, జీపీఏ 9.7కి పైగా 717, 9.5కి పైగా 1,492 మంది విద్యార్థులతో పాటు మొత్తం 11,201 మంది విద్యార్థులు 'ఏ'గ్రేడ్ కైవసం చేసుకున్నారని వెల్లడించారు. విద్యార్థుల శ్రమ, ఉపాధ్యాయుల కృషి వల్లే ఇంతటి అద్భుత ఫలితాలు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందిని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావు అభినందించారు.

కేశవరెడ్డి విద్యార్థుల హవా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పది ఫలితాల్లో కేశవరెడ్డి విద్యార్థుల హవా కొనసాగింది. తమ విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ కేశవరెడ్డి తెలిపారు. 9.8, 9.7, 9.5 లాంటి ఉత్తమ జీపీఏ సాధించారని చెప్పారు. ప్రతి ఐదుగురిలో ఇద్దరు 9కి పైగా జీపీఏ సాధించారన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అందుకు విశేష కృషి చేసిన ఉపాధ్యాయులను సహకరించిన తల్లిదండ్రులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

ఎస్ఆర్ స్కూల్స్ ప్రతిభ

విద్యారణ్యపురి: టెన్త్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు మెరుగైన ప్రతిభ చాటారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. టెన్త్ పరీక్షల ఫలితాల్లో 124 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారని వెల్లడించారు. క్రమశిక్షణతో కూడిన విద్య, పటిష్టమైన పాఠ్యప్రణాళికతో అంకితభావం కలిగిన ఉపాధ్యాయ బృందం విద్యాబోధన చేస్తుందని తెలిపారు. పోటీ పరీక్షలను ఎదుర్కొనే విధంగా ఎస్సెస్సీ విద్యార్థులకు ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌లో ఎక్కువ శ్రద్ధ తీసుకుంటామన్నారు. విద్యార్థులను అన్ని పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఒక బృహత్తరమైన పద్ధతిలో ప్రైమ్ స్కూల్స్ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించామని చెప్పారు.

త్రివేణి విజయదుందుభి

సాక్షి, హైదరాబాద్: ఎస్సెస్సీ ఫలితాల్లో త్రివేణి విద్యార్థులు విజయదుందుభి మోగించారు. త్రివేణి అన్ని బ్రాంచీల్లో తమ విద్యార్థులు ఎస్సెస్సీ ఫలితాల్లో 10/10 జీపీఏ 71 మంది సాధించారని త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. 149 మంది 9.8కి పైగా జీపీఏ, 227 మంది 9.7కి పైగా, 538 మంది 9 కిపైగా జీపీఏ సాధించారన్నారు. అత్యధిక బ్రాంచీల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి తమ విద్యార్థులు సత్తాచాటారని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, బోధన, బోధనేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

నారాయణ ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రతి ఏడుగురిలో ఒకరికి 10/10 జీపీఏతో 12.5% మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించింది. 1,707 మంది విద్యార్థులు 9.5 జీపీఏ ఆపైన మార్కులు సాధించినట్లు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పి.సింధూనారాయణ, శరణి నారాయణ తెలిపారు. 9.0% జీపీఏ ఆపైన మార్కులు సాధించినవారు 65 శాతం మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టుల్లో 32,135 మంది విద్యార్థులు ఎ గ్రేడ్ సాధించారని తెలిపారు. నారాయణ సిఓ- స్పార్క్, ఒలింపియాడ్, ఈ-టెక్నో, మెడిస్పార్క్ వంటి ప్రోగ్రామ్స్‌తో బోధన చేయడం వల్లే విద్యార్థులు ఈ విజయాలు సాధించారని చెప్పారు

శ్రీ చైతన్య హవా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యా సంస్థలు హవా చాటినట్లు ఆ విద్యాసంస్థల డైరెక్టర్ సీమ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ విద్యా సంస్థనుంచి 10/10 జీపీఏను 1402 మంది విద్యార్థులు సాధించారని ఆమె వెల్లడించారు. 2803 మంది విద్యార్థులు 9.8 జీపీఏ ఆపైన మార్కులు సాధించడంతోపాటు 5,207 మంది విద్యార్థులు 9.5 జీపీఏ ఆపైన సాధించారని పేర్కొన్నారు. అదేవిధంగా 8216 మంది విద్యార్థులు 9.0 జీపీఏ ఆపైన మార్కులు సాధించారని తెలిపారు. రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సి-ఐపీఎల్, ఎంపిఎల్, ఐకాన్, సి-బ్యాచ్, సివిల్స్, మెడికాన్ వంటి ప్రోగ్రామ్స్ ద్వారా టీచింగ్ చేయడంతోనే తమ సంస్థకు ఇంతటి విజయం దక్కిందని సీమ చెప్పారు.

దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్‌స్కూల్ విజయకేతనం

సాక్షి,హైదరాబాద్: తెలంగాణ టెన్త్ ఫలితాల్లో తమ ప్రభంజనం సృష్టించినట్లు 'దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్' మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. పరీక్షకు హాజరైన 931 మంది విద్యార్థుల్లో 78 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించినట్లు పేర్కొంది. 114 మంది విద్యార్థులు 9.8 జీపీఏను 642 మంది విద్యార్థులు 9.0 ఆపై మార్కులు సాధించినట్లు వెల్లడించింది. 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులందరికీ రుద్ర మెమోరియల్ అవార్డు కింద ఒక్కొక్కరికీ రూ.20వేల నగదు బహుమతిని అందజేస్తున్నట్లు సంస్థ తెలిపింది.

'పోలీస్ బోర్డు' ద్వారా ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ల ఎంపిక

- మూడు వేల ఖాళీల భర్తీకి ఇటీవల ఆర్టీసీ ప్రతిపాదన
- ఆర్థికశాఖ వద్ద ఫైల్.. త్వరలో ముఖ్యమంత్రి పరిశీలనకు
- ఆయన ఆమోదముద్ర వేయగానే ప్రక్రియ ప్రారంభం
- దశాబ్దాలుగా ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నియామకాలు



సాక్షి, హైదరాబాద్: 'పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు' ద్వారా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను ఎంపిక చేయనున్నారు. ఆర్టీసీలో మూడు వేల ఖాళీల భర్తీకి ఇటీవల ఆ సంస్థ ప్రతిపాదించింది. ఆర్థికశాఖ వద్ద ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఆ ప్రతిపాదన ఎన్నికల కోడ్ ముగిశాక సీఎం పరిశీలనకు వెళుతుంది. దానికి ఆయన ఆమోదముద్ర వేయగానే ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆర్టీసీ ఉద్యోగుల ఎంపిక బాధ్యత అప్పగించటంపై ఆయన ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయకపోతే ఈ నియామకాలు చకచకా జరుగుతాయి.

టీఎస్‌పీఎస్సీ అనాసక్తితో..

దశాబ్దాలుగా అంతర్గత ఉద్యోగాల నియామకాలను సొంతంగా ఆర్టీసీనే చూస్తూ వచ్చింది. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఓ దశలో దీనిని ప్రశ్నించింది. ప్రభుత్వ సంస్థల్లో అన్ని రకాల నియామకాలను టీఎస్‌పీఎస్సీ పర్యవేక్షిస్తుండగా, ఆర్టీసీలో ఆ సంస్థ చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలో అప్పటి వరకు నియామకాలు లేకపోవటం, తొలిసారి ఖాళీల భర్తీకి శ్రీకారం చుట్టాలని నిర్ణయించిన తరుణంలో ఈ ప్రశ్న ఉత్పన్నమైంది. దీంతో ఆర్టీసీ ఉద్యోగాల ఎంపిక కూడా టీఎస్‌పీఎస్సీనే చూడాలని ఆదేశించింది. తొలుత ఆర్టీసీ ఫైనాన్స్, పర్సనల్ విభాగాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల నియామక ప్రక్రియ చేపట్టింది. కానీ అప్పట్లో వాటి నియామకాలు జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. డ్రైవర్ల నియామక ప్రక్రియ వరకు వచ్చేసరికి టీఎస్‌పీఎస్సీ చేతులెత్తేసింది. ఇతర ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో బిజీగా ఉండగా, వీటిని చేపట్టడం సాధ్యం కాదని పేర్కొంది. దీంతో విషయం నాటి ప్రభుత్వ చివరిదశలో మరోసారి ప్రభుత్వ పరిశీలనకు వెళ్లింది. మళ్లీ దీనిపై సమాలోచనలు చేసి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు అప్పగించింది. ఈలోపు ఎన్నికలు రావటం, ప్రభుత్వం మారిపోవటంతో ఆ ప్రక్రియ అలాగే ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పించటంతో బస్సుల సంఖ్య భారీగా పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఉద్యోగుల కొరత ఉన్న సమయంలో కొత్త బస్సులు సమకూర్చుకుంటే వాటి నిర్వహణ అసాధ్యంగా మారే పరిస్థితి ఉంది. దీంతో 8 వేల మంది డ్రైవర్లు, కండక్టర్లను నియమించుకోవాలని నిర్ణయించి ప్రభుత్వానికి ఆర్టీసీ ప్రతిపాదించింది. అన్ని నియామకాలు వద్దని ఆర్థికశాఖ మౌఖికంగా సూచించంతో 3 వేల పోస్టుల భర్తీకి మళ్లీ ప్రతిపాదించింది. ఇందులో 2 వేల మంది డ్రైవర్లు ఉండగా శ్రామిక్‌లు, డిపో మేనేజర్లు ఇలా మిగతా విభాగాలకు చెందిన మరో వెయ్యి మంది ఉన్నారు. సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మూడు వేల ఆర్టీసీ ఖాళీల భర్తీ ప్రక్రియ చేపడతారు.

డ్రైవర్ల డబుల్ డ్యూటీ రూ.వెయ్యికి పెంపు

➤ ప్రస్తుతం ఆర్టీసీలో 'లక్షే లక్ష్యం' పేరుతో ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. 2017 నాటి వేతన సవరణ అమలు చేయనుండటంతో ఆర్టీసీపై రోజువారీగా రూ.కోటి చొప్పున భారం పడుతుంది. ఆ భారాన్ని పూడ్చుకునేందుకు సంస్థ, రోజువారీ ఆదాయాన్ని రూ.కోటి మేర అదనంగా పెంచుకోవాలని నిర్ణయించింది. ఇందుకుగాను ప్రతి డిపో రోజుకు రూ.లక్ష చొప్పున ఆదాయాన్ని పెంచుకునే కసరత్తు ప్రారంభించింది. లక్షే లక్ష్యం పేరుతో దీనిని చేపట్టింది. కానీ, ఈ రూపంలో డ్రైవర్లపై భారం మరింత పెరిగిందంటూ ఇటీవల డిపో మేనేజర్లు ఎండీ దృష్టికి తెచ్చారు. తీవ్ర ఎండలున్న ప్రస్తుత తరుణంలో ఇది ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. దీంతో మే, జూన్ నెలలకు సంబంధించి డ్రైవర్ల డబుల్ డ్యూటీ మొత్తాన్ని రూ.వెయ్యికి పెంచాలని తాజాగా ఆర్టీసీ నిర్ణయించి ఆదేశాలు జారీ చేసింది. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేలా డ్రైవర్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది.

టెన్త్‌లో మళ్లీ నిర్మల్ టాప్

▶ మొదటి పేజీ తరువాయి

2,178 (54.14%) మంది, బాలురు 3,594 (47.40%) మంది పాసయ్యారు.

ఆరు స్కూళ్లలో సున్నా ఉత్తీర్ణత

గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం పెరిగింది. 3,927 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించాయి. 6 స్కూళ్ళలో ఒక్కరు కూడా పాసవ్వలేదు. గురుకుల పాఠశాలలు 98.71 శాతం అత్యధిక పాస్ పర్సంటేజీతో దూసుకెళ్ళాయి. జిల్లా పరిషత్, ఇతర ప్రభుత్వ పాఠశాలలు సగటు ఉత్తీర్ణత శాతం కన్నా తక్కువ పర్సంటేజీ దక్కించుకున్నాయి.

15 రోజుల్లోగా రీ కౌంటింగ్, వెరిఫికేషన్

మార్కుల రీ కౌంటింగ్, ఫలితాల రీ వెరిఫికేషన్ కోరుకునేవారు 15 రోజుల్లో (మే 15లోగా) దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ తెలిపింది. రీ కౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500 చెల్లించి, దరఖాస్తులను పాఠశాల విద్య కార్యాలయానికి పంపాలి. రీ వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ. 1,000 చెల్లించాలి. హాల్ టిక్కెట్ జిరాక్స్, మార్కుల మెమో కాపీతో కూడిన రీ వెరిఫికేషన్ దరఖాస్తును సంబంధిత డీఈవో కార్యాలయానికి పంపాలి. వీరికి మూల్యాంకనం చేసిన సమాధాన పత్రం ప్రతిని పంపుతారు.

జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్ 3 నుంచి 13 వరకూ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం ఎదురు చూడకుండా ఈ పరీక్షలకు దరఖాస్తు చేయాలని విద్యాశాఖ కోరింది. మే 16లోగా సంబంధిత స్కూల్ హెచ్ఎంలకు పరీక్ష ఫీజు చెల్లించాలి.

ఒత్తిడికి లోనవ్వొద్దు: బుర్రా వెంకటేశం

ఫెయిల్ అయిన, గ్రేడ్లు తగ్గిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మానసిక ఒత్తిడికి గురికావద్దంటూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం విజ్ఞప్తి చేశారు. ఫెయిల్ అయిన వారు సప్లిమెంటరీ రాసుకుని ఇంటర్‌లో చేరేందుకు అవకాశం ఉందన్నారు. అన్ని పరీక్షలు ఫెయిల్ అయినా, జీవితంలో అద్భుతంగా రాణించిన వారు ఎంతోమంది ఉన్నారని సూచించారు. పాఠశాల విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు ఈ విద్యా సంవత్సరం నుంచే చర్యలు చేపట్టాలని భావిస్తున్నట్టు చెప్పారు.

సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణత..

సబ్జెక్టు	ఉత్తీర్ణులు	శాతం
ప్రథమ భాష	479634	97.12
ద్వితీయ భాష	492665	99.87
తృతీయ భాష	485016	98.30
గణితం	476513	96.46
సామాన్య శాస్త్రం	477255	96.60
సాంఘిక శాస్త్రం	489276	99.05

మీడియం వారీగా ఉత్తీర్ణత (రెగ్యులర్)

మీడియం	రాసిన వారు	ఉత్తీర్ణులు	శాతం
తెలుగు	84,790	68,437	80.71
ఆంగ్లం	4,01,458	3,76,317	93.74
ఉర్దూ	7,508	6,119	81.50
ఇతర భాషలు	451	399	88.47
మొత్తం	4,94,207	4,51,272	91.31

తల్లీకూతుళ్లు అదుర్స్..

ఇంటర్‌లో తల్లి.. టెన్త్‌లో కుమార్తెకు మంచి మార్కులు

గోదావరిఖని టౌన్: తల్లీకూతుళ్లు ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. తల్లి కుట్టు మెషీన్‌పై కుడుతూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటూ ఇంటర్ పరీక్షలు రాసింది. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో 954 మార్కులు సాధించింది. మరోవైపు మంగళవారం విడుదలైన టెన్త్ ఫలితాల్లో ఆమె కూతురు 10 జీపీఏ సాధించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన చిట్టోజు రమణాచారి–గీతారాణి దంపతులు. వారికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. రమణాచారి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గీతారాణి దుస్తులు కుడుతూ సంపాదిస్తోంది. వీరి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. పెద్ద కూతురు చందన రామగుండం మండలం లింగాపూర్ మోడల్ స్కూల్‌లో టెన్త్ చదివింది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 10జీపీఏ సాధించింది. తల్లే తనకు ఆదర్శమని చందన స్పష్టం చేసింది. ఐఏఎస్ కావడమే తన జీవిత లక్ష్యమని తెలిపింది. ఇందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేసింది.



తల్లి గీతారాణితో కూతురు చందన

హైవేలపై ఆగి ఉన్న మృత్యువు

- నిలిపి ఉన్న వాహనాలను ఢీకొని రోడ్డు ప్రమాదాలు
- ఈ తరహాలో ప్రతిరోజూ ఓ ప్రమాదం
- ప్రతి మూడు రోజులకూ ఒకరు మృత్యువాత
- హైవేలపై వాహనాలు పార్క్ చేస్తే కఠిన చర్యలు: రోడ్డు భద్రత అడిషనల్ డీజీ మహేష్ భగవత్



సాక్షి, హైదరాబాద్: కొందరి నిర్లక్ష్యం మరికొందరి పాలిట మృత్యుపాశమవుతోంది. అనుమతి లేకున్నా జాతీయ రహదారుల వెంట నిలిపి ఉంచుతున్న భారీ వాహనాలు ఢీకొని దుర్మరణంపాలవుతున్నారు. జాతీయ రహదారుల్లో వేగంగా దూసుకెళ్లే వాహనదారులు ముందు ఆగిన లారీలు, భారీ ట్రక్కులను గుర్తించే లోపే నష్టం జరిగిపోతోంది.

➤ ఏప్రిల్ 25న కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగపురం వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 22న సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం శివారులో జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్ లారీని కారు వెనుక నుంచి ఢీ కొట్టడంతో కారు మొత్తం కంటైనర్ కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు మృత్యువాతపడ్డారు. ఈ తరహా ప్రమాదాలు పెరుగుతుండటం వాహనదారుల్లో ఆందోళన కలిగిస్తోంది.

రోజుకో రోడ్డు ప్రమాదం.. మూడు రోజులకొకరు మృతి

రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ నివేదికల ప్రకారం చూస్తే తెలంగాణలో ఈ తరహాలో జాతీయ రహదారుల వెంట ఆగి ఉన్న లారీలు, ట్రక్కులను ఢీకొట్టడం కారణంగా ప్రతి రోజూ కనీసం ఒక ప్రమాదం జరుగుతోంది. ఈ ప్రమాదాల కారణంగా ప్రతి మూడు రోజులకు ఒకరి చొప్పున ప్రాణాలు కోల్పోతున్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2018 నుంచి 2022 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 600 మంది మృతి చెందగా, వందలాది మంది క్షతగాత్రులయ్యారు. 2022లో తెలంగాణలో మొత్తం 331 రోడ్డు ప్రమాదాలు ఈ తరహాలో జర్గగ్గా, 128 మంది మృతిచెందినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఎక్కువ ప్రమాదాలు తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 6 గంటల మధ్య జరగడం గమనార్హం. ప్రమాదాలు జరిగిన సమయంలో ఆగి ఉన్న లారీలను ఢీకొట్టే కార్లు గంటకు 80 నుంచి 100 కిలోమీటర్ల వేగం ఉంటున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

హైవేలపై పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవు

జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు నిలిపి ఉంచడం, పార్కింగ్ చేయడం చట్ట ప్రకారం నేరం. అలా వాహనాలు నిలిపితే ఐపీసీ 304 సెక్షన్ కింద కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. జాతీయ రహదారుల వెంట ఉన్న పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీసులు ఈ తరహాలో వాహనాలు నిలపకుండా పెట్రోలింగ్ చేస్తున్నారు. అయితే ఇటీవల తెల్లవారుజాము సమయంలోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నందున ఆ వేళల్లో పోలీసులను మరింత అప్రమత్తం చేసేలా సర్క్యులర్‌ను జారీ చేస్తాం.

– మహేష్ భగవత్, తెలంగాణ రోడ్డు భద్రత విభాగం అడిషనల్ డీజీ

ప్రమాదాలకు కారణమవుతున్న ప్రధాన నిర్లక్ష్యం ఇలా..

➤ జాతీయ రహదారుల వెంట వాహనాలు నిలిపి ఉంచవద్దని నిబంధనలు ఉన్నా.. భారీ ట్రక్కులు, లారీల డ్రైవర్లు కొందరు వీటిని విస్మరిస్తున్నారు.

➤ ఏదైనా మరమ్మతుల కారణంగా వాహనం తప్పక ఆపాల్సి వస్తే వెనుక నుంచి వాహనదారుడికి ఆ విషయం తెలిసేలా పార్కింగ్ లైట్లు తప్పక ఆన్ చేసి పెట్టాలి. సేఫ్టీ ట్రయాంగిల్ ఆకారాన్ని వాహనానికి కొంత దూరంలో పెట్టాలి.

➤ జాతీయ రహదారుల వెంట ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలోనే వాహనాలు నిలిపి ఉంచాలి. కానీ చాలామంది అలా చేయడం లేదు

➤ డ్రైవర్ అలసిపోయినప్పుడు తెల్లవారుజాము సమయంలో వాహనాన్ని జాతీయ రహదారి వెంటే నిలిపి ఉంచి నిద్రిస్తుండడం సైతం మిగిలిన వాహనదారులకు మృత్యుపాశమవుతోంది.

'పది'లో సత్తా చాటిన గురుకులాలు

- రాష్ట్రవ్యాప్తంగా సగటున 96.33 శాతం ఉత్తీర్ణత
- అత్యధికంగా జనరల్ సొసైటీలో 98.70 శాతం పాస్

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి ఫలితాల్లో గురుకుల విద్యాసంస్థలు సత్తా చాటాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్యాల ఉత్తీర్ణత సగటున 91.31% ఉండగా గురుకుల విద్యాసంస్థల సగటు ఉత్తీర్ణత 96.33% ఉంది. అంటే రాష్ట్ర సగటు కంటే 5.02% అధికంగా ఉత్తీర్ణత శాతం నమోదైంది. రాష్ట్రంలో సంక్షేమ శాఖల పరిధిలో 4 గురుకుల సొసైటీలు, విద్యా శాఖ పరిధిలో జనరల్ గురుకుల సొసైటీ, మోడల్ స్కూల్ సొసైటీ, కస్తూర్బా గాంధీ విద్యాలయాల సొసైటీ లు కొనసాగుతున్నాయి. 2023 –24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల నుంచి 90,112 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 86,808 మంది ఉత్తీర్ణులుకాగా సగటు ఉత్తీర్ణత 96.33 శాతంగా నమోదైంది. ఈ ఏడాది జనరల్ గురుకుల సొసైటీ అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించగా ఆ తర్వాతి స్థానంలో బీసీ గురుకుల సొసైటీ, ఎస్సీ గురుకుల సొసైటీలున్నాయి. గిరిజన గురుకుల సొసైటీ సైతం మెరుగైన ఫలితాలనే నమోదు చేయగా ఆ తర్వాత స్థానంలో మైనారిటీ గురు కుల సొసైటీ, మోడల్ స్కూల్ సొసైటీ చివరగా కేజీబీవీలున్నాయి. గురుకుల సొసైటీలు గతేడాది 94.4 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా ఈసారి అంతకు మించిన ఫలితాలు సాధించడం గమనార్హం.

153 బీసీ గురుకుల పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని స్కూళ్లు టెన్త్ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించినట్లు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. సొసైటీలో 98.2 శాతం ఉత్తీర్ణత నమోదైందని చెప్పారు. 261 పాఠశాలలకుగాను 153 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని హర్షం వ్యక్తం చేశారు. 391 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారన్నారు. ఇందుకుగాను బోధన సిబ్బంది, విద్యార్థులను అభినందించారు. వచ్చే ఏడాది వందశాతం ఫలితాలు సాధిస్తామన్నారు.

2023-24 పదో తరగతి ఫలితాలు సొసైటీలవారీగా...

సొసైటీ	హాజరు	ఉత్తీర్ణత	శాతం
టీఎస్ఆర్ఈఐఎస్	2,475	2,443	98.70
ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఐఎస్	17,467	17,154	98.20
టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్	18,063	17,706	98.02
టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్	6,893	6,697	97.15
టీఎంఆర్ఈఐఎస్	10,076	9,756	96.82
మోడల్ స్కూల్స్	17,592	16,723	95.06
కేజీబీవీ	17,546	16,329	93.06
మొత్తం	90,112	86,808	96.33

పెరుగుతున్న టెన్త్ ఉత్తీర్ణత

- 2015లో 77 శాతం పాస్ .. 2024లో 91 శాతం ఉత్తీర్ణత
- 8 రెట్లు పెరిగిన 10 జీపీఏ విద్యార్థులు
- ప్రైవేటుతో పోటీ పడుతున్న గురుకులాలు, మోడల్ స్కూల్స్

సాక్షి, హైదరాబాద్: టెన్త్‌లో ఉత్తీర్ణత శాతం ఏటా గణనీయంగా పెరుగుతోంది. 2015లో 77.56 శాతమే ఉన్న పాస్ పర్సంటేజీ క్రమంగా 2014 నాటికి 91 శాతానికి చేరింది. పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించే విద్యార్థుల సంఖ్య 8 రెట్లు పెరిగింది. 2015లో కేవలం 1,387 మంది 10 జీపీఏ సాధిస్తే, ఈ ఏడాది 8,883 మంది 10 జీపీఏ సొంతం చేసుకున్నారు. గురుకులాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో విద్యా ప్రమాణాలు పెరగడమే ఈ పురోగతికి కారణంగా టీచర్లు చెబుతున్నారు. ఈ విభాగాలు ప్రైవేటు స్కూళ్లతో పోటీ పడుతున్నాయి. అయితే జిల్లా పరిషత్, ప్రభుత్వ స్కూళ్లలో సాధారణ ఫలితాలే వస్తున్నాయి. సకాలంలో పాఠ్య పుస్తకాలు అందకపోవడం, బోధన లోపాలు ఈ పరిస్థితికి కారణమని చెబుతున్నా రు. హైదరాబాద్ వంటి అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోనూ ప్రభుత్వ స్కూళ్లలో ఉత్తీర్ణత శాతం తక్కువగానే ఉంటోంది.

సంవత్సరం	పరీక్ష రాసినవారు	ఉత్తీర్ణులు	శాతం	10 జీపీఏ
2015	5,13,473	3,98,253	77.56	1,387
2016	5,19,494	4,44,808	85.62	3,419
2017	5,07,938	4,27,414	84.15	2,427
2018	5,01,732	4,20,307	83.77	4,768
2019	5,06,202	4,67,859	91.43	8,676
2020	5,08,960	5,08,953	100	1,44,395
2021	5,16545	5,16,545	100	2,10,647
2022	5,03,579	4,53,201	90	11,343
2023	4,84,370	4,19,460	86.60	6,163
2024	5,05,813	4,57,044	91.30	8,883

కుటుంబ సభ్యుల మెడకోసి హత్య.. ఆపై ఆత్మహత్య

- విజయవాడ గురునానక్ కాలనీలో ఓ డాక్టర్ అఘాయిత్యం
- స్నేహితుల మోసం, ఆర్థిక ఇబ్బందులే కారణం?



మృతుడు డాక్టర్ శ్రీనివాస్ (ఫైల్)



భార్య ఉష, కొడుకు శ్రీహాన్(ఫైల్)

పటమట (విజయవాడ తూర్పు): ప్రాణాలు పోయాల్సిన డాక్టర్ విచక్షణ మరచి తల్లి, భార్య, పిల్లల మెడలు కోసి పాశవికంగా హత్య చేసి, ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగవారం తెల్లవారు జామున విజయవాడలో చోటుచేసుకుంది. స్నేహితుల మోసంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడమే ఈ దారుణానికి కారణమని సమాచారం. పటమట పోలీసుల వివరాల ప్రకారం... గురునానక్‌నగర్ సమీపంలోని మారుతీ కో–ఆపరేటివ్ సొసైటీ కాలనీలో ఆర్థోపెడిక్ వైద్యుడు డి. శ్రీనివాస్ (40) నివాసం ఉంటున్నాడు. కొంతకాలం క్రితం స్నేహితులతో కలిసి శ్రీజ ఆర్థోపెడిక్ క్లినిక్‌ను స్థాపించాడు. ఇందుకోసం పలుచోట్ల అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పులు చెల్లించాలంటూ ఒత్తిడి రావడంతో మనస్థాపం చెందాడు. ఈ క్రమంలో తల్లి రమణమ్మ (65), భార్య ఉష (38), కుమార్తె శైలజ (11), కుమారుడు శ్రీహాన్ (8) రాత్రి నిద్రపోతుండగా, కత్తితో మంగళవారం తెల్లవారుజామున వారి మెడలు కోసి హత్య చేశాడు. అనంతరం ఉదయం 7 గంటల సమయంలో తానూ డాబా గ్రిల్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రోజూ మాదిరి పనికోసం వచ్చిన పనిమనిషి చూసి ఈ విషయాన్ని పక్కింటి వారికి చెప్పింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న విజయవాడ సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ, డీసీపీ అధిరాజాసింగ్ రాణా తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు విచారణ చేపట్టారు. విజయవంతంగా నడుస్తున్న ఆస్పత్రి నష్టాల్లోకి రావడానికి అతని స్నేహితులే కారణమని, అతడిని మోసం చేశారని మృతుల కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ ఉద్యోగులు గత ఆర్థిక సంవత్సరంలో సమర్పించిన వాహనాల బిల్లులు, సప్లిమెంటరీ జీతాలు, వైద్య బిల్లులను సత్వరం మంజూరు చేయాలని, తిరస్కరించిన బిల్లులను పునఃపరిశీలించి స్వీకరించాలని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్ సోమవారం సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పే అండ్ అకౌంట్స్ ద్వారా జీతం పొందుతున్న ఉద్యోగులకు.. ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారికి చెల్లించినట్టే ఎన్నికల గౌరవ వేతనం చెల్లించాలని కోరారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఉద్యోగుల బిల్లుల సమస్యను పరిష్కరిస్తామని కృష్ణభాస్కర్ వారికి హామీ ఇచ్చారు. పే అండ్ అకౌంట్స్ ద్వారా వేతనాలు పొందుతున్న ఉద్యోగులకూ ఎన్నికల గౌరవ వేతనం చెల్లించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ట్రెసా ఒక ప్రకటనలో తెలిపింది.

క్లుప్తంగా...

ఢిల్లీ పోలీసుల నోటీసులకు జవాబు ఇస్తాం

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్



ఖలీల్‌వాడి (నిజామాబాద్ అర్బన్): వీడియో మార్ఫింగ్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పోలీసులు ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. ఎన్నికల సమయంలో నోటీసులు రావడం సహజమేనని, దీనికి సంబంధించిన అంశాలను లీగల్ సెల్ చూసుకుంటుందని చెప్పారు. మంగళవారం నిజామాబాద్‌లోని ఓ హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ పేరిట భయభ్రాంతులకు గురి చేస్తోందని, దీనికి కాంగ్రెస్ పార్టీ బెదిరిపోదని పేర్కొన్నారు. దేశంలో జరిగిన రెండు దఫాల లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వెనుకంజలో ఉందని, ఇండియా కూటమికి ప్రజలు స్పష్టమైన మెజార్టీ ఇస్తారని భావిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌డీఏ కూటమికి నూకలు చెల్లాయని, ఇండియా కూటమి గెలుపు వైపు ఉందన్నారు. తెలంగాణలో 15 ఎంపీ స్థానాలు గెలుపొందుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని, దేశంలో కింగ్‌మేకర్‌గా మారుతామని కేసీఆర్ కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. నామా నాగేశ్వర్‌రావుకు కేంద్రమంత్రి వస్తుందని కేసీఆర్ చెప్పడాన్ని జోక్‌గా అభివర్ణించారు.

ఉస్మానియా వర్సిటీ ప్రతిష్టకు భంగం

బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థులకు నీళ్లు, విద్యుత్ సరఫరా చేయకుండా విశ్వవిద్యాలయప్రతిష్ఠను దెబ్బతీశారని బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆయన మంగళవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ తప్పులు ప్రభుత్వం చేసి.. యూనివర్సిటీ చీఫ్ వార్డెన్‌కు నోటీసులిచ్చి చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మరోవైపు యూనివర్సిటీలో నాలుగో సెమిస్టర్ పరీక్షలుండగా సెలవులు ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. యూనివర్సిటీలో విద్యుత్, నీళ్లు ఉన్నాయని డిప్యూటీ సీఎం భట్టి ఎలా ప్రకటిస్తారని నిలదీశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ .. బోగస్ ప్రభుత్వంగా మారిందని శ్రీనివాస్ విమర్శించారు.

మోదీకే మద్దతివ్వాలి: మందకృష్ణ మాదిగ



అనంతగిరి: ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి యావత్ మాదిగ సమాజం మద్దతు తెలపాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో మంగళవారం వికారాబాద్‌లో జరిగిన మాదిగ ఉపకులాల ప్రజాఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. మాదిగలను అక్కున చేర్చుకున్న బీజేపీకి అండగా నిలవాలని కోరారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనను మరోసారి ఎంపీగా దీవించాలని కోరారు.

ఈడబ్ల్యూఎస్, మహిళా రిజర్వేషన్లు ఎందుకు?



సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్లను ఎత్తేసే ఉద్దేశమే ఉంటే.. ఈడబ్ల్యూఎస్, మహిళా రిజర్వేషన్లను బీజేపీ ఎందుకు తీసుకొచ్చిందని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాల బీసీ దళిత ఆదివాసీ మేధావులతో మంగళవారం ఏర్పాటు చేసిన జూమ్ సమావేశంలో ప్రముఖులు పాల్గొన్నారు. సమావేశ నిర్వాహకుడు, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ మాట్లాడుతూ 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏర్పడిన మొదటి బీసీ కమిషన్ (కాకా కాలేల్కర్) నివేదిక, 1980లో మండల్ కమిషన్ నివేదికలను తొక్కిపెట్టడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. పేదల కోసం కుల గణన నిర్వహిస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ అగ్రవర్ణాలకు అనుకూలంగా ఉన్న ఈడబ్ల్యూఎస్, మహిళా రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ఎందుకు వ్యతిరేకించలేదని ప్రశ్నించారు.

శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ రాజేశ్వర్‌రావు ప్రమాణం



ప్రమాణం అనంతరం జస్టిస్ శ్రీనివాస్‌రావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ జగన్నగారి శ్రీనివాస్‌రావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ప్రమాణస్వీకారం చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఫస్ట్ కోర్టు హాల్‌లో వీరితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ రాజేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు, ఇతర న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. 2022, జూలైలో వీరిద్దరూ అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టగా, తాజాగా శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.



జస్టిస్ రాజేశ్వర్‌రావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీజే

ప్రాంతీయ శక్తులే.. ప్రజాస్వామ్య పరిరక్షకులు

బలమైన ప్రాంతీయ పార్టీలకే బీజేపీని అడ్డుకొనే శక్తి ఉంది

- కేంద్రాన్ని శాసించేది బీఆర్‌ఎస్, వైఎస్సార్‌సీపీ, డీఎంకే వంటి పార్టీలే
- బీజేపీ అరాచకాలకు ప్రజాశక్తితోనే అడ్డుకట్ట వేస్తాం
- ముఖ్యమంత్రి పదవికి రేవంత్ ఏమాత్రం తగడు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సొంత పార్టీ నేతలే కూల్చేస్తారు
- 10–12 ఎంపీ సీట్లు గెలిస్తే ఏడాదిలోపే రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ తిరిగి శాసిస్తారు
- మోసపోయిన ప్రజలకు సాంత్వన చేకూర్చేందుకే బస్సు యాత్ర

సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

(కల్వల మల్లికార్జున్‌రెడ్డి)

'లోక్‌సభ ఎన్నికల పోరు ప్రస్తుతం బీజేపీ, కాంగ్రెస్ నడుమ కాకుండా ప్రాంతీయ శక్తులతోనే జరుగుతోంది. ప్రాంతీయ శక్తులే ప్రజల ఆకాంక్షలకు దగ్గరగా ఉంటాయి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేది ప్రాంతీయ పార్టీలే. బీజేపీ పదేళ్లుగా అధికారంలో ఉన్నా అడ్డుకొనే శక్తి జాతీయ పార్టీగా చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీకి లేదు. బీజేపీకి అడ్డుకట్ట వేసేది ప్రాంతీయ శక్తులే'అని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు స్పష్టం చేశారు. దేశంలో పెద్ద సైజు ప్రాంతీయ పార్టీలే తప్ప 28 రాష్ట్రాల్లో బలంగా వేళ్లూనుకున్న జాతీయ పార్టీలే లేవన్నారు. బీఆర్‌ఎస్, టీఎంసీ, ఆప్, వైఎస్సార్‌సీపీ, డీఎంకే వంటి బలమైన ప్రాంతీయ పార్టీల వల్ల ఆయా రాష్ట్రాల్లో బీజేపీకి స్థానం లేకుండా పోయిందని చెప్పారు. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న చోట ప్రభుత్వాల కూల్చివేతకు బీజేపీ చేసిన ప్రయత్నాలకు అడ్డుకట్ట పడిందని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ పాలించిన కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో బీజేపీ కుట్రలను ఆ పార్టీ అడ్డుకోలేకపోయిందని విశ్లేషించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కేటీఆర్ పలు అంశాలపై స్పందించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

హైదరాబాద్‌ను యూటీ చేసే కుట్ర

'హైదరాబాద్‌పై పట్టు చేజిక్కించుకోవడంతోపాటు బీఆర్‌ఎస్‌కు చెక్ పెట్టేందుకు హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేయాలని బీజేపీ పన్నాగం పన్నుతోంది. నదుల అనుసంధానం పేరిట గోదావరి జలాలను తమిళనాడు, కర్ణాటకకు తరలించేందుకు ప్రయత్నిస్తోంది. లోక్‌సభలో మూడింట రెండొంతుల సీట్లు వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల రిజర్వేషన్ల రద్దుకు కుట్రలు చేస్తోంది. వీటిని అడ్డుకొనేందుకు బీఆర్‌ఎస్ వంటి సమాఖ్య స్ఫూర్తిగల ప్రాంతీయ పార్టీల అవసరం ఉంది. బీఆర్‌ఎస్‌కు ఎక్కువ సీట్లు వస్తేనే వాటికి అడ్డుకట్ట వేయగలుగుతుంది. కేసీఆర్, వైఎస్ జగన్, స్టాలిన్, పినరయి విజయన్ వంటి ప్రాంతీయ శక్తులు గట్టిగా గొంతు విప్పితే కేంద్రాన్ని శాసించడంతోపాటు దక్షిణాదిని రక్షించుకోవచ్చు.

రూ. వేల కోట్ల స్కాంలు చేసినా బీజేపీలో చేరగానే క్లీన్‌చిట్



కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ ఎవరు అధికారంలో ఉన్నా 'ఉంటే జేబులో ఉండు.. లేదంటే జైల్లో ఉండు'అనేలా వ్యవహరిస్తున్నాయి. జగన్‌పై కేసులు, జైల్లో పెట్టినా ప్రజల వద్దకు వెళ్లి తీర్పు కోరారు. ప్రజల్లో బలంగా ఉండే నాయకుడిని ముట్టుకొనేందుకు ఏ ఏజెన్సీ అయినా భయపడాల్సిందే. వివిధ అభియోగాలు ఎదుర్కొంటున్న 25 మంది నేతలు బీజేపీలో చేరగానే క్లీన్‌చిట్ వచ్చింది. సుజనా చౌదరి, సీఎం రమేశ్, అజిత్ పవార్ రూ. వేల కోట్ల కుంభకోణాలకు పాల్పడినా మోదీతో చేతులు కలిపిన వెంటనే వారికి క్లీన్‌చిట్ లభించింది. 3 వేల మందికిపైగా మహిళలను లైంగికంగా వేధించిన జేడీఎస్ ఎంపీ అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ బీజేపీ సహకారం లేకుండా దేశం దాటాడా? రూ. 100 కోట్ల కుంభకోణం అంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, కవితను జైల్లో పెట్టారు. ఇదే ఆరోపణలపై అరెస్టు అయిన మాగుంట రాఘవరెడ్డి అప్రూవర్‌గా మారి టీడీపీ తరఫున పోటీ చేస్తున్నాడు. బీజేపీలో చేరితే కడిగిన ముత్యాలు అవుతారా? ఈ అరాచకాలను ప్రజాశక్తితోనే ఎదుర్కొంటాం.

షర్మిలను ప్రయోగించింది కాంగ్రెస్ పార్టీయే

మోదీ 2014లో, రేవంత్‌రెడ్డి 2023లో ప్రజలకు రంగుల కల చూపి అధికారంలోకి వచ్చారు. ప్రజలను ఊహల పల్లకిలో కూర్చోబెట్టడంతో పాటు కేసీఆర్‌ను దుర్మార్గుడిగా చిత్రీకరించేందుకు అనేక శక్తులను వాడారు. వై.ఎస్. షర్మిలను తెలంగాణలో ప్రయోగించింది కాంగ్రెస్ పార్టీయే. తెలంగాణలో కేసీఆర్‌ను బదనాం చేయడం, వై.ఎస్. రాజశేఖర రెడ్డి అభిమానులను బీఆర్‌ఎస్‌కు దూరం చేసేందుకు షర్మిలను ఉపయోగించుకున్నారు. షర్మిలతో పార్టీ పెట్టించి తిట్టించింది కాంగ్రెస్ పార్టీయే. ఇక్కడ పని కాగానే షర్మిలను ఆంధ్రాలో ప్రయోగిస్తున్నారు. షర్మిలతో అక్కడా అదే ప్రయోగం చేయడం కాంగ్రెస్ స్ట్రాటజీలో భాగం.

సోషల్ మీడియాలో వికృత ధోరణి

రేవంత్‌రెడ్డి సీఎం పదవికి తగని చిల్లరగాడు. ఆయనవి చిల్లర మాటలు, ఉద్దెర పనులు. రేవంత్ ప్రసంగాలను కుటుంబంతో కూర్చుని చూడలేని పరిస్థితి. ప్రజలను చిరకాలం ప్రజలను భ్రమల్లో పెట్టవచ్చని అనుకుంటున్నాడు. మేడిగడ్డ ప్రాజెక్టులో కుంగిన మూడు పిల్లర్లను ఉద్దేశపూర్వకంగా మరమ్మతులు చేయట్లేదు. కేసీఆర్‌ను ఉద్దేశపూర్వకంగా బదనాం చేసేందుకే పంటలను ఎండబెట్టారు. డిసెంబర్ 3న కేసీఆర్ తిరిగి సీఎం అయ్యుంటే మేడిగడ్డకు మరమ్మతులు చేసి పంటలను కాపాడేవారు.

కాంగ్రెస్ నేతలే కూల్చుతారు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ కూల్చాల్సిన అవసరం లేదు. రేవంత్ చుట్టూ కాంగ్రెస్‌కు చెందిన ఖమ్మం, నల్లగొండ బాంబులు ఉన్నాయి. ప్రజలు 10–12 ఎంపీ సీట్లు మాకు ఇస్తే ఏడాదిలోపే రాష్ట్ర రాజకీయాలను తిరిగి కేసీఆర్ శాసించే పరిస్థితి ఉంటుంది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన స్టేషన్ ఘనపూర్, ఖైరతాబాద్, భద్రాచలంలో ఉప ఎన్నిక ఖాయం. కాంగ్రెస్ ప్రతిష్ట క్షేత్రస్థాయిలో దిగజారుతోంది. 'ఆర్ ట్యాక్స్' కడితేనే భవన నిర్మాణ అనుమతులు వస్తున్నాయి. ఢిల్లీకి డబ్బు సంచులు పంపేందుకు బిల్డర్లు, రైస్‌మిల్లర్లను బెదిరిస్తున్నారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారు.

కుండ పగిలినా కుక్క బుద్ధి తెలిసింది

ఇతర పార్టీల నుంచి చేరిన కొందరిని పూర్తిగా చదవకుండానే పదవులు ఇచ్చాం. కుండ పగిలినా కుక్క బుద్ధి తెలిసింది. పార్టీని వీడిన కడియం, రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, దానం నాగేందర్ వంటి వారిపై బీఆర్‌ఎస్ కేడర్ కసితో ఉంది. భవిష్యత్తులో ఇలాంటి ద్రోహులను దగ్గరకు తీయకుండా గుణపాఠం నేర్చుతాం. లోక్‌సభ ఎన్నికల్లో సామాజిక సమతూకం పాటించి రిజర్వుడ్ స్థానాల్లోనూ ఉద్దండులను బరిలోకి దించాం. కనీసం 10–12 స్థానాల్లో గెలుస్తామనే నమ్మకం ఉంది.



రెఫరెండం ప్రకటనకు కట్టుబడి ఉండాలి

మాట ఇచ్చి తప్పడం రేవంత్‌కు అలవాటు. కొడంగల్‌లో రాజకీయ సన్యాసమని మల్కాజిగిరిలో పోటీ చేశాడు. లోక్‌సభ ఎన్నికలు రెఫరెండం అంటున్న రేవంత్ కాంగ్రెస్‌కు మెజారిటీ సీట్లు రాకుంటే పదవి నుంచి తప్పుకుంటారా? జిల్లాల సంఖ్య తగ్గిస్తామని రేవంత్ అనడం తుగ్లక్ పని. 33 జిల్లాల్లో ఒక్కటి టచ్ చేసినా తెలంగాణ తిరగబడుతుంది.

జగన్ మళ్లీ గెలుస్తారు

గుంటూరులో ఇంటర్ చదివా. హైదరాబాద్‌లో సీమాంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన వారితో మాట్లాడుతున్న దానిని బట్టి ఏపీలో వై.ఎస్. జగన్ మళ్లీ గెలిచి సీఎం అవుతారనే సమాచారం నాకు ఉంది. జగన్ మళ్లీ గెలిచి వస్తారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితే బీఆర్‌ఎస్, వైసీపీ, జేడీఎస్ వంటి 13 పార్టీలు కూటముల రూపురేఖలను మార్చేస్తాయి.

కాంగ్రెస్‌ను వెంటాడతాం

కేసీఆర్ సీఎంగా లేరనే విషయాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. హామీలు నెరవేర్చకపోతే ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌ను వెంటాడుతాం. ఏడు పదుల వయసులో మేజర్ సర్జరీ జరిగినా.. కర్ర సాయంతో నడుస్తూ, కూతురు జైల్లో ఉన్నా, ఎర్రటి ఎండలున్నా, నమ్ముకున్న నాయకులు పార్టీని వీడుతున్నా, రేవంత్ పరుషంగా మాట్లాడుతున్నా కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రజలకు సాంత్వన చేకూరేలా కేసీఆర్ చేస్తున్న బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

6 నుంచి హైకోర్టుకు వేసవి సెలవులు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టుకు మే 6వ తేదీ నుంచి మే 31 వరకు వేసవి సెలవులుగా నిర్ణయిస్తూ రిజిస్ట్రార్ జనరల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వేసవి సెలవుల్లో పనిచేసే ధర్మాసనాల వివరాలను ప్రకటించారు. ద్విసభ్య ధర్మాసనాల విచారణ తర్వాత అదే జడ్జీలు ఏకసభ్య విచారణ కొనసాగిస్తారని చెప్పారు. ముందస్తు బెయిల్, బెయిల్, కింది కోర్టుల్లో బెయిల్ తిరస్కరణ.. ఇతర అత్యవసర కేసులను వెకేషన్ బెంచ్‌లు విచారణ చేపడతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫైలింగ్ తేదీ	విచారణ తేదీ	ధర్మాసనం
మే 7	9	జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ శ్రీనివాస్‌రావు (డివిజన్ బెంచ్) జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి (సింగిల్ బెంచ్)
14	16	జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ శ్రీనివాస్‌రావు (డివిజన్ బెంచ్) జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి (సింగిల్ బెంచ్)
21	23	జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ లక్ష్మీనారాయణ (డివిజన్ బెంచ్) జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి (సింగిల్ బెంచ్)
28	30	జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ లక్ష్మీనారాయణ (డివిజన్ బెంచ్) జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి (సింగిల్ బెంచ్)


ఏపీ పిటిషన్‌కు మెయింటెనబిలిటి లేదు

- 'కృష్ణా జలాల'కేసులో తెలంగాణ వాదన
- లిఖితపూర్వకంగా సమర్పించాలన్న సుప్రీంకోర్టు
- తదుపరి విచారణ జూలై 9కి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నదిపై ఉన్న జల విద్యుత్ కేంద్రాలను కూడా కృష్ణా బోర్డు (కేఆర్‌ఎంబీ) పరిధిలోకి తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌కు మెయింటెనబిలిటీ లేదని తెలంగాణ ప్రభుత్వం ఆరోపించింది. అలాగే జల వివాదాలను పరిష్కరించే అధికారం సుప్రీంకోర్టుకు లేదని వాదించింది. కృష్ణా జలాలను తెలంగాణ విద్యుదుత్పత్తికి వినియోగించడం, కేఆర్‌ఎంబీ అధికార పరిధిపై ఏపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్. ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ ఏపీ ప్రభుత్వం వేసిన రిట్ పిటిషన్‌కు మెయింటెనబిలిటీ లేదన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ఆర్టికల్ 32 ప్రకారం దాఖలైన ఈ పిటిషన్‌ను విచారించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందని స్పష్టం చేసింది. అయితే వైద్యనాథన్ వాదిస్తూ జల వివాదాలను పరిష్కరించే అధికారం సుప్రీం కోర్టుకు లేదని... రాజ్యాంగ ధర్మాసనం మాత్రమే కేసులను పరిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ఏపీ పిటిషన్‌కు ఎందుకు మెయింటైనబిలిటీ లేదో, మధ్యంతర ఉపశమనం ఎందుకు ఇవ్వకూడదో లిఖితపూర్వకంగా తెలియజేయాలని తెలంగాణ ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం, కృష్ణా బోర్డును ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 9కి వాయిదా వేసింది.

మీ వాదనలేంటో చెప్పండి



- అనర్హత పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు
- రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యేలు కడియం, తెల్లంకు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు అనర్హత పిటిషన్లలో వాదనలేంటో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ, శాసనసభ కార్యదర్శులకు, కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు కడియం, తెల్లంలకు కూడా నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 5కు వాయిదా వేసింది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీరు 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున విజయం సాధించి, తర్వాత కాంగ్రెస్‌లో చేరారని చెప్పారు. ఒక పార్టీ అభ్యర్థిత్వంపై గెలిచి శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరిన వీరిని అనర్హులుగా ప్రకటించాలని, స్పీకర్‌కు ఈ-మెయిల్ ద్వారా పంపిన పిటిషన్‌పై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని ఆయన కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. గత విచారణ సందర్భంగా అనర్హత పిటిషన్లను జీపీ ద్వారా స్పీకర్ కార్యాలయానికి అందేలా చూడాలని.. అవి అందాయా? లేదా? అన్నది తెలియజేయాలని ఏజీని న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో మంగళవారం విచారణకు హాజరైన ఏజీ పిటిషన్లు స్పీకర్ కార్యాలయానికి చేరాయని, దానికి సంబంధించిన గుర్తింపు పత్రాన్ని పిటిషనర్ల న్యాయవాదికి అందజేశామని చెప్పారు. అనంతరం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన న్యాయమూర్తి విచారణ వాయిదా వేశారు.

'విద్యుత్'పై 28 మందికి నోటీసులు

- జారీ చేసిన జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి కమిషన్

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణం.. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు నిర్ణయాల్లో భాగస్వాములైన 28 మంది ప్రస్తుత, మాజీ అధికారులకు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ రెండు వారాల కింద నోటీసులు జారీ చేసింది. ఇందులో వారి పాత్ర ఏమిటనే వివరణ, అభిప్రాయాలను 15 రోజుల్లోగా తెలియజేయాలని ఆదేశించింది. ఇంధన శాఖ మాజీ ముఖ్యకార్యదర్శులు సురేష్ చందా, ఎస్కే జోషీ, అరవింద్‌కుమార్, అజయ్ మిశ్రా, ట్రాన్స్‌కో–జెన్‌కో మాజీ సీఎండీ డి.ప్రభాకర్‌రావు, టీఎస్ఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ జి.రఘుమారెడ్డి, టీఎస్ఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీలు కె.వెంకటనారాయణ, ఎ.గోపాల్‌రావు, విద్యుత్ సంస్థల మాజీ, ప్రస్తుత డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, ఇతర అధికారులకు కమిషన్ నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. నోటీసులు అందుకున్న వారిలో కొందరు ఇప్పటికే తమ వివరణలను కమిషన్‌కు పంపించారు. ఈ సమాచారం ఆధారంగా విద్యుత్ నిర్ణయాల్లో కీలక పాత్రపోషించిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేసే అవకాశముంది.

ఈసీ అనుమతి కోరిన కమిషన్

యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంపై న్యాయ విచారణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం బహిరంగ ప్రకటన జారీ చేయడానికి విచారణ కమిషన్.. కేంద్ర ఎన్నికల సంఘాన్ని అనుమతి కోరింది. ఎన్నికల సంఘం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే బహిరంగ ప్రకటన జారీ చేసే అవకాశముంది.

అమిత్‌షా 'డీప్ ఫేక్'లో అరెస్టులు

ముగ్గురిని అరెస్టు చేసిన ఢిల్లీ స్పెషల్ సెల్

- ఇద్దర్ని అహ్మదాబాద్‌లో, ఒకర్ని అసోంలో అదుపులోకి
- కాంగ్రెస్, ఆప్‌కు చెందిన కార్యకర్తలుగా అనుమానం
- త్వరలో తెలంగాణలోనూ అరెస్టులు!

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 'డీప్ ఫేక్'వీడియో కేసులో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మంగళవారం జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, నాగాలాండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, రాంచీ, అసోంలకు వెళ్లిన స్పెషల్ సెల్ టీంలు విచారణ చేపట్టాయి. వీరి పర్యటన నేపథ్యంలో అహ్మదాబాద్ సైబర్ క్రైం పోలీసులు సతీష్ వన్సోలా, ఆర్వీ వరియాల అనే ఇద్దరిని అరెస్టు చేశారు. గువాహతికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త రీతమ్ సింగ్‌ను కూడా అరెస్టు చేశారు. వీరిలో వరియాల అక్కడి కాంగ్రెస్ లీడర్ జిగ్నేష్ మేవానీ సహాయకుడు కాగా, సతీష్ వన్సోలా ఆప్‌కు చెందిన కార్యకర్తగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా అసోం, అహ్మదాబాద్, నాగాలాండ్, జార్ఖండ్‌లకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలకు, సమాజ్‌వాదీ పార్టీ నేత ఒకరికి స్పెషల్ సెల్ సమన్లు ఇచ్చింది.

తెలంగాణపైనా నజర్

'డీప్ ఫేక్'వ్యవహారంలో ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మన్నె సతీష్‌తో పాటు శివకుమార్ అంబాలా, నవీన్, ఆస్మా తస్లీంలకు సమన్లు ఇచ్చిన ఢిల్లీ స్పెషల్ సెల్ బుధవారం విచారణకు రావాలంటూ సూచించింది. ఫేస్‌బుక్, ఎక్స్ అఫీషియల్లీ పేజీల్లో పోస్ట్ చేశారనే అంశంపై స్పెషల్ సెల్ దృష్టిసారించింది.

మోదీ, షా పేజీలపై డేగకన్ను

మరోసారి డీప్‌ఫేక్ లాంటి వ్యవహారం ఏదీ చోటు చేసుకోకుండా కేంద్ర హోంశాఖ చర్యలు అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. 'ఇండియన్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్'(ఐ4సీ)తో నిత్యం సంప్రదింపులు జరుపుతోంది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాలకు చెందిన ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్ ఖాతాలపై పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. వీరిద్దరి అధికారిక పేజీలను 24 గంటలూ పరిశీలించేందుకు ఓ బృందాన్ని నియమించింది. మోదీ, అమిత్ షాలు మాట్లాడిన మాటలు వక్రీకరించకుండా, డీప్ ఫేక్ లాంటివి జరగకుండా ఈ బృందం డేగకన్ను వేసిందని తెలుస్తోంది.

చోటా భాయ్ అక్రమాలపై స్పందించరెందుకు?

ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి కేటీఆర్ ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: 'ఛోటా భాయ్'అక్రమంగా 'డబుల్ –ఆర్'టాక్స్ వసూలు చేస్తుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న మీరేం చేస్తున్నారని ప్రధాని నరేంద్రమోదీని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్న మోదీ ఛోటా భాయ్ నిర్వాకాన్ని ఎందుకు క్షమిస్తున్నారని 'ఎక్స్' వేదికగా నిలదీశారు. ఇవాళ ఛోటాభాయ్ అక్రమాలను.. డబుల్–ఆర్ టాక్స్ వసూళ్లను చూసీ చూడనట్టు వదిలేస్తే రేపు 'డబుల్ ఇంజన్ సర్కారు' ఏర్పాటుకు మీకు సహకరిస్తారని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా బడే భాయ్, ఛోటా భాయ్‌ది ఒకే మాట, ఒకే బాట. ఒకరు ప్రతిష్టాత్మక ప్రాజెక్టును బలిచేయాలని చూస్తుంటే.. మరొకరు తమిళనాడు కోసం తాకట్టుపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణకు వచ్చారు. అదే పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలకు ఎందుకు పాతరేశారు? పదేళ్లు గడిచినా తెలంగాణ విభజన హక్కులను ఎందుకు కాలరాశారు? అత్యున్నత చట్టసభలో ఇచ్చిన హామీలకే దిక్కులేకపోతే.. బహిరంగ సభల్లో బీజేపీ వాగ్దానాలను ప్రజలెలా విశ్వసిస్తారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దెబ్బతీసే ఈ ఫెవికాల్ బంధంపై యుద్ధానికి తెలంగాణ సమాజం సిద్ధం'అని కేటీఆర్ స్పష్టంచేశారు. 'ధరలు, నిరుద్యోగం, దళితులపై దాడులు, మైనారిటీల్లో పెరుగుతున్న అభద్రతపై మోదీ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం అన్యాయం. అవినీతిపరులకు బీజేపీని కేరాఫ్‌గా మార్చి రాజకీయ ప్రత్యర్థులపై కక్షగట్టి పెడుతున్న కేసులను, ఎలాంటి ఆధారాలు లేకుండా చేస్తున్న అక్రమ అరెస్టులను తెలంగాణ ప్రజలతో పాటు యావత్ భారత సమాజం గమనిస్తోంది'అని కేటీఆర్ పేర్కొన్నారు.



సమోసాలు వేయించి.. బజ్జీలు కొని

ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మంగళవారం చింతకాని మండలం నాగులవంచలో ప్రచారం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మధిర వెళ్ల వస్తూ నాగులవంచ బస్టాండ్ సెంటర్ వద్ద ఆగారు. ఈ సందర్భంగా అక్కడి హోటల్‌లో కాసేపు సమోసాలు వేయించి.. బజ్జీలు కొనుగోలు చేశారు.

- చింతకాని



ఆటోవాడిని.. అందరివాడిని..

పిలిస్తే పలికే దూరంలో ఉండే తాను అందరివాడినని బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం పాత బస్టాండ్‌లో ప్రయాణికులు, ఆటోడ్రైవర్లను కలిసి ఓట్లు అభ్యర్థించిన ఆయన కాసేపు ఆటో నడిపారు. ఆతర్వాత చిరు వ్యాపారులను కూడా కలిసి లోక్‌సభ ఎన్నికల్లో మరోమారు తనను ఆశీర్వదించాలని కోరారు.

- ఖమ్మం మయూరి సెంటర్

ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేం

నామినేషన్ల తిరస్కరణ పిటిషన్ల కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎలక్షన్ ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని చెబుతూ నామినేషన్ల తిరస్కరణపై దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి తాను వేసిన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారని పేర్కొంటూ వీరబ్రహ్మ రవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇలాంటి కారణాలతోనే మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి కల్లు నర్సింలుగౌడ్, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి షేక్ తౌఫీక్ పిటిషన్లు వేశారు. నామినేషన్లను అనుమతించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలివ్వాలని కోరారు. ఈ మూడు పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం....ఈ దశలో ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్లను కొట్టివేసింది.

తెలంగాణకు ఏఐసీసీ ప్రత్యేక పరిశీలకులు

12మందిని నియమించిన కాంగ్రెస్ అధిష్టానం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో సార్వత్రిక ఎన్నికలు, అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం కాంగ్రెస్ అధిష్టానం 12 మంది ఏఐసీసీ ప్రత్యేక పరిశీలకులను నియమించింది. రాష్ట్రంలోని 10 లోక్‌సభ స్థానాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో ప్రత్యేక పరిశీలకులను నియమించారు. ఈ మేరకు మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్‌కు కొడికున్నిల్ సురేష్, జహీరాబాద్–రాజ్‌మోహన్ ఉన్నితన్, మహబూబ్‌నగర్–జి.సి. చంద్రశేఖర్, మల్కాజ్‌గిరి– ఎస్.జోతిమణి, చేవెళ్ల– హిబీ ఈడెన్, ఆదిలాబాద్–షఫీ పరంబిల్, నిజామాబాద్– ఎస్.ఎస్.బోసురాజు, మంతర్ గౌడ్, నాగర్ కర్నూల్–పి.వి.మోహన్, సికింద్రాబాద్– రిజ్వాన్ అర్షద్, వరంగల్– రవీంద్ర దాల్వీ, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు పి.విశ్వనాథన్‌లను ఏఐసీసీ ప్రత్యేక పరిశీలకులుగా నియమించారు.

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరులో రాజకీయాలు ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటాయి. ప్రస్తుత లోక్‌సభ పోరు కూడా ఆసక్తికరంగానే మారింది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. డీకే.అరుణ (బీజేపీ), చల్లా వంశీచంద్‌రెడ్డి (కాంగ్రెస్), మన్నె శ్రీనివాస్‌రెడ్డి (బీఆర్ఎస్) నువ్వా..నేనా అన్నట్టుగా గెలుపే లక్ష్యంగా పోటాపోటీగా అస్త్రాలు సంధిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానానికి 1952 నుంచి ఇప్పటివరకు 17 పర్యాయాలు ఎన్నికలు జరగ్గా.. పదిసార్లు కాంగ్రెస్, మూడు దఫాలు బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్), తెలంగాణ ప్రజాసమితి, జనతాదళ్, జనతా పార్టీ, బీజేపీ ఒక్కోసారి మాత్రమే విజయం సాధించాయి. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడం.. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్ కూడా ఈ పార్లమెంట్ పరిధిలోకి రావడంతో ఇక్కడ గెలుపును ఆయన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ స్థానంలో విజయం సాధించి కాంగ్రెస్ ఆధిపత్యానికి చెక్ పెట్టాలని బీజేపీ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకొని, తిరిగి పట్టు సాధించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ సర్వశక్తులొడ్డుతోంది.



సీఎం జిల్లాపై పట్టెవరిది?

పాలమూరు స్థానం రేవంత్‌కు ప్రతిష్టాత్మకం

ప్రజాక్షేత్రంలో నిత్యం తిరుగుతున్న బీజేపీ అభ్యర్థి	సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నం	గెలుపే లక్ష్యంగా ఎత్తుకు పైఎత్తులు.. పోటాపోటీగా పావులు



కాంగ్రెస్: కొడంగల్ స్కీం, ముదిరాజ్‌లపై ఆశలు

మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్ ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు ఏడు పర్యాయాలు పర్యటించారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రూ.4వేల కోట్లతో చేపట్టిన మక్తల్–నారాయణపేట–కొడంగల్ పథకంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన విషయాన్ని పదేపదే ఓటర్లకు వివరిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో అధిక శాతం ఓటర్లుగా ఉన్న ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మారుస్తామని హామీ ఇచ్చిన ఆయన.. పాలమూరు ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా తీసుకురాకపోవడం, తగిన నిధులు కేటాయించకపోవడంపై బీజేపీ, బీఆర్ఎస్‌పై దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ అంశాలు తమ గెలుపునకు దోహదం చేస్తాయనే ధీమా కాంగ్రెస్ పార్టీలో వ్యక్తమవుతోంది. అయితే మహబూబ్‌నగర్, మక్తల్, దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో నాయకులు, కేడర్ మధ్య సమన్వయం కొరవడినట్టు తెలుస్తోంది. చేరికల క్రమంలో పాత, కొత్త నేతల మధ్య వైరం ముదిరినట్టు సమాచారం.

బీజేపీ: మోదీ చరిష్మా, కేంద్ర పథకాలపై..

బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి, సీనియర్ మహిళానేత డీకే.అరుణ రెండోసారి బరిలో దిగారు. గత ఎన్నికల్లో రెండోస్థానంలో నిలిచిన ఆమె ఈ ఎన్నికల్లో విజయం సాధించాలనే పట్టుదలతో శ్రమిస్తున్నారు. 'విజయ్ సంకల్ప్ యాత్ర' పేరుతో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టేసిన ఆమె.. నియోజకవర్గ కేంద్రాల్లో ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ప్రతిరోజు ఏదో ఒక కార్యక్రమంతో ప్రజాక్షేత్రంలోనే ఉంటున్నారు. మోదీ చరిష్మా, కేంద్ర పథకాలు తన గెలుపునకు దోహదం చేస్తాయని బలంగా చెబుతున్న ఆమె.. పాలమూరు ప్రాజెక్టుల సాధనలో తనదే ముఖ్యపాత్ర అని ప్రజల ముందుకు తీసుకెళుతున్నారు. అధికసంఖ్యలో ఉన్న ఎస్సీ సామాజికవర్గ ఓట్లు తనకు కలిసివస్తాయనే ఆశతో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ విమర్శలకు దీటుగా సమాధానం చెబుతూ తనదైన శైలిలో ముమ్మర ప్రచారం కొనసాగిస్తున్నారు. అయితే జితేందర్‌రెడ్డి, జలంధర్ రెడ్డి వంటి నాయకులు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరడం, ఆమెకు కొంత మైనస్‌గా మారినట్టు తెలుస్తోంది.

బీఆర్ఎస్: కేసీఆర్‌పైనే భారం

బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి రెండోసారి బరిలో నిల్చున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం అలుముకుంది. ఈ క్రమంలో ఎంపీ అభ్యర్థుల ప్రకటన ఇతర పార్టీల కంటే ఆలస్యం కాగా.. ప్రచారంలో కొంత వెనుకబడ్డారు. అయితే పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగడం.. బస్సు యాత్ర ద్వారా మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన భారీ రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌కు పెద్దఎత్తున ప్రజలు హాజరుకావడంతో 'గులాబీ' శ్రేణుల్లో జోష్ నెలకొంది. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏం చేసిందని..అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయలేక చతికిలపడిందంటూ తనదైన పంథాలో విమర్శలు గుప్పిస్తూనే..ఈ పార్లమెంట్ స్థానంలో అధిక సంఖ్యలో ఉన్న ముస్లిం ఓటర్లు టార్గెట్‌గా ప్రసంగించి ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో ఇక్కడ బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ నెలకొందని.. అందరూ కృషి చేస్తే మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు తథ్యమని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.



డీకే అరుణ (బీజేపీ)



వంశీచంద్‌రెడ్డి (కాంగ్రెస్)



శ్రీనివాస్‌రెడ్డి (బీఆర్ఎస్)

ప్రభావం చూపే అంశాలు..

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయహోదా
- అచ్చంపేట-తాండూరు, కృష్ణా-వికారాబాద్ రైల్వే లేన్ పెండింగ్
- గద్వాల-మాచర్ల లేన్‌కు అడుగులు పడకపోవడం
- నారాయణపేటకు మంజూరైన సైనిక్ స్కూల్ తరలిపోవడంపై నిరసన
- గద్వాల, నారాయణపేటలో చేనేతలకు టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు

అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా ఓటర్ల వివరాలు

అసెంబ్లీ స్థానం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహబూబ్‌నగర్	1,28,268	1,30,37,7	13	2,58,658
జడ్చర్ల	1,11,354	1,11,863	5	2,23,222
దేవరకద్ర	1,18,372	1,20,705	-	2,39,077
నారాయణపేట	1,16,261	1,19,254	2	2,35,517
మక్తల్	1,19,474	1,23,863	1	2,43,338
కొడంగల్	1,19,237	1,23,020	10	2,42,267
షాద్‌నగర్	1,19,114	1,19,211	13	2,38,338
మొత్తం	8,32,080	8,48,293	44	16,80,417

2019 ఎంపీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల వారీగా అభ్యర్థులకు పోలైన ఓట్లు..

టీఆర్ఎస్ - మన్నె శ్రీనివాస్‌రెడ్డి
4,11,402 (41.78 శాతం)

బీజేపీ - డీకే అరుణ
3,33,573 (33.88 శాతం)

కాంగ్రెస్ - చల్లా వంశీచంద్‌రెడ్డి
1,93,631 (19.67 శాతం)

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

- దేశ విచ్ఛిన్నానికి ఆర్ఎస్ఎస్ కుట్రలు
- దళితులు, ముస్లింల వ్యతిరేకి బీజేపీ
- హైదరాబాద్‌లో అరాచకం సృష్టించేందుకు ఆ పార్టీ నేతల యత్నాలు
- ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపణ



ఎన్నికల సభలో మాట్లాడుతున్న అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: ప్రపంచంలోనే అత్యుత్తమమైన భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని మజ్లిస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ చేతుల్లో కీలుబొమ్మ అయిన బీజేపీ దళితులు, ముస్లింలకు పక్కా వ్యతిరేకి అని విమర్శించారు. మంగళవారం గోల్కొండ ఎండిలైన్స్ చౌరస్తా వద్ద జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్‌భగవత్ ఒకొక్కటిగా తమ ఎజెండాను అమలు చేస్తూ దేశ విచ్ఛిన్నానికి కుట్రలు చేస్తున్నారని నిందించారు. గత పదేళ్ల పాలనలో దళితులు, ముస్లింల సంక్షేమానికి ఏమీ చేయని పీఎం మోదీ ఇప్పుడు వారి రిజర్వేషన్లను సైతం రద్దు చేసేందుకు పక్కాగా ప్లాన్ చేశారని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లిం నాయకుల హత్యాకాండ నేరుగా అక్కడి ప్రభుత్వాల కనుసన్నల్లోనే కొనసాగుతోందని ఒవైసీ ధ్వజమెత్తారు. ముస్లిం నేతలు అరెస్టయి జైలుకు వెళ్లే వారు సజీవంగా తిరిగిరావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ముస్లిం నేతలను పోలీసులే చంపారని ఆయన గుర్తు చేశారు.

నన్ను ఓడించేందుకు మోదీ, అమిత్ షా పాట్లు

హైదరాబాద్‌లో అరాచక వాతావరణం నెలకొల్పేందుకు బీజేపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఒవైసీ ఆరోపించారు. హైదరాబాద్ స్థానం నుంచి తనను ఓడించేందుకు మోదీ, అమిత్ షాలు పడరాని పాట్లు పడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. మతసామరస్యానికి పెట్టిన పేరైన హైదరాబాద్ ఓటర్లు ఎంతో వివేకవంతులనీ, శాంతిభద్రతలు నగర అభివృద్ధి కోరుకుని తనను గెలిపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, కార్పొరేటర్ నసీరుద్దీన్, మహ్మద్ గౌస్ తదితరులున్నారు.

'బీజేపీని ఓడించేందుకే కాంగ్రెస్‌కు మద్దతు'

ఖమ్మం మయూరి సెంటర్: దేశ ప్రయోజనాలే కాక ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని బీజేపీని ఓడించేందుకు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో కూనంనేని, ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు మోదీ కుట్రలు చేస్తున్నారని కూనంనేని ఆరోపించారు. ఇదేక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ...దేశ ఉనికికి బీజేపీ ప్రమాదకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని భువనగిరి మినహా 16 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి పాల్గొని సీపీఎం మద్దతు కోరారు.

నేటి నుంచి బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీపరంగా చేపడుతున్న ఎన్నికల కార్యాచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి ఈనెల 8 వరకు వీధి చివర సమావేశాలు (స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్) నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. జాతీయ స్థాయి నుంచి మండల స్థాయి వరకు స్థానికంగా తమకు అందుబాటులో ఉన్న సమావేశాల్లో నాయకులు పాల్గొంటారని ఓ ప్రకటనలో తెలియజేశారు.

కేసీఆర్ అబద్ధాల కోరు: భట్టి

కూసుమంచి (ఖమ్మం జిల్లా): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పచ్చి అబద్ధాల కోరు అని, ఆయన నోరు తెరిస్తే అబద్ధం తప్ప నిజం రాదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి తరఫున ప్రచారంలో భాగంగా మంగళవారం కూసుమంచిలో నిర్వహించిన రోడ్ షోలో భట్టి ప్రసంగించారు. పదేళ్ల ప్రజలను మోసం చేసినట్లు గుర్తించడంతోనే ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకపోయినా కోతలున్నట్లు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు కర్రు కాల్చి వాతలు పెట్టినా ఆయనలో మార్పు రాలేదని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన ప్రతీ హామీని కచ్చితంగా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. కాగా, అబద్ధాల బీఆర్ఎస్‌తో పాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీని చిత్తుగా ఓడించి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేసేలా కార్యకర్తలు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రేణుకాచౌదరి మాట్లాడారు.



కూసుమంచిలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రి పొంగులేటి, ఎంపీ రేణుకాచౌదరి, అభ్యర్థి రఘురాంరెడ్డి తదితరులు

బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్.. కాంగ్రెస్ వీడియో మార్ఫింగ్‌తో

ప్రజాస్వామ్యం ఖూనీ



ప్రధాని మోదీ సభ కోసం వేములవాడ బైపాస్‌రోడ్డులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ సంజయ్

- ఎంపీ బండి సంజయ్‌కుమార్
- 8న ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని పిలుపు

వేములవాడ/సిరిసిల్లటౌన్: ఫోన్ ట్యాపింగ్స్‌లో బీఆర్ఎస్.. వీడియోల మార్ఫింగ్స్‌లో కాంగ్రెస్ పార్టీలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని, ఈ రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం వేములవాడలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం స్థానికంగా ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ ఈనెల 8న వేములవాడకు ప్రధాని నరేంద్రమోదీ వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఉదయమే ప్రధాని సభ ఉంటుందని, ఎన్నికల కోడ్ వల్ల ఎలాంటి ఆటంకాలు ఉండకుంటే రాజన్నను తప్పకుండా దర్శించుకుంటారని చెప్పారు. పదేళ్ల కాలంలో రాష్ట్రంలో నీచ రాజకీయాలు జరిగాయని, సభ్యసమాజం తలదించుకునేలా బీఆర్ఎస్ నాయకులు ఫోన్ ట్యాపింగ్ చేశారన్నారు. ఇక కాంగ్రెస్ నేతలు ఫేక్ వీడియోలు తయారు చేస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్లను బీజేపీ పక్కాగా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీ సంజయ్‌తోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తదితరులు బైపాస్‌రోడ్డులోని పలు ఖాళీ స్థలాలను పరిశీలించారు. రెండు రోజుల్లో సభ స్థలాన్ని ఫైనల్ చేస్తామని వారు చెప్పారు.

రేవంతన్నా.. నా గుండుతో నీకేమన్నా..

'రేవంతన్నా.. నా గుండుతో నీకేం పనన్నా.. నేను ఆరు గ్యారంటీల గురించి అడిగితే గుండు.. అరగుండు' అంటూ అవహేళనగా మాట్లాడుతున్నావని ఎంపీ బండి సంజయ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై మంగళవారం రాత్రి సిరిసిల్లకు వచ్చిన బండి గట్టి కౌంటర్ ఇస్తూ తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి భాషను చూసి జనాలు అసహ్యించుకుంటున్నారన్నారు. మీరు ఎన్ని అవాకులుచవాకులు మాట్లాడినా కరీంనగర్‌లో తాను భారీ మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, గంగాడి మనోహర్‌రెడ్డి, గంధ్ర నళిని, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభతో బీజేపీలో జోష్

మళ్లీ 8, 10 తేదీల్లో రాష్ట్రానికి ప్రధాని

- నేడు హైదరాబాద్‌లో అమిత్‌షా రోడ్‌షో



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ముందుకెళ్తున్న బీజేపీలో ప్రధాని మోదీ బహిరంగసభ నూతనోత్సాహాన్ని నింపింది. ఈ సభలో యువత పెద్దసంఖ్యలో పాల్గొనడం, మోదీ ప్రసంగం సందర్భంగా కరతాళధ్వనులు, నినాదాలతో హోరెత్తించడం పార్టీ కేడర్‌లో హుషారు తెచ్చింది. ఈ సభకు ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి కాంగ్రెస్ నాయకులకు నిద్రపట్టదంటూ మోదీ తన ప్రసంగం సందర్భంగా వ్యాఖ్యానించారు. మంగళవారం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అల్లాదుర్గ్‌లో నిర్వహించిన సభ సక్సెస్ కావడం పట్ల పార్టీ ముఖ్యనేతలు సంతోషాన్ని వ్యక్తంచేస్తున్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా బీబీ పాటిల్‌ను, మెదక్ ఎంపీ అభ్యర్థిగా ఎం.రఘునందన్‌రావును గెలిపించాలంటూ మోదీ కోరడంతోపాటు, ఈ ప్రాంతానికి సంబంధించి కేంద్రంలోని తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించడంపై ప్రజల్లో మంచి స్పందన కనిపించింది. మళ్లీ మే 8న వేములవాడలో, మే 10న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే బహిరంగసభల్లో మోదీ పాల్గొననున్నారు.

నేడు అమిత్‌షా రోడ్‌షో...

బీజేపీ అగ్రనేత, కేంద్రహోంమంత్రి అమిత్ షా బుధవారం హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో బేగంపేట ఎయిర్‌పోర్టులో దిగుతారు. ఆ తర్వాత పాతబస్తీ లాల్‌దర్వాజ మహంకాళి ఆలయం నుంచి అక్కడికి దగ్గరలోని సుధ టాకీస్ వరకు రోడ్‌షో నిర్వహిస్తారు. రాత్రి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో చేవెళ్ల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానాల్లో పార్టీపరంగా చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్షిస్తారు.

కాకిని వాలనియ్యమని చెప్పి గద్దలనే ఎత్తుకుపోయారు



రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- గాడ్ ప్రామిస్ పేరిట కొత్త నాటకం
- ఏ పాలనలో ఎలా ఉన్నామో ఉద్యోగులు ఆలోచన చేయాలని హితవు

జగదేవ్‌పూర్(గజ్వేల్), సిద్దిపేటజోన్: కేసీఆర్ ఇంటి మీద కాకి.. మా ఇంటి మీద వాలనియ్యబోమని నీతులు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి గద్దలనే ఎత్తుకుపోయారని, ఆ గుంపుమేస్త్రీకి ఓట్లతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో చేపట్టిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలు, రెండు లక్షల రుణమాఫీ చేస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు పారిపోయారో చెప్పాలని నిలదీశారు. గజ్వేల్ గడాకు మంజూరైన రూ.73 కోట్లతో పాటు గ్రామాలకు మంజూరైన ఎస్‌జీఎఫ్ నిధులను ఎందుకు వాపస్ తీసుకుపోయారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దుబ్బాకలో చెల్లని రూపాయి గజ్వేల్‌లో ఎలా చెల్లుతుందని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావునుద్దేశించి ఎద్దేవా చేశారు.

ఆ మాట ఇచ్చిన తర్వాతే సిద్దిపేటకు రావాలి

సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా జరిగిన ఆటో కార్మికుల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. 'రెండు, మూడు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు వస్తారట. ఏమి ఉద్ధరించారని వస్తున్నారు. ఏం ముఖం పెట్టుకొని వస్తారు, సిద్దిపేటకు మంజూరై నిర్మాణంలో ఉన్న వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించుకుపోయారు. ముందు వెటర్నరీ కళాశాల పనులు చేయిస్తామని మాట ఇచ్చిన తర్వాతే సిద్దిపేటలో అడుగు పెట్టాలి' అని డిమాండ్ చేశారు. కొడంగల్ ప్రగతి కోసం రేవంత్ ఎన్నయినా మంజూరైనా చేసుకోవచ్చనీ కానీ సిద్దిపేటకు మంజూరైన వాటిని కొడంగల్‌కు తీసుకెళ్లడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బాండ్ పేపర్ల మీద రాసి ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు గాడ్ ప్రామిస్ పేరిట కొత్త నాటకం ఆడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన అసమర్థత, చేతకానితనంతో అధికారులు, ఉద్యోగులను ఇబ్బందులు పెడుతోందని హరీశ్ ఆరోపించారు. విద్యుత్ కోతలు, తాగునీరు సమస్యలు బయటకు వస్తే సస్పెన్షన్, బదిలీ, షోకాజ్ నోటీసులు ఇస్తూ ఉద్యోగులను వేధించడం మంచి పద్ధతి కాదన్నారు. ఉద్యోగులు కూడా ఏ ప్రభుత్వంలో ఎలా ఉందో ఆలోచన చేయాలని సూచించారు.

ఆహ్వాన పత్రికల నుంచి... ప్రత్యేక యాప్‌ల దాకా

పోలింగ్ పెంచేందుకు హరియాణాలో ఈసీ యత్నాలు



చండీగఢ్: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో ప్రయోగం చేస్తోంది. హరియాణాలో మ్యూజికల్ బ్యాండ్స్, ఓటర్లకు ఆహ్వాన పత్రాలతో పాటు యాప్‌లు తదితరాలతో ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తోంది. యువ ఓటర్లను ఆకర్షించేందుకు మ్యూజికల్ బ్యాండ్స్ ఏర్పాటు చేసింది. ఇవి ఎన్నికల థీమ్ పాటలను ప్రదర్శిస్తాయి. ఓటుపై అవగాహన పెంచి, యువత కచ్చితంగా ఓటేసేలా ప్రోత్సహిస్తాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనురాగ్ అగర్వాల్ తెలిపారు. పంచ్‌కులలో తొలి బ్యాండ్ ప్రదర్శన ఉంటుందని, యువ ఓటర్లు అధికంగా ఉన్న అన్ని జిల్లాల్లో ఇవి సంగీత ప్రదర్శనలు ఇస్తాయని తెలిపారు. ఇక పోలింగ్ రోజు కేంద్రాల్లో పొడవాటి క్యూలు ఉంటాయని చాలామంది ఓటేయడానికే వెళ్లరు. అందుకే పోలింగ్ కేంద్రాల్లో క్యూ గురించి తెలియజేయడానికి 'ఓటర్స్ ఇన్ క్యూ' యాప్‌ను లాంచ్ చేస్తోంది. అలాగే పెళ్లిళ్లకు పంపినట్టుగా ఓటర్లకు కూడా ఆహ్వాన పత్రికలు పంపుతోంది. వాళ్లు మండుటెండల్లో పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టే అవస్థ లేకుండా ఇంటి దగ్గరే ఓటేసేలా గురుగ్రాంలో పలు బహుళ అంతస్తుల భవనాల్లో 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. హరియాణాలో రెండు కోట్ల మంది ఓటర్లున్నారు. వీరిలో 18–19 ఏళ్ల వయసు వారు 3.65 లక్షలు. 20–29 మధ్య వయసు వారు 39 లక్షలు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 70 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి 75 శాతానికి పైగా పెంచడమే లక్ష్యమని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

కురుక్షేత్ర యుద్ధాన్ని తలదన్నే రాజకీయాలకు హరియాణా ఆలవాలం. కుల సమీకరణాలు, పొత్తులు, కూటములు, వేరుకుంపట్లు ఇక్కడ పరిపాటి. జాతీయ పార్టీలతో పాటు ఒకప్పుడు చక్రం తిప్పిన ప్రాంతీయ పార్టీలూ రాజకీయంగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆధిపత్యం లభిస్తూ వస్తోంది. 2005 నుండి 2014 దాకా కాంగ్రెస్ చక్రం తిప్పగా పదేళ్లుగా బీజేపీ పట్టు బిగించింది. గత ఎన్నికల్లో సింగిల్‌గా పోటీ చేసి 10 సీట్లను క్లీన్‌స్వీప్ చేసిన కమలనాథులను రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు కలవరపెడుతున్నాయి. గత ఎన్నికల్లో సున్నా చుట్టిన కాంగ్రెస్ ఈసారి ఇండియా కూటమి రూపంలో కాషాయ పార్టీని ఢీకొడుతోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్





పోలింగ్ తేదీ: మే 25

సర్వేలు ఏమంటున్నాయి?!

బీజేపీ 8, ఇండియా కూటమి 2 సీట్లలో గెలుస్తాయని తాజా ఎన్నికల సర్వేలు అంచనా వేశాయి. సీఎం మార్పు, ప్రభుత్వ వ్యతిరేకత, రైతు ఆందోళనలు, తదితర పరిణామాలు కమలనాథుల జోరుకు కళ్లెం వేస్తాయని మరికొందరు రాజకీయ పండితులు అంటున్నారు.

స్టేట్ స్కాన్

కూటముల కురుక్షేత్రం

హరియాణా రాజకీయాలు జాతీయ, ప్రాంతీయ పార్టీల ఎత్తుజిత్తుల నడుమ సాగుతున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఏడు సీట్లు గెలిచిన బీజేపీ 2019లో ఒంటరిగా పోటీ చేసి మొత్తం 10 సీట్లూ ఒడిసిపట్టింది. కాంగ్రెస్‌కు ఒక్క సీటూ దక్కలేదు. ప్రాంతీయ పార్టీ ఇండియన్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ) 2014లో గెలిచిన 2 సీట్లనూ పోగొట్టుకుంది.

హరియాణాలో హోరాహోరీ → గత ఎన్నికల్లో బీజేపీ క్లీన్‌స్వీప్ → ఈసారి కాంగ్రెస్ గట్టి పోటీ → రాష్ట్రంలో చతుర్ముఖ పోరు

ఇండియా కూటమి, ప్రాంతీయ పార్టీలు సై...

రైతు సమస్యలు తదితరాలతో రాష్ట్రంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బీజేపీపై కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి రెట్టించిన ఉత్సాహంతో పోరాడుతోంది. పొత్తులో భాగంగా 9 సీట్లలో కాంగ్రెస్, ఒకచోట ఆప్ పోటీ చేస్తున్నాయి. మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా సారథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 31 సీట్లతో బలమైన ప్రతిపక్షంగా నిలిచిన కాంగ్రెస్ ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని పట్టుదలగా ఉంది. ధరల పెరుగుదల, కార్పొరేట్లతో మోదీ కుమ్మక్కు, విపక్షాలపై వేధింపులు, నిరుద్యోగం తదితరాలను ఇండియా కూటమి ప్రచారాస్త్రాలుగా చేసుకుంది. రైతు ఆందోళనలకు మద్దతుతో పాటు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత హామీలను మేనిఫెస్టోలో చేర్చడం కలిసొస్తుందని ఆశపడుతోంది. ఐఎన్ఎల్‌డీ, జేజేపీ కూడా ఒంటరిగా పోటీ చేస్తూ జాతీయ పార్టీలకు సవాలు విసురుతున్నాయి. అయితే జేజేపీ హరియాణా రాష్ట్ర చీఫ్ నిషాన్ సింగ్ ఎన్నికల వేళ పార్టీకి గుడ్‌బై చెప్పి షాకిచ్చారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన కార్పొరేట్ దిగ్గజం నవీన్ జిందాల్ కురుక్షేత్రలో ఆప్ నేత సుశీల్ గుప్తాతో తలపడుతున్నారు. అది హాట్ సీట్‌గా అందరినీ ఆకర్షిస్తోంది. 2004, 2009ల్లో కాంగ్రెస్ తరఫున ఇక్కడ గెలిచిన జిందాల్ 2014లో బీజేపీ చేతిలో ఓడారు. 2019లో పోటీకి దూరంగా ఉన్నారు.

బీజేపీకి కొత్త కష్టాలు...



2014 లోక్‌సభ ఎన్నికల్లో 7 సీట్లు గెలిచిన ఊపులో ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించింది. మనోహర్‌లాల్ ఖట్టర్ సీఎం అయ్యారు. 2019లో 10 లోక్‌సభ సీట్లూ నెగ్గినా అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పుంజుకోవడంతో హంగ్ వచ్చింది. అయినా జేజేపీ, స్వతంత్రుల మద్దతుతో బీజేపీ మళ్లీ గద్దెనెక్కింది. జేజేపీ చీఫ్ దుష్యంత్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టింది. ప్రభుత్వ వ్యతిరేకతతో బీజేపీకి కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై విభేదాలతో బీజేపీ, జేజేపీ పొత్తుకు తెరపడింది. దాంతో ఖట్టర్, దుష్యంత్ రాజీనామా చేశారు. ఎన్నికల ముందు ఓబీసీ వర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయాబ్ సింగ్ సైనీ సీఎం అయ్యారు. తాజాగా వెల్లువెత్తిన రైతు ఆందోళనలూ బీజేపీకి ప్రతికూలంగా మారొచ్చని భావిస్తున్నారు. మోదీ కరిష్మా, అయోధ్య రామమందిర నిర్మాణం, హిందుత్వ నినాదం తదితరాలనే పార్టీ నమ్ముకుంది.

ప్రాంతీయ పార్టీల్లో చీలికలు...

ఐఎన్ఎల్‌డీ వ్యవస్థాపకుడు, హరియాణా సీఎంగా, ఉప ప్రధానిగా చేసిన చౌదరి దేవీలాల్ అనంతరం పార్టీ పగ్గాలు చేపట్టిన కుమారుడు ఓం ప్రకాశ్ చౌతాలా నాలుగుసార్లు సీఎం అయ్యారు. ఉద్యోగ నియామకాల కుంభకోణంలో ఆయన, అవినీతి కేసుల్లో పెద్ద కుమారుడు అజయ్ సింగ్ చౌతాలా జైలు కెళ్లారు. దాంతో రెండో కుమారుడు అభయ్ సింగ్ చౌతాలా పార్టీ పగ్గాలు చేపట్టారు. అన్నదమ్ముల కుమ్ములాటతో పార్టీ చీలిపోయింది. అజయ్ సింగ్ కుమారులైన దుష్యంత్ చౌతాలా, దిగ్విజయ్ చౌతాలాను పార్టీ నుంచి తొలగించారు. దాంతో తండ్రి, సోదరునితో కలిసి దుష్యంత్ జననాయక్ జనతా పార్టీ (జేజేపీ)ని స్థాపించారు. జేజేపీ గత లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌తో కలిసి పోటీ చేసినా ఒక్క సీటూ దక్కలేదు. అభయ్ సారథ్యంలోని ఐఎన్ఎల్‌డీ కూడా ప్రభావం చూపలేకపోయింది. 2014లో హరియాణా జనహిత్ కాంగ్రెస్ (హెచ్‌జేసీ–బీఎల్)తో పొత్తు పెట్టుకున్న బీజేపీకి పెద్దగా ప్రయోజనం లభించలేదు. బీజేపీ 8 స్థానాల్లో పోటీ చేసి ఏడింటిని దక్కించుకోగా మూడు చోట్ల పోటీ చేసిన హెచ్‌జేసీకి ఒక్క సీటూ దక్కలేదు. హరియాణాలో మూడుసార్లు కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా పని చేసిన భజన్‌లాల్ 2007లో కుమారుడు కుల్దీప్ బిష్ణోయ్‌తో కలిసి ఈ పార్టీని స్థాపించారు. 2016లో కాంగ్రెస్‌లో విలీనం చేశారు.

'పోలింగ్'లో 'సమానత్వం'

అక్కడ స్త్రీ పురుషులు సమానం. ఎక్కడ? ఎలా? ఈ సమానత్వం ఎప్పుడు వచ్చింది? ఇలాంటి ప్రశ్నలన్నీ తలెత్తుతున్నాయా? ఏమీ లేదు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఎన్నికల సంఘం ఏదో ఒక కొత్త ప్రయోగం చేస్తూనే ఉంటుంది. అలాగే ఈసారి కూడా ఛత్తీస్‌గఢ్‌లో ఓ ప్రయోగం చేసింది. 300 పోలింగ్ కేంద్రాల్లో స్త్రీ, పురుష సిబ్బందిని సమాన సంఖ్యలో నియమించింది. ఒక బూత్‌లో నలుగురు సిబ్బంది ఉంటే వారిలో విధిగా ఇద్దరు మహిళలుంటారు. ఇందుకు రాయ్‌గఢ్ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఈసీ ఎంచుకుంది. అక్కడ 300 పోలింగ్ కేంద్రాల్లో ఇలా స్త్రీ, పురుష సిబ్బందిని సమానంగా నియమించింది. వీటిలో లైలుంగా అసెంబ్లీ స్థానం పరిధిలో 75, రాయ్‌గఢ్‌లో 100, ఖర్సియాలో 75, ధరమ్‌జయ్‌గఢ్ పరిధిలో 50 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లోని స్త్రీ, పురుష సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బడ్డీ ఓటర్... ముంజేతికి ఎన్నికల బంధం



గువాహటి: తొలిసారి ఓటేస్తున్న వారిని ఆకర్షించేందుకు అస్సాంలో ఎన్నికల సంఘం 'బడ్డీ ఓటర్' పేరిట వినూత్నంగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)లో భాగంగా కామ్‌రూప్ జిల్లా ఎన్నికల అధికారి జల్లి కీర్తి దీన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా గత ఎన్నికల్లో తొలిసారి ఓటేసిన విమలా ప్రసాద్ చలిహా కాలేజీ విద్యార్థులు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి ఓటేయబోతున్న విద్యార్థుల చేతికి బ్యాండ్ కట్టి ఆహ్వానించారు. ఇందుకోసం స్వీప్ బృందం రంగురంగుల బ్యాండ్స్ రూపొందించింది. రక్షాబంధన్ రోజు రాఖీ కట్టి అభయమిచ్చినట్టుగా ఇలా బ్యాండ్ కట్టి ఓటేయడానికి రమ్మంటూ ప్రోత్సహించడం బాగుందంటున్నారు విద్యార్థులు. తాను తొలిసారి ఓటేసినప్పుడు కాస్త నెర్వస్‌గా ఫీలయ్యానని, ఇప్పుడు కొత్తగా ఓటేస్తున్న వారికి ఆ ఫీలింగ్ లేకుండా భరోసా ఇవ్వడం బాగుందని మరో విద్యార్థి అన్నారు. ఓటర్లను ప్రోత్సహించడంతో పాటు సీనియర్లు, జూనియర్ల మధ్య ఆరోగ్యకర వాతావరణాన్ని పెంపొందించడానికి కూడా ఈ ప్రయోగం పనికొస్తుందంటున్నారు కాలేజీ ప్రిన్సిపల్ కమలా చంద్ర పథక్.

ఫలౌదీ చెప్తే అంతే..!

ఫలితాలపై కచ్చితమైన జోస్యాలు

- ఎన్నికల పందేలకు యమా ఫేమస్
- మోదీ మూడో విడత ఖాయమని జోస్యం



ఈ లోక్‌సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టడమే గాక ఏకంగా 370 సీట్లు దాటేస్తామని ప్రధాని మోదీ. బీజేపీకి 200 కూడా దాటవని కాంగ్రెస్. ఈ విడత ఢిల్లీ పీఠం ఎవరిని వరిస్తుంది? దేశ, విదేశాల్లో అందరిలోనూ ఉత్కంఠ రేపుతున్న అంశమిది. దీనిపై స్పష్టత రావాలంటే రాజస్తాన్ వెళ్లాల్సిందే. స్పష్టంగా చెప్పాలంటే జోధ్‌పూర్‌కు 142 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫలౌదీ అనే చిన్న పట్టణానికి వెళ్లాలి. పందేలకు ఈ ప్రాంతం కేరాఫ్ అడ్రసని చెప్పాలి. ఇక్కడి పందెం రాయుళ్లు చెప్పేది దాదాపుగా నిజమవుతుంది! ముఖ్యంగా ఎన్నికల ఫలితాలపై ఇక్కడి బుకీల అంచనాలు తప్పడం చాలా అరుదు...

సట్టా బజార్

ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఉప్పు తయారీ పరిశ్రమలకు కేంద్రం ఫలౌదీ. అయితే దీనికి అంతకు మించిన గుర్తింపు ఒకటుంది. అదే... 'సట్టా బజార్'! ఈ పేరుతో ఇది దేశ విదేశాల్లోనూ ప్రసిద్ధికెక్కింది. ప్రత్యేకించి ఎన్నికల బెట్టింగ్‌లకు ఇది పెట్టింది పేరు! అందుకే ప్రతి ఎన్నిక సమయంలోనూ విశ్లేషకులు ఈ సట్టా బజార్ వైపే చూస్తుంటారు. ఇక్కడి సట్టా బజార్ బుకీలు చెప్పిందే నిజమవుతూ వస్తుండటంతో ఎన్నికల జూదానికి ఈ ప్రాంతం హాట్ మార్కెట్‌గా మారిపోయింది. ఎగ్జిట్ పోల్స్‌ను కూడా తోసిరాజని ఇక్కడి సట్టా బజార్ చెప్పిందే నిజమైన సందర్భాలెన్నో! తాజాగా 2023 చివర్లో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల విషయంలో కూడా ఫలౌదీ బుకింగ్‌ల అంచనాలే నిజమయ్యాయి. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ ఫలితాల విషయంలో దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్సూ పప్పులో కాలేస్తే సట్టా బజార్ అంచనాలు మాత్రం అక్షరాలా నిజమయ్యాయి!

అంచనాల్లో కచ్చితత్వం

2023 రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెసే గెలవచ్చని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ 110 నుంచి 112 సీట్లతో బీజేపీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఫలౌదీలో పందేలు నడిచాయి. అన్నట్టుగానే బీజేపీ 115 సీట్లు గెలిచి అధికారంలోకి వచ్చింది. ఇక గుజరాత్‌లో బీజేపీ 136–138 స్థానాలు సాధిస్తుందని, కాంగ్రెస్ 30–31కి పరిమితమవుతుందని పందేలు కాశారు. చివరికి బీజేపీకి 156 స్థానాలు లభించాయి. హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీ గట్టి పోటీ ఇచ్చినా కాంగ్రెస్ నెగ్గుతుందని బెట్టింగ్ నడిచింది. కాంగ్రెస్‌కు 40 స్థానాలతో అధికారం చేజిక్కించుకోగా బీజేపీకి 25 వచ్చాయి. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీకి 50 నుంచి 52 స్థానాలు వస్తాయని అంచనా వేయగా 54 సీట్లతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్‌కు 37–39 రావచ్చని పందేలు నడవగా 35 సీట్లు దక్కాయి.

ఈ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపెవరిదో?

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 330–333 స్థానాల దాకా దక్కుతాయని ఫలౌదీ మార్కెట్లో బెట్టింగ్ బాబులు పందేలు వేసుకుంటున్నారు. అయితే, కాంగ్రెస్‌కు 100 దాటవచ్చని వారు అంచనా వేస్తుండటం విశేషం. బీజేపీకి 350 వస్తాయంటూ రూ.3 చొప్పున బెట్టింగ్ నడుస్తోంది. ఇది నిజమైతే పందెం కాసిన వారికి ప్రతి రూపాయికి రూ.3 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇక బీజేపీ 400 స్థానాలు గెలుచుకుంటే ప్రతి రూపాయికి ఏకంగా 12 నుంచి 15 రూపాయలిస్తామని బుకీలు ఆఫర్ చేస్తున్నారు. ఎన్డీఏకు 370 వరకు వస్తాయన్నది ఫలౌదీ అంచనా వేస్తున్నారు. 400 స్థానాలు గనుక వస్తే ప్రతి రూపాయిపై రూ.4–5 చెల్లిస్తామని బుకీలు చెబుతున్నారు.

వీరికెలా తెలుస్తుంది?

ఫలౌదీ సట్టా బజార్ అతిపెద్ద బెట్టింగ్ కేంద్రాల్లో ఒకటి. ఎన్నికల ఫలితాల మీదే కాకుండా, క్రికెట్, చివరికి వర్షాలపై కూడా ఇక్కడ పందేలు నడుస్తుంటాయి. కాకపోతే రూ.వందలాది కోట్లతో సాగే ఎన్నికల బెట్టింగ్ వాటాయే ఎక్కువ. నిత్యం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వ్యాపారం ఫోన్ కాల్స్ ద్వారా, ప్రత్యక్షంగా నడుస్తుంటుంది. ముఖ్యమైన రాజకీయ పార్టీలన్నింటితోనూ ఇక్కడి వారికి లోతైన సంబంధాలుంటాయి. పార్టీల వర్గాల నుంచి సమాచారాన్ని సేకరించి వాటి ఆధారంగా బెట్టింగ్‌లు నడుపుతుంటారు. రాజస్తాన్ సహా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు జూదాన్ని నిషేధించాయి. ఇక్కడ నడిచేదంతా చట్టవిరుద్ధమైన జూదమే.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఈసారి ఓటు మార్పు కోసమే

డింపుల్ యాదవ్ మనోగతం



ఇంటర్వ్యూ

ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కచ్చితంగా మార్పు కోసమే ఓటేస్తారని సమాజ్‌వాదీ పార్టీ నాయకురాలు డింపుల్ యాదవ్ ధీమా వెలిబుచ్చారు. మెయిన్‌పురి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఆమె ప్రచార పర్వంలో బిజీగా ఉన్నారు. మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని స్వగ్రామం సైఫైలో పీటీఐ ప్రత్యేక ముఖాముఖిలో పలు అంశాలపై డింపుల్ తన మనోగతాన్ని ఇలా పంచుకున్నారు...

బీజేపీపై..

బీజేపీ పూర్తిగా ఓటు బ్యాంక్ రాజకీయాల్లో మునిగిపోయింది. కులాల లెక్కన జనాన్ని విడగొడుతోంది. జనం మనోభావాలతో ఆడుకుంటోంది. కీలక సమస్యల నుంచి జనం దృష్టి మరల్చుతోంది. బీజేపీ రాజకీయ ఒత్తిళ్లతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారు. విభజన రాజకీయాలతో వర్గాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటోందని వారికి తెలిసొచ్చింది. అందుకే కేంద్రంలో ఈసారి అధికార మార్పు కోసమే జనం ఓటేస్తారు.

దర్యాప్తు సంస్థలు, ధరలపై..

ఈడీ, సీబీఐ, ఐటీ ఇలా ప్రతి దర్యాప్తు సంస్థనూ కేంద్రంలోని బీజేపీ సర్కార్ దుర్వినియోగం చేసింది. ఉత్తరప్రదేశ్‌లో జిల్లా స్థాయిలోనూ యోగి ఆదిత్యనాథ్ సర్కార్ జనాన్ని పీడిస్తోంది. ద్రవ్యోల్బణం విజృంభిస్తోంది. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు జనాలకు చేరట్లేవు. వాగ్దానాలైతే జోరుగా చేస్తున్నారుగానీ క్షేత్రస్థాయిలో వాటి అమలు అస్సలు కనిపించట్లేదు. దేశాన్ని బీజేపీ ఎటు వైపు తీసుకెళ్తుందో అందరికీ తెలుసు. పోషకాహార లోపం, ఆకలి చావుల రేటింగ్స్, గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో భారత్ స్థానం ఏటికేడు దిగజారుతోంది. మళ్లీ బీజేపీ గెలిస్తే దేశం 15 ఏళ్లు తిరోగమనంలోకి వెళ్లడం ఖాయం. దేశ భవిష్యత్తును కాపాడుకోవాల్సిన తరుణంలో వచ్చిన ఎన్నికలివి.

మోదీ మంగళసూత్రం వ్యాఖ్యలపై

ఇదొక్కటే వాళ్లకు ఆయుధంగా దొరికింది. జనం భవితకు సంబంధించిన ఏ అంశమూ బీజేపీకి పట్టదు. యూపీలో మొత్తం 80 సీట్లు గెలిచేస్తామని అబద్ధాలు చెబుతున్నారు. అందులో నిపుణులు వాళ్లు. కానీ వాళ్ల మాటలను ఈసారి జనం నమ్మట్లేరు. గట్టి గుణపాఠమే చెప్తారు. అత్యంత అవినీతి నేతలను బీజేపీ లాగేసి డ్రై క్లీనింగ్ మెషీన్‌లో పడేస్తోంది. అంతా రాజకీయ లబ్ధికోసమే చేస్తుంది.

గెలుపు మెజారిటీ తగ్గడంపై..

మామ ములాయం సింగ్ యాదవ్ కాలం నుంచి చూస్తే భారీ మెజారిటీ అనేది తగ్గడం వాస్తవమే. 2019లో ఆ మెజారిటీ కేవలం 94000కు తగ్గింది. ఎన్నికలు ఎప్పుడూ ఒకేలా జరగవు. ప్రతిసారీ గెలుపును వేర్వేరు కారణాలు ప్రభావితం చేస్తాయి.

తన ప్రచార సరళిపై..

రోజుకు ఎనిమిది, తొమ్మిది మీటింగ్‌లలో పాల్గొంటున్నా. విపక్షాల 'ఇండియా' కూటమికి జనం నుంచి వస్తున్న స్పందన అద్భుతం. నా కూతురు అదితి యాదవ్ సైతం తొలిసారిగా ప్రచారంలో పాల్గొంటోంది. గ్రామాలకు వెళ్తూ వారిని కలుస్తోంది. ములాయం మరణంతో వెల్లువెత్తిన సానుభూతి కారణంగానే 2022 మెయిన్‌పురి ఉపఎన్నికల్లో 2.8 లక్షల భారీ మెజారిటీతో ఎస్పీ గెలిచిందన్న బీజేపీ వ్యాఖ్యల్లో నిజంలేదు. జనం మనసుల్లో మేమే ఉన్నాం. ఈసారీ గెలుపు మాదే. ఆర్మీలో పనిచేస్తున్న యువతతోపాటు వృద్ధులు, మహిళలు అంతా బీజేపీ వాగ్దానాలను నెరవేర్చలేదన్న నిస్పృహలో ఉన్నారు.

– మెయిన్‌పురి

• ఉజ్వల్ నికమ్

ప్రజా కోర్టు ముందుకు

పరిచయం

ఉజ్వల్ నికమ్. 26/11 ముంబై ఉగ్ర దాడి కేసును వాదించి దేశవ్యాప్తంగా ఖ్యాతితో పాటు ఏకంగా జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత పొందిన ప్రముఖ న్యాయవాది. ఆకట్టుకునే హావభావాలు, వన్ లైనర్ పంచ్‌లతో నిండిన వాదనలకు పెట్టింది పేరు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు. 71 ఏళ్ల ఉజ్వల్ ముంబై నార్త్ సెంట్రల్ నుంచి బీజేపీ తరఫున బరిలోకి దిగుతున్నారు. ముంబై కాంగ్రెస్ చీఫ్ వర్షా గైక్వాడ్‌తో తలపడుతున్నారు. సిట్టింగ్ ఎంపీ పూనమ్ మహాజన్‌ను కాదని నికమ్‌కు బీజేపీ టికెటిచ్చింది. ఆమె తండ్రి, బీజేపీ దిగ్గజం ప్రమోద్ మహాజన్ హత్య కేసును ఆయనే వాదించడం విశేషం...!

- సాక్షి, నేషనల్ డెస్క్



30 ఏళ్ల కెరీర్...

ఉజ్వల్ నికమ్ జల్గావ్ జిల్లాలో సివిల్ లాయర్‌గా కెరీర్ ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయ కేసులు వాదించి తనదైన ముద్ర వేశారు. 1991లో కళ్యాణ్ బాంబు పేలుడు కేసులో ముద్దాయి రవీందర్ సింగ్‌ను దోషిగా రుజువు చేయడంలో కీలక పాత్ర పోషించారు. 1993 ముంబై వరుస పేలుళ్ల కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వాదించడం ఆయన కెరీర్లో కీలక మలుపు. ఉగ్రవాద (నిరోధక) చట్టం కింద ఏర్పాటైన ప్రత్యేక కోర్టులో 14 ఏళ్లకు పైగా పని చేశారు. ఇక 26/11 ముంబై దాడుల విచారణలో మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించారు. విచారణ విశేషాలను రోజూ మీడియాకు వివరిస్తూ దేశవ్యాప్తంగా ఫేమసయ్యారు. అప్పట్లో ఆయనకు జెడ్ ప్లస్ భద్రత కల్పించడం విశేషం! ముంబై దాడి నిందితుడు అజ్మల్ కసబ్ జైలులో మటన్ బిర్యానీ డిమాండ్ చేశారని చెప్పిన నికమ్, అది అబద్ధమని తర్వాత అంగీకరించడం విశేషం! టీ సిరీస్ అధినేత గుల్షన్ కుమార్ హత్య, బీజేపీ అగ్రనేత ప్రమోద్ మహాజన్ హత్య, పుణే ఊచకోత, గ్యాంగ్‌స్టర్ అబూ సలేం, కొల్హాపూర్ పిల్లల వరుస హత్యలు, శక్తి మిల్ గ్యాంగ్ రేప్, డేవిడ్ హెడ్లీ కేసు వంటి ఎన్నో హై ప్రొఫైల్ కేసుల్లో ఆయన వాదించారు. 2013 ముంబై గ్యాంగ్ రేప్ కేసు, 2016 కోపర్డి రేప్ అండ్ మర్డర్ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కూడా ఆయనే. ఇప్పటివరకూ నికమ్ వాదించిన కేసుల్లో ఏకంగా 37 మందికి మరణశిక్ష, 628 మందికి జీవిత ఖైదు పడటం విశేషం! అయితే 2011 ముంబై ట్రిపుల్ పేలుళ్ల కేసు, మొహ్సిన్ షేక్ హత్య వంటి పలు కేసుల విచారణ నుంచి ఆయన అర్ధాంతరంగా తప్పుకున్నారు. జైబుద్దీన్ అన్సారీ అలియాస్ అబు జుందాల్‌పై 26/11 విచారణ, నటి లైలా ఖాన్ హత్య కేసుల్లో ప్రాసిక్యూటర్‌గా కొనసాగుతున్నారు. లాయర్‌గా 30 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో కేసుల్లో నెగ్గిన ఆయన ప్రజా కోర్టులో ఏ మేరకు నెగ్గుకొస్తారో చూడాలి.

తల్లి స్వాతంత్య్ర యోధురాలు...

ఉజ్వల్ నికమ్ మహారాష్ట్రలోని జల్గావ్‌లో మరాఠీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి దేవరావుజీ నికమ్ న్యాయమూర్తి. తల్లి విమలాదేవి స్వాతంత్య్ర యోధురాలు. జల్గావ్‌లోని ఎస్ఎస్ మనియార్ లా కాలేజీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. న్యాయ రంగంలో కృషికి 2016లో పద్మశ్రీ అందుకున్నారు. ఉజ్వల్ కొడుకు అనికేత్ నికమ్ ముంబై హైకోర్టులో క్రిమినల్ లాయర్. లోక్‌సభకు పోటీ చేయనుండటం చాలా పెద్ద బాధ్యత అని అన్నారాయన. ''కొత్త పాత్రకు సిద్ధంగా ఉన్నా. ముంబై నార్త్ సెంట్రల్‌లో ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తా. చాలా ముఖ్యమైన కేసుల్లో మహారాష్ట్రకు ప్రాతినిధ్యం వహించాను. ఇప్పుడు దేశ వ్యతిరేకులపై గొంతు వినిపిస్తా. పేదలకు న్యాయం జరిగేలా చేస్తా'' అని చెబుతున్నారు.

అదే నా కల

ఎప్పటికీ జనం గుండెల్లో బతికి ఉండాలి

దేవుడు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నా

రూ.2.70 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం

అవినీతి, వివక్ష ఎక్కడుంది? ప్రజల్లోకి వెళ్లి నేరుగా మైకు పెట్టి అడగండి

ఇండియాటుడే టీవీ చానల్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ ఇంటర్వ్యూలో సీఎం వైఎస్ జగన్



'అణగారిన, వెనుకబడిన వర్గాల ప్రజలు, అగ్రవర్ణ పేదల జీవితాల్లో వెలుగులు నింపే అవకాశాన్ని దేవుడు నాకు ఇచ్చాడని గట్టిగా నమ్ముతున్నా. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నా. నేను మరణించినా, ప్రజల గుండెల్లో బతికి ఉండాలన్నదే నా కల' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌ను ఇండియా టుడే టీవీ ఇంటర్వ్యూ చేసింది.

రాజ్‌దీప్: మీరు 2019 ఎన్నికలకు ముందు ప్రజా సంకల్ప యాత్ర పేరుతో పాదయాత్ర చేసి చంద్రబాబును చాలెంజ్ చేశారు. ఇప్పుడు చంద్రబాబు మీకు చాలెంజ్ చేస్తున్నారు. మీరు అధికారంలో ఉండి ఎన్నికలకు వెళ్లడం గతంతో పోలిస్తే ఇది కఠినంగా అనిపిస్తోందా?

సీఎం జగన్: సాధారణ పరిస్థితుల్లో అనిపించొచ్చు. కానీ, ఇక్కడ వాస్తవం ఏమంటే.. మేము ప్రజలకు సుపరిపాలన అందించాం. మా మేనిఫెస్టోలోని 99 శాతం వాగ్దానాలను త్రికరణ శుద్ధిగా అమలు చేసి చూపించాం. అర్హతే ప్రామాణికంగా, ఎలాంటి వివక్ష లేకుండా.. అవినీతికి తావు లేకుండా అత్యంత పారదర్శకంగా రూ.2.70 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం.

రాజ్‌దీప్: మీరు చాలా డబ్బు ప్రజలకు చేరిందని చెబుతున్నారు.. ఇలా నగదు బదిలీ ద్వారా ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని కొంత మంది ఆరోపిస్తున్నారు.. ఏపీలో నేరుగా రైతులకు డబ్బులు ఇస్తున్నారు. ఇలా క్యాష్ ట్రాన్స్‌ఫర్ కాకుండా.. ఉత్పాదక ఉపాధి కోరుకుంటున్న వాళ్లకి ఏం చెబుతారు?

సీఎం జగన్: ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే రాజ్‌దీప్.. కొందరిలో ఆ కన్ఫ్యూజన్ ఉంది. మేం చాలా సమగ్రమైన విధానాలను అనుసరించాం. రైతుల గురించే తీసుకుంటే.. ఏ విధంగా వ్యవసాయానికి భరోసా ఇచ్చామో తెలుస్తుంది. రాష్ట్రంలో 50 శాతం మంది అర్ధ హెక్టార్, 70 శాతం మంది ఒక హెక్టార్ లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులున్నారు. ఇలాంటి వారందరి కోసమే రైతు భరోసా ప్రవేశపెట్టాం. ఏటా రూ.13,500 పెట్టుబడి సాయంగా ఇస్తున్నాం. మేము ఐదేళ్లలో రూ.50 వేలు ఇస్తామని చెప్పి.. రూ.67,500 ఇచ్చాం. ఇది రైతులకు 80 శాతం సాగు ఖర్చులుగా ఉపయోగపడుతుంది. దీనికి తోడు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) తీసుకొచ్చాం. గ్రామ సచివాలయాన్ని పెట్టాం. 60–70 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున సేవలు అందిస్తున్నారు. ప్రతి పథకం అవినీతి, వివక్ష లేకుండా క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుడి దగ్గరకు నేరుగా చేరుతోంది. సమస్త ప్రభుత్వ సేవలన్నీ పేదల ఇంటి ముంగిటనే నిలిచాయి.

రాజ్‌దీప్: సంక్షేమ పథకాలతో రాష్ట్రం దివాలా తీస్తోందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అందుకే కేంద్రం సాయం కోసం ఢిల్లీకి వెళ్తున్నారని ఆరోపించాయి కదా?

సీఎం జగన్: రాజ్‌దీప్.. మనం డబ్బు ఎక్కడ ఖర్చు చేస్తున్నామో చూడాలి. ఎవరైనా మాట్లాడే ముందు ఆలోచించాలి. పథకానికి ఏ పేరు పెట్టినా ఆ డబ్బు ఎవరికి వెళ్లి.. ఎంత మేలు చేసిందో చూసుకోవాలి. దీన్ని సామాజిక పెట్టుబడిగా చూడాలి.

రాజ్‌దీప్: రాష్ట్రంపై రూ.4.42 లక్షల కోట్ల అప్పు ఉంది. ఆ దబ్బుల కోసమే మీరు కేంద్రంపై ఆధారపడ్డారా?

సీఎం జగన్: ఇదంతా ప్రతి రాష్ట్రంలో ఉంటుంది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల మేరకే ఏ రాష్ట్రమైనా అప్పులు చేస్తుంది. ఆ పరిమితులను దాటి ఏ రాష్ట్రం కూడా అప్పు చేయలేదు.

రాజ్‌దీప్: నేరుగా డీబీటీతో ఆర్థిక భరోసా కల్పించడం ద్వారానే మీరు తిరిగి మరోసారి అధికారంలోకి వస్తారని నమ్ముతున్నారా? ఇదే మీ విన్నింగ్ కార్డు అనుకోవచ్చా?

సీఎం జగన్: ఇక్కడ సరిగా అర్థం చేసుకోవాలి. డబ్బు ఎక్కడికి.. ఎలా.. వెళ్లిందో చూడాలి. మేము ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఇంగ్లిష్ మీడియంలోకి తీసుకొచ్చాం. ద్విభాషా పాఠ్య పుస్తకాలు అందిస్తున్నాం. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించాం. ఆరో తరగతి నుంచి ప్రతి తరగతి గదిలో ఐఎఫ్‌పీ ప్యానల్స్‌ను పెట్టి డిజిటల్ బోధన అందిస్తున్నాం. ప్రతి ఎనిమిదో తరగతి విద్యార్థి చేతిలో బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్‌లు పెట్టాం. ఇది సిలబస్‌తో కనెక్ట్ అయి ఉంటుంది. ఇలా చూస్తే విద్యా వ్యవస్థలో చాలా మార్పులు కనిపిస్తాయి. టోఫెల్ శిక్షణ కోసం ప్రత్యేక పీరియడ్ తీసుకొచ్చాం. ఇదంతా ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థుల కోసం జరుగుతోంది. 2025 విద్యా సంవత్సరంలో ఫస్ట్ క్లాస్ విద్యార్థి ఐబీ సిలబస్‌లో చదువుకుంటాడు. 2035 నాటికి మా పిల్లలు ఐబీ బోర్డు పరీక్షలు రాస్తారు. ప్రతి ఏటా ఒక్కో తరగతికి ఐబీని అప్‌గ్రేడ్ చేసుకుంటూ వెళ్తాం. సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చే ప్రతి రూపాయి పేదవాడి భవితను మారుస్తోందనడానికి ఇలా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

> **రాజ్‌దీప్:** కేంద్రంలో అధికారం కోసం మోదీకి సీట్లు తగ్గితే మీరు 20 ఎంపీ సీట్లతో సపోర్ట్ చేస్తారా?
> **సీఎం జగన్:** ఊహాజనిత పరిస్థితి గురించి ఎందుకు మాట్లాడటం.. ఇప్పుడు వారు నేను ఒకరికొకరం వ్యతిరేకంగా పోరాడుతున్నాం.



> **రాజ్‌దీప్:** మీరు మళ్లీ గెలిస్తే విశాఖపట్నాన్ని రాజధానిని చేసే విషయంలో కచ్చితమైన స్పష్టతతో ఉన్నారా?
> **సీఎం జగన్:** అమరావతి గురించి మాట్లాడే వారు రూ. లక్ష కోట్లు ఎలా ఖర్చు చేస్తారో చెప్పగలరా.. కనీసం రూ.5 వేల కోట్లు ఖర్చు చేయలేదు. ఒక వేళ అమరావతి కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేయడం మొదలుపెడితే పది పదిహేనేళ్లు పడుతుంది. అప్పటికి ఈ లక్ష కోట్లు పది లక్షల కోట్లు అవుతుంది. రాజధాని అనేది కలగానే మిగులుతుంది. విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్‌లో నంబర్ వన్ నగరం. విశాఖలో ఇప్పటికే రహదారులు ఉన్నాయి. ఎయిర్‌పోర్టు ఉంది. మౌలిక సదుపాయాలన్నీ అక్కడ ఉన్నాయి. కేవలం రూ.5 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్లు వెచ్చిస్తే రాబోయే 5-10 సంవత్సరాలలో హైదరాబాద్, బెంగళూరు లేదా చెన్నైతో వైజాగ్ పోటీ పడడాన్ని మీరు నిజంగా చూస్తారు.

రాజ్‌దీప్: 81 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలను మీరు మార్చారు. వైఎస్సార్‌సీపీలో వన్ మ్యాన్ షో జరుగుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. వైఎస్ జగన్ అనే పేరు చెప్పి ఈ రోజున ఓట్లు అడుగుతున్నారు. ప్రాంతీయ పార్టీలో ఇది హైరిస్క్ ఫార్ములా కాదంటారా?

సీఎం జగన్: ప్రతి రాజకీయ పార్టీకి ఒక సొంత సర్వే ఉంటుంది. ఆ సర్వేల ప్రకారం ఈ రోజున మా ప్రభుత్వం మీద, సీఎంగా నా మీద ప్రజల్లో ఎటువంటి వ్యతిరేకత లేదు. ఇది రియాలిటీ. అందుకే నేను చాలా నమ్మకంగా ఉన్నాను.

రాజ్‌దీప్: అందుకేనా జగన్ పేరిటే ఓట్లు అడుగుతున్నారు?

సీఎం జగన్: అవును. నేను ఎంతో నమ్మకంగా ఉన్నాను. నేను ఎక్కడికి వెళ్లినా ప్రజలకు ఒకటే చెబుతున్నా. ప్రస్తుతం జరుగుతున్నవి ఎంపీలు, ఎమ్మెల్యేలను ఎన్నుకునే ఎన్నికలు కాదు. మీ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలని వివరిస్తున్నా. 'మీ భవిష్యత్ జగన్‌తో ఉంటే భద్రంగా ఉంటుంది. జగన్ ద్వారానే మీ భవిష్యత్ మంచి మలుపు తిరుగుతుంది' అంటేనే వైఎస్సార్‌సీపీకి ఓటేయమని అడుగుతున్నా. అంతేకాదు.. గడిచిన ఐదేళ్లలో మా ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందినట్లయితేనే, మంచి పరిపాలన అందించారని భావిస్తేనే ఓటేయాలని అడుగుతున్న ఏకైక పార్టీ కూడా వైఎస్సార్‌సీపీ.

రాజ్‌దీప్: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, మీ సొంత చెల్లి షర్మిల ఇలా అందరూ అటు వైపు ఉంటే మీరొక్కరే ఇటువైపు ఉన్నారు. వాళ్లందరూ ఒక్కటిగా వస్తున్నారు. ఇది మీకు ఇబ్బందికరంగా లేదా?

సీఎం జగన్: గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలకు మంచి పరిపాలన నేను అందించాను. మంచి చేశాను కాబట్టే నేను ధైర్యంగా ఒంటరిగా ప్రజల్లోకి వెళుతున్నాను. ప్రజలకు కూడా నాపై నమ్మకం ఉంది. నన్ను ఒంటరిగా ఎదుర్కోడానికి ప్రతిపక్షాలు భయపడుతున్నాయి. అందుకే గుంపులుగా వస్తున్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. 50 శాతం పైగా ఓట్లు ఎవరికి వస్తే వాళ్లు విజయం సాధిస్తారు.

> **రాజ్‌దీప్:** మీరేమో అవినీతి లేదంటున్నారు? ప్రతిపక్ష నేత చంద్రబాబు భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారు..
> **సీఎం జగన్:** చంద్రబాబు నిరాశ, నిస్పృహల్లో మునిగిపోయి అలా మాట్లాడుతున్నారు. మీరే నేరుగా ప్రజల దగ్గర మైక్ పెట్టి అడగండి. మేము చెప్పిన హామీలు, పథకాలతో ఎంత ఆర్థిక మేలు జరిగిందో చెబుతారు. పైస్థాయిలో నేను చెప్పిన ప్రతి రూపాయి కింది స్థాయిలోని లబ్ధిదారులకు నేరుగా చేరింది. సంక్షేమ పథకాలకు సంబంధించి డీబీటీ ద్వారా కోట్ల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో పడుతుంటే అవినీతి, వివక్ష ఎక్కడ ఉంటుంది?

రాజ్‌దీప్: అమరావతి గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా చేసేందుకు చాలా కష్టపడ్డానని, ఎంతో ఖర్చు చేశానని చంద్రబాబు చెబుతున్నారు. కానీ మీరు మూడు రాజధానులు మా విధానం అంటున్నారు. రాజధాని అంశం సుప్రీంకోర్టులో స్టక్ అయ్యింది. శాశ్వత రాజధాని లేకుండా పరిపాలన ఎలా? రైతుల నుంచి భూములు తీసుకుంటే ప్రస్తుత సీఎం వాటిని వెనక్కు ఇచ్చేస్తున్నారని చంద్రబాబు అంటున్నారు.

సీఎం జగన్: అమరావతి ఎక్కడుంది.. అమరావతి అంటే ఏమిటనేది ముందుగా మనం ఆలోచించాలి. అమరావతి.. గుంటూరు, విజయవాడకు 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. 50 వేల ఎకరాల భూ సమీకరణ జరిగింది. అదంతా మూడు పంటలు పండే భూమి. అమరావతి రాజధాని అనేది ఒక కుంభకోణం. తన సన్నిహితులు ముందే భూములు కొనుగోలు చేసేశాక అప్పుడు చంద్రబాబు అక్కడ రాజధానిని డిక్లేర్ చేశారు. రహదారులు, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికే వారి సొంత నివేదిక ప్రకారమే ఎకరాకు రూ.2 కోట్లు అవుతుంది. అంటే మొత్తంగా రూ. లక్ష కోట్లు కేవలం మౌలిక సదుపాయాల కల్పనకే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంత డబ్బును రాష్ట్రం ఎక్కడి నుంచి తెస్తుంది?

రాజ్‌దీప్: జగన్‌పై రాయితో దాడి చేయడం అనేది పూర్తిగా ఓ డ్రామా అని, అదంతా సింపతీ కోసం జగనే క్రియేట్ చేసుకున్నాడని చంద్రబాబు అంటున్నారు. తనను అక్రమంగా అరెస్ట్ చేసి, జైలుకు పంపారని, జగన్ ఆంధ్రాలో డిక్టేటర్‌గా వ్యవహరిస్తున్నారని చంద్రబాబు ఆరోపిస్తున్నారు..

సీఎం జగన్: ఎవరి ద్వారా ఈ రాయి వచ్చింది? వాళ్ల మనుషుల ద్వారానే వచ్చింది. చంద్రబాబు ఏం మాట్లాడుతున్నారు? అక్కడ చంద్రబాబు నిలబడి, అదే వేగంతో అదే రాయితో కొట్టించుకుని, మూడు కుట్లు వేయించుకోమనండి. ఆయనకూ సింపతీ వస్తుంది.

రాజ్‌దీప్: పాత కేసుల్లో సీఐడీని వాడి చంద్రబాబును జైలుకు పంపారని, జగన్ శత్రువులను, తనకు వ్యతిరేకంగా మాట్లాడిన వాళ్లను ఈ విధంగా వేధిస్తారనే వాదన ఉంది.

సీఎం జగన్: ఎవరు తప్పు.. ఎవరు ఒప్పు అనేది న్యాయస్థానం పెట్టే పరీక్షలో తేలుతుంది. చంద్రబాబుని 52 రోజులు జైలుకు పంపడం సరైనదేనని కోర్టులు భావించాయి. అంటే అతను ఏదో చేశాడనే కదా అర్థం. బెయిల్ అనేది ప్రతి ఒక్కరి హక్కు. అది ఏదో సమయంలో వస్తుంది. నిజం ఏంటంటే ఆ కుంభకోణం జరిగిందనడానికి సరిపడా ఆధారాలు ఉన్నాయి.

రాజ్‌దీప్: ఎన్నికల అనంతరం కేంద్రంతోనూ, ప్రధానితోనూ మీ సంబంధాలు ఎలా ఉండబోతున్నాయి? అభివృద్ధి కోసమే తాను బీజేపీతో పొత్తు పెట్టుకున్నానని చంద్రబాబు అంటున్నారు.

సీఎం జగన్: ప్రస్తుతం చంద్రబాబు, మోదీ పొత్తులో ఉన్నారు. వారు పొత్తు పెట్టుకుంటే అభివృద్ధి కోసమా.. అదే ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేంద్రంతో సత్సంబంధాలు కలిగి ఉంటే అది ఇంకోదానికోసమా?

రాజ్‌దీప్: ఇంగ్లిష్ మీడియం విద్య, ఐబీ, ఇలాంటి విప్లవాత్మక మార్పులన్నీ గ్రామ స్థాయిలో సాధ్యం అవుతాయా? క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటున్నాయని అందరూ అంటున్నారు..

సీఎం జగన్: ఎవరు అంటున్నారు? ఈ రోజు మీరు ఒక గ్రామానికి వెళ్లండి. మార్పు మీ కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. గ్రామంలోకి ప్రవేశించిన వెంటనే గ్రామ సచివాలయం కనిపిస్తుంది. ఈ సచివాలయం ద్వారా ప్రజలకు గ్రామ స్థాయిలోనే 600 రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 60, 70 ఇళ్లకు ఒక వలంటీర్ ఉంటున్నారు. వీళ్ల ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా వ్యవహరిస్తున్నారు. ప్రతి గ్రామస్తుడి చేయి పట్టి ముందుకు నడిపే కార్యక్రమం చేస్తున్నారు. అదే గ్రామంలో నాలుగు అడుగులు ముందుకు వేస్తే వైఎస్సార్ విలేజ్ క్లినిక్ కనిపిస్తుంది. మరో నాలుగు అడుగులు ముందుకు వెళితే ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ బడి ఉంటుంది. ఇంకొంచెం ముందుకు పోతే వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం కనిపిస్తుంది. ఇవన్నీ గ్రామ స్థాయిలో అభివృద్ధికి తార్కాణాలు. గతంలో ఇవన్నీ ఎక్కడా మనకు కనిపించేవి కాదు. ప్రభుత్వం లేదా ఒక పెద్ద పరిశ్రమ ద్వారా భారీ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి కల్పన సాధ్యపడదు. ఎకానమీని డ్రైవ్ చేసే ఎంఎస్ఎంఈలు, సెల్ఫ్ ఎంప్లాయిడ్ సెక్షన్లను మేం ప్రోత్సహించాం. ఈ రోజున 62 శాతం ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. అదే విధంగా స్వయం సహాయక బృందాల్లోని మహిళలు, మత్స్యకారులు, స్ట్రీట్ వెండర్స్, బార్బర్స్, టైలర్లు, ఆటో డ్రైవర్లు వీళ్లంతా రాష్ట్ర అభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషిస్తారు. ఈ క్రమంలో వీరందరికీ బ్యాంక్‌లు, వివిధ పథకాల ద్వారా ఆర్థికంగా చేయూతగా నిలిచాం.



రాజ్‌దీప్: సర్వశక్తులు ఒడ్డుతున్న వారితో పోరాటంలో మిమ్మల్ని ముందుకు నడిపిస్తున్నదేమిటి?


సీఎం జగన్: అణగారిన వర్గాలు, నిరుపేదల జీవితాలను మార్చే అవకాశాన్ని దేవుడు నాకు ఇచ్చాడని నేను గట్టిగా నమ్ముతాను. దాని కోసం దేవుని దయ వల్ల నేను ఏం చేయగలనో అది చేస్తున్నాను. నాకు కావాల్సింది.. నా కల ఒక్కటే. నేను మరణించినా ప్రజల గుండెల్లో బతికుండాలి.

> **రాజ్‌దీప్ :** ఈ ఎన్నికల్లో మీ సోదరి మీకు వ్యతిరేకంగా నిలబడ్డారు. ఇది ప్రతిష్టకు భంగంగా భావిస్తున్నారా?
> **సీఎం జగన్:** ఆమె డిపాజిట్ కోల్పోతుండటం నాకు చాలా బాధ కలిగిస్తోంది. ఏ పార్టీ అయితే నా తండ్రి పేరును సీబీఐ చార్జ్‌షీట్‌లో చేర్చిందో.. ఏ పార్టీ అయితే కల్పిత కేసులను నాపై పెట్టిందో అందరికీ తెలుసు. అవి కాంగ్రెస్, టీడీపీలు. ఈ రోజు నా సోదరిని ఎవరు నడిపిస్తున్నారో తెలుసా.. రేవంత్ ద్వారా చంద్రబాబు నడిపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ రిమోట్ చంద్రబాబు చేతిలో ఉంది. బీజేపీ రిమోట్ చంద్రబాబు చేతిలో ఉంది. ఈ రోజు జగన్ ఫైట్ చేస్తోంది కేవలం ఒక్క బీజేపీతోనే కాదు. కాంగ్రెస్‌తో కూడా.


కేంద్రం టైటిల్‌తో బాబు డ్రామా

అమల్లోకే రాని ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై నాటకాలు

- భూములు లాక్కుంటున్నారంటూ ఎల్లో ముఠా వికృత క్రీడ
- ఐవీఆర్ఎస్ కాల్స్, వీడియోలతో భయభ్రాంతుల్ని చేసే యత్నం
- భూములన్నీ జగన్ పేరిటే రిజిస్టర్ చేస్తున్నారంటూ పిచ్చి వ్యాఖ్యలు
- నిజానికి ఈ చట్టం తెచ్చేందుకు 1989 నుంచీ కేంద్రం ప్రయత్నాలు
- ఎలా అమలు చేయాలో వివరిస్తూ రోడ్ మ్యాప్ జారీ
- దానికి తగ్గట్టు 2019లో ముసాయిదా చట్టం చేసిన మోదీ సర్కారు
- దీన్ని అమలు చేయాలంటే భూముల రీ సర్వే పూర్తవ్వాలి
- రాష్ట్రంలో 17 వేల గ్రామాలు... 6 వేల గ్రామాల్లో పూర్తయిన రీ సర్వే
- అన్ని రాష్ట్రాలూ అమలు చేస్తేనే ఇక్కడా చేస్తామంటున్న ఆంధ్రప్రదేశ్
- బీజేపీతో అంటకాగుతూ కూడా... చంద్రబాబు పచ్చి అబద్ధాలు
- లేని చట్టాన్ని రద్దు చేస్తామంటూ మేనిఫెస్టోలో కూడా హామీ
- దీన్ని మోదీ సభల్లో చెప్పగలరా? మోదీతో చెప్పించగలరా?



ల్యాండ్ టైట్లింగ్ మార్గదర్శకాల కోసం జాతీయస్థాయి కమిటీ వేస్తూ నీతి ఆయోగ్ 2019లో ఇచ్చిన మెమో



అమలులోకి రాని చట్టంపై
ఇంత దుష్ప్రచారమెందుకు? ల్యాండ్ టైట్లింగ్ చట్టం తేవాలని కేంద్రం స్పష్టంగా అన్ని రాష్ట్రాలకూ చెబుతున్న నేపథ్యంలో.. జనానికి నచ్చినా, నచ్చకపోయినా.. బలవంతంగానైనా దాన్ని అమల్లోకి తెచ్చే అవకాశం ఎవరి హయాంలో ఉంటుంది? బీజేపీతో కలిసి పోటీ చేస్తూ.. ఎన్డీఏతో కూటమి గట్టిన చంద్రబాబు నాయుడి హయాంలోనే కదా?

ఏ పార్టీతోనూ సంబంధం లేకుండా స్వతంత్రంగా
ఎన్నికల బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. ఆ చట్టాన్ని ప్రజల ఇష్టాయిష్టాల మేరకు అమల్లోకి తేవటమో, తేకుండా నిలిపేయటమో ఏదైనా చేయగలరు. కానీ చంద్రబాబు పరిస్థితి అలా కాదు కదా! బీజేపీతో కూటమి గట్టి పోటీ చేస్తున్నారు గనక.. ఎన్డీఏ పేరుతో ఓట్లడుగుతున్నారు కనక.. ప్రజలకు ఇష్టం ఉన్నా, లేకున్నా చచ్చినట్టు ఈ చట్టాన్ని అమలు చేసి తీరాలి. ఇది వాస్తవం. ఇది పచ్చి నిజం. మరి దొంగ మాటలెందుకు చంద్రబాబూ? పైపెచ్చు అమల్లోకి రాని ఈ చట్టాన్ని రద్దు చేస్తాననే ఓ పిచ్చి హామీని మేనిఫెస్టోలో పెట్టారంటే మిమ్మల్ని ఏమనుకోవాలి? మీ మానసిక స్థితి సరిగానే ఉందా?

అసలు అమల్లోకే రాని ఈ చట్టంపై ఉన్నవీ లేనివీ
చెబుతూ... దాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఆపాదిస్తూ.. వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చేసిందని, అందరి భూములూ లాక్కుంటోందని దిగజారిపోయి దౌర్భాగ్యపు ప్రచారానికి దిగటం ఎంత నీచం? ఈ చంద్రబాబు నాయుడి నైచ్యానికి అంతూ పొంతూ ఉండదా? మనిషిగా పుట్టాక కాస్తయినా సిగ్గూ శరం ఉండాలి కదా? 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని చెబుతున్న ఈ పెద్ద మనిషి.. ఇంత కుళ్లు కుతంత్రాలతో.. జనం సాక్షిగా కళ్లు మూయకుండా అబద్ధాలు చెప్పేస్తూ విషం కక్కుతుండటం హేయం కాదా?

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: వాస్తవానికి ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి పునాది పడింది 1989లోనే. భూ వివాదాలకు శాశ్వతంగా ముగింపు పలకటానికి, ఎవరి పేరుతో భూమి ఉందో వారి పేరిట టైటిల్ ఇచ్చి.. ఆ టైటిల్‌కు ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చేలా చట్టాన్ని చేయాలని, దీనికోసం ల్యాండ్ రికార్డులన్నిటినీ డిజిటల్ చేయాల్సి ఉంటుందని అప్పట్లోనే తీర్మానించారు. ఆ తీర్మానాలకు కొనసాగింపుగా.. 2004లో జాతీయ ల్యాండ్ రికార్డుల కంప్యూటరీకరణ (ఎన్ఎల్ఆర్ఏపీ) పథకాన్ని రూపొందించారు. దాని ప్రకారం 2009లో తొలి మోడల్ చట్టం తయారైంది. ఈ మోడల్ చట్టాన్ని అనుసరిస్తూ 2011లో నాటి యూపీఏ ప్రభుత్వం ఒక ముసాయిదా చట్టాన్ని తెచ్చింది. దానికి కొన్ని సవరణలు చేస్తూ 2015లో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మరో ముసాయిదా చట్టాన్ని తెచ్చింది. అదిగో ఆ తర్వాతే...అంటే 2015లో ముసాయిదా తెచ్చాకే కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ 'నీతి ఆయోగ్' దీనికో రోడ్ మ్యాప్ ఇచ్చింది. టైటిల్ గ్యారంటీకి ఏమేం చెయ్యాలి? ఎలా చెయ్యాలి? ఏం చేస్తే మనం ఆ దశకు చేరుకోగలమనే రోడ్డు మ్యాప్ అది. ఆ రోడ్ మ్యాప్‌కు తగ్గట్టుగానే 2019లో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మరో ముసాయిదా చట్టాన్ని రూపొందించింది. ఈ ముసాయిదాకు అనుగుణంగా.. ఈ చట్టాన్ని తేవాలంటే రాష్ట్ర భూముల సర్వేను పూర్తి చేయటం తప్పనిసరి కనక... ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

రీ సర్వే పూర్తయితేనే 'ల్యాండ్ టైట్లింగ్'
వాస్తవానికి రాష్ట్రంలో 17,000 గ్రామాలుండగా వాటిలో ఇప్పటికే 6 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. ఇంకా 11 వేల గ్రామాల్లో రీసర్వే జరగాల్సి ఉంది. రీ సర్వే జరిగి.. ఆ సందర్భంగా తలెత్తే వివాదాలన్నీ పరిష్కారం కావటానికి చాలా సమయం పడుతుంది. అదంతా పూర్తయ్యాక, రీ సర్వేలో పేర్కొన్న వ్యక్తులకు భూ హక్కు పత్రాలిస్తారు. ఆ పత్రాల ఆధారంగానే.. ప్రతి ఒక్కరికీ ఆయా భూముల టైటిల్‌ను వారి పేరిట మంజూరు చేస్తారు. అంటే.. రీ సర్వే పూర్తి కాకుండా ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తేవటం అసాధ్యం. రీ సర్వే పూర్తయి.. ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమల్లోకి వస్తే... భూములపై సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, ఆర్థిక నేరాలు, ఇవేవీ లేకుండా చూసుకునే అవకాశం ఉంటుంది. ఇదీ వాస్తవం.

అన్ని రికార్డులూ ఒకే రిజిస్టర్లో...
ల్యాండ్ టైట్లింగ్ చట్టం వస్తే... టైటిల్ రిజిస్టరులో ప్రతి భూమికీ ఒక యునిక్ నంబరును (రీ సర్వేలో పేర్కొన్న మేరకు) కేటాయిస్తారు. ఆ రిజిస్టరు భూములతో సంబంధం ఉండే ప్రతి విభాగానికీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా ప్రతి బ్యాంకుకూ, ఆర్థిక సంస్థకూ అందుబాటులో ఉంటుంది. దీంతో ఆయా సంస్థలు తామిచ్చే రుణాలతో సహా ఆ భూమికి సంబంధించిన లావాదేవీలన్నిటినీ ఆ రిజిస్టరులో నమోదు చేస్తాయి. కాబట్టి తదుపరి మోసాలకు, వివాదాలకు తావుండదు.

అందుకే ప్రభుత్వ గ్యారంటీ
మోసాలకు తావుండదు కనక.. ఈ చట్టం ప్రకారం ప్రతి భూమికీ ప్రభుత్వం ఆయా టైటిల్ దారు పేరిట బీమా చేయిస్తుంది. కాబట్టి ఊహించని పరిస్థితుల్లో ఆ భూమి తనదంటూ వేరెవరైనా వివాదం తెచ్చినా... ఒకవేళ అది ఏ అసైన్డ్ భూమో అని తేలినా.. టైటిల్ దారుకు ప్రభుత్వమే పరిహారం చెల్లిస్తుంది. అంటే ఆ టైటిల్‌దారుకు ప్రభుత్వమే గ్యారంటీగా ఉంటుందన్న మాట.

అసలు వాస్తవాలు ఇవీ..

1. ప్రభుత్వం భూములెలా లాక్కుంటుంది? 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు, గిరిజనులకు 3.22 లక్షల ఎకరాలకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందజేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం కలలోనైనా ఇలాంటి ఆలోచన చేస్తుందా? నిజానికి రీసర్వే చేసేటపుడే ఆ భూమి ఎవరిదో తేల్చి.. వారి పేరిట హక్కు పత్రాలు ఇస్తోంది. ఆ హక్కుదారు పేరే కదా రికార్డుల్లో ఉంటుంది. మరి ఆ పేరును మార్చేయటం సాధ్యమా? రాత్రికి రాత్రి ఆన్‌లైన్లో ఎలా మార్చేస్తారు? మన పేరిట హక్కు పత్రం ఇచ్చినపుడు...ఆ పత్రం మనదగ్గర ఉన్నపుడు రికార్డుల్లో మన పేరు మార్చేయటం ఎలా సాధ్యం? ఏ కొంచెం ఆలోచన ఉన్నా ఇది తెలిసిపోతుంది కదా!
2. రికార్డుల్లో జరిగే తప్పులపై ఇప్పుడు ఫిర్యాదు చేస్తున్నది తహసీల్దారు, ఆర్డీఓ, కలెక్టరు ప్రభుత్వ అధికారులకే కదా? వీళ్లతో పాటు ఉండే టైటిల్ రిజిస్ట్రారు కూడా ప్రభుత్వాధికారే ఉంటారు. దీన్లో తప్పేముంది? ఇక భూమి యాజమాన్యంపై వచ్చే సివిల్ వివాదాలు ఇప్పటి మాదిరే కోర్టుల్లోనే పరిష్కారమవుతాయి. దీన్లో ఎలాంటి తేడా ఉండదు. మరి కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదనటం పచ్చి అబద్ధం కాదా?
3. అన్ని అధికారాలూ టైటిల్ రిజిస్ట్రారుకు ఎందుకుంటాయి? ఇప్పుడు భూముల రిజిస్టరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఉంటోంది. ఆయన కూడా ప్రభుత్వాధికారే. మరి ఆయన ఎమ్మెల్యే, ఎంపీలు చెప్పినట్లు రికార్డుల్లో పేర్లు మార్చేయగలుగుతున్నారా? ఎవరికి కావాలంటే వారికి భూములు రాసేయగలుగుతున్నారా? రికార్డుల్లోని వివరాల నిర్వహణకు ప్రభుత్వం నియమించే గుమాస్తాగానే ఆయన్ను చూడాలి తప్ప.. రికార్డులు మార్చే అధికారం తనకు ఎందుకుంటుంది?
4. మళ్లీ ఎందుకు రిజిస్ట్రేషన్ చేసుకుంటారు? అసలు ఆ అవసరం ఎందుకుంటుంది? వివిధ కార్యాలయాల్లో ఉండే వివరాలను ఆన్‌లైన్లో క్రోడీకరించి.. రీ సర్వేలో ఇచ్చిన హక్కు పత్రాల ఆధారంగా రిజిస్టరులో ప్రభుత్వమే నమోదు చేసుకుంటుంది. మళ్లీ రిజిస్ట్రేషన్ అక్కర్లేదు.

ఇదీ... ఎల్లో ముఠా సాగిస్తున్న విష ప్రచారం

1. ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా భూములన్నీ లాగేసుకుంటారు. రాత్రికి రాత్రి ఆన్‌లైన్‌లో రికార్డులను మార్చేస్తారు.
2. సివిల్ కోర్టులకు ఇక భూములపై అధికారాలు ఉండవు. ల్యాండ్ టైటిల్స్ కోర్టులు ఇవ్వాలి గానీ, రెవెన్యూ శాఖ ఎలా ఇస్తుంది..
3. భూములకు సంబంధించిన అన్ని అధికారాలు తీసుకెళ్లి టైటిల్ రిజిస్టర్ అధికారికి ఇస్తున్నారు.. ఆయన ఎమ్మెల్యే, ఎంపీ, అధికార పార్టీ వాళ్లు చెప్పిన ఎవరికి కావాలంటే వారికి భూములు రాసేస్తారు.
4. ఈ చట్టం వచ్చాక భూములున్న వారంతా మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.


మోదీతో చెప్పించు బాబూ?

అసలు ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తయారు చేసింది కేంద్రమే కదా? రకరకాల ముసాయిదాలు రూపొందించి.. దాన్ని అన్ని రాష్ట్రాలకూ పంపించింది అబద్ధ మా? ఈ చట్టం తేవాలంటే ముందుగా రాష్ట్రం మొత్తాన్ని రీ సర్వే చేయాల్సి ఉంటుంది కనక ఆ సర్వే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంత మాత్రానికే ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమల్లోకి వచ్చేసిందంటూ అన్ని భూములనూ జగన్ ప్రభు త్వం తన పేరిట రాసేసుకుంటోందని చెబుతూ ఎన్నికల ముందర చంద్రబాబు, ఆయన పచ్చ ముఠా వికృతక్రీడ మొదలు పెట్టింది. లేని చట్టా న్ని రద్దు చేస్తామంటూ మేనిఫెస్టోలో కూడా హామీ ఇచ్చింది. ఈ రాష్ట్రంలో టీడీపీ బీజేపీతో, జనసేనతో కలిసి పోటీ చేస్తోంది. ఇప్పటికే ఒకసారి ప్రచారం చేసి వెళ్లిన నరేంద్ర మోదీ.. త్వరలో మళ్లీ రాష్ట్రానికి రాబోతున్నారు. మరి ఆ రోజున ప్రధాన మంత్రి ముందే ఈ చట్టాన్ని మేం అమలు చేయబోమని చెప్పగలవా చంద్రబాబూ? ల్యాండ్ టైట్లింగ్ అంటూ ఊగిపోతున్న పవన్.. మోదీ ముందు అదే నటనను కొనసాగించగలరా?

బాబు కిచిడీ మేనిఫెస్టో

సూపర్ సిక్స్‌లో సగం వైఎస్సార్‌సీపీ నుంచి, సగం పక్క రాష్ట్రాల నుంచి కాపీ

177 ఎన్నికల హామీలతో మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్



సాక్షి, అమరావతి: చంద్రబాబు అంటేనే మోసం, మాయ, వెన్నుపోటు. ఏదో విధంగా ప్రజలను మభ్యపెట్టడం, అధికారంలోకి వస్తే అదే ప్రజలను మోసం చేసి, వెన్నుపోటు పొడిచి, తాను లాభపడటం.. ఇదే నైజం. ప్రజలకు మేలు చేసే మనసు ఆయనకు ఏ కోశానా లేదు. మంగళవారం విడుదల చేసిన తాజా మేనిఫెస్టోలోనూ చంద్రబాబు ఇదే నైజాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం ఏపీలో, పక్క రాష్ట్రాల్లో అమలవుతున్న పథకాలనే కాపీ కొట్టి తన మేనిఫెస్టో తయారు చేశారు. నిబద్ధతతో పనిచేసే నాయకుడైతే ప్రజలకు తానేమి మేలు చేస్తాడో ఆలోచించి, వాటిని మేనిఫెస్టోలో చెప్తాడు. కానీ, చంద్రబాబు ప్రజల కోసం ఏమీ చేయరన్నది గతంలో ఆయన పరిపాలనే విస్పష్టంగా చెబుతుంది. ఇటువంటి నాయకుడి మేనిఫెస్టోలో ఏ హామీలు ఉంటే ప్రజలకేం ఉపయోగం? అందుకే చంద్రబాబు ఇప్పటికే రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న ప్రజోపయోగ పథకాలు, పక్క రాష్ట్రాల్లో ఉన్నవీ తెచ్చి తాజా మేనిఫెస్టోలో చేర్చేసుకున్నారు.. ఏమాత్రం కష్టం లేకుండా. గతంలో 2104, 2019లో తాను ప్రజలను మోసగించడానికి ఇచ్చిన హామీలను కూడా ఈసారి మేనిఫెస్టోలో ఉంచారు.. ఇందులో ఆయన ఏమాత్రం సిగ్గుపడలేదు. ఈ మేనిఫెస్టోలో 177 హామీలు ఉన్నప్పటికీ, అవన్నీ కాపీ కొట్టినవి, పాతవే.

అరువు తెచ్చుకున్న సూపర్ సిక్స్

చంద్రబాబు తాజా మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన ప్రధాన హామీలు అన్నీ అరువు తెచ్చుకున్నవే. వీటిలో సగం రాష్ట్రంలో ఇప్పటికే అమలవుతున్న పథకాలు కాగా, మిగతావి పక్క రాష్ట్రాల నుంచి కాపీ కొట్టారు. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాది రూ.15 వేలు, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందించే పథకాలను అమ్మఒడి, రైతు భరోసా పేరుతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఐదేళ్ల నుంచి అమలు చేస్తోంది. వీటికే పేర్లు మార్చి, చంద్రబాబు మేనిఫెస్టోలో రాసుకున్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కూడా వైఎస్సార్‌సీపీ నుంచి కాపీ కొట్టిందే. ఇది కాకుండా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకి నెలకు రూ.1500, ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీలను తెలంగాణ, కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి కాపీ కొట్టారు. అంతే కాదు.. జాబు కావాలంటే బాబు రావాలంటూ 2014లో ఊదరగొట్టిన చంద్రబాబు.. జాబు లేదంటే నిరుద్యోగ భృతి అంటూ యువతను నిలువునా మోసం చేసి, మళ్లీ అదే హామీ ఇప్పుడూ ఇవ్వడమే ఆయనలోని గొప్పతనం.

అవినీతి అమరావతిని మళ్లీ కడతారట

అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ పేదలను పట్టించుకోని చంద్రబాబు.. మళ్లీ అధికారంలోకి వస్తే వారిని సంపన్నులను చేసేందుకు పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ (పీ4) పేరుతో పథకాలు ఇస్తానని ప్రకటించారు. అంతర్జాతీయ అవినీతి కుంభకోణంగా మారిన రాజధాని అమరావతి నిర్మాణాన్ని కొనసాగిస్తానని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల గురించి పట్టించుకోకుండా అమరావతి జపం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని నమ్మబలుకుతున్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు వద్దే వద్దంటూ అక్కడ హైకోర్టు బెంచిని తక్షణం ఏర్పాటు చేస్తామని నమ్మబలికారు. అగ్రిగోల్డ్ ఆస్తులను కొల్లగొట్టి లక్షలాది మందిని నడిరోడ్డున పడేసిన విషయాన్ని మరచిపోయి, ఇప్పుడు బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చెబుతున్నారు.

రూ.4 వేలు పింఛనంటూ మాయ హామీ

చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లూ సామాజిక పింఛన్లు రూ.1,000 మాత్రమే ఇచ్చారు. అందులోనూ చాలా మోసాలు. ఇచ్చిందే తక్కువ. అందులోనూ జన్మభూమి కమిటీల దందా, అవినీతి. వృద్ధులు నెల నెలా నానా అవస్థలుపడి ప్రభుత్వ ఆఫీసులకు వెళ్లి, అక్కడ ఇచ్చినంత తెచ్చుకోవాల్సిన దుస్థితి. అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర పెన్షనర్లకు చంద్రబాబు పెట్టిన అవస్థల నుంచి విముక్తి కల్పిస్తూ సీఎం జగన్ చర్యలు చేపట్టారు. బాబు రూ. వెయ్యి పింఛను ఇవ్వగా, దానిని సీఎం జగన్ రూ.3 వేలు ఇచ్చి, ఇంటి వద్దనే వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వం ఐదేళ్లుగా ఇస్తున్న రూ.3 వేలను రూ.4 వేలకు పెంచి ఇస్తామని చంద్రబాబు మభ్యపెట్టే హామీ ఇచ్చారు. అది కూడా 50 ఏళ్లకే ఇస్తామని చెప్పడం మాయ చేయడానికేనని కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. గతంలో చేయకుండా ఇప్పుడు మెగా డీఎస్సీ ప్రకటిస్తామని, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ అంటూ ప్రకటించారు. ప్రతి ఇంటికీ మేలు చేసేలా జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థను తూలనాడి, 2 నెలలుగా వారిని విధులకు దూరం చేసిన చంద్రబాబు.. వారికి రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తానని ప్రకటించడం ఆయన దివాళాకోరుతనమే. ఉద్యోగుల గురించి ఏనాడూ పట్టించుకోని చంద్రబాబు.. ఇప్పుడు అధికారంలోకి వస్తే వారికి మేలు చేస్తానంటున్నారు.

52 పేజీల నుంచి 6 పేజీలకు మేనిఫెస్టో

మేనిఫెస్టోలను పేజీలకు పేజీలు విడుదల చేసే అలవాటున్న చంద్రబాబు ఈసారి మాత్రం సీఎం వైఎస్ జగన్‌ను ఫాలో అయిపోయారు. కేవలం ఆరు పేజీలతో మేనిఫెస్టో విడుదల చేశారు. బాబు 2014లో 52 పేజీలతో, 2019లో 34 పేజీలతో మేనిఫెస్టో తయారు చేశారు. వైఎస్ జగన్ కేవలం 4 పేజీల మేనిఫెస్టోను విడుదల చేయడంతో చంద్రబాబూ ఈసారి దీనిని కాపీ కొట్టి, 6 పేజీలతో మేనిఫెస్టో విడుదల చేశారు.

ఇది మరో రకం మోసం

ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి ఆ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో చేయాలని చెబుతున్న ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేస్తామని చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించడమూ ప్రజలను మోసం చేయడమే. 2014, 2019 మేనిఫెస్టోల్లో చెప్పినట్టుగానే ఈ మేనిఫెస్టోలోనూ పోలవరం ప్రాజెక్టును సత్వరం పూర్తి చేస్తామని, నదుల అనుసంధానం, ప్రతి ఎకరానికి నీరు అంటూ పాత హామీలను పెట్టారు. రాష్ట్రంలో ఇప్పుడు పారదర్శకంగా ఇసుక విధానం అమలవుతుండగా తన హయాంలో అభాసుపాలైన ఉచిత ఇసుక విధానాన్ని మళ్లీ తెస్తానని చంద్రబాబు ప్రకటించారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ వంటి సకల మౌలిక వసతులతో గ్రామాల ముఖ చిత్రమే మారిపోయినా, గ్రామాల్లో మౌలిక వసతులు, మండల, జిల్లా కేంద్రాల్లో వర్క్ ఫ్రం హోం స్టేషన్లు అంటూ హామీలిచ్చారు.

బీసీలకు బురిడీ

చంద్రబాబు అధికారంలో ఉండగా బీసీలకు స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు తగ్గించేశారు. ఇప్పుడు 34 శాతం ఇస్తామని చెప్పడం ఆ వర్గాలను మభ్యపెట్టడమే. 2014, 2019 మేనిఫెస్టోల్లో చెప్పినట్టుగానే ఇప్పుడూ బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేస్తామని మరోసారి పాత హామీనే ఇచ్చారు.

మరోసారి మహిళలను మోసం చేసేలా..

స్వయం సహాయక సంఘాలను మళ్లీ కొత్త తరహాలో మోసం చేయడానికి చంద్రబాబు కొత్త హామీ ఇచ్చారు. స్వయం సహాయక సంఘాల రుణాలు మాఫీ చేస్తానని 2014 మేనిఫెస్టోలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరినీ వంచించి, ఆ సంఘాలను దివాలా తీయించారు చంద్రబాబు. ఇప్పుడు రూ. 3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామంటూ నిస్సిగ్గుగా మరోసారి ప్రకటించారు. ఇది మరోసారి మహిళలను వంచనకు గురిచేయడమే.

ఆరోగ్యశ్రీకి మంగళమే!

సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.25 లక్షల విలువైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. చంద్రబాబు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేలా ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా ఇస్తామని ప్రకటించారు. అంటే చంద్రబాబు వస్తే ప్రజలకు బీమానే వర్తిస్తుంది తప్ప, ఆరోగ్య శ్రీ ఉండదు. ఆరోగ్యానికి భరోసా ఉండదు. డిజిటల్ హెల్త్ కార్డులు ఇప్పటికే రాష్ట్రంలో కోట్ల మందికి పంపిణీ చేసినా తానూ చేస్తానని చెప్పారు. విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలి డాక్టర్, జగనన్న సురక్ష పథకాలన్నీ వైద్యాన్ని పేదలకు చేరువ చేయగా వాటికి ఏమాత్రం సాటిరాని, తీసికట్టుగా జన ఔషధి కేంద్రాలు, బీపీ, షుగర్ వ్యాధులకు ఉచితంగా జనరిక్ మందులు పంపిణీ చేస్తామని చెబుతున్నారు. విద్యా రంగంలో వైఎస్ జగన్ విప్లవాత్మకమైన మార్పులు తెస్తే, వాటి దరిదాపుల్లోకి సైతం రాలేని స్థితిలో కేజీ టు పీజీ సిలబస్‌ని రివ్యూ చేస్తామని, మూతపడిన పాఠశాలలు పునరుద్ధరిస్తామంటూ పస లేని హామీలు ఇచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రస్తుతం అమల్లో ఉండగా, నేరుగా కాలేజీలకే రుసుం చెల్లిస్తామని ప్రకటించి దానిపైనా తిరకాసు హామీ ఇచ్చారు.

ఇప్పుడు అమలవుతున్నవే ఆయనొచ్చి చేస్తాడట..

- సీఎం జగన్ ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, ముస్లింలు, కాపులు, వడ్డెరలు, ఆర్య వైశ్యులు, క్షత్రియులు, అగ్రవర్ణ పేదలకు నవరత్నాలతో వేల కోట్ల సంక్షేమం అందిస్తుంటే.. ఇప్పుడు బాబు వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటానని అనడం ఆ వర్గాలను మోసం చేయడమే.
- 2019 ఎన్నికల్లో ఇచ్చినట్టుగానే గ్రామాల్లో పేదలకు 3 సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తానని, పక్కా ఇళ్లు కట్టిస్తానంటూ పాత పాటే పాడారు. నిజానికి ఈ ఐదేళ్లలో పేదలకు సీఎం వైఎస్ జగన్ 31 లక్షల ఇళ్ల స్థలాలు ఇవ్వగా, వీటిలో ఇప్పటికే 22 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఆయనొచ్చి చేసేదేముంది?
- నైపుణ్య శిక్షణ కేంద్రాలు, క్రీడా మౌలిక సదుపాయాలు, డిజిటల్ లైబ్రరీలు ఇప్పటికే రాష్ట్రంలో ఉన్నా, వాటి గురించి మేనిఫెస్టో చేర్చడం ప్రజలను మభ్య పెట్టడం కాక మరేమిటి? కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 10% ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇప్పటికే రాష్ట్రంలో అమల్లో ఉండగా తానూ అమలు చేస్తానని ప్రకటించడం పక్కా మోసమే.
- వైఎస్ జగన్ ప్రభుత్వం ఏడాది నుంచి రాష్ట్రంలో శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు ఇస్తుండగా.. తాము అందిస్తామంటూ అదే హామీ ఇచ్చారు.
- గొర్రెల పెంపకం యూనిట్లకు రాయితీలు, బీమా సౌకర్యం ఇప్పటికే ఉండగా దాన్ని తాను ఇస్తానని అంటున్నారు.
- నాయీ బ్రాహ్మణుల షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తుండగా దాన్ని ఇస్తానంటూ చెప్పుకొంటున్నారు.
- మత్స్యకారుల సంక్షేమానికి ఇప్పటికే వైఎస్సార్‌సీపీ రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తుండగా దాన్ని పెంచుతామని నమ్మబలికారు.
- వైఎస్సార్‌సీపీ వాహన మిత్ర పథకం అమలు చేస్తూ రవాణా రంగ కార్మికులకు మేలు చేస్తుండగా, ఇప్పుడు తాను డ్రైవర్లకు ప్రమాద బీమా ఇస్తానని, వడ్డీ సబ్సిడీ ఇస్తానంటూ నమ్మబలికారు.
- వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ విద్యుత్ సరఫరా ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తుండగా తాను అధికారంలోకి వస్తే ఇస్తానన్నారు.
- వైఎస్ జగన్ సీఎం కాగానే ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయగా, ఇప్పుడు తాను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.
- సేంద్రీయ వ్యవసాయం, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, ప్రభుత్వ గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీ యూనిట్ల వంటివన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తుండగా వాటిని తన మేనిఫెస్టోలో పెట్టుకున్నారు. ఇప్పుడు అమల్లో ఉన్న పథకాలన్నీ తాను చేస్తాననడం ప్రజలను వంచించడమే కదా?

అప్పుడలా.. ఇప్పుడిలా..

అవ్వాతాతల పింఛన్ల పంపిణీపై చంద్రబాబుది రోజుకో తీరు



- అవ్వాతాతల ఓట్లు దక్కవేమోనన్న దుగ్ధతో మొదట్లో ఇంటింటి పంపిణీని అడ్డుకునేందుకు ఈసీకి ఫిర్యాదులు
- దీంతో సచివాలయాల్లో పంపిణీ చేయాలని ఈసీ ఆదేశాలు..
- దీనికనుగుణంగా ఏప్రిల్ పింఛన్లు సచివాలయాల్లో అందజేత
- అవ్వాతాతల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో బాబు బృందం యూటర్న్
- ఇప్పుడు బ్యాంకుల్లోనే పింఛను జమచేయాలని 20 రోజులుగా నిమ్మగడ్డ.. పచ్చముఠా ఫిర్యాదులు
- దీంతో పింఛన్ల పంపిణీలో మళ్లీ మార్పు
- ఫలితంగా బ్యాంకు ఖాతాలున్న వారికి బ్యాంకుల్లో జమచేయాలని..
- ప్రత్యేక పరిస్థితులున్న వారికి సచివాలయాల సిబ్బంది ద్వారా పంపిణీ చేయాలని ఆదేశాలు
- ఎప్పటికప్పుడు బాబు మాట మారుస్తూ అధికారులు, ప్రభుత్వంపై నిందలు
- మే 1న సెలవు రోజైనా పింఛను మొత్తాన్ని జమచేయనున్న బ్యాంకులు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నీ హామీలకు డబ్బెక్కడిది బాబూ?

ఏడాదికి రూ.1.65 లక్షల కోట్లు కావాలని అంచనా

సాక్షి, అమరావతి: అధికారమే పరమావధిగా ప్రజలను వంచించేందుకు సిద్ధమైన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మేనిఫెస్టోలో ఇష్టం వచ్చినట్లు ఇచ్చిన హామీల అమలుకు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారు? ఈ ప్రశ్న ఇప్పుడు ఆర్థిక నిపుణులను సైతం వేధిస్తోంది. అలవికాని హామీలను ఎడాపెడా ఇచ్చేసిన చంద్రబాబు అసలు వాటిని అమలు చేయడం సాధ్యమా? అందుకు ఎంత ఖర్చు అవుతుంది? అంత సొమ్ము ఎక్కడి నుంచి సమీకరిస్తారు? అనే అంశాలకు సమాధానం లేదు. ప్రాథమిక అంచనాల ప్రకారం చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలంటే ఏడాదికి రూ.1.65 లక్షల కోట్లు ఖర్చవుతుంది. అంత డబ్బు సమీకరించుకునే అవకాశం ఉందా? రాష్ట్రంలో అందుకు తగ్గ వనరులు ఉన్నాయా?.. అంటే లేదనే సమాధానం వస్తుంది.

వాస్తవికంగా ఆలోచిస్తూ..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించదు కాబట్టే సీఎం వైఎస్ జగన్‌కు ఇంకా సంక్షేమం అందించాలని మనసులో ఉన్నా కొత్త హామీలు ఇవ్వలేదు. అన్ని లెక్కలు వేసుకుని, వనరుల సమీకరణ చూసుకుని చేయగలిగే హామీలను మాత్రమే ఆయన మేనిఫెస్టోలో చేర్చారు. ప్రస్తుతం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల కోసం ఏటా రూ.70 వేల కోట్లు దాకా ఖర్చు చేస్తున్నారు. ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా పారదర్శకంగా నేరుగా లబ్ధిదారులకే ప్రయోజనం చేకూరుస్తున్నారు. దీనికి అదనంగా మరికొంత లబ్ధిని జోడిస్తూ మేనిఫెస్టోను రూపొందించారు. తాము అమలు చేసే పథకాలు, కార్యక్రమాలు, వాటికి అయ్యే ఖర్చు, ఎక్కడి నుంచి సమీకరిస్తామనే విషయాలను ఆయన కూలంకషంగా వివరించారు. పథకాల అమలులో ఎక్కడా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలోనే డబ్బు జమ చేయడం (డీబీటీ) లాంటి వినూత్న విధానాల ద్వారా చాలా పకడ్బందీగా ఐదేళ్లు ఆర్థిక క్రమశిక్షణ పాటించి ఇబ్బందికర పరిస్థితుల్లోనూ నెట్టుకొచ్చారు. పింఛన్లకు ఇంకా ఎక్కువ ఇవ్వాలని ఉన్నా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలించవు కనుకే రూ.3,500 చొప్పున ఇస్తామని ప్రకటించారు. ఒకవేళ అప్పులు తెద్దామన్నా అవి కూడా పరిమితులకు లోబడే తేవాల్సి ఉంటుంది. అన్నీ బేరీజు వేసుకుని, ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పథకాలను కొనసాగించేందుకు సిద్ధమయ్యారు.

- అంత సొమ్ము సమకూర్చుకోవడం సాధ్యమా?
- అన్ని ఆర్థిక వనరులు రాష్ట్రంలో ఉన్నాయా?
- ప్రజలను వంచించేందుకు ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చేస్తావా?
- సీఎం జగన్ పథకాల అమలుకు రూ.70 వేల కోట్ల వ్యయం
- అన్ని లెక్కలు వేసుకుని, ఆర్థిక క్రమశిక్షణ చూసుకునే ఆయన హామీలిచ్చారు
- ఏ లెక్కలు చూడకుండా, ఇష్టం వచ్చినట్లు ఇచ్చిన హామీలకు డబ్బులెలా తెస్తావ్?
- చంద్రబాబు మేనిఫెస్టోపై నిపుణుల విస్మయం

వేలం పాటలా పోటీ పడి హామీలు

40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు కనీస ఆలోచన లేకుండా ఇష్టం వచ్చినట్లు హామీలు గుప్పించారు. చిత్తశుద్ధితో నెరవేర్చే ఉద్దేశం లేనందు వల్లే వేలం పాటలో రేటు పెట్టినట్లుగా సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలకే తాను ఇంకా ఎక్కువ ఇస్తానని నమ్మబలికారు. అమ్మఒడి, రైతు భరోసా పథకాల పేర్లు మార్చి ఇష్టం వచ్చినట్లు ప్రకటించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న చాలా పథకాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో ప్రకటించిన పథకాలను సైతం కాపీ కొట్టి మేనిఫెస్టోలో చేర్చి ప్రజలను ఏమార్చేందుకు సిద్ధమయ్యారు. మరి ఇన్ని హామీలను అమలు చేయడం సాధ్యమా? ఇంత డబ్బు ఎక్కడి నుంచి తెస్తారనే దానికి ఆయన వద్ద సమాధానం లేదు. మేనిఫెస్టో విడుదల చేసినప్పుడు ఒక మీడియా ప్రతినిధి ఈ హామీల అమలుకు ఎంత ఖర్చవుతుందని అడగడంతో సమాధానం చెప్పకుండా కస్సుమని మండిపడ్డారు. దాన్నిబట్టే ఆయనకు తాను ఇచ్చిన హామీలపై చిత్తశుద్ధి లేదనే విషయం స్పష్టమైంది. సీఎం జగన్ ఇస్తున్నారు కాబట్టి తాను అంతకంటే ఎక్కువ ప్రకటించి ప్రజలను నమ్మించాలి, ఆ తరువాత ఎలాగూ అమలు చేసేది లేదని తనకు అలవాటైన రీతిలో వాగ్దానాలు చేస్తున్నారు.



సాధ్యం కాదనే బీజేపీ పట్టించుకోలేదు

చంద్రబాబు హామీలను అమలు చేయడం సాధ్యం కాదని గుర్తించడం వల్లే బీజేపీ ఆయన మేనిఫెస్టోను అంగీకరించలేదు. ప్రధాని మోదీతోపాటు బీజేపీ నేతల ఫొటోలు మేనిఫెస్టోలో కనీసం ముద్రించేందుకు కూడా ఒప్పుకోలేదు. చివరికి మేనిఫెస్టోను తాకడానికి సైతం బీజేపీ పరిశీలకుడు సిద్ధార్థనాథ్ సింగ్ ఇష్టపడలేదంటే బాబు హామీలపై వారికి ఎంత నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చు. అంటే చంద్రబాబు హామీలకు కేంద్రం నుంచి కూడా ఎలాంటి సహకారం ఉండదని చెప్పకనే చెప్పేశారు. రాష్ట్రంలో ఆర్థిక వనరులు సమకూర్చుకునే పరిస్థితులు లేక, కేంద్రం సహకరించకపోతే చంద్రబాబు అంత డబ్బు ఎక్కడి నుంచి తెస్తారనే దానికి సమాధానమే లేదు. అంటే ఆయన ఇచ్చిన హామీలు అమలు చేసేవి కావని తేటతెల్లమైంది. కేవలం ప్రజలను మభ్య పెట్టేందుకు, మరోసారి మాయ చేసేందుకే వేలం పాట మాదిరిగా సంక్షేమ పథకాలు ప్రకటించారు. పొరపాటున జనం నమ్మితే ఇక అంతే సంగతులు. 2014లో మాదిరిగా ఆ మేనిఫెస్టో మాయం కావడం ఖాయం.

మేం టచ్ చెయ్యం బాబూ

పేరుకే కూటమి.. మేనిఫెస్టో పట్టుకోవడానికి కూడా బీజేపీ ససేమిరా

- మోదీ ఫొటో పెట్టేందుకు కూడా 'నో'
- బాబుకు విశ్వసనీయత లేదని సంకేతాలు
- 2014లో మోదీ ఫొటోతో ఉమ్మడి మేనిఫెస్టో విడుదల.. అధికారంలోకి వచ్చి, హామీలకు తూట్లు పొడిచిన బాబు
- అడుగడుగునా ప్రజలను మోసం చేసిన టీడీపీ అధినేత.. బీజేపీకీ అంటిన మరక.. బాబును నమ్మలేమని బీజేపీ నిర్ధారణ
- మేనిఫెస్టోపై పార్టీ ముద్ర లేకుండా జాగ్రత్తలు.. ప్రధాని మోదీ, ఇతర నేతల చిత్రాలు ఉండకూడదని స్పష్టీకరణ
- పట్టుబట్టి చివర్లో మేనిఫెస్టోపై కమలం గుర్తునే తీయించిన బీజేపీ
- అప్పటికప్పుడు మార్పించిన చంద్రబాబు.. 3 గంటలు ఆలస్యంగా విడుదల
- మేనిఫెస్టో పట్టుకోవడానికి కూడా ఇష్టపడని బీజేపీ నేతలు



సాక్షి, అమరావతి: దేశంలో విశ్వసనీయత లేని నాయకుడు చంద్రబాబు అని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కేంద్ర నాయకత్వం స్పష్టమైన సంకేతాలిచ్చింది. ఈ ఎన్నికల్లో టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకున్నప్పటికీ, ఉమ్మడిగా మేనిఫెస్టో ఇవ్వడానికి మాత్రం అంగీకరించలేదు. తద్వారా చంద్రబాబు హామీలకు బీజేపీ కానీ, ప్రధాని నరేంద్ర మోదీ కానీ గ్యారంటీ కాదని చెప్పింది. ఆ మేనిఫెస్టోపై బీజేపీ ముద్ర ఒక్కటి కూడా లేకుండా జాగ్రత్తపడింది. దానిపై బీజేపీ నేతల ఫొటోలు, గుర్తు ఉండకూడదని ఆ పార్టీ ముందే స్పష్టం చేసింది. చంద్రబాబు కమలం గుర్తు వేయించినా, చివర్లో తొలగించాల్సి వచ్చింది. ఆ మేనిఫెస్టోని తాకడానికి కూడా బీజేపీ నేతలు ముందుకు రావడంలేదు.

2014లో టీడీపీతో పొత్తు పెట్టుకొన్న బీజేపీ అప్పట్లో ఉమ్మడి మేనిఫెస్టోకి అంగీకరించింది. ఆ మేనిఫెస్టోలో చంద్రబాబు రైతులు, డ్వాక్రా రుణాల మాఫీ, యువతకు జాబులు అంటూ ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చారు. ఆ మేనిఫెస్టోలో ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబు, పవన్ ఫొటోలు, మూడు పార్టీల గుర్తులు ఘనంగా ముద్రించారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ఒక్కటీ నెరవేర్చకుండా అన్ని హామీలకు మంగళం పాడారు. అడుగడుగునా ప్రజలను వంచించారు. రుణ మాఫీ చేస్తానని చెప్పి రైతులు, మహిళలను నిలువునా మోసం చేశారు. జాబులు లేక యువత అల్లాడారు. పైగా, ఐదేళ్లూ విచ్చలవిడి అవినీతి, దోపిడీ జరగడంతో మరోసారి చంద్రబాబు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు. ఆ నింద బీజేపీ పైనా పడింది. ఆ పార్టీ జాతీయ నేతలూ ఇదే నిర్ధారణకు వచ్చారు.

బాబును నమ్మని బీజేపీ

ఈ ఎన్నికల్లో మళ్లీ బీజేపీతో పొత్తుకు చంద్రబాబు వెంపర్లాడినప్పటికీ, ఆ పార్టీ జాతీయ నాయకత్వం తొలుత అంగీకరించలేదు. చంద్రబాబు ఢిల్లీలోని తన ఏజెంట్లు, బీజేపీలో ఉన్న తన అనుంగులు, ఇతరత్రా పైరవీలు చేశారు. అయినా బీజేపీ పెద్దలు ఆయన్ని నమ్మలేదు. ఢిల్లీలో రాత్రింబవళ్లు పడిగాపులు గాసి, కాళ్లా వేళ్లా పడి చిట్టచివరకు పొత్తు పెట్టుకోగలిగారు. బీజేపీ పొత్తయితే పెట్టుకొంది కానీ, చంద్రబాబును ఆ పార్టీ పెద్దలు నమ్మడంలేదన్న విషయం ప్రతి సందర్భంలోనూ బటయపడుతోంది. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన గెలుపే అసాధ్యమైతే, మేనిఫెస్టో విషయంలోనూ మరోసారి అభాసుపాలు కాకూడదని బీజేపీ అధిష్టానం భావించింది. దీంతో ఈసారి మేనిఫెస్టో విడుదల కార్యక్రమానికి ఓ పరిశీలకుడిని మాత్రమే పంపి మమ అనిపించింది. కనీసం రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి, పార్టీ రాష్ట్ర నాయకులు కూడా హాజరుకాలేదు. అంతేకాదు.. మేనిఫెస్టోలో కనీసం ప్రధాని మోదీ ఫొటోగానీ, కమలం గుర్తు గానీ ముద్రించేందుకు బీజేపీ పెద్దలు అంగీకరించలేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, హోంమంత్రి అమిత్ షా, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఫొటోలు ముద్రించేందుకు కూడా ఒప్పుకోలేదు. అయితే, చంద్రబాబు తెలివిగా మేనిఫెస్టో కాపీలపై మోదీ, ఇతర నాయకుల ఫొటోలు లేకుండా, కమలం గుర్తును మాత్రం వేయించారు. బీజేపీ దీనికీ అంగీకరించలేదు. దాన్ని మార్చాల్సిందేనని పరిశీలకుడు సిద్ధార్థనాథ్‌సింగ్ పట్టుబట్టారు. దీంతో మేనిఫెస్టో ముఖచిత్రంలో అప్పటికప్పుడు మార్పులు చేశారు. అందుకే 12 గంటలకు జరగాల్సిన మేనిఫెస్టో విడుదల మూడు గంటలు ఆలస్యమైంది. చివరకు టీడీపీ, జనసేన పార్టీల మేనిఫెస్టోగానే చంద్రబాబు, పవన్ దాన్ని విడుదల చేశారు. బాబు, పవన్ ఫొటోలు, రెండు పార్టీల గుర్తులు మాత్రమే మేనిఫెస్టోలో ఉన్నాయి. మేనిఫెస్టో విడుదల సందర్భంగా కనీసం దాన్ని పట్టుకునేందుకు సైతం బీజేపీ పరిశీలకుడు సిద్ధార్థనాథ్‌సింగ్ ఇష్టపడలేదు. పవన్, చంద్రబాబు మేనిఫెస్టోను విడుదల చేసి ఫొటోలకు పోజు ఇస్తూ దాన్ని సిద్ధార్థనాథ్‌ను పట్టుకోవాలని ఒక వ్యక్తి ఇవ్వగా, ఆయన నిర్ద్వందంగా తిరస్కరించడం టీవీల్లో ప్రత్యక్ష ప్రసారంలోనే కనిపించింది. చివరకు ఈ మేనిఫెస్టోకు టీడీపీ, జనసేనదే బాధ్యతని చంద్రబాబు చెప్పడం గమనార్హం. బీజేపీ జాతీయ స్థాయిలో ఒకే మేనిఫెస్టో విడుదల చేస్తుందని, కాబట్టి ఏపీలో కూటమిలో మేనిఫెస్టోకి మద్దతు తెలిపిందని ఆయన సర్దిచెప్పుకున్నారు. సిద్ధార్థనాథ్‌సింగ్ కూడా తాము రాష్ట్రానికో మేనిఫెస్టో ఇవ్వడంలేదని చెప్పారు. నిజానికి జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలోనూ వేర్వేరుగా మేనిఫెస్టోలు ప్రకటించే ఆనవాయితీ ఉన్నా కేవలం చంద్రబాబుపై నమ్మకం లేకే బీజేపీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

కూటమిది అసత్యాల మేనిఫెస్టో

- హామీలన్నీ జగన్ అమలు పరిచినవే
- అరచేతిలో వైకుంఠం చూపే చంద్రబాబు.. ఓట్లకోసం ముస్లింలు, క్రిస్టియన్లు కావాలి
- మాజీ మంత్రి పేర్ని నాని

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 1-5-2024



ప్రతి శ్రమకూ ఒక విలువ ఉంటుంది.
పురుషుడు విలువ కలిగిన శ్రమే చేస్తాడు.
అతడిది ఉద్యోగం.
స్త్రీ విలువ కట్టని ఇంటి పని చేస్తుంది.
ఆమెది చాకిరి.
భారతదేశంలో స్త్రీ, పురుషుల్లో స్త్రీలు
అత్యధిక గంటలు ఏ ఖరీదూ లేని
ఇంటి పనుల్లో మునిగి ఉంటున్నారని
సర్వేలు చెబుతున్నాయి.
దేశ యంత్రాంగాలు అంతరాయం
లేకుండా ముందుకు సాగడంలో
ఈ శ్రమ నిశ్శబ్ద పాత్ర వహిస్తోంది.
స్త్రీల శ్రమకు విలువ కట్టలేకపోతే
కనీసం గౌరవం ఇవ్వడమైనా నేర్వాలి.

ఖరీదు కట్టే షరాబు లేదు

ఇంతకు ముందు వివరించి చెప్పడం కొంత కష్టమయ్యేది. ఇప్పుడు అర్బన్ క్లాప్ వంటి సంస్థలు వచ్చాయి కనుక సులువు. అర్బన్ క్లాప్ వారికి బాత్‌రూమ్‌ల క్లీనింగ్ కోసం కాల్ చేస్తే వాళ్లు ఒక్కో బాత్‌రూమ్‌కు ఇంతని చార్జ్ చేస్తారు. ఇంట్లో రెండుంటే రెంటికీ చార్జ్ పడుతుంది. అదీ ఒకసారికి. అమ్మ వారంలో రెండు సార్లు, నెలలో ఏడెనిమిది సార్లు రెండు బాత్‌రూమ్‌లు కడుగుతుంది. ఆమెకు ఆ చార్జ్ మొత్తం ఇవ్వాలి లెక్క ప్రకారం. అలాగే కిచెన్ క్లీన్ చేయాలంటే కూడా ఒక చార్జ్ ఉంటుంది. అమ్మ రోజూ వంటిల్లు సర్ది సర్ది, ప్లాట్‌ఫామ్ కడిగి, స్టవ్ రుద్ది క్లీన్ చేస్తుంది. ఆ చార్జ్ కూడా ఆమెకు ఇవ్వాలి. అమ్మ శ్రమకు కనీసం విలువ కట్టాలని కొన్ని సందర్భాలలో కోర్టులు కూడా అంటున్నాయి. కొన్ని సంస్థలు అమ్మ శ్రమను ఎలా విలువ కట్టవచ్చో కూడా చెబుతున్నాయి.

1. ఆపర్చునిటీ కాస్ట్ మెథడ్:
అంటే అమ్మ బయటకు వెళ్లి ఉద్యోగం చేస్తే నలభై వేలు వస్తాయనుకుంటే, ఆమె ఆ ఉద్యోగం మానుకుని ఇంట్లో ఉండిపోతే ఆమె శ్రమ విలువను నెలకు నలభై వేలుగా గుర్తించాలి. (అమ్మ ఉద్యోగం చేసి కూడా అంత శ్రమా చేస్తుంటే నలభైకి మరో నలభై కలిపి ఇంటికి ఇస్తున్నట్టు).

2. రీప్లేస్‌మెంట్ కాస్ట్ మెథడ్:
ఇల్లు చిమ్మడం, బట్టలుతకడం, ఆరిన బట్టల్ని మడత పెట్టడం, ఇస్త్రీ చేయడం, మొక్కలకు నీళ్లు పోయడం, కూరగాయలు, సరుకులు తెచ్చుకోవడం, బిల్లులు కట్టడం, వంట చేయడం, ఇంటిని కనిపెట్టుకుని ఉండటం... వీటన్నింటినీ బయట వ్యక్తులతో సర్వీసుగా తీసుకుంటే (అర్బన్ క్లాప్ మాదిరిగా) ఎంత



అవుతుందో లెక్కగట్టి అది అమ్మ చేసే పని శ్రమగా గుర్తించడం.

3. ఇన్‌పుట్/అవుట్‌పుట్ కాస్ట్ మెథడ్:
అలా కాకుండా ఈ పనులన్నింటికీ ఒక యోగ్యమైన ఉద్యోగిని పెట్టుకుంటే మార్కెట్ అంచనాను బట్టి ఎంత జీతం ఇవ్వాల్సి వస్తుందో అంత జీతం ఇవ్వడం.

అవన్నీ సరే. కంటికి కనిపించే పనులకు కట్టే విలువ. కాని పిల్లవాడు స్కూల్లో పడి దెబ్బ తగిలించుకుని ఇంటికి వస్తే అమ్మ దగ్గరకు తీసుకుని, మందు రాసి, ధైర్యం చెప్పి, వాడి పక్కన కూచుని కబుర్లు చెపుతుందే... ఆ ప్రేమకు విలువ కట్టే షరాబు ఉన్నాడా?

మే డే రోజున ప్రపంచ కార్మికులారా ఏకం కండి అనే నినాదాలు వినిపిస్తుంటాయి. కాని ఇంటి పని చేస్తూ, అది ఎక్కువైనా చేస్తూ, కుటుంబమంతా ఆ పనిలో భాగం కావాలన్న సంగతిని చెప్పడానికి కూడా తటపటాయిస్తూ, అది వద్దనుకుంటే ఆ ఆప్షన్ లేక, తప్పించుకోవడానికి వీల్లేని ఆ పనిని చేస్తూ కూడా విలువ లేని పని చేస్తున్నామన్న న్యూనతను అనుభవిస్తూ తమ హక్కులు ఏమిటో తమకే తెలియని తల్లి, భార్య, కుమార్తె, చెల్లెళ్లను కార్మికులుగా గుర్తించాలని ఎవరూ అనుకోరు.

స్త్రీల ఇంటి శ్రమ దేశంలోని యంత్రాంగం సజావుగా పనిచేయడంలో కీలకమైనది. వారు...
1. దేశం కోసం పని చేసి రిటైరైన వృద్ధుల సేవలో ఉంటారు. 2. దేశానికి ఆదాయం తెచ్చిపెట్టే యువత సేవలో ఉంటారు. 3. దేశానికి భవిష్యత్తులో అంది రావాల్సిన పిల్లల సేవలో ఉంటారు.

'కుటుంబం' అనే బంధంలోకి వచ్చి కూతురిగా, కోడలిగా, భార్యగా వీరు 'ప్రేమ'తో, 'బాధ్యత'తో, 'బంధం'తో ఈ సేవ చేస్తారు. అంత మాత్రం చేత ఈ సేవను నిరాకరించడానికి వీల్లేదు. శ్రమగా చూడక్కర్లేదని భావించకూడదు. ఇంత చేస్తున్నా 'ఇంట్లో కూచుని ఏం చేస్తుంటావ్?' అనే మాటను వాళ్లు పడాలా?

ఉద్యోగం చేసినా చేయకపోయినా ఒక గృహిణి రోజుకు సగటున మూడున్నర గంటలు ఇంటి పని చేస్తుంటే పురుషుడు కేవలం గంటన్నర ఇంటి పని చేస్తున్నాడు.

స్త్రీలు తమ ఇంటి పనిని ఒక్కరోజు మానేసి సహాయనిరాకరణ చేస్తే దేశం స్తంభిస్తుంది. అందుకే స్త్రీల శ్రమను గౌరవించే మే డే రోజున వారికి కృతజ్ఞతలు తెలియచేయాలి. విలువైన శ్రమ చేస్తున్నందుకు సమాజం వారికి హర్షధ్వానాలు తెలియచేయాలి.



1. సాచి 2. ఇలీన హ్యాట్స్ 3. అవంతి 4. అనన్య నందా 5. అంకిత కుందు 6. రణిత బెనర్జీ 7. లిష మిశ్రా 8. మిథాలీ ఠాకూర్ 9. దియా వదిరాజ్

సెల్ఫ్-మేడ్ మ్యూజిక్ స్టార్స్

క్షణ క్షణం సంగీత పర్వం

యూత్ పల్స్

యువ సంగీతాభిమానులకు అచ్చంగా సరిపోయే మాట... మ్యూజిక్ మేక్స్ ఎవ్రీ థింగ్ బెటర్. ఇట్టే మరిచిపోయే లక్షణం నుంచి జ్ఞాపకశక్తి పెరగడం వరకు, క్రియేటివిటీని ఎంజాయ్ చేయడం నుంచి క్రియేటివ్ పవర్ పెంచుకోవడం వరకు, జడత్వం నుంచి నిత్యజీవనోత్సాహం వెల్లివిరియడం వరకు, అనామకత్వం నుంచి ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదగడం వరకు ఎన్నోరకాలుగా సంగీతం యువతకు బలం అయింది. సంగీత రత్నాలను వెదుకుతూ మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలోకి అడుగు పెట్టిన యువతరం ఆ ప్లాట్‌ఫామ్‌లలోనే మ్యూజిక్ స్టార్‌లుగా మెరవడం ఈ తరంలో కనిపిస్తున్న ప్రత్యేకత.

ఆరు సంవత్సరాల వయసులో పాటల కోసం గొంతు సవరించింది బెంగళూరుకు చెందిన దియా వదిరాజ్. రకరకాల మ్యూజిక్ జానర్‌లలో టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది. కోల్‌కతాకు చెందిన రనితా బెనర్జీ అయిదు సంవత్సరాల వయసులో 'సింగింగ్ స్టార్' షోలో పాల్గొంది. 'స రే గ మ ప' లిటిల్ ఛాంప్స్‌లో ఫస్ట్ రన్నర్-అప్‌గా నిలిచింది. 'స్వీట్ వాయిస్' రనిత గొంతు నుంచి వచ్చిన 'జరాసీ ఆహట్' పాట 6.2 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

మల్టీ టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది అంకిత కుందు. రియాల్టీ షోలలో పాడడం ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. బిహార్‌కు చెందిన మిథాలీ ఠాకూర్ 'రైజింగ్ స్టార్' షోతో ఫేమ్ అయింది. భోజ్‌పూరి, క్లాసికల్, ఫోక్ సాంగ్స్‌ను పాడడంలో మంచి పేరు తెచ్చుకుంది. యూట్యూబ్‌లో ఆమె వీడియోలు మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇండియన్-అమెరికన్ సింగర్, సాంగ్ రైటర్ లిశా మిశ్రా పాటలను రికార్డ్ చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. బాలీవుడ్ సినిమాలలో కూడా పాడింది. ఇండియన్ ఐడల్ జూనియర్‌గా 2015లో సంగీత ప్రపంచానికి పరిచయం అయింది భువనేశ్వర్‌కు చెందిన అనన్య నందా. బాలీవుడ్ పాటల్లోనే కాదు క్లాసికల్‌లోనూ మంచి పేరు తెచ్చుకుంది. మెలోడియస్ వాయిస్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.

బోస్టన్ (యూఎస్)లో పుట్టిన అవంతి నగ్రల్‌కు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. ముంబైకి వచ్చిన తరువాత తన పాషన్‌నే కెరీర్‌గా చేసుకుంది. మ్యూజిక్‌లో రకరకాల జానర్స్‌ను మిక్స్ చేయడంలో గట్టి పట్టు సాధించిన అవంతికి యూట్యూబ్ చానల్ కూడా ఉంది. ఇందులో తన లైవ్ పర్‌ఫార్‌మెన్స్ వీడియోలను అప్‌లోడ్ చేస్తుంది. అవంతికి ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు.

ఆర్ అండ్ బీ, హిప్-హాప్, సోల్, పాప్ మ్యూజిక్‌లలో బహుముఖ ప్రజ్ఞ చాటుకుంటోంది ఇలీన హ్యాట్స్. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చింది. ముంబైకి చెందిన సాచి రాజాధ్యక్ష ఆల్ట్-పాప్ మ్యూజిక్‌లో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది. ఆమె పవర్‌ఫుల్, సోల్ వాయిస్‌కు ఎంతోమంది అభిమానులు ఉన్నారు.

దియ నుంచి అవంతి వరకు ఎందరో, ఎందరెందరో యంగ్ మ్యూజిషియన్స్ సంగీతం పట్ల అంకితభావంతో సెల్ఫ్-మేడ్ సూపర్‌స్టార్‌లుగా ఎదిగారు. ఎంతోమంది ఔత్సాహికులకు రోల్ మోడల్స్‌గా మారారు.



స్పాటిఫైతో ప్రయాణం ప్రారంభించి స్టార్‌గా ఎదిగిన ఆర్టిస్ట్‌లలో జస్లీన్ రాయల్ ఒకరు. సింగర్, సాంగ్ రైటర్, కంపోజర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. హిట్ బాలీవుడ్ ట్రాక్స్ కంపోజ్ చేసింది. 'ప్రపంచ ప్రేక్షకులతో కనెక్ట్ కావడానికి, శ్రోతల అభిప్రాయాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా మ్యూజిక్ కంపోజింగ్‌లో మార్పులు చేయడానికి స్పాటిఫై ఉపయోగపడింది' అంటుంది జస్లీన్ రాయల్.

సినిమా

- తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం
- రూ. రెండు కోట్లు వసూలు చేసిన తొలి తెలుగు చిత్రం
- జాతీయ అవార్డు తెచ్చుకున్న తొలి తెలుగు పాట 'తెలుగు వీర లేవరా...'
- ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం

అల్లూరికి అర్ధ శతాబ్దం



'మా మన్యం దొర సీతారామరాజు వచ్చాడు'.... ప్రజల్లో సంబరం. దొరకు పాదాభివందనం చేశారు. కానీ... అతను నిజమైన దొర కాదు. మన్యం దొర అల్లూరి సీతారామ రాజు గెటప్ వేసుకున్న నటుడు. అప్పటికి నిజమైన అల్లూరి సీతారామరాజుని చూసిన కొందరు వృద్ధులు లొకేషన్లో ఆ గెటప్‌లో ఉన్న నటుడికి పాదాభివందనం చేశారు. వెండితెరపై సీతారామరాజుగా కనిపించక ముందే అలా షూటింగ్ లొకేషన్లో ప్రజల చేత 'భేష్' అనిపించుకున్నారు కృష్ణ. అల్లూరి సీతారామరాజు గెటప్ అంటే కృష్ణ తప్ప వేరే ఏ నటుడికీ నప్పదు అనేంతగా ఆ పాత్రలో ఒదిగిపోయారు సూపర్ స్టార్. 1974 మే 1న విడుదలైన 'అల్లూరి సీతారామరాజు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రం యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొన్ని విశేషాలు తెలుసుకుందాం...

ఎన్టీఆర్ హీరోగా నటించిన 'అగ్గిరాముడు' సినిమా 1954 ఆగస్టు 5న విడుదలైంది. బుర్రిపాలెంకు చెందిన కృష్ణ తెనాలిలో ఆ సినిమా చూశారు. అందులో అల్లూరి గురించి బుర్రకథగా చెప్పే సీన్ కృష్ణను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన 'జై సింహ'ని కూడా చూశారు కృష్ణ. ఆ సినిమా పాటల పుస్తకం చివరి పేజీలో ఎన్టీఆర్ తర్వాతి చిత్రం 'అల్లూరి సీతారామరాజు' అనే ప్రకటనతో పాటు అల్లూరి గెటప్‌లో స్కెచ్‌తో గీసిన ఎన్టీఆర్ బొమ్మ ఉంది. ఆ సినిమా కోసం కృష్ణ ఎదురు చూశారు. అయితే ఆ సినిమా ప్రారంభమైనా తర్వాత ఆగిపోయింది. పై చదువుల కోసం ఏలూరు వెళ్లిన కృష్ణకి నాటకాలపై ఆసక్తి కలిగింది. అది కాస్తా సినిమాలవైపు మళ్లడంతో చెన్నైకి చేరుకున్నారు. అప్పుడు ప్రజా నాట్యమండలి రాజారావు బృందం ప్రదర్శించిన 'అల్లూరి సీతారామరాజు' నాటకానికి మంత్రముగ్ధుడయ్యారు కృష్ణ. ఆ తర్వాత హీరో అయిన కృష్ణ 'అసాధ్యుడు'లో (1968) అంతర్నాటకంలో భాగంగా సీతారామరాజు వేషం వేశారు. ఆ వేషంలో చక్కగా ఉన్నారంటూ జనాలు కితాబిచ్చారు. దీంతో తాను హీరోగా అల్లూరి చరిత్రతో సినిమా తీస్తే బాగుంటుందనుకున్నారు కృష్ణ. అయితే 1972లో శోభన్‌బాబు హీరోగా సీతారామరాజు మూవీ నిర్మించనున్నట్లు డి. లక్ష్మీ నారాయణ (డీఎల్) ప్రకటించారు. కానీ అనారోగ్యం వల్ల ఆ ప్రయత్నం విరమించుకున్నారాయన. కృష్ణ హీరోగా 'పెద్దలు మారాలి' సినిమా తీశారు డీఎల్. ఆ చనువుతో సీతారామరాజు కథని కృష్ణకి ఇచ్చి, ఆసక్తి ఉంటే సినిమా తీసుకోమన్నారు. అలా 'అల్లూరి సీతారామరాజు' చేసే అవకాశం కృష్ణకి వచ్చింది.



డేరింగ్ అండ్ డ్యాషింగ్ కృష్ణ

కృష్ణకు 'డేరింగ్ అండ్ డ్యాషింగ్' అని పేరు. 'అల్లూరి సీతారామరాజు' కథలో వాణిజ్యపరమైన అంశాలు ఉండవని, పైగా హీరో చనిపోతాడని ఫైనాన్స్ ఇవ్వడానికి ఫైనాన్షియర్లు, పంపిణీ చేయడానికి కూడా ఎవరూ సాహసించలేదు. 'ఇంత రిస్క్ అవసరమా.. ఈ సినిమా వద్దు' అని శ్రేయోభిలాషులు కృష్ణకు చెప్పారు. ఎన్టీఆర్ కూడా వద్దనే అన్నారు. అయినా తాను ఓ హీరోగా రూపొందిన 'దేవుడు చేసిన మనుషులు' శత దినోత్సవంలో అల్లూరి సీతారామరాజు సినిమా తీస్తున్నానని, అది తన నూరో చిత్రంగా ఉంటుందని కృష్ణ ప్రకటించారు. 1973 డిసెంబరులో మద్రాస్ వాహినీ స్టూడియోలో షూటింగ్ ఆరంభమైంది. అల్లూరి సీతారామరాజు గెటప్‌లో ఉన్న కృష్ణపై ఫస్ట్ షాట్ తీశారు. సినిమా మొదలుపెట్టినప్పట్నుంచి అనేక ఇబ్బందులు. చింతపల్లి అడవిలో షూటింగ్ కాబట్టి అక్కడ గెస్ట్ హౌస్‌లు లేకపోవడంతో యూనిట్‌లోని దాదాపు ఐదువందల మందికి ఒక కాలనీలా తాత్కాలిక బస ఏర్పాటు చేశారు. సముద్ర మట్టానికి నాలుగువేల అడుగుల ఎత్తులో కొండ ప్రాంతంలో షూటింగ్. భయంకరమైన చలి. దాదాపు 40 రోజుల పాటు షూటింగ్ చేశారు. దర్శకుడు రామచంద్రరావు అస్వస్థతకి గురి కావడం ఓ ఊహించని షాక్. ఆయన్ను చెన్నైకి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం చేయించినా కోలుకోలేదు. ఫిబ్రవరి 14న తుది శ్వాస విడిచారు. మిగతా భాగాన్ని కృష్ణ తెరకెక్కించారు. యుద్ధ సన్నివేశాలను దర్శకుడు కేఎస్ఆర్ దాస్ రూపొందించారు. రామచంద్రరావు మీద గౌరవంతో దర్శకుడిగా ఆయన పేరే ఉంచేశారు కృష్ణ.

సినిమా స్కోప్.. ఈజీ కాదు

తెలుగులో పూర్తి స్థాయిలో రూపొందిన తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం 'అల్లూరి సీతారామరాజు'. అయితే అప్పుడు సినిమా స్కోప్ అంత ఈజీ కాదు. ఈ మూవీకి వీఎస్ఆర్ స్వామి ఛాయాగ్రాహకుడు. అప్పట్లో సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసేందుకు రెండే లెన్స్‌లు ఉండేవట. కాగా సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసే లెన్స్‌కి కెమెరా వ్యూఫైండర్స్ ఉండవట. దీంతో ఊహించుకుని ఫ్రేమ్ సెట్ చేసుకునేవారట. ఈ ప్రక్రియను వీఎస్ఆర్ స్వామి ముంబైలో అధ్యయనం చేసి రావడంతో 'అల్లూరి సీతారామరాజు' ఈజీగా చేయగలిగారు.

అల్లూరి చేయనన్న ఎన్టీఆర్

అల్లూరి సీతారామరాజు సినిమా మొదలుపెట్టి, ఆపినా ఆ సినిమా తీయాలన్న ఎన్టీఆర్ ఆకాంక్ష అలాగే ఉండిపోయింది. కృష్ణ 'అల్లూరి సీతారామరాజు' వచ్చిన చాలా ఏళ్లకు ఆ సినిమా తీద్దామని పరుచూరి బ్రదర్స్‌తో అన్నారు ఎన్టీఆర్. కానీ సోదరులు వద్దని సలహా ఇచ్చి, కృష్ణ చేసిన సినిమా చూడమన్నారు. ఎన్టీఆర్ కోరిక మేరకు 'అల్లూరి సీతారామరాజు'ని ప్రత్యేకంగా చూపించారు కృష్ణ. "అద్భుతంగా తీశారు. నేను 'అల్లూరి సీతారామరాజు' తీయను" అన్నారు ఎన్టీఆర్.

మహారథి చేతికి స్క్రిప్ట్

త్రిపురనేని మహారథి చేతిలో డీఎల్ ఇచ్చిన స్క్రిప్ట్ పెట్టి, 'ఈ సబ్జెక్ట్‌లో సినిమా తీయడానికి కావాల్సినంత దమ్ము ఉందా' అడిగారు కృష్ణ సోదరుడు హనుమంతరావు. 'చాలా ఉంది' అన్నారు మహారథి. కానీ, తనకు ఇచ్చిన స్క్రిప్ట్‌లో ఒక్క సన్నివేశం తప్ప మహారథికి వేరే ఏదీ నచ్చలేదు. పరిశోధనలు చేసి, స్క్రిప్ట్ తయారు చేశారు. దర్శకుడిగా వి. రామచంద్రరావును తీసుకున్నారు. సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్‌లో తీయాలని నిర్ణయించింది పద్మాలయా స్టూడియోస్ సంస్థ (కృష్ణ సొంత నిర్మాణ సంస్థ).

'అల్లూరి...' తర్వాత 'పాడి పంటలు'తోనే హిట్...

'అల్లూరి సీతారామరాజు' చూసిన విజయా వాహిని సంస్థ అధినేతల్లో ఒకరైన దర్శక-నిర్మాత చక్రపాణి అభినందించారు. కానీ 'ఈ సినిమా తర్వాత నీ సినిమాలు ఆడటం కష్టం' అని కూడా కృష్ణతో అన్నారు. ఆయన అన్న మాటలు నిజమయ్యాయి. 'అల్లూరి సీతారామరాజు' తర్వాత కృష్ణ చేసిన ప్రతి చిత్రాన్నీ ఈ సినిమాతో పోల్చారు ప్రేక్షకులు. దాంతో ఆ తర్వాత కృష్ణ నటించిన పది సినిమాలకు పైగా ఆశించిన ఫలితాన్ని సాధించలేదు. చివరికి పద్మాలయా స్టూడియోస్ నిర్మించిన 'పాడి పంటలు' (1976) విజయంతో హీరోగా కృష్ణ పూర్వ వైభవాన్ని పొందారు.

అల్లూరి పాటలు అజరామరం

'అల్లూరి సీతారామరాజు'లోని పాటలన్నీ సూపర్ హిట్. పి. ఆదినారాయణరావు ఈ సినిమాకు సంగీత దర్శకుడు. సినిమా ఆరంభంలో వచ్చే 'రగిలింది విప్లవాగ్ని..', సినిమా చివర్లో వచ్చే.. 'ఓ విప్లవజ్యోతి...' పాటలకు ఆరుద్ర సాహిత్యం అందించగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడారు. 'వస్తాడు నా రాజు..' పాటను నారాయణరెడ్డి రాయగా, 'హైలెస్సా.. హైలెస్సా..', 'కొండ దేవతా నిన్ను కొలిచేవమ్మా..' పాటలను కొసరాజు రాశారు. 'తెలుగు వీర లేవరా..' పాటను శ్రీశ్రీ రాశారు. ఈ పాటను ఘంటసాలతోనే పాడించాలన్నది కృష్ణ సంకల్పం. ఆ సమయానికి ఘంటసాల ఆరోగ్యం సరిగా లేదు. ఆ తర్వాత ఘంటసాల ఆరోగ్యం కాస్త కుదుటపడటంతో ఆయన ఈ పాట పాడారు. కానీ ఈ సినిమా విడుదల కాకముందే ఘంటసాల కాలం చేశారు. ఈ పాటకు వి. రామకృష్ణ గొంతు కలిపారు. ఈ పాటకుగాను జాతీయ ఉత్తమ గీత రచయిత అవార్డు శ్రీశ్రీని వరించింది. ఓ తెలుగు సినిమాలోని పాటకు జాతీయ పురస్కారం రావడం అదే తొలిసారి. అలాగే ఇదే సినిమాలోని 'వందేమాతరం అంటూ నినదించిన..', 'హ్యాపీ క్రిస్మస్..' పాట, 'అరుణాయ శరణ్యాయ..' శ్లోకం వంటివి కూడా వీనుల విందుగా ఉంటాయి.

రికార్డులు భళా

'అల్లూరి సీతారామరాజు' సినిమా 19 కేంద్రాల్లో (బెంగళూరుతో కలుపుకుని) వందరోజులు, 2 కేంద్రాల్లో 25 వారాలు, హైదరాబాద్‌లోని సంగం థియేటర్‌లో రజతోత్సవం, అలాగే షిఫ్టింగులతో ఏడాది పాటు ఆడటం విశేషం. ఈ చిత్రం స్వర్ణోత్సవం చెన్నైలోని ఉడ్‌ల్యాండ్స్ హోటల్‌లో ఘనంగా జరిగాయి. స్వాతంత్ర్య సమరయోధులు ఇంటూరి వెంకటేశ్వరరావు, అనిసెట్టి సుబ్బారావు, దాశరథి, సుంకర సత్యనారాయణ, కేఎస్ గోపాలకృష్ణన్ వంటి వారిని సత్కరించారు. అల్లూరి సీతారామరాజు కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం రూ. పదివేలతో ఓ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి, అందుకు సంబంధించిన పత్రాలను సీతారామరాజు సోదరుడు సత్యనారాయణరాజుకి అందించారు కృష్ణ. ఇలా ఈ సినిమాకి సంబంధించిన విశేషాలు చాలా ఉన్నాయి.

ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు



- అబ్బూరి రవి

'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా హీరో హీరోయిన్లుగా మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక నిర్మించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఈ చిత్రం ఈ నెల 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం డైలాగ్ రైటర్ అబ్బూరి రవి మాట్లాడుతూ– ''ఈ సినిమాలో పెళ్లి అనే సబ్జెక్ట్‌ను వినోదాత్మకంగా చూపిస్తూనే, ఆడియన్స్ ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యేలా తీశాం. ముఖ్యంగా ఇది పెళ్లి కాని ప్రతి వారు కోరుకునే కంటెంట్. క్లీన్ ఎంటర్‌టైనర్. 'ఆ ఒక్కటీ అడక్కు' అనేది ఈవీవీగారి క్లాసిక్ టైటిల్. ఈ సినిమాకు ఈ టైటిల్‌ను అన్నప్పుడు కాస్త భయం వేసింది. కానీ ఈ కథకు ఆ టైటిల్ సరిగ్గా సరిపోతుందని నరేశ్‌గారే సూచించారు. ఇక నాకు డైరెక్షన్ చేయాలని ఉంది. ఆ ప్రయత్నాల్లో ఉన్నాను. ప్రస్తుతం 'గూఢచారి 2', 'డెకాయిట్' సినిమాలకు వర్క్ చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

ముఫాసా ఈజ్ బ్యాక్



హాలీవుడ్ లయన్ కింగ్ మళ్లీ వస్తున్నాడు. 1994లో వచ్చిన యానిమేటెడ్ మ్యూజికల్ డ్రామా 'ది లయన్ కింగ్' ఆధారంగా 'ది లయన్ కింగ్' టైటిల్‌తోనే సినిమా వచ్చింది. జోన్ ఫావ్రూ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ముఫాసా, సింబ (ముఫాసా తనయుడు), ముఫాసా తమ్ముడు స్కార్‌లు ప్రధాన పాత్రధారులుగా 'ది లయన్ కింగ్' సినిమా కథనం సాగుతుందన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 'ది లయన్ కింగ్' సినిమాకు ప్రీక్వెల్‌గా 'ముఫాసా: ది లయన్ కింగ్' చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం ట్రైలర్, ఫస్ట్ లుక్ విడుదలైంది. డిసెంబరు 20న 'ముఫాసా: ది లయన్ కింగ్' రిలీజ్ కానుంది.

వినూత్న కథాంశంతో...



- విరాజ్ అశ్విన్, రవితేజ మహాదాస్యం

రవితేజ మహాదాస్యం హీరోగా మద్దుల మదన్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న నూతన చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆర్ట్ మేకర్స్ సమర్పణలో సౌజన్య కావూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రచయిత పురాణపండ శ్రీనివాస్ కెమెరా స్విచ్చాన్ చేయగా, తొలి సీన్‌కి విరాజ్ అశ్విన్ క్లాప్ ఇచ్చారు. ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నితిన్ రెడ్డి చిమ్ముల, సహనిర్మాతలు: దియా, సంజీవ్ కోనేరు, వెంకట్ రమణారెడ్డి.

తిండిబోతు దెయ్యం



- నరసింహా, మోనిక, వాసవి

నరసింహా బోదాసు హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న కామెడీ హారర్ ఫిల్మ్ 'తిండిబోతు దెయ్యం'. మోనికా సమత్తార్, తన్నీరు వాసవి హీరోయిన్లు. శిరీష నరసింహా బోదాసు నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత శిరీష నరసింహా బోదాసు కెమెరా స్విచ్చాన్ చేయగా, సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావు క్లాప్ ఇచ్చి, యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ''ఈ సినిమాలో కొత్తదనం ఉంటుంది'' అన్నారు నరసింహా బోదాసు.



ఇంగ్లండ్ టి20 జట్టులో జోఫ్రా ఆర్చర్

గాయం నుంచి కోలుకుని పూర్తి ఫిట్‌నెస్ సంతరించుకున్న పేస్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ఏడాది తర్వాత మళ్లీ ఇంగ్లండ్ జట్టులోకి వచ్చాడు. టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే ఇంగ్లండ్ జట్టును మంగళవారం ప్రకటించారు. ఆర్చర్ పునరాగమనం చేయగా... జోస్ బట్లర్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. మొయిన్ అలీ, బెయిర్‌స్టో, హ్యారీ బ్రూక్, స్యామ్ కరన్, బెన్ డకెట్, టామ్ హార్ట్‌లే, విల్ జాక్స్, క్రిస్ జోర్డాన్, లివింగ్‌స్టోన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, రీస్ టాప్లే, మార్క్ వుడ్ జట్టులో ఇతర సభ్యులుగా ఉన్నారు.

మార్క్‌రమ్ సారథ్యంలో బరిలోకి దక్షిణాఫ్రికా

టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే దక్షిణాఫ్రికా జట్టును ప్రకటించారు. గత ఏడాది మార్చిలో తొలిసారి దక్షిణాఫ్రికా టి20 జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన మార్క్‌రమ్ సారథ్యంలోనే సఫారీ బృందం ఈ మెగా టోర్నీలో పోటీపడనుంది. వికెట్ కీపర్ రికెల్టన్, పేసర్ బార్ట్‌మన్ తొలిసారి జాతీయ జట్టులోకి ఎంపికయ్యారు. డికాక్, కొయెట్జీ, ఫోర్టూన్, రీజా హెండ్రిక్స్, మార్కో జాన్సెన్, హెన్రిచ్ క్లాసెన్, కేశవ్ మహరాజ్, డేవిడ్ మిల్లర్, నోర్జే, రబడ, షమ్సీ, ట్రిస్టన్ స్టబ్స్ జట్టులో ఇతర సభ్యులుగా ఉన్నారు.





రోహిత్ శర్మ

ప్రపంచకప్ వేటకు సిద్ధం

టి20 ప్రపంచకప్ సమరాన్ని గెలిచేందుకు బీసీసీఐ సెలక్షన్ కమిటీ మరోసారి అనుభవాన్నే నమ్ముకుంది. ఐపీఎల్‌లో అద్భుత బ్యాటింగ్‌తో కొందరు కుర్రాళ్లు అదరగొడుతున్నా... సీనియర్లకు ప్రాధాన్యతనిచ్చింది. దీంతో పాటు ప్రస్తుతం ఫామ్ గొప్పగా లేకున్నా... అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఇప్పటికే ఎంతో కొంత ప్రభావం చూపించిన వారిపైనే కమిటీ విశ్వాసం ఉంచింది. గత టి20 వరల్డ్ కప్‌లో ఆడిన 9 మందికి ఈసారి మళ్లీ అవకాశం కల్పించింది. అందుకే వరల్డ్ కప్ టీమ్ సెలక్షన్ దాదాపుగా అంచనాలకు తగినట్లుగానే సాగింది. ఒకరిద్దరు ఆటగాళ్ల ఎంపిక విషయంలో కాస్త ఆశ్చర్యకర నిర్ణయాలు కనిపించినా... మొత్తంగా అర్హత కలిగిన వారికే అమెరికా–వెస్టిండీస్ వీసా లభించింది. గత వరల్డ్ కప్ సెమీఫైనల్లో ఓటమి తర్వాత పూర్తిగా కుర్రాళ్లతో టి20ల్లో బోర్డు కొత్త ప్రయోగాలు చేసినా... తర్వాతి మెగా టోర్నీకి వచ్చేసరికి మళ్లీ తమ పాత ప్రణాళికకే కట్టుబడటం చెప్పుకోదగ్గ అంశం.

టి20 మెగా టోర్నీకి భారత జట్టు ప్రకటన

రిషభ్ పంత్ పునరాగమనం

సామ్సన్, దూబే, యశస్వి జైస్వాల్‌లకు అవకాశం

గిల్, రాహుల్, రింకూలకు దక్కని చోటు

అనుభవజ్ఞులకే అవకాశమిచ్చిన సెలక్టర్లు

అహ్మదాబాద్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 9వ టి20 ప్రపంచ కప్ కోసం భారత సెలక్టర్లు 15 మంది సభ్యుల జట్టును ప్రకటించారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బోర్డు సెలక్షన్ కమిటీ మంగళవారం సమావేశమై ఆటగాళ్లను ఎంపిక చేసింది. రోహిత్ శర్మ వరుసగా రెండో టి20 ప్రపంచకప్‌లో కెప్టెన్ హోదాలో బరిలోకి దిగనుండగా... 2022లో ఆస్ట్రేలియా గడ్డపై టి20 వరల్డ్ కప్‌లో ఆడిన వారిలో 9 మంది ఈసారీ టీమిండియా చాన్స్ దక్కించుకున్నారు. గత టోర్నీలో భారత్ సెమీఫైనల్ వరకు చేరింది. సెలక్టర్లు ప్రకటించిన జట్టులో నలుగురు బ్యాటర్లు, ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లు, ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లు, నలుగురు ఆల్‌రౌండర్లు ఉన్నారు. మరో నలుగురు ఆటగాళ్లను 'రిజర్వ్'లుగా కూడా ఎంపిక చేశారు. జూన్ 1 నుంచి 29 వరకు జరిగే వరల్డ్ కప్‌లో గ్రూప్ 'బి'లో ఉన్న భారత్ జూన్ 5న తమ తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో తలపడుతుంది. ఆ తర్వాత జూన్ 9, 12, 15 తేదీల్లో వరుసగా పాకిస్తాన్, అమెరికా, కెనడా జట్లను టీమిండియా ఎదుర్కొంటుంది. ఐపీఎల్‌లో ప్లే ఆఫ్స్ చేరని జట్ల ఆటగాళ్లతో కూడిన మొదటి బృందం ఈ నెల 21న ముందుగా కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో పాటు అమెరికాకు బయల్దేరుతుంది.

జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్, సంజూ సామ్సన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, యుజువేంద్ర చహల్, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్. **రిజర్వ్ ఆటగాళ్లు:** శుబ్‌మన్ గిల్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్, అవేశ్ ఖాన్.

ఐపీఎల్ ప్రదర్శనతోనే...

జట్టు ఎంపికలో తాజా ఐపీఎల్ ప్రదర్శనను సెలక్టర్లు పరిగణనలోకి తీసుకున్నారా అంటే అవునని, కాదని కూడా సమాధానం వస్తుంది. చెన్నై తరఫున మిడిలార్డర్‌లో సిక్సర్లతో చెలరేగిపోతున్న శివమ్ దూబేకు ఐపీఎల్ కారణంగానే పిలుపు దక్కింది. ఈ టోర్నీలో అతను ఏకంగా 172.41 స్ట్రయిక్‌రేట్‌తో 350 పరుగులు సాధించాడు. భారత్‌కు ఆడిన 21 టి20ల్లో కూడా అతను ఆకట్టుకున్నాడు. ఇక కారు ప్రమాదం నుంచి కోలుకొని ఐపీఎల్‌లో రాణిస్తున్న రిషభ్ పంత్‌ను కూడా సెలక్టర్లు ఎంపిక చేశారు. లీగ్‌లో అతను 158.58 స్ట్రయిక్‌రేట్‌తో 398 పరుగులు చేశాడు. అయితే పరుగులకంటే పూర్తి ఫిట్‌గా పంత్ కనిపించడం కూడా సానుకూలాంశంగా మారింది. మరోవైపు రెండో వికెట్ కీపర్‌గా కేరళకు చెందిన సంజూ సామ్సన్ కూడా ఎంపికయ్యాడు. ఐపీఎల్‌లో కెప్టెన్‌గా రాజస్తాన్ రాయల్స్ టీమ్‌ను సమర్థంగా నడిపించడంతో పాటు 161.08 స్ట్రయిక్‌రేట్‌తో సామ్సన్ 385 పరుగులు సాధించాడు.

ఎవరు... ఎందుకు... ఎలా?

2022 వరల్డ్ కప్‌కు ఎంపిక చేసిన ఆడిన జట్టుతో పోలిస్తే రోహిత్, కోహ్లి, సూర్యకుమార్, పంత్, హార్దిక్, అక్షర్, అర్ష్‌దీప్, చహల్, బుమ్రా (టోర్నీకి ముందు గాయంతో తప్పుకున్నాడు) తమ స్థానాలు నిలబెట్టుకున్నారు. 2021, 2022లో వరల్డ్ కప్‌లలో ఆడిన జట్టులో దాదాపు అదే టాప్–6 ఇప్పుడు కూడా మళ్లీ ఎంపికయ్యారు. కేఎల్ రాహుల్ స్థానంలో యశస్వి రావడం మినహా ఎలాంటి మార్పూ లేదు. యశస్వి ఈ సీజన్ ఐపీఎల్‌లో వరుస వైఫల్యాల తర్వాత సెంచరీతో ఆకట్టుకోవడంతో అతనికి అవకాశం దక్కింది. బ్యాటింగ్‌లో ఇప్పుడు కావాల్సిన 'ఫైర్' లేదని ఎన్ని విమర్శలు వస్తున్నా అగ్రశ్రేణి బ్యాటర్లుగా రోహిత్, కోహ్లిల స్థానం ఎప్పుడూ ప్రశ్నార్థకం కాదు. సూర్యకుమార్ విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. రవీంద్ర జడేజా కూడా గొప్ప ప్రదర్శన చేయకపోయినా ఆల్‌రౌండ్ నైపుణ్యం అతనికి కలిసొచ్చింది. జడేజా ఉన్న తర్వాత అక్షర్ పటేల్ ఎంపిక కూడా కాస్త ఆశ్చర్యకరమే.

హార్దిక్ మళ్లీ...

ఇటీవల ఆటలో వైఫల్యాలతో పాటు ముంబై కెప్టెన్సీ వ్యవహారాలతో అన్ని వైపుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న హార్దిక్ పాండ్యాకు సెలక్టర్లు మాత్రం అండగా నిలిచారు. వన్డే వరల్డ్ కప్‌లో గాయపడి కోలుకున్న తర్వాత భారత్‌కు ఆడకపోయినా అతనిపై నమ్మకముంచారు. ఐపీఎల్‌లోనూ విఫలమైనా... అతని తరహాలో సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ స్థానం కోసం ప్రత్యామ్నాయం లేక ఎంపిక చేయక తప్పలేదు. దూబే అస్సలు బౌలింగ్ చేయకపోవడం, హార్దిక్ ఎన్నో కొన్ని ఓవర్లు వేస్తుండటం వల్ల కూడా అతని స్థానానికి ఢోకా లేకుండా పోయింది.

నలుగురు స్పిన్నర్లతో...

అమెరికాలో తొలిసారి వరల్డ్ కప్ జరుగుతుండంతో కొత్తగా అక్కడ తయారు చేస్తున్న పిచ్‌లు ఎలా ఉంటాయో సరిగ్గా ఎవరూ అంచనా వేయలేని పరిస్థితి. అయితే స్పిన్‌కు అవకాశం ఉంటే తమ అన్ని అస్త్రాలను వాడుకునేందుకు భారత్ సిద్ధమైంది. జడేజా, అక్షర్‌లతో పాటు కుల్దీప్, యుజువేంద్ర చహల్‌లు జట్టులో ఉన్నారు. కుల్దీప్ చాలా కాలంగా మంచి ఫామ్‌లో ఉండగా... గత రెండు సిరీస్‌లలో భారత జట్టులో చోటు దక్కించుకోని చహల్ పునరాగమనం చేసి తొలిసారి టి20 వరల్డ్‌కప్‌లో



రాహుల్

ఆడే అవకాశాన్ని దక్కించుకున్నాడు. మధ్య ఓవర్లలో ప్రత్యర్థిని కట్టడి చేసేందుకు వీరిని వాడుకోవచ్చు. బుమ్రాకు తోడుగా అర్ష్‌దీప్, సిరాజ్‌లను ఎంపిక చేశారు. ఈ ఫార్మాట్‌లో గొప్ప ప్రదర్శన లేకపోయినా, ఐపీఎల్‌లోనూ పెద్దగా రాణించలేకపోతున్నా... ప్రస్తుత స్థితిలో అనుభవం ఉన్న పేసర్ అతనే కావడంతో సిరాజ్‌కు తొలిసారి టి20 ప్రపంచకప్ ఆడే చాన్స్ లభించింది. లెఫ్టార్మ్ పేసర్ కావడమే అర్ష్‌దీప్ బలం. కొంత కాలంగా లయ కోల్పోయి ఇబ్బంది పడుతున్నా అర్ష్‌దీప్‌ను సెలక్టర్లు మళ్లీ నమ్మారు.

గత వరల్డ్ కప్‌లో సెమీస్ ఓటమి తర్వాత మళ్లీ అంతర్జాతీయ టి20 ఆడని రాహుల్‌ను తప్పించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అతని స్ట్రయిక్‌రేట్ కూడా అంతంత మాత్రమే. రాహుల్ తరహాలోనే శుబ్‌మన్ గిల్ కూడా ఈ ఫార్మాట్‌లో పెద్దగా ప్రభావం చూపించింది లేదు.

పాపం రింకూ సింగ్...



వరల్డ్ కప్ జట్టు ఎంపికలో అన్ని రకాలుగా చర్చకు దారి తీసిన విషయం రింకూ సింగ్‌ను ఎంపిక చేయకపోవడం. విధ్వంసకర బ్యాటింగ్‌తో గత ఏడాది ఐపీఎల్ నుంచి అతను తానేంటో నిరూపించుకున్నాడు. లోయర్ మిడిలార్డర్‌లో ఫినిషర్‌గా సత్తా చాటాడు. భారత్ తరఫున లభించిన పరిమిత అవకాశాల్లో (11 ఇన్నింగ్స్‌లు) ఏకంగా 176.23 స్ట్రయిక్ రేట్, 89 సగటుతో పరుగులు సాధించాడు. కానీ చివరకు వచ్చేసరికి అతనికి వరల్డ్ కప్ చాన్స్ లభించలేదు. ఈసారి ఐపీఎల్‌లో గొప్పగా ఆడకపోవడం వాస్తవమే అయినా కోల్‌కతా టాపార్డర్ రాణిస్తుండటంతో అతనికి పెద్దగా అవకాశాలు రాలేదు. 9 మ్యాచ్‌లలో కేవలం 82 బంతులే ఆడే చాన్స్ దక్కింది. మిడిలార్డర్‌లో భారీ షాట్లు కొట్టే సామర్థ్యం ఉన్న బ్యాటర్ కోసం జరిగిన చర్చలో రింకూపై దూబేదే పైచేయి అయింది. ఒకవేళ తుది జట్టులో హార్దిక్‌ను తప్పించాల్సి వచ్చినా... దూబే బౌలింగ్ ఎంతో కొంత ఉపయోగపడగలదని సెలక్టర్లు భావించారు.

రోహిత్ శర్మ



వయసు: 37
ఆడిన టి20లు: 151
చేసిన పరుగులు: 3974
అత్యధిక స్కోరు: 121 నాటౌట్
సెంచరీలు: 5
అర్ధ సెంచరీలు: 29
స్ట్రయిక్‌రేట్: 139.97
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 8

విరాట్ కోహ్లి



వయసు: 35
ఆడిన టి20లు: 117
చేసిన పరుగులు: 4037
అత్యధిక స్కోరు: 122 నాటౌట్
సెంచరీలు: 1
అర్ధ సెంచరీలు: 37
స్ట్రయిక్‌రేట్: 138.15
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 5

సూర్యకుమార్



వయసు: 33
ఆడిన టి20లు: 60
చేసిన పరుగులు: 2141
అత్యధిక స్కోరు: 117
సెంచరీలు: 4
అర్ధ సెంచరీలు: 17
స్ట్రయిక్‌రేట్: 171.55
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 2

హార్దిక్ పాండ్యా



వయసు: 30
ఆడిన టి20లు: 92
చేసిన పరుగులు: 1348
అత్యధిక స్కోరు: 71 నాటౌట్
అర్ధ సెంచరీలు: 3
స్ట్రయిక్‌రేట్: 139.88
తీసిన వికెట్లు: 73
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 3

రిషభ్ పంత్



వయసు: 26
ఆడిన టి20లు: 66
చేసిన పరుగులు: 987
అత్యధిక స్కోరు: 65 నాటౌట్
అర్ధ సెంచరీలు: 3
స్ట్రయిక్‌రేట్: 126.37
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 2

శివమ్ దూబే



వయసు: 30
ఆడిన టి20లు: 21
చేసిన పరుగులు: 276
అత్యధిక స్కోరు: 63 నాటౌట్
అర్ధ సెంచరీలు: 3
తీసిన వికెట్లు: 8
స్ట్రయిక్‌రేట్: 145.26
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

అర్ష్‌దీప్ సింగ్



వయసు: 25
ఆడిన టి20లు: 44
తీసిన వికెట్లు: 62
ఉత్తమ బౌలింగ్: 4/37
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 1

యుజువేంద్ర చహల్



వయసు: 33
ఆడిన టి20లు: 80
తీసిన వికెట్లు: 96
ఉత్తమ బౌలింగ్: 6/25
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

కుల్దీప్ యాదవ్



వయసు: 29
ఆడిన టి20లు: 35
తీసిన వికెట్లు: 59
ఉత్తమ బౌలింగ్: 5/17
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

రవీంద్ర జడేజా



వయసు: 35
ఆడిన టి20లు: 66
చేసిన పరుగులు: 480
అత్యధిక స్కోరు: 46 నాటౌట్
స్ట్రయిక్‌రేట్: 125.32
తీసిన వికెట్లు: 53
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 5

సంజూ సామ్సన్



వయసు: 29
ఆడిన టి20లు: 25
చేసిన పరుగులు: 374
అత్యధిక స్కోరు: 77
అర్ధ సెంచరీలు: 1
స్ట్రయిక్‌రేట్: 133.09
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

యశస్వి జైస్వాల్



వయసు: 22
ఆడిన టి20లు: 17
చేసిన పరుగులు: 502
అత్యధిక స్కోరు: 100
సెంచరీలు: 1
అర్ధ సెంచరీలు: 4
స్ట్రయిక్‌రేట్: 161.93
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

జస్‌ప్రీత్ బుమ్రా



వయసు: 30
ఆడిన టి20లు: 62
తీసిన వికెట్లు: 74
ఉత్తమ బౌలింగ్: 3/11
ఆడిన టి20 ప్రపంచకప్‌లు: 2

మొహమ్మద్ సిరాజ్



వయసు: 30
ఆడిన టి20లు: 10
తీసిన వికెట్లు: 12
ఉత్తమ బౌలింగ్: 4/17
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

అక్షర్ పటేల్



వయసు: 30; ఆడిన టి20లు: 52
చేసిన పరుగులు: 361
తీసిన వికెట్లు: 49
ఉత్తమ బౌలింగ్: 3/9
ఇదే తొలి టి20 వరల్డ్‌కప్

రెండో టి20లోనూ భారత మహిళల గెలుపు

రాణించిన హేమలత, రాధా యాదవ్



హేమలత

సిల్హెట్: బంగ్లాదేశ్ పర్యటనలో భారత మహిళల జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం జరిగిన రెండో టి20కి వర్షం అంతరాయం కలిగించగా.. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ 19 పరుగులతో బంగ్లాదేశ్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 119 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ ముర్షిదా ఖాటున్ (49 బంతుల్లో 46; 5 ఫోర్లు) రాణించగా, రీతూ మోని (18 బంతుల్లో 20; 2 ఫోర్లు) మెరుగ్గా ఆడింది. రాధా యాదవ్ 3, శ్రేయాంక, దీప్తి శర్మ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత మహిళల జట్టు వర్షంతో ఆట నిలిచే సమయానికి 5.2 ఓవర్లలో వికెట్ నష్టానికి 47 పరుగులు చేసింది. భారత్ ఓపెనర్ షఫాలీ వర్మ (0) డకౌట్ కాగా, స్మృతి మంధాన (5 నాటౌట్) నింపాదిగా ఆడింది. కానీ హేమలత దయాళన్ (24 బంతుల్లో 41 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగింది. మైదానం చిత్తడిగా మారడంతో మళ్లీ మ్యాచ్ కొనసాగించే అవకాశం లేకపోయింది. హేమలతకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది.

చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ పరాజయం



చెంగ్డూ: ఉబెర్ కప్ మహిళల టీమ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత జట్టు లీగ్ దశను పరాజయంతో ముగించింది. ఆతిథ్య చైనా జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 0–5తో పరాజయం పాలైంది. వరుసగా మూడో విజయంతో చైనా గ్రూప్ 'టాపర్'గా నిలువగా... ద్వితీయ శ్రేణి జట్టుతో బరిలోకి దిగిన భారత జట్టు రెండు విజయాలు సాధించి రెండో స్థానంతో క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. చైనాతో జరిగిన పోటీలో తొలి మ్యాచ్‌లో ఇషారాణి 12–21, 10–21తో చెన్ యు ఫె చేతిలో... రెండో మ్యాచ్‌లో ప్రియ–శ్రుతి మిశ్రా 13–21, 12–21తో చెన్ కింగ్ చెన్–జియా యి ఫాన్ చేతిలో... ఓడిపోయారు. హాన్ యుయెతో జరిగిన మూడో మ్యాచ్‌లో అన్‌మోల్ తొలి గేమ్‌ను 9–21తో కోల్పోయి, రెండో గేమ్‌లో 1–4తో వెనుకబడిన దశలో గాయపడి వైదొలిగింది. దాంతో చైనా 3–0తో విజయాన్ని ఖరారు చేసుకుంది. నాలుగో మ్యాచ్‌లో సిమ్రన్ సింగ్–రితిక ద్వయం 9–21, 10–21తో లియు షెన్ షు–టాన్ నింగ్ జోడీ చేతిలో ఓడిపోగా... ఆఖరి మ్యాచ్‌లో తన్వీ శర్మ 7–21, 16–21తో వాంగ్ జి యి చేతిలో ఓటమి పాలైంది.

సూపర్ స్టొయినిస్...

- లక్నో ఖాతాలో ఆరో విజయం
- ముంబై ఇండియన్స్‌కు ఏడో ఓటమి



స్టొయినిస్

లక్నో: బౌలర్లు శాసించిన ఐపీఎల్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ పైచేయి సాధించింది. 4 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. నేహల్ వధెరా (41 బంతుల్లో 46; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (18 బంతుల్లో 35 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. మోసిన్ ఖాన్ 2 వికెట్లు తీశాడు. తర్వాత లక్నో 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 145 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్ (45 బంతుల్లో 62; 7 ఫోర్లు, 2 సిక్స్) నెమ్మదించిన పిచ్‌పై కీలకపాత్ర పోషించాడు. హార్దిక్ పాండ్యా 2 వికెట్లు తీశాడు.

ముంబై 28/4

మెరుపులు మెరిపించాల్సిన పవర్ ప్లేలో ముంబై కష్టాలపాలైంది. రోహిత్ (4), సూర్యకుమార్ (10), తిలక్ వర్మ (7), హార్దిక్ పాండ్యా (0) ఇలా హిట్టర్లంతా వరుస కట్టడంతో 6 ఓవర్లలో ముంబై 28/4 స్కోరు చేసింది. 9వ ఓవర్లో 8 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇషాన్ కిషన్‌కు లైఫ్ వచ్చింది... లేదంటే పరిస్థితి ఇంకాస్త క్లిష్టంగా ఉండేది. పదో ఓవర్లో ముంబై కష్టంగా 50 పరుగులు దాటింది. కిషన్ (36 బంతుల్లో 32; 3 ఫోర్లు), నేహల్ వధెరా ఐదో వికెట్‌కు 53 పరుగులు జోడించారు. వీళ్లిద్దరు అవుటయ్యాక ఆఖర్లో టిమ్ డేవిడ్ ధాటిగా ఆడటంతో ముంబై ఆ మాత్రం స్కోరు చేయగలిగింది.

మొదటి ఓవర్లోనే అర్శిన్ కులకర్ణి (0) డకౌటైనా... కెప్టెన్ రాహుల్ (22 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్), స్టొయినిస్ క్రీజులో పాతుకుపోవడంతో పవర్ ప్లేలో లక్నో 52/1 స్కోరు చేసింది. కాసేపటికే రాహుల్ నిష్క్రమించినప్పటికీ స్టొయినిస్ తర్వాత వచ్చిన బ్యాటర్స్‌తో జట్టును లక్ష్యం వైపు నడిపించాడు. 39 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. స్వల్ప వ్యవధిలో స్టొయినిస్, టర్నర్ (5) అవుటైనప్పటికీ పూరన్ (14 బంతుల్లో 14 నాటౌట్; 1 సిక్స్) బాధ్యతగా ఆడి మిగతా లక్ష్యాన్ని పూర్తి చేశాడు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) మయాంక్ (బి) బిష్ణోయ్ 32; రోహిత్ (సి) స్టొయినిస్ (బి) మోసిన్ 4; సూర్యకుమార్ (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 10; తిలక్ వర్మ (రనౌట్) 7; హార్దిక్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 0; నేహల్ (బి) మోసిన్ 46; టిమ్ డేవిడ్ (నాటౌట్) 35; నబీ (బి) మయాంక్ 1; కొయెట్జీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 144. వికెట్ల పతనం: 1–7, 2–18, 3–27, 4–27, 5–80, 6–112, 7–123. బౌలింగ్: స్టొయినిస్ 3–0–19–1, మోసిన్ 4–0–36–2, నవీనుల్ 3.5–0–15–1, మయాంక్ 3.1–0–31–1, రవి బిష్ణోయ్ 4–0–28–1, దీపక్ హుడా 2–0–13–0.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) నబీ (బి) హార్దిక్ 28; అర్శిన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తుషార 0; స్టొయినిస్ (సి) తిలక్ (బి) నబీ 62; హుడా (సి) బుమ్రా (బి) హార్దిక్ 18; పూరన్ (నాటౌట్) 14; టర్నర్ (బి) కొయెట్జీ 5; బదోని (రనౌట్) 6; కృనాల్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (19.2 ఓవర్లలో 6 వికెట్లకు) 145. వికెట్ల పతనం: 1–1, 2–59, 3–99, 4–115, 5–123, 6–133. బౌలింగ్: తుషార 4–0–30–1, బుమ్రా 4–0–17–0, కొయెట్జీ 3–0–29–1, పియూశ్ చావ్లా 3–0–23–0, హార్దిక్ పాండ్యా 4–0–26–2, నబీ 1.2–0–16–1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	9	8	1	16	0.694
కోల్‌కతా	9	6	3	12	1.096
లక్నో	10	6	4	12	0.094
చెన్నై	9	5	4	10	0.810
హైదరాబాద్	9	5	4	10	0.075
ఢిల్లీ	11	5	6	10	-0.442
గుజరాత్	10	4	6	8	-1.113
పంజాబ్	9	3	6	6	-0.187
ముంబై	10	3	7	6	-0.272
బెంగళూరు	10	3	7	6	-0.415

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × పంజాబ్
వేదిక: చెన్నై

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

హర్షిత్ రాణాపై జరిమానా, ఒక మ్యాచ్ సస్పెన్షన్



కోల్‌కతా: కోల్‌కతా నైట్‌రైడర్స్ పేస్ బౌలర్ హర్షిత్ రాణా తన అనుచిత ప్రవర్తనతో భారీ మూల్యమే చెల్లించుకున్నాడు. అతనిపై 100 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా విధించడంతో పాటు ఒక మ్యాచ్ సస్పెండ్ చేశారు. గతంలో హైదరాబాద్ బ్యాటర్ మయాంక్ అగర్వాల్‌ను అవుట్ చేశాక హర్షిత్ అతన్ని లక్ష్యంగా చేసుకొని 'ఫ్లయింగ్ కిస్' ఇవ్వడంతో 60 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించారు. తాజాగా సోమవారం ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో పోరెల్ వికెట్ తీసినప్పుడు కూడా అలాగే అతి చేశాడు. దీంతో రెండోసారి తప్పును పునరావృతం చేయడంతో ఐపీఎల్ నియమావళి ప్రకారం జరిమానాతో పాటు సస్పెన్షన్ వేటు వేశారు.

సాక్షి బిజినెస్

బుధవారం
1-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 188	74,482
నిఫ్టీ ▽ 38	22,604

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,812	▽ 171
డోజోన్స్	38,030	▽ 356
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,144	▽ 3
డాక్స్	17,932	▽ 186
షాంఘై	3,105	▽ 8
నికాయ్	38,406	▽ 471

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	70,800
బంగారం (22 క్యారెట్)	67,430
వెండి (కేజీ)	87,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.84	85.13
£	బ్రిటన్ పౌండ్		102.36	106.93
€	యూరో		87.44	91.55
¥	జపాన్ ఎన్ (100)		43.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.71	56.97
S$	సింగపూర్ డాలర్		59.29	63.53
SAR	సౌదీ రియాల్		21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్		21.85	23.62
¥	చైనా యువాన్		10.39	12.39

ధర పెరిగినా బంగారమే

- జనవరి–మార్చి త్రైమాసికంలోడిమాండ్ 8% అప్
- పరిమాణంలో 136.6 టన్నులు
- ఆర్‌బీఐ కొనుగోళ్లు 19 టన్నులు



న్యూఢిల్లీ: భారత్ కుటుంబాల్లో బంగారానికి ఉన్న ప్రాధాన్యత తెలిసిందే. దీనిని ప్రతిబింబిస్తూ, ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికంలో 2023 ఇదే కాలంతో పోల్చితే భారత్ పసిడి డిమాండ్ 8 శాతం పెరిగి 136.6 టన్నులకు (ఆభరణాలు, పెట్టుబడులు) పెరిగింది. ధర తీవ్రంగా ఉన్నా ఈ స్థాయి డిమాండ్ నెలకొనడం గమనార్హం. సమీక్షా కాలంలో త్రైమాసిక సగటు ధర (దిగుమతి సుంకం, జీఎస్‌టీ మినహా) 10 గ్రాములకు రూ.49,943.80 నుంచి రూ.55,247.20కి ఎగసింది. ఇక భారత్ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇదే కాలంలో ఏకంగా 19 టన్నులు కొనుగోలు చేసింది. 2023 క్యాలెండర్ ఇయర్ మొత్తంలో ఆర్‌బీఐ కొనుగోళ్లు 16 టన్నులే కావడం గమనార్హం. తాజా 'క్యూ1 2024, గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్ నివేదికలో ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) ఈ అంశాలను తెలిపింది.

ప్రపంచ వ్యాప్తంగా 3 శాతం అప్

మార్చి త్రైమాసికంలో ప్రపంచ పసిడి డిమాండ్ 3% పెరిగి 1,238 టన్నులకు చేరింది. 2016 తర్వాత ఈ స్థాయి డిమాండ్ పటిష్టత ఇదే తొలిసారి. సగటు త్రైమాసిక ధర ఔన్స్‌కు (31.1 గ్రాములు) 2,070 డాలర్లు. వార్షికంగా ఈ రేటు 10% అధికమైతే, త్రైమాసికంగా 5 % ఎక్కువ. సెంట్రల్ బ్యాంకులు తమ హోల్డింగ్స్‌ను ఈ కాలంలో 290 టన్నులు పెంచుకున్నాయి.

- మార్చి త్రైమాసికంలో భారత్ పసిడి డిమాండ్ విలువ రూపాయల్లో వార్షిక ప్రాతిపదికన 20 శాతం పెరిగి రూ.75,470 కోట్లకు చేరింది.
- సమీక్షా కాలం మొత్తం పసిడి డిమాండ్‌లో ఆభరణాల డిమాండ్ 4 శాతం పెరిగి 95.5 టన్నులకు చేరగా, పెట్టుబడుల (కడ్డీలు, నాణేల వంటివి) విలువ 19 శాతం పెరిగి 41.1 టన్నులుగా నమోదైంది.
- విలువల్లో చూస్తే ఆభరణాలకు డిమాండ్ 15% పెరిగి రూ.52,750 కోట్లకు చేరింది. పెట్టుబడుల్లో విలువ 32% పెరిగి రూ.22,720కి ఎగసింది.
- మార్చి త్రైమాసికంలో పసిడి దిగుమతులు 25 % పెరిగి 179.4 టన్నులుగా నమోదయ్యాయి.
- గోల్డ్ రీసైక్లింగ్ విలువ 10% పెరిగి 38.3 టన్నులుగా నమోదైంది.
- 2024లో 700 నుంచి 800 టన్నుల కొనుగోళ్లు జరుగుతాయన్నది అంచనా.

జోయాలుక్కాస్ అక్షయ తృతీయ ఆఫర్లు

హైదరాబాద్: జోయాలుక్కాస్ అక్షయ తృతీయ సందర్భంగా పలు ఆఫర్లు ప్రకటించింది. రూ.50,000 అంతకుపైబడిన వజ్రాలు, అన్‌కట్ వజ్రాల కొనుగోలుపై రూ.2,000 విలువైన గిఫ్ట్ వోచర్ పొందవచ్చు. రూ.50,000, అంతకు పైబడిన బంగారు ఆభరణాలు కొనుగోలుపై రూ.1000 గిఫ్ట్ వోచర్.., రూ.10,000 విలువైన వెండి ఆభరణాలు కొనుగోలుపై రూ.500 గిఫ్ట్ వోచర్‌ను అందిస్తుంది. దేశవ్యాప్తంగా అన్ని షోరూంల్లో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు ఆఫర్ అందుబాటులో ఉంటుంది. కస్టమర్లు ఈ ఆఫర్‌ను వినియోగించుకోవాలని ఎండీ, చైర్మన్ జోయ్ అలుక్కాస్ కోరారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రత్యేక ఆఫర్లు



హైదరాబాద్: అక్షయ తృతీయ సందర్భంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. బంగారు వజ్రాభరణాల తయారీ చార్జీలపై 25% వరకు, ప్రెసియా/ఎరా ఆభరణాల తయారీ, కొనుగోలుపై ఫ్లాటు 25%, వజ్రాభరణాల కొనుగోలుపై 25% వరకు తగ్గింపు ఆఫర్ పొందవచ్చు. కనీసం 10% చెల్లింపుతో ముందస్తు బుకింగ్ సౌకర్యం కల్పిస్తుంది. ఉచితంగా వెండి నాణెమూ పొందవచ్చు. ఈ మే 12 వరకు అందుబాటులో ఉండే ఈ ప్రత్యేక ఆఫర్‌ను కస్టమర్లంతా వినియోగించుకోవాలని కంపెనీ కోరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-5-2024 ఫామ్ ధర...	
విశాఖ	400-00
చిత్తూరు	468-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	370-00
విజయవాడ	370-00
హైదరాబాద్	365-00
వరంగల్	367-00

మార్చిలో మౌలిక రంగం వృద్ధి 5.2 శాతం



న్యూఢిల్లీ: ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం గ్రూప్ మార్చిలో 5.2 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకుంది. ఫిబ్రవరికన్నా (7.1 శాతం) ఈ రేటు తగ్గడం గమనార్హం. 2023లో ఇదే నెలల్లో ఈ గ్రూప్ వృద్ధి రేటు 4.2 శాతంగా ఉంది. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ రంగాలు కలిగి ఉన్న ఈ గ్రూప్‌నకు మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో 40.27 శాతం వెయిటేజ్ ఉంది. ఇక 2023–24 ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్–మార్చి) ఈ రంగం వృద్ధి రేటు 7.8 శాతం నుంచి 7.5 శాతానికి తగ్గింది. కాగా మే మొదటి పక్షంలో ఐఐపీ గణాంకాలు వెల్లడి కానున్నాయి. వార్షికంగా ఈ గణాంకాల స్పీడ్ తగ్గే అవకాశం ఉందని నిపుణుల అంచనా.

ఆఖరి గంటలో అమ్మకాలు

ఇంట్రాడేలో నిఫ్టీ ఆల్‌టైం హై • బ్యాంకులు, ఐటీ షేర్ల భారీ విక్రయాలు



ముంబై: ఆఖరి గంటలో బ్యాంకులు, ఐటీ, మెటల్, ఫార్మా షేర్లలో భారీ విక్రయాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలూ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. చివరి గంటలో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా లాభాల స్వీకరణకు పాల్పడడంతో సూచీలు లాభాలన్నీ హరించుకుపోయాయి. ఇంట్రాడేలో 765 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్ చివరికి 188 పాయింట్లు నష్టపోయి 74,482 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 74,346 వద్ద కనిష్టాన్ని 75,111వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 140 పాయింట్లు ఎగసి 22,783 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 38 పాయింట్లు కోల్పోయి 22,604 వద్ద నిలిచింది.

జేఎన్‌కే ఇండియా సక్సెస్

ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో జేఎన్‌కే ఇండియా షేరు లిస్టింగ్ విజయవంతమైంది. ఇష్యూ ధర (రూ.415)తో పోలిస్తే బీఎస్‌ఈలో 49% ప్రీమియంతో రూ.620 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 72% ఎగసి రూ.712 వద్ద గరిష్టాన్ని అందుకుంది. చివరికి 67% లాభంతో రూ.694 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,860 కోట్లుగా నమోదైంది.

మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా నేడు (బుధవారం) బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు సెలవు. బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. కమోడిటీ మార్కెట్లు సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి.

ఐవోసీ లాభం సగానికి డౌన్

క్యూ4లో రూ. 4,838 కోట్లు • రూ. 7 డివిడెండ్



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) నికర లాభం సగానికి పైగా క్షీణించింది. రూ. 4,838 కోట్లకు పరిమితమైంది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 2.28 లక్షల కోట్ల నుంచి రూ. 2.21 లక్షల కోట్లకు తగ్గింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ. 7 తుది డివిడెండ్ ప్రకటించింది. రూ. 5 మధ్యంతర డివిడెండ్‌కు ఇది అదనం.

పూర్తి సంవత్సరానికి రికార్డు లాభాలు..

పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ చరిత్రలోనే అత్యధిక లాభాలను ఐవోసీ ప్రకటించింది. రూ. 39,619 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇక ఆదాయం రూ. 9.41 లక్షల కోట్ల నుంచి రూ. 8.71 లక్షల కోట్లకు తగ్గింది. ముడి చమురు శుద్ధికి సంబంధించి ప్రతి బ్యారెల్‌పై వచ్చే స్థూల రిఫైనింగ్ మార్జిన్ 19.52 డాలర్ల నుంచి 12.05 డాలర్లకు తగ్గింది. అంతర్జాతీయంగా ముడి చమురు రేట్లు తగ్గినా దేశీయంగా ఇంధనాల ధరలను తగ్గించకుండా దాదాపు రెండేళ్ల పాటు అదే స్థాయిలో కొనసాగించడమనేది ఐవోసీ వంటి కంపెనీలకు లాభించింది.

స్పందన స్ఫూర్తి లాభం 22 శాతం జంప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో స్పందన స్ఫూర్తి నికరలాభం 22 శాతం ఎగసి రూ.129 కోట్లు సాధించింది. టర్నోవర్ 8 శాతం అధికమై రూ.710 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం 41 శాతం దూసుకెళ్లి రూ.378 కోట్లను తాకింది. రాబడి 106 బేసిస్ పాయింట్లు పెరిగి 24.2 శాతంగా ఉంది. వ్యయాలు 15 శాతం అధికమై రూ.194 కోట్లకు చేరాయి. పన్నుకు ముందు లాభం 24 శాతం దూసుకెళ్లి రూ.172 కోట్లకు చేరింది. కొత్త కస్టమర్ల సంఖ్య క్యూ3తో పోలిస్తే 30 శాతం దూసుకెళ్లి 4.4 లక్షలు నమోదైంది. మంజూరైన రుణాలు 30 శాతం పెరిగి రూ.3,970 కోట్లుగా ఉన్నాయి. 2023–24లో స్పందన స్ఫూర్తి నికరలాభం 488 శాతం దూసుకెళ్లి రూ.501 కోట్లు సాధించింది. టర్నోవర్ 72 శాతం ఎగసి రూ.2,534 కోట్లకు చేరింది. నిర్వహణలో ఉన్న ఆస్తులు 2024 మార్చి 31 నాటికి 41 శాతం పెరిగి రూ.11,973 కోట్లకు ఎగశాయి. సంస్థ యాక్టివ్ కస్టమర్ల సంఖ్య 33 లక్షలకుపైమాటే.

సెంట్రల్ బ్యాంక్ లాభం 41 శాతం అప్..

క్యూ4లో రూ. 807 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో రూ. 807 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో నమోదైన రూ. 571 కోట్లతో పోలిస్తే ఇది 41 శాతం అధికం. సమీక్షాకాలంలో బ్యాంకు ఆదాయం రూ. 8,567 కోట్ల నుంచి రూ. 9,699 కోట్లకు ఎగిసింది. వడ్డీ ఆదాయం రూ. 7,144 కోట్ల నుంచి రూ. 8,337 కోట్లకు చేరినట్లు బ్యాంకు తెలిపింది. అటు స్థూల మొండి బాకీలు (జీఎన్‌పీఏ) 8.44 శాతం నుంచి 4.5 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 1.77 శాతం నుంచి 1.23 శాతానికి తగ్గాయి. మొండి బాకీల నిష్పత్తి తగ్గడంతో ఎన్‌పీఏలకు కేటాయింపులు సైతం రూ. 789 కోట్ల నుంచి రూ. 509 కోట్లకు తగ్గాయి. మరోవైపు, ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో) లేదా రైట్స్ ఇష్యూ ద్వారా రూ. 5,000 కోట్లు సమీకరించే ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేసినట్లు బ్యాంకు వివరించింది.

విప్రోకు నోకియా భారీ ఆర్డర్

న్యూఢిల్లీ: విప్రో తాజాగా టెలికమ్యూనికేషన్స్ కంపెనీ నోకియా నుంచి భారీ ఆర్డర్ చేజిక్కించుకుంది. ఇందులో భాగంగా నోకియా ఉద్యోగుల అనుభవాన్ని మెరుగుపరిచే ఐటీ సపోర్ట్ సొల్యూషన్స్‌ను విప్రో రూపొందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 130 దేశాల్లోని 86,700 మంది నోకియా సిబ్బంది కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన క్లౌడ్ ఆధారిత పరిష్కారాన్ని అందిస్తామని విప్రో తెలిపింది. కాగా డీల్ విలువ వెల్లడికాలేదు.

భవిత

జాబ్ పాయింట్



హెచ్‌యూఆర్‌ఎల్, న్యూఢిల్లీలో 80 పోస్టులు

న్యూఢిల్లీలోని హిందూస్థాన్ ఉర్వారక్ అండ్ రసాయన్ లిమిటెడ్(హెచ్‌యూఆర్‌ఎల్).. ఒప్పంద/రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 80
» పోస్టుల వివరాలు: మేనేజర్–20, ఇంజనీర్–34, ఆఫీసర్–17, చీఫ్ మేనేజర్–02, అసిస్టెంట్ మేనేజర్–07.
» విభాగాలు: కాంట్రాక్ట్స్ అండ్ మెటీరియల్స్, కెమికల్, మార్కెటింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సేఫ్టీ, ఫైనాన్స్, కార్పొరేట్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్స్, లీగల్.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, సీఏ/సీఎంఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: స్క్రీనింగ్/రాత పరీక్షలు, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలు ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.05.2024
» వెబ్‌సైట్: https://jobs.hurl.net.in

ఆర్ఆర్‌సీ–ఉత్తర రైల్వేలో 38 స్పోర్ట్స్ కోటా గ్రూప్–డి పోస్టులు

న్యూఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్, నార్తర్న్ రైల్వే స్పోర్ట్స్ కోటాలో.. 2023–24 సంవత్సరానికి సంబంధించి గ్రూప్–డి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 38
» క్రీడలు: ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, బాక్సింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, హాకీ, బ్యాడ్మింటన్, కబడ్డీ, రెజ్లింగ్, చెస్.
» అర్హత: పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత క్రీడలో వివిధ స్థాయిల్లో ప్రతిభ చూపి ఉండాలి.
» వయసు: 01.07.2024 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.05.2024
» ట్రయల్ తేది: 10.06.2024.
» వెబ్‌సైట్: https://www.rrcnr.org

కర్ణాటక సర్కిల్– తపాల శాఖలో స్టాఫ్ కార్ డ్రైవర్ పోస్టులు

బెంగళూరులోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్, కర్ణాటక సర్కిల్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన స్టాఫ్ కార్ డ్రైవర్(ఆర్డినరీ గ్రేడ్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» కర్ణాటక పోస్టల్ రీజియన్లు: ఎస్‌కే రీజియన్, ఎన్‌కే రీజియన్, బీజీ(హెచ్‌క్యూ) రీజియన్.
» పోస్టుల వివరాలు: స్టాఫ్ కార్ డ్రైవర్ 27 పోస్టులు
» అర్హత: పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు మూడేళ్ల పని అనుభవం, మోటార్ మెకానిజంపై పరిజ్ఞానం కలిగి ఉండాలి.
» వయసు: 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.19,900 నుంచి రూ.63,200 ఉంటుంది.
» ఎంపిక విధానం: రాత పరీక్ష, డ్రైవింగ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను మేనేజర్, మెయిల్ మోటార్ సర్వీస్, బెంగళూరు చిరునామాకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరి తేది: 14.05.2024
» వెబ్‌సైట్: www.indiapost.gov.in

ఏఐఆర్ఐ ఢిల్లీలో ప్రాజెక్టు పోస్టులు

న్యూఢిల్లీలోని ఐకార్– ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 15
» పోస్టుల వివరాలు: రీసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ)– 04 పోస్టులు, సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)– 06 పోస్టులు, యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు– 05.
» అర్హతలు: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: dpp.mpp2022@gmail.com.
» ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: 12.05.2024
» వెబ్‌సైట్: https://iari.res.in/en/news.php

యూజీసీ నెట్.. మార్పులివే!

» యూజీసీ నెట్ 2024 జూన్ నోటిఫికేషన్ విడుదల
» నూతన విధానంలో మూడు కేటగిరీలుగా పరీక్ష నిర్వహణ
» నెట్‌తో జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ ప్రవేశాలు
» నాలుగేళ్ల డిగ్రీతోనూ నెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు

యూజీసీ నెట్.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్–నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్! జేఆర్ఎఫ్‌తో పీహెచ్‌డీలో చేరేందుకు.. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువులకు ప్రామాణికంగా నిలుస్తున్న పరీక్ష! అందుకే.. బోధన, పరిశోధన విభాగాల్లో కెరీర్ కోరుకునే అభ్యర్థులు ఎక్కువగా యూజీసీ–నెట్‌కు ప్రిపరేషన్ సాగిస్తుంటారు. తాజాగా యూజీసీ.. నెట్‌లో కీలక మార్పులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ నెట్–2024 జూన్‌లో కొత్త మార్పులు, ఈ పరీక్షతో ప్రయోజనాలు, అర్హతలు, బెస్ట్ స్కోర్‌కు మార్గాలపై ప్రత్యేక కథనం..



ఇంతకాలం పీహెచ్‌డీలో చేరాలంటే.. పీజీ పూర్తి చేసి.. నెట్‌లో సంబంధిత సబ్జెక్ట్‌లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. యూజీసీ తాజా నిర్ణయంతో నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసుకున్న అభ్యర్థులు కూడా నెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెట్ స్కోర్ ఆధారంగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందొచ్చు. యూజీసీ–నెట్‌ను ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు. ఈ ఏడాది.. తొలి విడత పరీక్ష జూన్–2024కు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో అర్హత ప్రమాణాలు, నెట్ నిర్వహించే కేటగిరీలలో మార్పులు ప్రకటించారు.

విద్యార్హతలు

- కనీసం 55% మార్కులతో పీజీ(పోస్ట్ గ్రాడ్యుయేషన్) ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- పీహెచ్‌డీలో ప్రవేశం కోరుకునే అభ్యర్థులు నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీలో కనీసం 75% మార్కులు సాధించాలి.
- రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదు శాతం మినహాయింపు కల్పిస్తారు.
- అర్హత కోర్సు చివరి సంవత్సరం/చివరి సెమిస్టర్ చదువుతున్న వారు కూడా నెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ విభాగాల అభ్యర్థులకు సర్టిఫికెట్లు పొందాకే.. వీటికి అర్హత లభిస్తుంది. పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే వారు నెట్ ఫలితాలు విడుదలైన సంవత్సరంలోపు నిర్దేశిత శాతంతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

వయసు

- జేఆర్ఎఫ్ అభ్యర్థుల వయసు జూన్ 1, 2024 నాటికి 30ఏళ్లు మించకూడదు.ఓబీసీ–ఎన్‌సీఎల్, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో అయిదేళ్ల సడలింపు లభిస్తుంది.
- అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్, పీహెచ్‌డీలో ప్రవేశం కోరే అభ్యర్థులకు ఎలాంటి గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు.

నాలుగేళ్ల డిగ్రీతో పీహెచ్‌డీ

యూజీసీ–నెట్ 2024 జూన్ నోటిఫికేషన్ ప్రకారం–నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు కూడా నెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో అర్హత సాధించి యూనివర్సిటీలలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందొచ్చు. యూనివర్సిటీలు నాలుగేళ్ల డిగ్రీతోనూ పీహెచ్‌డీలో ప్రవేశం కల్పించాలని యూజీసీ ఇప్పటికే మార్గనిర్దేశకాలు జారీ చేసింది. దీనికోసం నెట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. పీహెచ్‌డీలో ప్రవేశం పొందాలనుకునే నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ అభ్యర్థులు కనీస 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని నిర్దేశించింది.

మూడు కేటగిరీలుగా పరీక్ష

- ఇప్పటి వరకు రెండు కేటగిరీల్లోనే (జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్) నెట్‌ను నిర్వహించారు. రీసెర్చ్/జేఆర్ఎఫ్ పట్ల ఆసక్తి ఉన్న వారు.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ విభాగానికి.. అధ్యాపక వృత్తికి మాత్రమే పరిమితం అవుదామనుకునే వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకునే వారు. దీనికి భిన్నంగా ఇకపై మూడు కేటగిరీలుగా నెట్ పరీక్షను నిర్వహించనున్నారు. అవి..
- కేటగిరీ–1: జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్), అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం.
- కేటగిరీ–2: అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీలో ప్రవేశం.
- కేటగిరీ–3: పీహెచ్‌డీలో ప్రవేశానికి మాత్రమే.

బెస్ట్ స్కోర్‌కు మార్గం

ఉమ్మడి పేపర్‌కు సన్నద్ధత

మూడు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడి పేపర్‌గా నిర్దేశించిన పేపర్–1లో.. టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాల (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్–గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు చొప్పున అడుగుతారు.

సబ్జెక్ట్ పేపర్‌కు ఇలా

పేపర్–2లో ప్రశ్నలు అభ్యర్థుల పీజీ స్పెషలైజేషన్ లేదా డొమైన్ సబ్జెక్ట్ ఆధారంగా ఉంటాయి. ఇందులో రాణించేందుకు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఆయా అంశాలను అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు క్రిటికల్ థింకింగ్, అనలిటికల్ అప్రోచ్ ఉపయుక్తంగా ఉంటుంది. దీనివల్ల ప్రశ్నలు ఏ విధంగా అడిగినా సమాధానాలు ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

పరీక్ష స్వరూపం

- యూజీసీ నెట్ పరీక్ష స్వరూపంలో ఎలాంటి మార్పులు లేవు. గతంలో మాదిరిగానే రెండు పేపర్లుగా మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ రెండు పేపర్లు కూడా పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
- పేపర్–1: టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్. ఈ విభాగంలో 50 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున 100 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పేపర్–2: సబ్జెక్ట్ పేపర్: అభ్యర్థుల డొమైన్ సబ్జెక్ట్ నుంచి 100 ప్రశ్నలతో 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- పేపర్–1(టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్) మూడు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడిగా ఉంటుంది.

కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్ పరీక్షలో మూడు కేటగిరీల అభ్యర్థులు (జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్, పీహెచ్‌డీ) ఉత్తీర్ణత సాధించాలంటే.. తాము రాసిన పేపర్లలో కనీస అర్హత మార్కులు సాధించాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు పొందాలి. ఈ సడలింపు (35 శాతం మార్కులు)ను జనరల్– ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మే 10
- ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సవరణ అవకాశం: 2024, మే 13–15
- యూజీసీ–నెట్ పరీక్ష తేదీ: 2024, జూన్ 18
- వివరాలకు వెబ్‌సైట్: https://ugcnet.nta.nic.in

నెట్‌తో ప్రయోజనాలెన్నో!

- యూజీసీ నెట్‌లో ప్రతిభ చూపి.. తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. అవి..
- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం–నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్ట్‌లకు ఎంపిక చేయాలి. ఏడో పీఆర్‌సీ సిఫార్సుల ప్రకారం–అసిస్టెంట్ ప్రొఫెసర్ పే స్కేల్‌ను ప్రారంభంలోనే నెలకు బేసిక్ పే రూ.67 వేలు చెల్లించే విధంగా యూజీసీ నిర్ణయించింది.
- జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు (జేఆర్ఎఫ్) ఎంపికైతే.. ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో మూడేళ్ల పాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పనిచేసే అవకాశం లభిస్తుంది. ఈ సమయంలో మొదటి రెండేళ్ల నెలకు రూ.31 వేలు చొప్పున జేఆర్ఎఫ్ అందుతుంది. జేఆర్ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్ఆర్ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్లపాటు నెలకు రూ.35వేల ఫెలోషిప్ పొందొచ్చు. జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారికి సైంటిస్టులుగా ప్రభుత్వ విభాగాల్లో కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తుంది. సైంటిస్ట్‌లుగా ఎంపికైన వారికి.. వారి గ్రేడ్ ఆధారంగా ప్రారంభంలోనే నెలకు రూ. ఎనభై వేల వేతనం పొందే అవకాశాలున్నాయి.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీతోపాటు నెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి జేఆర్ఎఫ్, పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హత లభిస్తుంది.
- ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ శాఖల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


SR'S THUMPING VICTORY IN SSC-2024
YEARS OF BRILLIANCE 50
Our school students who continued in SR junior colleges and scored outstanding results in JEE(Main)-2024
99.99 PERCENTILE
D.MANISH
APP. 240310469723
ALL INDIA RANK OPEN CATEGORY
126
295/300
99.98 PERCENTILE
DEEPANSH
APP. 240310166542
ALL INDIA RANK OPEN CATEGORY
357
తెలంగాణ SSC-2024 ఫలితాలలో GPA 10/10
124 STUDENTS
G.Laxmi Prasanna, B.Geethika, P.Manideep, Nabiha Unissa, B.Karthikeya, L.Sanju Sree, B.Akshith Vardhan, E.Sindhu, N.Akshitha, P.Srivardhitha, R.Prasannanjana, S.Keertana, V.Sanjana, V.Soumika, A.Spandana
C.Rupakrishna, G.Lipika, B.Shantha Sugandhi, J.Akshaya, O.Rishi, Sameera, B.Sahasra, K.Abhiram Reddy, K.Rakshitha, M.Sahasra, S.Vyshnavi, B.Cheshwanth, G.Sirivennela, G.Koushik, P.Sri Sharan
G.Pavithra, B.Ruthvik, K.Adithi, B.Akshaya, B.Srinidhi, M.Akshay, K.Charan Teja, G.Bharath, R.Nikhitha, C.Ruthwik Reddy, G.Tejaswini, V.Laxmi Nihal, N.Neel Kumar, A.Pavan Kumar, Sri Laxmi
Spoorthi, O.Asritha, K.T.Catherine, P.Shloka, R.Kaveri, K.Akshara, E.Vishwesh Rao, C.Abheeshta Reddy, B.Parth, G.Varshini
C.Haripriya, N.Druvitha Reddy, G.Pranavi, G.Sumith Ramesh, N.Yagnesh Reddy, Afiya Nazish, V.Ananya Reddy, E.Srinithya, M.Harini, G.Manaswini
B.Nakshathra, K.Ruchitha, B.Lalitha Adithya, E.Sreeshanth, E.Vittal, G.Abhigna, Md.Sanam, S.Harshith Reddy, A.V.Sai Prasun, N.Swanjana, K.Akshitha, L.Siri Thanvi Ratna, M.Charanya, Ch.Vyshali, V.Naga Karthik
G.Rishitha, P.Aashritha, V.Eekshitha, M.Shruthi, D.Keerthana, B.Manish, P.Neelothpal, B.Srinithya Reddy, Aliya Fathima, V.Akshaya, Sanda Sai Karan, P.Hanshika, V.Teja Sree, Prakash Sharma, K.Akhila
A.Akshitha, V.Vishal, G.Chinmai, P.Sreeja, B.Sai Spoorthy, Md. Saeed Hasan, M.Joshika Venkata, Shaik Ayub, B.Aishwarya, D.Sai Poojitha, K.Ganesh, Ch.Tilak Kumar Reddy, Y.Swathi, G.Sai Charan, D.Mrudhila
Taha Fatima, S.S.Mohana Manjusha, Jyothi Sathar, Ayeesha, K.Lavanya, P.Soumya Vardhini, S.Bhavani, Y.Sharon, B.Jashwanth, B.Rithik Reddy, Y.Raj Prayush, D.Lakshana, Kushmitha, Jeevika Reddy
Total Students who secured 9.8/10 GPA 240
PRIME
Program for IIT and Medical Entrance Examinations
An outgoing student of SR should carry with him the profound knowledge of the fundamentals of the subject that will enable him to get a brilliant rank in the competitive exams like JEE (MAIN), JEE (ADVANCED), NEET, AIIMS, EAPCET etc...
INTEGRATED FOUNDATION PROGRAM
Syllabus conceived from
NCERT / STATE / CBSE / ICSE
ఈ విద్యాసంవత్సరం నూతనంగా SR PRIME స్కూల్స్ ADIBATLA & PUNNELU
ADIBATLA, Hyderabad.
PUNNELU, Warangal.
SR PRIME SCHOOL (Residential)
No 413 & 414, Mangalpally, Hayath Nagar, Near Adibatla, TCS, Ibrahimpatnam.
M: 91751 44061
6th to 10th Std (EM) (Recognized by Govt. of Telangana)
SR PRIME SCHOOL (Day & Residential)
H.No.1-1/1, Punnelu (V) G.Panchayath, Innavole (M), Hanumakonda (Dist)
M: 96421 17374
4th to 10th Std (EM) (Recognized by Govt. of Telangana) Proposed CBSE School
PRIME PROGRAM WITHOUT DISTURBING THE REGULAR CURRICULUM FOR SURE SUCCESS
SHARP
An integrated foundation program which gives a head start at the intermediate level to face the competitive exams like JEE (Main), JEE (Advanced), NEET, AIIMS, EAPCET…confidently for assured success.
SPARK
A solid foundation program designed to score ranks below 1000 in JEE (Main) & JEE (Advanced)
Emphasis on fostering critical thinking and problem solving skills
FOCUS
An excellent coaching program for securing ranks below 100 in JEE MAIN and JEE Advanced
Program for super achievers and brainy students
MEDICUS
An excellent medical foundation program, exploring concepts in Biology, Physics and Chemistry. Program framed for NEET, AIIMS, JIPMER, and AIPMT aspirants
OUR FEATURES: Integrated curriculum that draws the best NCERT/STATE/CBSE/ICSE SYLLABUS Meticulously planned micro schedules to cover all the syllabus in structural manner Every weekend examination and analysis across the nation Focused on achieving top ranks in exams like RMO, NTSE, AMTI & all Olympiads
SR DIGI SCHOOLS - HYDERABAD - AS Rao Nagar - T: 8688960710, Boduppal - T: 8886609253, Hemanagar - T: 8886609259, Tarnaka - T: 8886609280, Nacharam - T: 8886609269, Dilsukhnagar - T: 8886609256, Alkapuri - T: 8886609248, Karmanghat - T: 8886609262, Champapet - T: 8886609254, Balapur - T: 8886609252, Meerpet - T: 8886609268, Vanasthalipuram - T: 8886609281, Hayatnagar - T: 8886609258, ECIL - T: 9160807070, Neredmet - T: 8886609271, Dammaiguda - T: 8886609255, Kompally - T: 8886609265, 9160907070, Old Bowenpally - T: 8886779000, New Bowenpally - T: 8886609272, Khanajiguda - T: 8886609263, Alwal - T: 8886609249, Kukatpally - T: 8886609264, Subhodaya Colony - T: 8886609279, Sardarpatel Nagar - T: 8886609276, KPHB - T: 8886077977, Nizampet - T: 8886609273, Jubilee Hills - T: 8886077877, Manikonda - T: 8886782000, Shivarampally - T: 8886887000, Attapur - T. 8886609251, Shamshabad - T: 8886774000, Ibrahimpatnam - T: 8886609260
WARANGAL - Balasamudram - T: 8886609806, T: 9642117736, Bheemaram - T: 9642117381, Gopalapur - T: 8886090001, MGM Hospital - T: 9121009470, Snehanagar - T: 9642117353, Pochamma Maidan - T: 9121226690, Padmakshi Nagar - T: 9154981744, Ramnagarl - T: 9154981745, BHUPALPALLY - T: 8886090006, PARKAL - T: 9642722022, ADILABAD - T: 8886090004, T: 9154989353, MANCHERIAL - T: 9642722322, NIRMAL - T: 8886090003, 9154989349, KARIMNAGAR - T: 9515512007, KHAMMAM - T: 8367667070, KOTHAGUDEM - T: 9642222999, SIDDIPET - T: 7075032182, MIRYALAGUDA - T: 8886090002, 9642112301, NIZAMABAD - T: 9642110777, NIZAMABAD - T: 8886993066 , VIZAG - T: 0891-2747070, 0891-2547070.
Cambridge Assessment International Education
Cambridge International School
SR PRIME SCHOOL
START YOUNG. STAY AHEAD.
SR digi SCHOOL
Experience a new joy of learning!
ADMISSIONS OPEN: NURSERY to 10th | www.srprimeschool.com • www.srdigischool.com
SR PRIME SCHOOLS - HYDERABAD - Keesara Boys - M: 9100518070, 9642115667, Keesara Girls - M: 9642115667, 9100518070, Bolarum - M: 9160503030, Adibatla - M: 91751 44061, Battupally - M: 8886866060, 8886868661, Battupally Cambridge - M: 9133278246, Warangal - M: 9642117374, Punnelu - M: 9642117374, NALGONDA - M: 9573927070, 9573827070, NIZAMABAD (Resi) - M: 9642110025, 9642111315, NIZAMABAD (Day) - M: 7702444398, 9642112356, KARIMNAGAR - M: 9985756563, 9154989352, KURIKYAL - M: 9121307171, 9052222237, NIRMAL - M: 9642117835, 9642111226, ADILABAD - M: 9154854690, 9642114476, KHAMMAM - M: 9154981736, 9121155002, KOTHAGUDEM - M: 9121226698, 9515516007, KODAD - M: 9154854714, ANDHRA PRADESH - ANANTAPURAMU - M: 9154854691, KAKINADA - M: 9154854703, KURNOOL - M: 9154854695, MACHILIPATNAM - M: 9154854704, RAJAHMUNDRY - M: 9154854693, 8008948442, SRIKAKULAM - M: 91548 54697, TIRUPATI - M: 9154854699, VIZAG - M: 9154854707, 9052222274, Boyapalem - M 9154854707, 9052222274, WEST GODAVARI - M: 9642223762, WEST GODAVARI - M: 7331122589, KARNATAKA - Chikkabanavara - M: 9154854710, Chikkabanavara - M: 79756411100, Chikkamagaluru - M: 9154854709, 9515514007, Hosapete - M: 9154854708, 9515514007, Banglore - M: 9154854712, 7022799536.
TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA